www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆత్మహత్యల్లో భారత్ టాప్

11

ప్రతి లక్షకూ 12 మందికి పైగా బలవన్మరణం

2022లో 1.71 లక్షల మంది ఆత్మహత్య

ప్రపంచవ్యాప్తంగా భారత్‌లోనే అత్యధికం

శుక్రవారం | 12-7-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 87 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, శుక్లపక్షం; తిథి: షష్ఠి మ. 12.33 తదుపరి సప్తమి; నక్షత్రం: ఉత్తర సా. 4.09 తదుపరి హస్త; వర్జ్యం: రా. 1.38-3.26; దుర్ముహూర్తం: ఉ. 8.27-9.19, మ. 12.46-1.38; అమృతఘడియలు: ఉ. 8.01-9.48; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 5.51; సూర్యాస్తమయం: 6.49 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఏపీ నంబర్ 1

ఇదే మా లక్ష్యం.. పాలనను పరుగులు పెట్టిస్తాం: చంద్రబాబు

ఉత్తరాంధ్రకు నేనున్నా..

పోలవరం, సుజల స్రవంతి పూర్తిచేసి 3.8 లక్షల ఎకరాలకు నీళ్లందిస్తా!

పోలవరం పూర్తయితే కరువే ఉండదు

రూ.800 కోట్లతో ఎడమ కాలువ పనులు

సూపర్ 6 అమలులో రాజీ లేదు

స్టీల్ ప్లాంటు తెలుగువాడి ఆత్మగౌరవం

యూటర్న్ తీసుకున్నానని నాపై దుష్ప్రచారం

వాజపేయి టైంలోనే ప్రైవేటీకరణను అడ్డుకున్నా.. ఇప్పుడూ కాపాడతా: సీఎం

అనకాపల్లి/విశాఖపట్నం/విజయనగరం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఏపీని నంబర్‌వన్‌గా నిలపాలన్నదే తన ప్రధాన లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఉత్తరాంధ్రకు పోలవరం ప్రాజెక్టు వరమని.. ఇది పూర్తయితే ఈ ప్రాంతంలో కరువనేదే ఉండదని తెలిపారు. వంశధార, కృష్ణా, గోదావరి, పెన్నా నదులను అనుసంధానం చేస్తే రాష్ట్రంలోనే కరువు ఉండదన్నారు. జగన్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఆగిన పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనులను

మిగతా 13వ పేజీలో...

ఉత్తరాంధ్రలో సీఎం సుడిగాలి పర్యటన

పోలవరం ఎడమ కాలువ పరిశీలన

భోగాపురం విమానాశ్రయం సందర్శన

అనంతరం విశాఖ మెడ్‌టెక్ జోన్‌కు

ఆనక సీఐఐ ప్రతినిధులతో వర్చువల్ భేటీ

పెట్టుబడులతో రండి

పారిశ్రామికవేత్తలకు బాబు ఆహ్వానం

సీఐఐ వర్సిటీ అమరావతిలో పెట్టాలి

కొత్త పీ4 పాలసీ తీసుకురాబోతున్నాం

గ్లోబల్ హబ్‌గా మెడ్‌టెక్ జోన్

త్వరలో ఏఐ వర్సిటీ: సీఎం



భోగాపురం విమానాశ్రయం నిర్మాణ ప్రాంతంలో సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

వడివడిగా అడుగులు

ఆర్భాటం లేకుండా అణకువగా ముందుకు.. బాబు 4.0 పాలనకు నేటితో నెల రోజులు

అభివృద్ధి మంత్రం.. సంక్షేమ సంతకం.. పేదలు, దివ్యాంగుల పింఛన్లు భారీగా పెంపు

జగన్ జమానాలో వెయ్యి పెంపునకు నాలుగేళ్లు.. వచ్చిన 15 రోజుల్లోనే అంత మొత్తం ఇచ్చిన బాబు

మళ్లీ పట్టాలెక్కిన అమరావతి రాజధాని నిర్మాణం.. కేంద్రంతో బలపడిన బంధంతో రాష్ట్రానికి శుభం

ఇసుక మాఫియాకు ముకుతాడుతో తగ్గిన ధరలు.. మెగా డీఎస్సీ, టైటిలింగ్ చట్టం రద్దు, అన్న క్యాంటీన్లు

రిఫైనరీతోపాటు కొత్త కంపెనీల రాకకు మార్గం సుగమం.. తన శాఖల్లో పవన్ మార్క్.. చురుగ్గా మరికొందరు

వైసీపీ అరాచక శక్తులపై చర్యల్లేవని క్యాడర్ అసంతృప్తి.. వట్టిపోయిన ఖజానాతో అల్లాడుతున్న ఎమ్మెల్యేలు

13

మోడ్రన్ ఎయిర్‌పోర్టుగా భోగాపురం

2026 జూన్ 30కి ముందే నిర్మాణం పూర్తి

రూ.4,700 కోట్ల వ్యయంతో పనులు

ఎకనామిక్ హబ్‌గా ఉత్తరాంధ్ర

అన్నీ సజావుగా జరిగినట్టయితే

2023 నాటికే వినియోగంలోకి: చంద్రబాబు

13



పాఠ్యాంశాలు మార్చేశారు!

ప్రభుత్వ బడులకు ఒకలా.. ప్రైవేటు బడులకు మరోలా

టెన్త్ తెలుగులో పొరపాట్లు

మొత్తం 24 చోట్ల.. మూడు పాఠాలు మార్పు

ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి నిర్వాకం 11

కేంద్రం, రాష్ట్రాల మధ్య వారధిగా ఈ ఆఫీస్!

సత్వర అనుమతులకు మార్గం

11

యూజీసీ-నెట్ ప్రశ్నపత్రం లీక్ కాలేదు

స్క్రీన్‌షాట్‌పై తేదీ మార్చి టెలిగ్రామ్‌లో వైరల్ చేశారు

సీబీఐ దర్యాప్తులో వెల్లడి

త్వరలోనే చార్జిషీట్ 11

కౌంటింగ్ తర్వాతా కుమ్ముడు



గనుల వెంకటరెడ్డి బరితెగింపు

ఆ శాఖలో అడ్డగోలు దోపిడీ

జూన్ 5న 170 ఎల్‌ఓఐలు జారీ

మార్చిలో ఇచ్చినట్లు పాత తేదీలతో ఉత్తర్వులు

చేతులు మారింది 100 కోట్లపైనే

న్యాయ శాఖ, ఈసీని పక్కనబెట్టి, నిబంధనలు ఉల్లంఘించి ఉత్తర్వులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గత ప్రభుత్వంలో గనుల శాఖ డైరెక్టర్‌గా పనిచేసిన వెంకటరెడ్డి లీలలు అన్నీ ఇన్నీ కావు. జగన్ రెడ్డి అండ ఉంటే చాలు.. కొండలను కూడా పిండి చేయవచ్చనే తరహాలో చెలరేగిపోయారు. చివర్లో ఎన్నికల ఫలితాలు వచ్చిన మరుసటి రోజు కూడా నిబంధనలకు విరుద్ధంగా ఖనిజాల తవ్వకాలకు సంబంధించిన లీజుల రెన్యువల్, కొత్త వాటికి అనుమతి ఇస్తూ 170 లెటర్ ఆఫ్ ఇంటెంట్‌లు (ఎల్‌ఓఐ) ఇచ్చారు. వెంకటరెడ్డికి బాగా సన్నిహితులైన గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ (డీడీ), అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ)లను పిలిపించుకొని వారి సమక్షంలోనే ఎల్‌ఓఐలకు సంతకాలు చేశారని తెలిసింది. చట్టాలు, రూల్స్, ఎన్నికల కమిషన్, న్యాయ శాఖలను కూడా పక్కనబెట్టి సొంతంగా నిర్ణయాలు తీసుకున్నారు. పూర్తిగా నిబంధనలకు విరుద్ధంగా వెంకటరెడ్డి ఉత్తర్వులు ఇచ్చినట్లు ఇప్పుడు తేలింది. ఎల్‌ఓఐల జారీ కోసం ఎన్నికల కమిషన్ అనుమతి కోరుతూ

మిగతా 11వ పేజీలో...

విశాఖ ఉక్కును ప్రైవేటీకరించం

ప్లాంట్‌ను పరిరక్షించడం మా బాధ్యత

మూతపడుతుందని ఆందోళన చెందవద్దు

100% సామర్థ్యంతో పనిచేసేలా చర్యలు

ప్రకటించిన కేంద్ర మంత్రి కుమారస్వామి

11



విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లో పర్యటిస్తున్న ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామి

సిసోడియాకు రెవెన్యూ

స్టాంపులు-రిజిస్ట్రేషన్లు కూడా ఆయనకే.. గత ఐదేళ్లలో తీవ్ర వేధింపులు, అప్రాధాన్య పోస్టులు

కొత్త ప్రభుత్వంలో సమున్నత గౌరవం.. సీసీఎల్‌ఏగా జయలక్ష్మి.. 19 మంది ఐఏఎస్‌ల బదిలీ

మొదటి విడత బదిలీలపై విమర్శలు రావడంతో ఈ దఫా పకడ్బందీగా పోస్టింగులు

14

10 మంది ఐపీఎస్‌ల బదిలీ

హరీశ్ గుప్తా విజిలెన్స్‌కు.. హోం ముఖ్య కార్యదర్శిగా విశ్వజిత్

ఫైర్ డీజీగా మాదిరెడ్డి ప్రతాప్.. శ్రీకాంత్‌కు శాంతిభద్రతలు

బెజవాడ సీపీగా రాజశేఖర్‌బాబు.. రామకృష్ణకు పీ అండ్ ఎల్

మీ పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు అత్యుత్తమ కళాశాల

అన్నమాచార్య యూనివర్సిటీ



Dr. C Gangi Reddy
Chancellor - Annamacharya University

ANNAMACHARYA UNIVERSITY

ANNAMACHARYA UNIVERSITY • VIDWAN SARVATRA PUJYATHE •

EXCELLENCE IN EDUCATION; SERVICE TO SOCIETY

(ESTD. UNDER AP PRIVATE UNIVERSITIES (ESTABLISHMENT AND REGULATION) ACT, 2016)

RAJAMPET, Annamayya District, AP - 516126, India

COUNSELLING CODE: AITSPU

COURSES OFFERED

School of Engineering

B.Tech Programs

- Mechanical Engineering
- Electrical and Electronics Engineering
- Electronics and Communication Engineering
- Computer Science and Engineering
- Civil Engineering
- Artificial Intelligence and Data Science
- Artificial Intelligence and Machine Learning
- CSE (Internet of Things and Cyber Security including Block Chain Technology)
- CSE (Artificial Intelligence)
- CSE (Artificial Intelligence and Machine Learning)
- CSE (Data Science)

M.Tech Programs

- Computer Science and Engineering
- Embedded Systems
- Electrical Power Systems
- Structural Engineering
- Machine Design

School of Management

MBA

School of Humanities and Social Sciences

PG Course : M.A. in English

School of Health Sciences

UG Courses

- B.Sc. in Anaesthesiology Technology and Operation Technology
- B.Sc. in Medical Lab Technology
- BPT - Bachelor of Physiotherapy

School of Education

UG Course : B.Ed

PG Course : M.Ed.

School of Sciences

UG Courses

- B.Sc. in Computers
- B.Sc. in Programming & Data Science
- B.Sc. in AI and Data Analytics
- B.Sc. in AI & ML

PG Courses

- Master of Computer Applications (MCA)
- M.Sc. in Applied Mathematics
- M.Sc. in Physics
- M.Sc. in Chemistry

School of Agricultural Sciences

B.Sc. (Hons.) - Agricultural

Ph.D. in all disciplines

Center of Excellence

- **SIEMENS Technical Skills Development Institute**
- 3D Experience Centre in Association with Dassault
- **CM's Centre of Excellence**
- IBM Centre of Excellence
- **Community Radio Station Granted by Govt. of India**
- Center of Excellence of EPAM, Hexaware, Zensar, Virtusa, Wipro Talent Next, Google Cloud, KAPTIUS

Highlights

- UG Programs Accredited by NBA
- Accredited by NAAC with A Grade
- Accredited by Institute of Engineers (India)
- **57 Acre lush green campus and excellent Infrastructute**
- World class library with 70000 + books & 4000 + Journals
- **Innovation and incubation Centre**
- State - of - the art computing facilities and laboratories
- **Separate Hostel for Boys & Girls**
- Vast Playgrounds & Various Indoor & Outdoor Sports and Games facilities

Accredited with 'A' Grade by NAAC NATIONAL ASSESSMENT AND ACCREDITATION COUNCIL | NBA NATIONAL BOARD of ACCREDITATION

AAA+ CAREERS360 | Ranked 42nd across India by DATAQUEST | 8th RANK THE WEEK

MoU with Foreign Universities: RWTH AACHEN UNIVERSITY | WISCONSIN UNIVERSITY OF WISCONSIN-MADISON | Penn UNIVERSITY of PENNSYLVANIA

SOME OF OUR RECRUITERS

DXC TECHNOLOGY, tcs TATA CONSULTANCY SERVICES, Cognizant, Infosys, wipro, ITC INFOTECH, Mphasis, carelon, Mu Sigma, HYUNDAI, accenture, HEXAWARE, Capgemini, IBM, virtusa, epam, Mindtree, Tech Mahindra, NTT DATA, Quest global, HCL, VOLTAS, SUTHERLAND, AMARA RAJA

SALARY PACKAGE RANGES FROM ₹ 4 LPA - ₹ 20 LPA

Contact for Admissions: +91 8565 - 251252, 9848998641, 9154147257

www.annamacharyauniversity.edu.in

Follow us: /Annamacharya Group





అపార్ట్‌మెంటులో బిగించిన హార్వెస్ట్ ఫిల్టర్ చూపుతున్న రవీంద్రకుమార్

వాన నీటిని ఒడిసి పడదాం..!

- రెయిన్ వాటర్ హార్వెస్టింగ్‌తో బోర్‌వెల్ రీచార్జ్
- భూగర్భ జలాల అభివృద్ధికి సరికొత్త పద్ధతి
- గుంటూరులో వైద్యుడి వినూత్న ప్రయత్నం

గుంటూరు (మెడికల్), జూలై 11: వర్షం నీటిని ఒడిసిపట్టి ఇంకుడు గుంతలకు మళ్లించడం ద్వారా క్రమేపీ భూగర్భ జలాలు పెరుగుతాయనే విషయం అందరికీ తెలిసిందే! మారుతున్న నూతన సాంకేతిక పరిజ్ఞానం సాయంతో భూగర్భ జలాల పరిరక్షణకు మరింత మెరుగైన పద్ధతులు అందుబాటులోకి వస్తున్నాయి. గుంటూరులోని పట్టాభిపురానికి చెందిన వైద్యుడు జె.రవీంద్రకుమార్ 'రూఫ్‌టాప్ రెయిన్ వాటర్ హార్వెస్టింగ్, బోర్‌వెల్ రీచార్జ్' అనే కొత్త పద్ధతిని వినియోగిస్తూ తమ అపార్టుమెంట్‌లో చక్కటి ఫలితాలు సాధిస్తున్నారు. వర్షం కురిసినప్పుడు అపార్ట్‌మెంట్ రూఫ్ టాప్‌పై పడే వాన నీటిని పైపుల ద్వారా సేకరించి ప్రత్యేక ఫిల్టర్ ద్వారా సంపు, బోర్‌వెల్‌కు అనుసంధానం చేశారు. దీని వల్ల 14 వేల లీటర్ల కెపాసిటీ గల సంపు నిండటంతో పాటు అదనపు నీటిని బోర్‌వెల్‌కు రీచార్జ్ చేస్తున్నారు. దీనివల్ల స్థానికంగా భూగర్భ జలాలు అభివృద్ధి చెందుతున్నాయి. దీనికోసం ఆయన ప్రత్యేకంగా రూ.25 వేలు విలువ చేసే ఫిల్టర్‌ను వినియోగిస్తున్నారు. ఇది ఒకసారి కొనుగోలు చేస్తే జీవితాంతం పని చేస్తుందని ఆయన చెప్పారు.

పని చిన్నది.. ఫలితం పెద్దది

ఒక అపార్టుమెంట్‌కు రూ.35వేలు వెచ్చించి ఫిల్టర్‌తో పాటు ఆరు, నాలుగు అంగుళాల ప్లాస్టిక్ గొట్టాలను బిగించి బోర్‌వెల్ రీచార్జ్ సెటప్‌ను ఏర్పాటు చేసుకోవచ్చు. 'వాతావరణ శాఖ ప్రకారం 8 సెంటీమీటర్ల వర్షం కురిసిందంటే.. 100 చదరపు మీటర్లలో పరిధిలో 80వేల లీటర్ల వర్షం నీరు పడుతుంది. 500 గజాల రూఫ్ టాప్ అపార్టుమెంటులో 4లక్షల లీటర్ల వర్షం నీరు పడుతుంది. ఈ నీటిని సేకరించి, అపార్టుమెంటు అవసరాలకు వాడుకొని విగిలిన నీటిని ఫిల్టర్ ద్వారా భూమిలోకి పంపితే.. భూగర్భ జలాలు అనూహ్యంగా పెరుగుతాయి' అని డాక్టర్ రవీంద్రకుమార్ తెలిపారు. ప్రభుత్వం కూడా ఇలాంటి ప్రయత్నాలను ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మహానందిలో చిరుత సంచారం



మహానంది ఆలయ పరిసరాల్లో సంచరిస్తున్న చిరుతపులి

మహానంది, జూలై 11: నంద్యాల జిల్లాలోని మహానంది ఆలయం ఎదుట చిరుతపులి సంచారం కలకలం రేపింది. బుధవారం అర్ధరాత్రి, తిరిగి గురువారం రాత్రి 8 గంటల సమయంలో చిరుత జనావాసాల్లోకి వచ్చింది. దైవదర్శనం కోసం సుదూర ప్రాంతాల నుంచి వచ్చి ఆలయ పరిసరాల్లో విశ్రాంతి తీసుకుంటున్న భక్తులు చిరుతను చూసి భయాందోళనకు గురై పరుగులు తీశారు. ఇంతవరకు దేవస్థానం గోశాల, పరిసరాల్లోని ఈశ్వర్‌నగర్ కాలనీ, ఉద్యోగుల కాలనీ, పార్వతీపురం సమీపంలో సంచరించిన చిరుత ఈ దఫా ఏకంగా మహానంది ఆలయం ముందు భాగంలోకి రావడంతో భక్తులకు భయాందోళనకు గురవుతున్నారు. చిరుతను బంధించేందుకు అటవీ శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

గ్రామీణ రోడ్లకు మహర్దశ

- రూ.4976 కోట్లతో 7213 కి.మీ. రహదారులు
- గత ప్రభుత్వంలో బిల్లుల చెల్లింపుల్లో జాప్యం
- అందుకే గ్రామీణ ప్రాంతాల్లో కుంటుపడిన పురోగతి
- మ్యాచింగ్ గ్రాంట్ తగ్గించేలా కేంద్రాన్ని కోరతాం
- ఏఐఐబీ అధికారుల సమీక్షలో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



ఏషియన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు అధికారుల సమావేశంలో డిప్యూటీ సీఎం పవన్

అమరావతి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): గ్రామాలకు రహదారుల అనుసంధానంపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తేనే ప్రగతి సాధ్యమని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. గురువారం విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు(ఏఐబీ) అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.4976 కోట్ల నిధులతో 7213 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణానికి సిద్ధం చేసిన ప్రతిపాదనలకు చురుగ్గా కార్యరూపం ఇవ్వాలని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. గ్రామాల్లో రహదారుల నిర్మాణం వల్ల పేదరిక నిర్మూలనతో పాటు సామాజిక, ఆర్థిక ప్రయోజనాలు మెరుగవుతాయనే విషయాన్ని అందరం గుర్తుంచుకోవాలన్నారు. గ్రామీణ రహదారుల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వ సహకారాలు మరింత కోరదామని చెప్పారు. ఈ సందర్భంగా బ్యాంకు అధికారులు మాట్లాడుతూ 250కి మించి జనాభా కలిగిన ప్రతి గ్రామానికీ రహదారులు అనుసంధానం చేయాల్సిన అవసరముందని తెలిపారు. 2018-19 ఆర్థిక సంవత్సరంలో మొదలైన ఈ ప్రాజెక్టు ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యతతో కూడిన రహదారుల నిర్మాణం సాధ్యపడుతుందని, నెలకు రూ.200 కోట్లతో రహదారుల నిర్మాణం చేపడితే ఈ ప్రాజెక్టులో అద్భుతమైన పురోగతి ఉంటుందని తెలిపారు. అందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.75 కోట్ల మ్యాచింగ్ గ్రాంట్ సమకూరిస్తే బ్యాంకు రూ.125 కోట్ల రుణం మంజూరు చేస్తుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో బిల్లుల చెల్లింపులో జాప్యం జరిగిందని బ్యాంకు అధికారులు పవన్ కల్యాణ్‌కు వివరించారు. దీనిపై ఆయన స్పందిస్తూ.. అందువల్లే గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణ ప్రక్రియ కుంటుపడిందన్నారు. ఈ సమస్యను పరిష్కరిస్తే గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు నాణ్యతతో కూడిన రహదారులు అందుబాటులోకి వచ్చేవని, తద్వారా గ్రామీణాభివృద్ధి సాధ్యపడేవన్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ రహదారి ప్రాజెక్టు ద్వారా రహదారుల నిర్మాణం, నిర్వహణ సక్రమంగా సాగేలా చూడాల్సిన బాధ్యత తాము తీసుకుంటామన్నారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం పనుల్లో పారదర్శకతను ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో సమీక్షించేందుకు ప్రత్యేక పోర్టల్ అభివృద్ధి చేయాలన్నారు. ప్రజల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించేందుకు వీలుగా ఆ పోర్టల్‌లో ప్రత్యేక కాలమ్ పొందుపరచాలన్నారు. ఈ ప్రాజెక్టులో రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చాల్సిన 30 శాతం మ్యాచింగ్ గ్రాంట్‌ను 10 శాతానికి తగ్గించే విధంగా అవసరమైన మార్పులు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరతామన్నారు. సమావేశంలో ఏఐఐబీ అధికారులు పర్హాద్ అహ్మద్, అశోక్‌కుమార్, శివరామకృష్ణ శాస్త్రి, పంచాయతీరాజ్ ఇంజనీర్ ఇన్ చీఫ్ బాలూ నాయక్, ఏపీఆర్‌పీ అధికారులు సీవీ సుబ్బారెడ్డి, పీవీ రమణ పాల్గొన్నారు.

మైనర్లే రేప్ చేసి చంపేశారు!

- ఆడుకుంటున్న తొమ్మిదేళ్ల బాలికను అపహరించి, అఘాయిత్యం
- నంద్యాల జిల్లాను కుదిపేస్తున్న బాలిక మిస్సింగ్ కేసు
- నిందితుల్లో ఒకరు 6వతరగతి, మరో ఇద్దరు టెన్త్ క్లాస్



కలెక్టర్‌తో మాట్లాడుతున్న నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి

నందికొట్కూరు/ పగిడ్యాల, జూలై 11: వారు ముగ్గురూ మైనర్లే! ఒకరు ఆరో తరగతి, మరో ఇద్దరు పదో తరగతి చదువుతున్నారు. నిండా పదిహేనేళ్లు కూడా లేవు! కానీ.. 9ఏళ్ల బాలికను అపహరించి, అఘాయిత్యం చేసి చంపేసి, మృతదేహాన్ని కాలువలో పడేసినట్లు పోలీసులకిచ్చిన వాంగ్మూలంలో అసలు గుట్టు బయటపెట్టారు. ఐదు రోజులుగా నంద్యాల జిల్లాను కుదిపేస్తున్న బాలిక అదృశ్యం కేసులో దారుణమిది!. బాలిక ఆచూకీని కనుగొనేందుకు జిల్లా రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం తలమునకలై ఉంది. చివరికి గురువారం ఎన్‌డీఆర్ఎఫ్ (నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్) బృందాలు రంగంలోకి దిగాయి. నంద్యాల జిల్లా పగిడ్యాల మండలంలోని ముచ్చుమర్రి అప్రోచ్ కెనాల్‌లో మూడు రోజులుగా అదృశ్యమైన బాలిక కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు.

అసలేం జరిగిందంటే..

నందికొట్కూరు నియోజకవర్గం పగిడ్యాల మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక(9) పాత ముచ్చుమర్రి ఉన్నత పాఠశాలలో 5వ తరగతి చదువుతోంది. ఆదివారం గ్రామంలోని పార్కులో ఆడుకునేందుకు వెళ్లిన ఆ చిన్నారి ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు ముచ్చుమర్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సోమవారం నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి నందికొట్కూరు విజయోత్సవ ర్యాలీలో ఉండగా ఈ విషయం తెలుసుకుని.. 24 గంటల్లో బాలిక ఆచూకీ కనుగొనాలని పోలీసులను ఆదేశించారు. దీంతో ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో మూడు రోజులుగా దర్యాప్తు చేపట్టారు. రెండు రోజుల క్రితం డాగ్ స్క్వాడ్ రంగంలోకి దిగడంతో ఒక చోట క్షుద్రపూజలు చేసిన ఆనవాళ్లు, బాలిక దుస్తులు లభ్యమైనట్లు తెలిసింది. కానీ.. ముగ్గురు బాలురు పార్కులో ఆడుకుంటున్న చిన్నారిని కిడ్నాప్ చేసి.. అఘాత్యానికి పాల్పడి ఆపై హత్య చేసినట్లు పోలీసులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. దీంతో ఆ ముగ్గురు బాలురను అదుపులోకి తీసుకొని విచారించగా సంఘటనా స్థలాన్ని చూపించారు. ఆ ముగ్గురిలో ఒకరు(12) ఆరోతరగతి, మరో ఇద్దరు(15) పదో తరగతి చదువుతున్నట్లు చెప్పారు. బాలురు ఇచ్చిన సమాచారం మేరకు ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం కాలువలో బాలిక మృతదేహం కోసం గాలిస్తున్నారు. గురువారం 30మందితో కూడిన ఎన్డీఆర్ఎఫ్ బృందం అత్యాధునిక టెక్నాలజీతో కూడిన కెమెరాలతో నీటిలో తనిఖీ చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు అక్కడే ఉంటూ బైరెడ్డి శబరి గాలింపు చర్యలను పర్యవేక్షిస్తున్నారు. పాప అదృశ్యమై ఐదు రోజులవుతున్నా ఆచూకీ లభించలేదని ఆమె కుటుంబ సభ్యులు, బంధువులు కలెక్టర్ ఎదుట వాపోయారు. తప్పుడు సమాచారంతో బాలురు పోలీసులను పక్కదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. మరోవైపు ఈ కేసులో బాలుర తల్లిదండ్రుల పాత్ర ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. క్షుద్రపూజలు అందులో భాగమేనని చెప్పుకొంటున్నారు.

ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ ఇన్‌చార్జి వీసీగా డాక్టర్ నరసింహం



నరసింహం

విజయవాడ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి ఉప కులపతిగా డాక్టర్ దొమ్మేటి ఎస్‌వీఎల్ నరసింహం నియమితులయ్యారు. దీనికి సంబంధించిన ఉత్తర్వులను ప్రభుత్వం గురువారం విడుదల చేసింది. ప్రస్తుతం ఈయన వైద్య విద్య సంచాలకుడిగా వ్యవహరిస్తున్నారు. కాకినాడకు చెందిన నరసింహం అక్కడ రంగరాయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా, ఇన్‌ఛార్జి డీఎంఈగా పనిచేస్తున్నారు.

16 వరకు నిందితులపై తొందరపాటు చర్యలొద్దు

- టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో పోలీసులకు హైకోర్టు ఆదేశం
- అప్పిరెడ్డి, సజ్జల, ఆళ్ల, రఘురాం, అవినాశ్ పిటిషన్లపై విచారణ వాయిదా

అమరావతి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ పిటిషన్లు వేసిన వైసీపీ నేతలపై ఈ నెల 16 వరకు తొందరపాటు చర్యలు తీసుకోవద్దని హైకోర్టు పోలీసులను ఆదేశించింది. మంగళగిరి పరిధిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి వ్యవహారంలో మంగళగిరి రూరల్ పోలీసులు నమోదు చేసిన కేసులో తమకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వైసీపీ ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, తలశిల రఘురాం, వైసీపీ నేత దేవినేని అవినాశ్, మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, ప్రభుత్వ మాజీ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. వీరి పిటిషన్లు గురువారం విచారణకు వచ్చాయి. పోలీసుల తరఫు ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది ఎస్.ప్రణతి స్పందిస్తూ.. ఈ వ్యాజ్యాలపై అడ్వకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తారని.. అనారోగ్య కారణాల వల్ల ఆయన విచారణకు హాజరుకాలేకపోతున్నారని తెలిపారు. పిటిషనర్లు తమ వాదనలు కొనసాగించవచ్చన్నారు. అయితే ఇరువైపుల వాదనలూ ఒకేసారి వింటామని న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కె కృపాసాగర్ స్పష్టం చేశారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి స్పందిస్తూ.. తదుపరి విచారణ వరకు పిటిషనర్లకు అరెస్టు నుంచి రక్షణ కల్పించాలని కోరారు. ఈ నేపథ్యంలో తదుపరి విచారణ వరకు ఎలాంటి తొందరపాటు/కఠిన చర్యలు తీసుకోవద్దని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. విచారణను ఈ నెల 16కి వాయిదా వేస్తూ న్యాయమూర్తి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. మరోవైపు.. చంద్రబాబు నివాసంపై మూకదాడికి సంబంధించి తాడేపల్లి పోలీసులు నమోదుచేసిన కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ మాజీ మంత్రి జోగి రమేశ్ దాఖలు చేసిన వ్యాజ్యంపై విచారణను కూడా న్యాయమూర్తి 16వ తేదీకి వాయిదా వేశారు. అప్పటి వరకు పిటిషనర్‌పై తొందరపాటు చర్యలు తీసుకోవద్దని స్పష్టం చేశారు.

బెయిల్ పిటిషన్లపై తీర్పు 15కి వాయిదా

గుంటూరు (లీగల్), జూలై 11: తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై దాడి కేసులో అరెస్టయి రిమాండ్‌లో ఉన్న వైసీపీకి చెందిన ఏడుగురు నిందితులు దాఖలు చేసుకున్న మూడు బెయిల్ పిటిషన్లపై గురువారం వాదోపవాదాలు పూర్తయ్యాయి. దీంతో జిల్లా ప్రధాన న్యాయాధికారి వైవీఎస్ బీజీ పార్థసారథి ఈ పిటిషన్లపై తీర్పును ఈ నెల 15కు వాయిదా వేశారు. ఈ కేసులోనే నిందితులుగా ఉన్న మరో 18మంది దాఖలు చేసిన 6 ముందస్తు బెయిల్ పిటిషన్లలో ఇరుపక్షాల వాదనలు వినేందుకుగాను ఈ నెల 18వ తేదీకి వాయిదా వేశారు. అప్పటివరకు ఈ 18 మందిని అరెస్టు చేయవద్దని దర్యాప్తు అధికారిని ఆదేశించారు. నిందితుల తరఫున న్యాయవాదులు కృష్ణారెడ్డి, రాజశేఖర రెడ్డి, షేక్ హబీబుల్లా వాదనలు వినిపించారు. మంగళగిరి రూరల్ పోలీసుల తరఫున జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సుల్తాన్ సిరాజుద్దీన్ వాదనలు వినిపించారు. ఈ దాడి ఘటన మొత్తం టీడీపీ కార్యాలయం వద్ద సీసీటీవీల్లో రికార్డు అయిందని, వాటి ద్వారానే నిందితుల గుర్తింపు జరిగిందని చెప్పారు. దర్యాప్తు పురోగతిలో ఉంది కాబట్టి నిందితుల బెయిల్ పిటిషన్లను రద్దు చేయాలని కోరారు.

తిరుమల క్యూలైన్‌లో ఆకతాయిల ప్రాంక్ వీడియో

- విజిలెన్స్ విచారణకు టీటీడీ ఆదేశం



ప్రాంక్ వీడియో చేస్తున్న ఆకతాయిలు

తిరుమల, జూలై 11 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి భక్తులను ఆటపట్టిస్తూ తీసిన ఓ ప్రాంక్ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. శ్రీవారి సర్వ దర్శనానికి భక్తులు వేచి ఉండే నారాయణగిరి షెడ్లలో ఇద్దరు తమిళనాడు యువకులు చేసిన ఈ ప్రాంక్ వీడియోలు కలకలం సృష్టిస్తున్నాయి. తమిళనాడుకు చెందిన టీటీఎఫ్ వాసన్ తన మిత్రులతో కలిసి ఈ వీడియోను తీసినట్టు తెలుస్తోంది. భక్తులు వేచిఉన్న నారాయణగిరి షెడ్‌లోని ఓ కంపార్టుమెంట్‌కు ఎప్పటిలానే టీటీడీ సిబ్బంది తాళాలు వేశారు. అయితే కంపార్టుమెంట్‌కు తాళాలు తీస్తున్నట్టు వాసన్ నటించాడు. దీంతో కంపార్టుమెంట్‌లో కూర్చుని ఉన్న భక్తులు టీటీడీ ఉద్యోగిగా భావించి దర్శనానికి పంపుతున్నారనే ఉద్దేశంతో ఒక్కసారిగా పైకి లేచారు. అంతలోనే వాసన్ వెకిలి నవ్వులతో అక్కడి నుంచి పరుగు తీశాడు. ఈ దృశ్యాలను అతని స్నేహితుడు సెల్‌ఫోన్‌లో చిత్రీకరించాడు. భక్తుల మనోభావాలతో ఆడుకున్న ఈ వీడియోను సోషల్‌మీడియాలో చూసిన పలువురు భక్తులు తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ఈ వీడియో గురువారం వైరల్ కావడంతో విజిలెన్స్ విచారణకు టీటీడీ ఈవో శ్యామలరావు ఆదేశించారు. కాగా, భక్తుల మనోభావాలు దెబ్బతినేలా తీసిన ప్రాంక్ వీడియో హేయమైన చర్య అంటూ టీటీడీ గురువారం సాయంత్రం ఓ ప్రకటనలో ఖండించింది. ఇటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం అని హెచ్చరించింది.

ట్రిపుల్ ఐటీ మెరిట్ జాబితా విడుదల

- 67.15 శాతం బాలికలు ఎంపిక..ఈ నెల 22 నుంచి అడ్మిషన్లు

నూజివీడు/వేంపల్లె, జూలై 11: ఆర్జీయూకేటీలో 2024-25 విద్యాసంవత్సర ప్రవేశానికి క్యాంపస్‌ల వారీగా ఎంపికైన విద్యార్థుల తుది జాబితాను ఏలూరు జిల్లా నూజివీడు ఆర్జీయూకేటీ చాన్సలర్ ఆచార్య కేసీ రెడ్డి, నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో గురువారం విడుదల చేశారు. ఎంపికైన విద్యార్థుల్లో 67.15శాతం బాలికలు, 32.85శాతం మంది బాలురు ఉన్నారు. ఎంపికైన విద్యార్థులు నూజివీడు ట్రిపుల్‌ఐటీ, ఇడుపులపాయల క్యాంపస్‌ల్లో ఈ నెల 22, 23వ తేదీల్లో, ఒంగోలు ట్రిపుల్‌ఐటీకి ఎంపికైన విద్యార్థులకు ఈ నెల 24, 25 తేదీల్లో ఇడుపులపాయ ప్రాంగణంలో, శ్రీకాకుళం ప్రాంగణానికి ఎంపికైన విద్యార్థులకు ఈ నెల 26, 27 తేదీల్లో కౌన్సిలింగ్ నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఇరాన్ గద్దెపై ఉదారవాది

ఇరాన్ కొత్త అధ్యక్షుడుగా మసూద్ పెజెష్కియాన్ ఎన్నికకావడం చాలామందిని ఆశ్చర్యపరిచింది. ఛాందసవాది, ఇరాక్ యుద్ధ వీరుడు అయిన సయ్యద్ జలీలీమీద సంస్కరణవాది మసూద్ మంచి మెజారిటీతో గెలవడం విశేషమైన పరిణామం. అమెరికాలో ఈ ఏడాది చివర్లో జరగబోయే ఎన్నికల్లో గెలవబోతున్న అధ్యక్షుడితో మళ్ళీ అణు ఒప్పందం కుదుర్చుకోవడానికి ఇరాన్ ఇలా ముందుగానే సిద్ధమైందని కొందరు ఉత్సాహంగా వ్యాఖ్యానిస్తున్నారు. బైడెన్ వెనుకంజలో ఉన్నారని అంచనాలున్న స్థితిలో, గతంలో ఆ ఒప్పందాన్ని తుత్తునియలు చేసిన డోనాల్డ్ ట్రంప్ మహాశయుడే తిరిగి అధ్యక్షుడైతేనో అన్న ప్రశ్న ఓ పక్కన ఉండనే ఉంది. కానీ, ఇంటాబయటా పలురకాల సంక్షోభాలు ఎదుర్కొంటున్న ఇరాన్‌కు ఈ ఆపత్సమయంలో పెజెష్కియాన్ సారథ్యం ఎంతోకొంత మేలు చేస్తుందన్న నమ్మకమైతే విశ్లేషకుల్లో బలంగానే ఉంది.

రెండుదశాబ్దాల క్రితం ఆరోగ్యమంత్రిగా పనిచేసిన ఈయన, పోటీలో నిలబడిన మిగతాఛాందసులకంటే ప్రజలకు నచ్చాడు. వారి కోర్కెలకు, ఆశలకూ ఆయన ప్రతినిధి. దేశప్రజల్లో తీవ్రమైన నైరాశ్యం ఆవరించి ఉందని, వారిలో అంతర్లీనంగా రగులుతున్న ఆగ్రహం ఏదో రూపంలో చల్లార్చాల్సిన అవసరం ఉన్నదని ఇరాన్ అధినాయకుడు, ఆయన ఆధ్వర్యంలోని మతాచార్యుల మండలి గుర్తించాయి. ఈ కారణంగానే గత అధ్యక్ష ఎన్నికల్లోనూ, ఇటీవలి మజ్లిస్ ఎన్నికల్లోనూ పెజెష్కియాన్‌ను దూరంపెట్టినవారే ఇప్పుడు పిలిచి మరీ ఈ పదవికి పోటీపడమన్నారు. ఆయన రాకవల్లనే ఈ ఎన్నికలకు కళవచ్చిందనీ, ప్రజల భాగస్వామ్యం పెరిగిందనీ అంటారు. ఎన్నికలబరిలో నిలవడానికి షియా మతాచార్యుల మండలి అనుమతించిన ఏకైక ఉదారవాది పెజెష్కియాన్.

గత అధ్యక్ష ఎన్నికల్లో ఖమేనీ ఆశీస్సులతో దేశాధ్యక్షుడైన ఇబ్రాహీం రైసీ తన నిరంకుశత్వంతో, ఛాందసత్వంతో అధికశాతం ప్రజలకు శత్రువైనాడు. అమెరికా అధ్యక్షుడుగా బరాక్ ఒబామా ఉండగా, ఇరాన్‌లో హసన్ రౌహానీ సాధించిన అణు ఒప్పందం ప్రపంచానికి ఎంతో ఉపశమనం ఇచ్చింది. ఆధునికుడిగా, ఆలోచనాపరుడుగా ప్రజల్లో మంచి పేరున్న రౌహానీ దీనితో ఎంతో సులువుగా రైసీని 2017 అధ్యక్ష ఎన్నికల్లో ఓడించగలిగారు. కానీ, ట్రంప్ తిక్కచేష్టలవల్ల ఆ ఒప్పందం స్వల్పకాలంలోనే నీరుగారిపోయి, అమెరికా చేతిలో ఇరాన్ పలు ఆంక్షలనూ, వేధింపులనూ అనుభవించాల్సివచ్చింది. ఈ వాతావరణం రైసీ తరహా ఛాందసశక్తుల ఎదుగుదలకు తోడ్పడింది. ఖమేనీ పట్టు బిగించడంతో రౌహానీని రైసీ 2021అధ్యక్ష ఎన్నికల్లో సులువుగా ఓడించగలిగారు. ఉదారవాదులు, సంస్కరణవాదుల గొంతులు బలహీనమైపోయిన ఆ తరుణంలో, ఖమేనీ ఆశీస్సులతో రెచ్చిపోయిన రైసీ వివిధ రకాల ఆంక్షలు అమలుచేశారు. అక్రమ నిర్బంధాలు, అణచివేతలు, రహస్య హత్యలు ఆయన హయాంలో చాలా జరిగాయి. ప్రజలకు స్వేచ్ఛ అపురూపమైపోయింది. మహిళల వస్త్రధారణకు సంబంధించి ప్రత్యేకమైన ఆంక్షలు, నిఘా నియంత్రణ వ్యవస్థలు ఏర్పాటైనాయి. చాదోర్ వస్త్రాన్ని ధరించనందుకు మెహసా అమీనీ అనే కుర్దు యువతిని పోలీసులు తమ కస్టడీలో హతమార్చిన ఘటన దేశాన్ని కుదిపివేసింది. ప్రజల మనసుల్లో పాలకులపట్ల గూడుకట్టుకొని ఉన్న ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఈ మహిళా ఉద్యమాన్ని అణచివేయడంలో ఇబ్రాహీం రైసీ ప్రదర్శించిన కాఠిన్యం ఇరాన్ ఎన్నటికీ మరిచిపోదు. విమానప్రమాదంలో మొన్న మే నెలలో ఆయన మరణించినప్పుడు చాలా సమూహాలు వేడుకచేసుకున్నాయని కూడా వార్తలు వచ్చాయి.

ఛాందసవాది రైసీ స్థానాన్ని సంస్కరణవాది పెజెష్కియాన్ భర్తీ చేయడం ఇరాన్ ప్రజలు, పాలకులు కూడా ఆశిస్తున్న మార్పు. ఆయన తన ఎన్నికల ప్రచారంలో చేసిన వాగ్దానాలన్నీ నెరవేర్చలేకపోవచ్చు, వ్యవస్థలని సమూలంగా ప్రక్షాళించలేకపోవచ్చు. కానీ, రైసీ హయాంలో ప్రజలు కోల్పోయిన స్వేచ్ఛనీ, హక్కులనీ కొంతమేరకు వారికి తిరిగి ఇవ్వగలిగినా చాలు. విదేశాంగం సహా చాలా విషయాల్లో ఖమేనీ, ఆయన ఆధ్వర్యంలోని సుప్రీం కౌన్సిల్ నిర్ణయాలే చెల్లుబాటవుతాయన్నది అందరికీ తెలిసిన విషయమే. కానీ, తీవ్ర అనారోగ్యంతో ఉన్న ఖమేనీ అనంతరం ఆ స్థానాన్ని రైసీ భర్తీ చేస్తారని, మరో ఛాందసుడు దేశాధ్యక్షుడవుతాడని దేశంలోని మైనారిటీలు, సంస్కరణాభిలాషులు, ఉదారవాదులు భయపడుతున్న తరుణంలో పెజెష్కియాన్ రాక ఇంటాబయటా కూడా ఒక సానుకూల వాతావరణాన్ని నెలకొల్పేందుకు ఉపకరిస్తుంది.

నాడు కరువు... నేడు కనక వర్షం!

టీ20 ప్రపంచ కప్‌ను గెలిచిన టీమ్ ఇండియాకు భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) నుంచి 125 కోట్ల రూపాయల నగదు నజరానా! భారతీయ క్రికెట్ ఎంతగా మారిపోయిందో ఈ ఘన బహుమానం సూచించడం లేదూ! 1950, 1960 దశకాలలో మన టెస్ట్ క్రికెటర్లకు ఒక్కో మ్యాచ్‌కు రూ.250 చెల్లించేవారు. ఒకసారి న్యూజిలాండ్‌ను భారత్ కేవలం మూడు రోజుల్లోనే ఓడించినప్పుడు విజేతలు ఒక్కొక్కరికి కేవలం రూ.150 మాత్రమే చెల్లించారు! క్రికెట్ బోర్డ్ తీరు నాడు ఆ క్రికెటర్లనే కాదు, నేడు మనలనూ విస్మయపరుస్తుంది. క్రీడాకారులను కేవలం దినసరి వేతన కూలీలుగా క్రికెట్ బోర్డ్ పరిగణించిందన్నది ఒక వాస్తవం. ఐదు రోజుల టెస్ట్ మ్యాచ్‌ను రెండు రోజులు ముందుగానే విజయవంతంగా ముగించేయడమే ఆనాటి క్రికెటర్లు చేసిన తప్పిదం! ఆ తప్పుకు శిక్షగా వారికిచ్చే పారితోషికంలో రూ.100 తగ్గించారు.

1971లో ఓవర్సీస్ టెస్ట్ క్రికెట్‌లో ఇంగ్లాండ్, వెస్టిండీస్ జట్లను భారత్ ప్రప్రథమంగా ఓడించింది. భారతీయ క్రికెట్ ఘనతను ప్రపంచానికి చాటి స్వదేశానికి తిరిగివచ్చిన ఆ విజేతలకు, ఇటీవల రోహిత్ శర్మ టీమ్‌కు కంటే కూడా ఘనమైన స్వాగత సత్కారాలు లభించాయి. నాడు ఆ విజేతలను చూసేందుకు, అభినందించేందుకు క్రికెట్ అభిమానులు అసంఖ్యాకంగా ఎగబడ్డారు. హార్దిక స్వాగతం ఎంత ఘనంగా లభించినా అంతిమంగా దక్కిన ఆర్థిక లబ్ధి పూజ్యం, నమ్మండి. ఒక జౌళి కంపెనీ మాత్రం ఉదారంగా ఆ విజేతలకు తలొక ప్యాంట్, షర్ట్ వస్త్రాలను కానుకగా ఇచ్చింది! 1983లో మహాశక్తిమంతమైన వెస్టిండీస్ జట్టును ఓడించి ప్రప్రథమంగా ప్రతిష్ఠాత్మక ప్రపంచ కప్‌ను గెలిచిన (కపిల్‌దేవ్ నాయకత్వంలోని) భారత్ జట్టు సభ్యులు ఒకొక్కరికి బీసీసీఐ చెల్లించింది కేవలం రూ.20 వేలు మాత్రమే. గాంధర్వ గాయని లతా మంగేష్కర్ ఆ విజేతల గౌరవార్థం ఒక సంగీత కచేరి నిర్వహించారు. ఆ సంగీత సభ ద్వారా లభించిన ఆదాయాన్ని ఆ క్రికెటర్లకు బహుమానంగా అందజేశారు. అలా ఒకొక్కరికి అందిన మొత్తం లక్ష రూపాయలే. ఈ నాటి క్రికెటర్లకు లభిస్తున్న కోట్లాది రూపాయలతో పోలిస్తే ఆ మొత్తం ఎంత! అన్నట్టు ఇప్పుడు టీమ్ ఇండియా సహాయ సిబ్బంది సైతం అంత కంటే అధికంగానే ఆర్థిక లబ్ధి పొందుతున్నారు.

అప్పటికీ ఇప్పటికీ భారత క్రికెట్ జగత్తులో చోటు చేసుకున్న అతి పెద్ద మార్పు క్రీడాకారులకు దక్కుతున్న విశేష ఆర్థిక లబ్ధి అని చెప్పి తీరాలి. కేవలం అంతర్జాతీయ టెస్ట్ మ్యాచ్‌లలో ఆడేవారికే కాదు, దేశీయ టోర్నమెంట్‌లలో ఆడేవారికి సైతం ద్రవ్య లాభం అధిక మొత్తంలో ఉంటోంది. ఉదాహరణకు రంజీ ట్రోఫీనే తీసుకోండి. మ్యాచ్ ఫీజుగా రోజుకు రూ. 40 నుంచి రూ.60 వేలు దాకా బీసీసీఐ చెల్లిస్తోంది. దేశీయ టోర్నమెంట్ సీజన్‌లో జరిగే అన్ని మ్యాచ్‌లలో ఆడే క్రీడాకారుడికి ఇంచుమించు రూ.30 నుంచి రూ.40 లక్షల దాకా ఆదాయం లభిస్తోంది. మరి 1960ల నాటి రంజీ ట్రోఫీ క్రీడాకారులకు ఎంత చెల్లించేవారో తెలుసా? ఒకో మ్యాచ్‌కు ఒకొక్కరికి కేవలం రూ.10 మాత్రమే లభించేది. ఆ తరం క్రీడాకారులు గౌరవ ప్రదంగా జీవించేందుకు ఎస్‌బీఐ లాంటి ప్రభుత్వ రంగ సంస్థలోనో లేదా టాటా లాంటి ఉదారశీల ప్రైవేట్ కంపెనీలోనే భద్రమైన ఉద్యోగం మాత్రమే ఆధారం మరి.

భారత క్రికెట్ జగత్తులోకి ధన ప్రవాహం ఎలా ప్రవేశించింది? ఈ అందమైన ఆటను ధనశక్తి ప్రభావితం చేయడం ఎలా ప్రారంభమయింది? మూడు నిర్ణయాత్మక పరిణామాలు అందుకు దోహదం చేశాయి. అవే మన క్రికెట్ జగత్తులో ఈ మిలియనీర్ రాజ్‌ను నెలకొల్పాయి. మొదటిది నిస్సందేహంగా 1983 ప్రపంచ కప్ విజయం. భారత క్రికెట్ చరిత్రలో అదొక అనూహ్య మలుపు. ఆ విజయం ఒక తరం తరాన్ని చాలా పెద్ద విషయాలను స్వప్నించేందుకు పురిగొల్పింది. నాలుగు సంవత్సరాల అనంతరం ప్రపంచ కప్ టోర్నమెంట్‌ను ఇంగ్లాండ్‌లో కాకుండా భారత్‌లో (ప్రప్రథమంగా) నిర్వహించారు.



1983 ప్రపంచ కప్ విజయం, 1990ల్లో శాటిలైట్ టీవీ విప్లవం, 2000 దశకంలో ఇండియన్ ప్రీమియర్ లీగ్ ఆవిర్భావం బీసీసీఐని మహా సంపద్వంతం చేశాయి. స్వతంత్ర భారత తొలితరాల క్రికెటర్లు ఊహించలేని, ఆశించలేని ఆర్థిక లబ్ధి 21వ శతాబ్ది క్రికెటర్లకు లభిస్తోంది. మరి క్రికెట్‌కు సంబంధించిన ప్రశస్త సంప్రదాయాలను సమున్నతం చేయవలసిన బాధ్యత బీసీసీఐకి ఉన్నది. క్రీడాకారులు, క్రికెట్ వ్యవహారాల నిర్వాహకుల మధ్య తేడాను పాటించడం అటువంటి అత్యుత్తమ సంప్రదాయాలలో ఒకటి.

రెండో పరిణామం 1990ల్లో అమలయిన ఆర్థిక సంస్కరణలు; అదే సమయంలో సంభవించిన శాటిలైట్ టీవీ విప్లవం. దాని ఫలితంగా క్రికెట్ క్రీడాకారులు తమ బ్రాండ్ విలువను తెలుసుకున్నారు. తమ ప్రభావశీలతను వ్యక్తిగత ఆర్థిక లబ్ధికి సద్వినియోగం చేసుకున్నారు. ముఖ్యంగా సచిన్ టెండూల్కర్ వాణిజ్య ప్రకటనల మహారాజుగా వెలుగొందారు. టీవీలో సచిన్ లేని, ఏ వస్తువుకు సంబంధించిన వాణిజ్య ప్రకటనా ప్రసారమయ్యేది కాదంటే నమ్మి తీరాలి.

మూడోది ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్). క్రికెట్ జగత్తులో పెను మార్పుకు కారణమైన ఐపీఎల్, 2008లో క్రీడా ప్రపంచాన్ని ఊపేసింది. విభ్రమపరిచింది. సంబరపరిచింది. దీనితో ఒక్కసారిగా క్రికెట్ అనేది భారతీయుల మనస్సును పూర్తిగా ఆవహించిన ఆటగా..... మాత్రమే కాకుండా భారత క్రికెట్ ప్రపంచం మెచ్చే క్రీడగా వెలుగొందడం ఆరంభమయింది. సమస్త ఐపీఎల్ టీమ్‌ల విలువ వందల కోట్ల రూపాయలలో ఉండడం ఒక సాధారణ విషయమయింది. ఐపీఎల్ ఇప్పుడు ప్రపంచ రెండో మహా సంపద్వంతమైన స్పోర్ట్స్ లీగ్‌గా వెలుగొందుతోంది. మ్యాచ్ విలువ పరంగా అమెరికాకు చెందిన నేషనల్ ఫుట్‌బాల్ లీగ్ తరువాయి స్థానం ఐపీఎల్‌దే. ప్రవాసంలో ఉన్న ఐపీఎల్ ఆవిర్భావానికి ప్రధాన కారకుడు లలిత్ మోదీ తాను ఎంతటి మహా ప్రభావదాయక క్రీడా పోటీని ప్రారంభించడం జరిగిందన్న విషయమై ఆశ్చర్యపోతున్నాడేమో?!

అంతా బాగానే ఉంది. అంతా మన మంచికే. క్రికెట్ ఆకాంక్షాభరితమైనది. ప్రతిభా సమన్వితమైనది. శతాధిక కోట్ల భారతీయుల స్వప్నాలను నెరవేర్చేది. అన్ని విధాలా క్రికెట్ పెరుగుదల ప్రభావం ఇతర ఆటలపై కూడా బహుముఖీనంగా ఉంటుంది. 2024 పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొననున్న క్రీడాకారులు అదృష్టవంతులు. మునుపటి ఒలింపియన్లు కలలో కూడా ఆశించని ఆర్థిక లబ్ధి పారిస్ ఒలింపియన్లకు లభించనున్నది. ఈ తరం వారికి మెరుగైన, ప్రశస్తమైన శిక్షణ కూడా లభిస్తోంది. బ్యాడ్మింటన్ ఛాంపియన్‌ల నుంచి అసాధారణ జావెలిన్ హీరో నీరజ్ చోప్రా దాకా భారతీయ క్రీడాకారులు ఎందరో ప్రపంచ అత్యుత్తమ క్రీడాకారులతో సమర్థంగా పోటీ పడుతున్నారు. విజయాలు సాధిస్తున్నారు. దురదృష్టవశాత్తు మన క్రీడా సంఘాలు అన్నీ వృత్తి నిబద్ధతతో పనిచేయడం లేదు. ఈ అవలక్షణం మూలంగానే ఒలింపిక్స్‌లో మన క్రీడాకారులు మరిన్ని ప్రశస్తమైన విజయాలు సాధించలేకపోతున్నారు.

సరే, మళ్లీ బీసీసీఐ విషయానికి వద్దాం. దేశంలో అత్యంత సంపద్వంతమైన క్రీడా సంఘమది. కొంత మంది దృష్టిలో అత్యంత అపారదర్శకంగా పనిచేసే క్రీడా సంఘం కూడా అదే. జైషా నాయకత్వంలోని బీసీసీఐ సగర్వంగా చెప్పుకోగల విషయాలు కొన్ని ఉన్నాయి. గత కొద్ది సంవత్సరాలుగా మహిళా క్రికెట్‌కు అందిస్తున్న ప్రోత్సాహం వాటిలో ముఖ్యమైనది. పురుష క్రికెటర్లతో సమానంగా మహిళా క్రికెటర్లకూ పారితోషికాల చెల్లింపులు జరగడం, ప్రత్యేకంగా ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ ఏర్పాటు రెండూ చరిత్రాత్మకమైనవి, ప్రశంసించి తీరాల్సినవి. అవి జెండర్ అవరోధాలను తొలగించాయి. క్రికెట్ క్రీడా జగత్తును ప్రపంచాన్ని మరింతగా సమ్మిళితమయ్యేందుకు దోహదం చేసిన కీలక చర్యలవి, సందేహం లేదు. ఎన్నో ప్రశంసనీయమైన మార్పులను తీసుకువచ్చినప్పటికీ నేటి బీసీసీఐ ఇప్పటికీ రాజకీయ మద్దతు, ప్రాబల్యమున్న అధికారుల కోటరీ నియంత్రణలో పనిచేస్తోంది. జవాబుదారీతనం చూపని ఈ పెద్ద మనుషులు ఆ ప్రపంచ క్రీడ వ్యవహారాలను అమితంగా ప్రభావితం చేస్తున్నారు, పెత్తందారీతనంతో నియంత్రిస్తున్నారు.



■ రాజ్‌దీప్ సర్దేశాయి

దీపశిఖ

భారతీయ క్రికెట్ ఒక మహాశక్తి. సూపర్ పవర్ హోదాతో వెలుగొందుతోంది. మరి అటువంటి ప్రభావశీలతకు చిత్తశుద్ధితో బాధ్యతల నిర్వహణ కూడా తోడైతే ఎంత బాగుండును! బీసీసీఐ పెద్దలు భారత క్రికెట్ సంరక్షకులే కానీ దాని యజమానులు కానేకారు. క్రికెట్ బోర్డు, ఒక ఐపీఎల్ లాంటి ఫ్రాంఛైజీ ఎంతమాత్రం కాదు. మరి క్రీడకు సంబంధించిన ప్రశస్త సంప్రదాయాలను సమున్నతం చేయవలసిన బాధ్యత బీసీసీఐకి ఉన్నది. క్రీడాకారులు, క్రికెట్ వ్యవహారాల నిర్వాహకుల మధ్య తేడాను పాటించడం అటువంటి అత్యుత్తమ సంప్రదాయాలలో ఒకటి. మరి క్రికెట్ బోర్డ్ అధికారులు 'ఇండియా ఛాంపియన్' టీషర్ట్‌లు ధరించి విజేతలయిన క్రీడాకారులతో పాటు ఓపెన్ టాప్ బస్‌పై కూర్చుని క్రీడాభిమానుల కేరింతలకు క్రీడాకారుల వలే చేతులు ఊపుతూ ప్రతిస్పందించడం ఏమి సబబు? ట్రోఫీ ఎత్తిపట్టుకుని ఫోటోలు కూడా దిగడమా? ఇది ఎంత మాత్రం సరైనది కాదు.

మరి కొద్ది నెలల్లో ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ)కి జైషా తదుపరి అధ్యక్షుడు అయ్యే అవకాశమున్నది. 35 ఏళ్ల షా క్రికెట్‌కు బిగ్‌బాస్‌గా చాలా శీఘ్రగతిన ఎదిగారు. ఐసీసీకి అధ్యక్షుడు కావడం ఆయన ఉత్థానంలో మరో గొప్ప ముందడుగు. అమిత్ షా కుమారరత్నం అయిన జైషా 'నెపో బేబీ' (తండ్రి పలుకుబడితో ఉన్నత స్థాయికి ఎదిగిన బిడ్డ)కి ఒక మంచి ఉదాహరణ అని ఆయన విమర్శకులు అంటుండవచ్చు గానీ జూనియర్ షా పనితీరు ప్రశస్తమైనది అనడంలో సందేహం లేదు. అనేక మేలు మార్పులకు ఆయన ప్రధాన కారకుడు. అయితే ఇప్పుడు ట్రోఫీలను గెలవడమే కాకుండా నిజమైన క్రికెట్ సంస్కృతిని గౌరవించవలసిన అవసరమున్నదన్న విషయాన్ని జైషా, క్రికెట్ బోర్డు అధికారులు గుర్తించాలి. బీసీసీఐ అధికారులు క్రికెట్ సంరక్షకులే కానీ ఆ ఆట వ్యవహారాలను శాసించే సర్వాధికారులు కారు.

తాజా కలం: ఇంగ్లాండ్‌లో ఏటా జరిగే వింబుల్డన్ టెన్నిస్ టోర్నమెంట్ విశిష్టమైన, అద్వితీయమైన క్రీడా సంఘటన. ఈ ప్రపంచ ప్రఖ్యాత టెన్నిస్ టోర్నమెంట్ ఎందుకు ప్రశస్తమైన క్రీడా సంఘటనో వింబుల్డన్ ఇటీవలే మరోసారి నిరూపించింది. రాయల్ బాక్స్ (కులీన, ఉన్నత స్థాయి అతిథులు కూర్చునే ప్రదేశం)లో ఉన్న వారందరూ వివిధ క్రీడలలో ప్రపంచ స్థాయి ఘనాపాటీలే. మన భారత రత్న సచిన్ టెండూల్కర్ సహా వారందరూ ప్రత్యేక ఆహ్వానితులు. వింబుల్డన్ అధికారులు కానీ, కార్పొరేట్ కుబేరులు కానీ ఎక్కడా ప్రాధాన్యం పొందలేదు. మరి భారతీయ క్రికెట్ మ్యాచ్‌లో మనకు కనపడేది అందుకు పూర్తిగా విరుద్ధమైనదే కాదూ?

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

మనకు తెలియని బీరు కథ!

బీరు చాలామందికి హాయినిచ్చే ఒక అనుభూతి. మన దేశంలో బీరుకు లభించినంత ఆదరణ వేరే ఏ ఇతర పానీయానికి లభించదు. అయితే గత కొన్నేళ్లుగా బీరు ఉత్పత్తి, దాని డిస్ట్రిబ్యూషన్‌లపై అనుసరిస్తున్న విధానాల వల్ల ఇటు కంపెనీలకు.. అటు వినియోగదారులకు అనేక రకాల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రెండు రాష్ట్రాలలోను కొత్త ప్రభుత్వాలు వచ్చిన నేపథ్యంలో ఈ విధానాలపై స్పష్టమైన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. అంతే కాకుండా సామాన్య ప్రజలకు కూడా బీరు తయారీపై అవగాహన కల్గించాల్సిన అవశ్యకత ఉంది.

మన దగ్గర బీరును బార్లీ, బియ్యం, పంచదారలతో తయారుచేస్తారు. వాస్తవానికి ఒక కోణం నుంచి చూస్తే ఇది ఒక ఆర్గానిక్ డ్రింక్ మాత్రమే! అయితే దీనిలో ఉండే ఆల్కాహాల్ కంటెంట్ వల్ల దీనిపై ప్రభుత్వం నియంత్రణ చేపట్టింది. బీరు అమ్మకాల వల్ల ప్రభుత్వానికి ప్రతి ఏడాది కొన్ని వేల కోట్ల రూపాయల ఆదాయం లభిస్తుంది. కానీ బీరు ఉత్పత్తిదారులకు లభించే ఆదాయం మాత్రం దానిలో నామమాత్రమే! ఉదాహరణకు బ్రూవరీస్ కార్పొరేషనకు ఒక క్రేట్ (పన్నెండు 650 ఎంఎల్ బాటిల్స్)కు ఇచ్చే ధర 289 రూపాయలు. దీనిని ప్రభుత్వం 1800 రూపాయలకు అమ్ముతుంది. అంటే ఒక క్రేట్ బీరు మీద ప్రభుత్వానికి వచ్చే ఆదాయం 1500 రూపాయలు. చాలా మంది వినియోగదారులు బీరు ధర కంపెనీల చేతుల్లో ఉంటుందనుకుంటారు. కానీ అది నిజం కాదు. బీరు ధరను ప్రభుత్వమే నిర్ణయిస్తుంది. అంతే కాదు. బీరు ధరలను నిర్ణయించటానికి ఒక పర్చేజింగ్ కమిటీ ఉంటుంది. ఇది మూడేళ్లకు ఒకసారి ధరలను నిర్ణయిస్తుంది. సాధారణంగా బీరుకు అవసరమైన ముడి సరుకును బహిరంగ మార్కెట్లోనే కొనుగోలు చేయాల్సి ఉంటుంది. కోవిడ్ తర్వాత ముడి సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. అయినా ధరలను ఇంకా సవరించలేదు. ఈ ధరల నిర్ణయాన్ని మూడేళ్లకు ఒకసారి కాకుండా ప్రతి ఏడాది నిర్ణయిస్తే బావుంటుంది. అంతే కాకుండా ప్రభుత్వం కంపెనీలకు ఇచ్చే బిల్లులను ప్రతి 15 రోజులకు ఒకసారి ఇస్తే బావుంటుంది. కొన్నిసార్లు ఈ బిల్లులు నెలలకొలది పెండింగ్ ఉండిపోతున్నాయి. దీని వల్ల కంపెనీలు తమ సప్లైయర్స్‌కు ఇవ్వటానికి ఇబ్బంది కలుగుతోంది.



బీరును తాగేవారు కొన్ని కోట్ల మంది ఉన్నారు. వారి కోసం నాణ్యమైన కల్తీలేని బీరును ఉత్పత్తి చేయటానికి అనేక కంపెనీలు కూడా సిద్ధంగా ఉన్నాయి. ఈ రెండింటిని సమన్వయం చేయగలిగితే ప్రభుత్వానికి ఆదాయం లభిస్తుంది. చెడు బీరును అమ్మి కొందరికి మేలు చేశారనే చెడ్డ పేరు రాదు.

ఇక చాలా మందికి విదేశాలలో కొన్ని వందల బ్రాండ్స్ అందుబాటులో ఉంటాయి కదా.. మన దగ్గర ఈ బ్రాండ్స్ ఎందుకు దొరకవనే ప్రశ్న తలెత్తుతూ ఉంటుంది. ఏ బ్రాండ్‌ను ఉత్పత్తి చేయటానికి అనుమతించాలి? ఎంత ఉత్పత్తిని అనుమతించాలి? అనే విషయాన్ని నిర్ణయించేది కూడా ప్రభుత్వమే. ఉదాహరణకు ప్రభుత్వం మూడు కంపెనీలకే అనుమతి ఇచ్చిందనుకుందాం. మూడు రకాల బీర్లే మార్కెట్లో లభ్యమవుతాయి. చాలా సందర్భాలలో ఇది వినియోగదారుల అభిరుచుల ఆధారంగా కాకుండా వేరే ఇతర కారణాల ఆధారంగా నిర్ణయాలు తీసుకుంటూ ఉంటారు. దీనివల్ల ఇటు కంపెనీలు నష్టపోతున్నాయి, అటూ వినియోగదారులకు సరైన ఉత్పత్తులు లభించటంలేదు. గత కొన్ని దశాబ్దాలుగా ప్రభుత్వాలు అనుసరిస్తున్న కొన్ని విధానాలే ఈ సమస్యలకు కారణం. వీటిని వెంటనే పరిష్కరించకపోతే వినియోగదారులకు ఇబ్బందులు తప్పవు.

బీరు ఉత్పత్తి చేయాలంటే ప్రభుత్వం లైసెన్స్ తప్పనిసరి. ఈ లైసెన్స్ ఫీజు సాధారణంగా చాలా ఎక్కువగా ఉంటుంది. బాగా అభివృద్ధి చెందిన దేశాల్లో.. మన దేశంలోని కొన్ని రాష్ట్రాల్లో ఈ లైసెన్స్ ఫీజు ఉత్పత్తి ఆధారంగా ఉంటుంది. ఉదాహరణకు ప్రతి ఏడాదికి 30 లక్షల బాటిల్స్ బీరు తయారుచేసేవారు కట్టాల్సిన లైసెన్స్ ఫీజు.. 10 లక్షల బాటిల్స్ తయారుచేసే వారు కట్టాల్సిన లైసెన్స్ ఫీజు ఒకటే! దీని వల్ల కొన్ని కంపెనీలు నష్టపోతాయి, కొన్ని కంపెనీలు లాభపడతాయి. కథ ఇక్కడితో ఆగలేదు. ఒకసారి లైసెన్స్ పొంది ఉత్పత్తి ప్రారంభించటానికి ప్రభుత్వం వద్ద నుంచి పర్చేజ్ ఆర్డర్లు అవసరం. సాధారణంగా ఇవి ఉత్పత్తి సామర్థ్యం ఆధారంగా ఇవ్వాల్సి ఉంటుంది. కానీ కొన్ని కారణాల వల్ల కొన్ని పెద్ద పెద్ద విదేశీ కంపెనీలకు ఎక్కువ ఆర్డర్లు లభిస్తాయి. దీనివల్ల చిన్న కంపెనీల మనుగడ ఎప్పుడూ కష్టమే! ఒకసారి బీరు ఉత్పత్తి అయి బయటకు వచ్చిన తర్వాత దానిని బహిరంగ మార్కెట్లో విక్రయించటానికి ఉండదు. ఉత్పత్తి అంతా ప్రభుత్వానికి అప్పచెబితే ప్రభుత్వం దానిని కొనుగోలు చేసి తమ డీలర్ల ద్వారా విక్రయిస్తుంది. అయితే ఈ ఉత్పత్తి విషయంలో కూడా విధానం సరిగ్గా లేదు. సాధారణంగా బీరు ఉత్పత్తి చేసే యంత్రాలకు కోట్ల రూపాయలలో పెట్టుబడి అవసరమవుతుంది. దీనిపై జీఎస్టీ కూడా కట్టాల్సి ఉంటుంది. అయితే బీరుపై జీఎస్టీ లేదు. అంటే, యంత్రాలపై పెట్టిన పెట్టుబడికి ప్రభుత్వం పన్ను సేకరిస్తుంది కానీ దాని ద్వారా బయటకు వచ్చే ఉత్పత్తికి మాత్రం పన్ను సేకరించదు. దీనివల్ల బీరు కంపెనీలకు అదనపు ఆదాయం లభించదు.

ప్రపంచీకరణ జరిగి ప్రపంచమంతా ఒకటైపోతున్న నేపథ్యంలో స్థానిక ఉత్పత్తులు.. వాటికి ఇవ్వాల్సిన ప్రాధాన్యం గురించి మాట్లాడటం కొంత ఆశ్చర్యంగా అనిపించవచ్చు. బీరును మల్టీ నేషనల్ కంపెనీలు (ఎమ్మెన్సీ)లతో పోటీపడుతూ స్థానిక కంపెనీలు కూడా ఉత్పత్తి చేస్తున్నాయి. అయితే ఎమ్మెన్సీల ఉత్పత్తులు ఉన్నతమైనవని, స్థానికంగా తయారుచేసే బ్రాండ్స్ తక్కువనే భావన కలిగించేలా ప్రచారం సాగుతూ ఉంటుంది. ఈ ప్రచారం వల్ల స్థానిక కంపెనీలన్నీ తీవ్రంగా నష్టపోతున్నాయి. ప్రతి బీరు కంపెనీలోను ప్రతిరోజు కనీసం ఐదు వందల నుంచి వెయ్యి మంది దాకా స్థానికులకు ఉపాధి దొరుకుతూ ఉంటుంది. బీరు ఉత్పత్తులు పెరగటం వల్ల వీరందరికీ కూడా ఏడాది పొడుగునా ఉపాధి లభిస్తుంది.

బీరును తాగేవారు కొన్ని కోట్ల మంది ఉన్నారు. వారి కోసం నాణ్యమైన కల్తీలేని బీరును ఉత్పత్తి చేయటానికి అనేక కంపెనీలు కూడా సిద్ధంగా ఉన్నాయి. ఈ రెండింటిని సమన్వయం చేయగలిగితే ప్రభుత్వానికి ఆదాయం లభిస్తుంది. చెడు బీరును అమ్మి కొందరికి మేలు చేశారనే చెడ్డపేరు రాదు. ప్రభుత్వం ఈ విషయాలన్నింటిపై దృష్టి పెట్టి కొన్ని మంచి నిర్ణయాలు తీసుకుంటుందని ఆశిస్తున్నాం.

• నన్నపనేని రఘుకృష్ణ
అమెరికన్ బ్లూక్రాఫ్ట్ ప్రైవేట్ లిమిటెడ్
(వ్యాసకర్తకు బీరు తయారీ రంగంలో మూడు దశాబ్దాల అనుభవం ఉంది)

విప్లవ తేజస్వి డీవీ

కమ్యూనిస్టు విప్లవకారుల అగ్రనాయకులు దేవులపల్లి వెంకటేశ్వరరావు (డీవీ) 1984 జూలై 12న మరణించారు. విప్లవ లక్ష్యం కోసం దేశంలో ఒక మనిషిని మరో మనిషి దోచుకోవటానికి వీలులేని సమసమాజ స్థాపన కోసం తన సర్వస్వాన్ని అర్పించి, భారత విప్లవోద్యమ చరిత్రలో మార్గదర్శిగా ప్రఖ్యాతిగాంచి అమరులైన ఆ విప్లవ తేజస్వికి 40వ వర్ధంతి సందర్భంగా జోహార్లు.

1939లో కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం స్వీకరించిన డీవీ, పూర్తిస్థాయి కార్యకర్తగా నల్లగొండ జిల్లాలో ఉద్యమ నిర్మాణం ప్రారంభించారు. దేశంలోనే ఒక మహోజ్వల చరిత్రను సృష్టించిన తెలంగాణ ప్రజల సాయుధపోరాటం (1946–51) అన్ని దశల్లోనూ ఆయన కీలక పాత్ర నిర్వహించారు. ఆ పోరాటాన్ని విరమించాలనే ధోరణిని తీవ్రంగా ఖండిస్తూ 1949లోనే ఆయన ఒక డాక్యుమెంటును రచించారు.



భారతదేశ ప్రజలు నేడు ఫ్యూడల్ భూస్వాముల, బడాపెట్టుబడిదారుల, సామ్రాజ్యవాదుల దోపిడీలు – అనే మూడు బరువులను మోస్తున్నారని, ఈ దోపిడీలను సమూలంగా రద్దుచేసి ఒక నూతన ప్రజాతంత్ర వ్యవస్థను స్థాపించుకున్నప్పుడే అన్ని రంగాల ప్రజల మౌలిక సమస్యలు పరిష్కారం అవుతాయని డీవీ ఉద్ఘాటించారు. ఈ లక్ష్యసాధనకు, దేశప్రజల విముక్తి కోసం విప్లవ కార్యక్రమాన్ని, పంథాను రూపొందించారు. పాలకవర్గాలు తమపై కుట్రకేసు (హైదరాబాదు కుట్రకేసు) బనాయించినపుడు కోర్టులో తమ విప్లవ కార్యక్రమాన్ని, పంథాను, లక్ష్యాలను బహిరంగంగా ప్రకటించారు. అనేక నిర్బంధాలకు, జైలు శిక్షలకు గురయ్యారు. ఏళ్ళ తరబడి రహస్య జీవితాన్ని గడిపారు. సుమారు 5 ఏళ్ళపాటు వివిధ జైళ్ళలో గడిపారు.

భారత విప్లవోద్యమంలో పొడచూపిన అనేక పెడధోరణులను అతివాద, మితవాద అవకాశవాదాలను వ్యతిరేకిస్తూ రాజీలేని సిద్ధాంత పోరాటాన్ని నిర్వహించారు. ఈ విప్లవ కర్తవ్య నిర్వహణలో కమ్యూనిస్టు విప్లవయోధుడు తరిమెల నాగిరెడ్డి(టిఎన్)తో భుజం భుజం కలిపి నిర్వహించిన పాత్ర చరిత్రాత్మకమైనది. 1975 ఏప్రిల్‌లో టిఎన్‌తో కలిసి యుసిసిఆర్ఐ (యం-యల్)ను స్థాపించారు. డీవీ, టిఎన్ భారత విప్లవోద్యమంలో కృష్ణార్జునుల వంటివారు అని ప్రముఖ విప్లవకవి కే.శే. జ్వాలాముఖి అభివర్ణించారు. నిజమైన కమ్యూనిస్టు విప్లవకారుడికి ఉండాల్సిన లక్షణాలన్నీ మూర్తీభవించిన నేత డీవీ. సత్యసంధత, చిత్తశుద్ధి, వ్యక్తిగత నిజాయితీ, నిస్వార్థబుద్ధి, త్యాగశీలత, నిరాడంబరమైన, క్రమశిక్షణాయుత జీవితం, మచ్చలేని శీలం– అత్యున్నతమైన నైతిక విలువలను ఆయన పాటించి యువ విప్లవకారులకు ఆదర్శనీయుడయ్యారు.

– సి. భాస్కర్, యుసిసిఆర్ఐ (యం-యల్)

అందరూ రాజ్యాంగ రక్షకులే, కానీ...

ఇటీవల జరిగిన పార్లమెంటు ఎన్నికలకు ముందూ, ఆ తర్వాతా కూడా, అన్ని పార్టీల నోళ్ళలోనూ, ఆ పార్టీలతో ఏకీభవించే మేధావుల రాతల్లోనూ, బాగా నానుతున్న మాట 'రాజ్యాంగం.'

'రాజ్యాంగానికి బద్ధ వ్యతిరేకులు మోదీ, షాలు! వాళ్ళు రాజ్యాంగాన్ని నాశనం చెయ్యడానికి చూస్తే, మేము ఒప్పుకోము!' – రాహుల్‌గాంధీ.

'ఒకప్పుడు ఎమర్జెన్సీ పెట్టి, రాజ్యాంగాన్ని అవమానించిన వారే, ఈ నాడు రాజ్యాంగం పేరుతో నాట్యమాడుతున్నారు!' – నరేంద్ర మోదీ.

మొత్తానికి అన్ని పార్లమెంటరీ పార్టీల వారూ, రాజ్యాంగం పట్ల తమకున్న విధేయతని గొంతెత్తి చాటుకుంటున్నారు. మోదీ అయితే, కొత్త పార్లమెంటులో, రాజ్యాంగం పుస్తకం ముందు వంగి నమస్కరించడం తెలిసిందే. రాహుల్‌గాంధీ చేతిలో మత గ్రంథం పట్టుకున్నట్టు రాజ్యాంగం పుస్తకాన్ని చేత్తో పట్టుకుని ఊపుతూ కనబడ్డ దృశ్యం కూడా తెలిసిందే. ఇంతకీ, ఆ రాజ్యాంగం ఏమి చెపుతుందో, దేశంలోని కోట్ల మంది శ్రామిక ప్రజల ప్రయోజనాల దృష్టితో చూడాలి.

కొంచెం తేలికైన మాటల్లో చెప్పుకోవాలంటే, రాజ్యాంగం అనేది ప్రభుత్వమూ పౌరులూ అనుసరించాల్సిన నియమావళి. పౌరులకూ, ప్రభుత్వానికీ వున్న హక్కులేమిటో, విధులేమిటో వివరించే సూత్రాల పత్రం అది. పౌరులు అనేవాళ్ళు ఏ దేశంలో అయినా, మూసపోసినట్టు ఒకే రకమైన పరిస్థితులలో వుండరు. వేరు వేరు వర్గాలుగా వుంటారు. అయితే, ప్రభుత్వం అనేది అన్ని వర్గాల పౌరులకూ ప్రతినిధిగా వుంటుందా? అలాంటప్పుడు రాజ్యాంగం మాత్రం అన్ని వర్గాల ప్రయోజనాలనూ కాపాడుతుందా? ఈ విషయాలు తెలియాలంటే, భారత రాజ్యాంగం ఎలా తయారైందో చూడాలి.

భారత రాజ్యాంగాన్ని తయారు చేయించినదీ, ఆమోదించినదీ రాజ్యాంగ సభ. అంటే, ఆ నాటి పార్లమెంటులాంటిది. కానీ, ఆ సభలోని సభ్యులు, ఇప్పటిలాగా, దేశంలోని ఓటు హక్కువున్న పౌరులందరూ ఓట్లు వెయ్యగా ఎన్నికైనవాళ్ళు కాదు. జనాభాలో నాలుగో వంతు మందికి మాత్రమే వుండిన ఓటు హక్కు ద్వారా, స్థానిక శాసనసభలకు ఎన్నికైన వాళ్ళు మాత్రమే ఓటు వెయ్యగా రాజ్యాంగ సభ్యులయ్యారు. నేరుగా ఎన్నిక కానివారే కాక, ఏ రకమైన ఎన్నికా లేకుండానే, రాజాస్థానాల ప్రతినిధులు 96 మంది (మొత్తం సభ్యుల్లో పావు వంతు మంది) కూడా కూచుని, రాజ్యాంగాన్ని ఆమోదించారు. అంటే, ఈ రాజ్యాంగం దేశ ప్రజలంతా ఓట్లు వెయ్యగా కలిసి ఏర్పర్చుకున్నది కాదు; భారతదేశపు పాలక వర్గాలు తయారు చేయించుకున్నది మాత్రమే! కానీ, 'భారత ప్రజలమైన మేము...' అని రాజ్యాంగంలోని మొట్టమొదటి వాక్యం మొదలవుతుంది. రాజ్యాంగం ఎలా తయారైనప్పటికీ, దానిలో వున్న నియమాలు, శ్రామిక ప్రజల ప్రయోజనాలను కాపాడేలా వున్నాయో లేవో చూడాలి. కొన్ని వందల పేజీల్లో వున్న రాజ్యాంగంలోని అన్ని విషయాలనూ ఇక్కడ చూడలేము. మచ్చుకి కొన్ని మాత్రమే చూడగలం.

పౌరులకి తగిన జీవనాధారం కల్పించాలని 39వ సూత్రం. రాజ్యాంగ రచయితలకీ, రాజ్యాంగ సభ సభ్యులకీ అవసరానికి మించిన జీవనాధారం ఎందుకు వుందీ, ఇతరులకు ఎందుకు లేదూ? అసలు జీవనాధారాలకు వీలునిచ్చే భూమి వంటి సాధనాలుగానీ, ఉద్యోగాలుగానీ కోట్లాదిమందికి ఎందుకు లేవు? అనే ప్రశ్నే వేసుకోలేదు రాజ్యాంగ రచయితలు!

రాజ్యాంగం మీద గౌరవం లేకుండా, కాంగ్రెసు పార్టీ ఎమర్జెన్సీని విధించిందని బీజేపీ విమర్శ. కానీ, రాజ్యాంగంలోనే వున్న 352వ సూత్రం ప్రకారం, ప్రత్యేక పరిస్థితుల్లో ఎమర్జెన్సీని విధించడానికి రాజ్యాంగమే వీలు కల్పించింది. ఇదంతా, పాలకవర్గాల వారు ముందు చూపుతో పెట్టుకున్న వెసులుబాటు!

రాజ్యాంగాన్ని మెచ్చుకునేవారు చెప్పే విషయం, ఈ రాజ్యాంగం ప్రసాదించిన కొన్ని హక్కులు: అభిప్రాయ ప్రకటనా స్వేచ్ఛా, సమావేశం అయ్యే స్వేచ్ఛా, సంఘాలు పెట్టుకునే స్వేచ్ఛా. ఇదే రాజ్యాంగంలో, 1963లో చేసిన సవరణ ప్రకారం ఈ హక్కుల్ని కత్తిరించే అధికారాన్ని కూడా రాజ్యాంగమే ప్రభుత్వానికి ఇచ్చింది. ఇది కూడా పాలకవర్గాలు గడుసుగా పెట్టుకున్న నిబంధన! రాజ్యాంగంలో 23వ, 24వ సూత్రాలు దోపిడీ వ్యతిరేక హక్కుని కల్పించాయని చెపుతారు, రాజ్యాంగ సమర్థకులు. కానీ, ఈ రాజ్యాంగం ప్రకారం, 'దోపిడీ' అంటే శ్రమ దోపిడీ అని కాదు. ఆ సూత్రాల అర్థం, శ్రమ చేయించుకుని జీతం ఇవ్వకపోవడం మాత్రమే దోపిడీ కిందకి వస్తుంది. అంతేగానీ, అదనపు విలువ రూపంలో, జరిగే శ్రమ దోపిడీ గురించి కాదు. కాబట్టి, ఈ పూత, శ్రమ దోపిడీ అనే రాకాసి పుండుని మార్చజాలదు.

47వ సూత్రం ప్రకారం, ప్రజలకి పోషకాహారం అందేలా ప్రభుత్వం చూడాలి. ప్రజల్లో కొందరికి సరైన ఆహారం అందకపోవడానికీ, కొందరికి పొట్టపగిలేలా తినగలిగినంత ఆహారం ఉండడానికీ, కారణం 'దోపిడీ స్వంత ఆస్తే' అనే సంగతి రాజ్యాంగం రాసినవాళ్ళకి తెలీదా? ఉన్నవాళ్ళూ–లేనివాళ్ళూ అనే నిజం కళ్ళముందు కనపడలేదా? కాబట్టి, ప్రజలకి పోషకాహారం అందేలా చూడమని చెప్పడం వల్ల దారిద్ర్యం అనే రాకాసి పుండు మానదు.



అందరికీ సమానావకాశాలు అని 17వ సూత్రం చెపుతూ వుంటే, 18వ సూత్రమేమో చాతుర్వర్ణాల లాగా, 4 రకాల బిరుదుల్ని ప్రసాదించింది. దేశ పౌరుల్లో కొందరు పద్మశ్రీలు, పద్మ భూషణులు, పద్మ విభూషణులు, భారత రత్నలు. మిగతా అందరూ ఉత్తుత్తి మనుషులు!

బాల కార్మికుల శ్రమని నిషేధించడానికి 24వ సూత్రం. భూములూ, ఫ్యాక్టరీలూ, గనులూ, వగైరా ఆస్తులున్న కుటుంబాలలో బాలలెవరూ ఇతరుల ఇళ్ళల్లో, పని స్థలాలలో శ్రమలు చేయడానికి ఎందుకు వెళ్ళరో, రాజ్యాంగ రచయితలకు కారణం తెలియలేదా? కాబట్టి, ఈ సూత్రం కూడా, బాల కార్మిక వ్యవస్థ అనే రాకాసి పుండును మాన్పదు.

పౌరులకి తగిన జీవనాధారం కల్పించాలని 39వ సూత్రం. రాజ్యాంగ రచయితలకీ, రాజ్యాంగ సభ సభ్యులకీ అవసరానికి మించిన జీవనాధారం ఎందుకు వుందీ, ఇతరులకు ఎందుకు లేదూ? అసలు జీవనాధారాలకు వీలునిచ్చే భూమి వంటి సాధనాలుగానీ, ఉద్యోగాలుగానీ కోట్లాదిమందికి ఎందుకు లేవు? అనే ప్రశ్నే వేసుకోలేదు రాజ్యాంగ రచయితలు!

ఎస్సీ, ఎస్టీల మీద జరిగే 'అత్యాచారాల' నిరోధించే చట్టం ఒకటి వుంది. కానీ, మెజారిటీ కేసుల్లో దానివల్ల ఏ ప్రయోజనమూ లేదు. కంచికచర్లా, కారంచేడూ, చుండూరూ ఘటనలు మనకి తెలుసు. దేశ చరిత్రలో అత్యంత కిరాతకమైన అత్యాచారమూ, హత్యాకాండా, మహారాష్ట్రలోని ఖైర్లాంజీలో జరిగింది. ఆ హంతకులకి ఏమీ జరగలేదు. ఈ దురంతం గురించి, 'ఆంధ్రజ్యోతి'లో, 'వివిధ' పేజీలో, గుంటూరు ఏసుపాదం అనే కవి ఒక గొప్ప వచన కవిత రాశాడు. దానిలో, మొట్టమొదటి పాదంలోనే, 'రాజ్యాంగం పూతలకు, రాకాసి పుండ్లు మానవు...' అంటారు ఏసుపాదం గారు. పేదరికం, నిరుద్యోగం, అనారోగ్యం, దళిత బహుజనుల మీదా, ఆదివాసీల మీదా జరిగే దాడులూ... ఇలాంటి సమస్యలన్నీ 'రాకాసి పుండ్లే! (కాన్సర్ పుండ్లే)'.

అందుకే, పార్లమెంటరీ రాజకీయాలలో నమ్మకం లేని వారు, ఇప్పుడున్న దానిని 'శ్రమ దోపిడీకి వీలునిచ్చే రాజ్యాంగం' అని భావించి, 'దీన్ని తిరస్కరించి, కొత్తదాన్ని రాసుకుందాం' అంటారు. గుంటూరు ఏసుపాదం, తన అద్భుత కవితలో చెప్పినట్టు, 'కులాతీత, మతాతీత మానవుడు/ మా'నవ రాజ్యాంగాన్ని' రచిస్తాడు/ ఆగామి యుగాన్ని అనుశాసిస్తాడు!' ఆ 'నవ' రాజ్యాంగం ఎలా ఉంటుందో, కవి చెప్పకపోయినా, ఇప్పుడున్నదానికి పూర్తి వ్యతిరేకంగానూ, భిన్నంగానూ వుంటుంది. సామాజిక రాచపుండ్లకి వీలునివ్వనిదిగా వుంటుంది. అంటే, శ్రమ దోపిడీని అనుమతించనిదిగా వుంటుంది. పౌరులందరూ, ఇతరుల శ్రమని దోచేవారిగా కాక, తాము కూడా శ్రమలు చేసే వారిగా నిర్దేశిస్తుంది. కులాలుగా గడ్డకట్టించిన అసమాన శ్రమవిభజన స్థానంలో, నూతన సమాన శ్రమ విభజనను ప్రవేశపెడుతుంది. అలాంటి రాజ్యాంగం రూపొందాలంటే, ఇప్పుడున్న రాజ్యాంగం స్వభావాన్ని, శ్రామికవర్గ దృక్పథంతో పరిశీలించే పని జరగాలి. అంతేగానీ, దీనికే, 'పూతలు' (సంస్కరణలు) పూసే పనిలో మనం సమయం వృధా చెయ్యకూడదు. ముఖ్యంగా ప్రజల పక్షాన నిలబడే మేధావులు!

■ బి.ఆర్. బాపూజీ





పచ్చని పల్లెపై విషం..!

ఇంకా కన్నీటి సుడిలోనే బూదవాడ గ్రామం

పచ్చటి పల్లెకు ఏదో శాపం తగిలింది. కళకళలాడే గ్రామం ఐదు రోజులుగా విలవిల్లాడిపోతోంది. పొట్టకూటి కోసం కూలి పనికి వెళ్లిన గ్రామస్థులు జీవచ్ఛవాల్లా ఆసుపత్రుల్లోని మంచాలపై పడి ఉండటం చూసి కుటుంబాలకు కుటుంబాలు కన్నీరు పెడుతున్నాయి. ఇప్పటికే మృతిచెందిన వారి బంధువుల రోదనలతో కుమిలిపోయిన ఆ గ్రామం.. చికిత్స పొందుతున్న క్షతగాత్రులు ఎప్పుడు క్షేమంగా వస్తారా అని ఆశగా ఎదురుచూస్తోంది. అల్ట్రాటెక్ కర్మాగారం నిర్లక్ష్యం.. అధికారుల లెక్కలేనితనం.. కాంట్రాక్టర్ విచ్చలవిడితనం.. వెరసి బూదవాడ గ్రామం ఇంకా బోరున విలపిస్తూనే ఉంది.

- అల్ట్రాటెక్ కర్మాగారం ఘటనతో కకావికలం
- ఇద్దరు మృతి.. నలుగురి పరిస్థితి విషమం
- క్షతగాత్రుల క్షేమ సమాచారం కోసం గ్రామస్థుల ఎదురుచూపులు
- అందరూ పొట్టకూటి కోసం రోజుకూలీకి వెళ్లి ప్రమాదంలో పడినవారే..
- వెట్టిచాకిరీ చేసినా అరకొర కూలీనే..
- కంపెనీ నిర్లక్ష్యం.. అధికారుల లెక్కలేనితనం
- స్థానికులకు ఉద్యోగాల నిబంధన తూచ్
- యూపీ, బిహార్, జార్ఖండ్ కూలీలే అధికం

జగ్గయ్యపేట రూరల్ : బూదవాడ గ్రామానికి అమాయక గ్రామమని పేరు. ఉన్నది లేనట్టు.. లేనిది ఉన్నట్టు ఎవరైనా మాట్లాడితే, 'మాకు కాదు.. బూదవాడ వాసులకు చెప్పు' అనే సామెత సైతం గతంలో వాడుకలో ఉండేది. దీన్నిబట్టి ఇక్కడి గ్రామస్థులు ఎంత అమాయకులో అర్థమవుతుంది. చుట్టూ పచ్చటి అడవితో పాడి సంపదకు నిలయంగా కళకళలాడుతూ ఉండేది ఈ గ్రామం. కేవలం 5 వేల మంది జనాభాతో ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గాలు అధికంగా ఉన్నా, రెండు తెలుగు రాష్ట్రాలకు సరిహద్దు గ్రామమైనా ఎక్కడా తెలంగాణ వాసన కనిపించదు. అచ్చమైన ఆంధ్రులుగా వీరు దశాబ్దాలుగా ఈ చిన్న ఊరులోనే జీవనం సాగిస్తున్నారు.

అల్ట్రాటెక్ రాకతో..

కాలక్రమంలో టెక్నాలజీ పెరగటం, విద్య అందుబాటులోకి రావటం, గ్రామంలో కర్మాగారం ఏర్పాటవటంతో ఇక్కడి స్వరూపమంతా మారిపోయింది. అల్ట్రాటెక్ సిమెంట్ కర్మాగార యాజమాన్య నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ విచ్చలవిడితనం గ్రామస్థులకు శాపంగా మారింది. స్థానికులకు శాశ్వత ఉద్యోగాలు మిగతా 6వ పేజీలో...

● పోలీస్ కావాలని.. కూలి పనికి..



దారావతు వెంకటేశ్వరరావు.. పోలీస్ ఉద్యోగం కోసం ఎన్నో కలలు కన్నాడు. పలుమార్లు కానిస్టేబుల్, ఎస్ఐ సెలక్షన్లకు కూడా వెళ్లాడు. ఉద్యోగం కోసం ప్రయత్నిస్తూనే ఖాళీగా ఉండటమెందుకని ఫ్యాక్టరీలో కూలీగా మారాడు. కర్మాగారంలో జరిగిన ప్రమాదంలో చిమ్మిన పౌడర్ వెంకటేశ్వరరావు కళ్లలో పడింది. భార్య నాగమణి, కుమారుడు నరేంద్ర, కుమార్తె కీర్తి ఉన్నారు. పిల్లలిద్దరూ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. తన కుమారుడి కళ్లకు ఏమైనా జరిగితే పరిస్థితి ఏమిటా..? అని వెంకటేశ్వరరావు తల్లిదండ్రులు నంద, లక్ష్మీ విలపిస్తున్నారు.

● కుటుంబమంతా కన్నీరు



బాణావతు సైదా కుటుంబం పేదరికంలో ఉంది. భార్య వీరేశ్వరి, కుమారుడు సత్యారాం, కుమార్తె తేజస్వితో పాటు నాయనమ్మ చిట్టి, తల్లి మంగమ్మ, చెల్లి నాగబాల, మేనకోడలు దుర్గ బాధ్యత కూడా సైదాపైనే ఉంది. సైదా విజయవాడలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, క్షేమంగా రావాలని ఆ కుటుంబమంతా కోరుకుంటోంది.

● ఎప్పుడు ఏమవుతుందో..



పరిటాల అర్జున్ పరిస్థితి విషమంగా ఉంది. తండ్రి వెంకటేశ్వర్లు సర్పంచ్‌గా పనిచేశారు. భార్య నాగలక్ష్మి, కుమారులు గురుసాయి, పవన్‌తేజ ఉన్నారు. ప్రస్తుతం అర్జున్ పరిస్థితి విషమంగా ఉందని, ఎప్పుడు దుర్వార్త వినాల్సి వస్తోందని ఆ కుటుంబం కన్నీటితో రోజులు గడుపుతోంది. పరిహారం ఇచ్చినా.. ఆ కుటుంబ భవిష్యత్తు ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఆ కుటుంబానికి శాశ్వత జీవనోపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

● అయ్యో కొడుకా..



గుగులోతు గోపీ సంపాదనే కుటుంబానికి ఆధారం. భార్య రోజా, కుమారుడు కల్యాణ్, కుమార్తె మల్లిక, తల్లిదండ్రులు కూడా గోపీపైనే ఆధారపడి ఉన్నారు. ఆదివారం జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గోపీ పరిస్థితి ఇప్పుడు విషమంగానే ఉంది. తన కుమారుడికి ఏమైనా జరిగితే కుటుంబం పరిస్థితి ఏమిటని ఆ తల్లిదండ్రులు గుండెలవిసేలా విలపిస్తున్నారు.

కొత్త సీపీగా రాజశేఖర్‌బాబు

● పీహెచ్‌డీ రామకృష్ణ బదిలీ



ఎస్పీ రాజశేఖర్‌బాబు

విజయవాడ, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ పోలీసు కమిషనరేట్‌కు కొత్త బాస్ రానున్నారు. కమిషనర్‌గా ఎస్పీ రాజశేఖర్ బాబును ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం ఆయన రాష్ట్ర పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్‌గా ఉన్నారు. రాష్ట్రంలో తొమ్మిది మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం పోలీసు కమిషనర్‌గా ఉన్న పీహెచ్‌డీ రామకృష్ణను డీజీపీ కార్యాలయంలోని ప్రొవిజనింగ్ అండ్ లాజిస్టిక్స్ విభాగానికి బదిలీ చేశారు. ఎన్నికల సమయంలో రామకృష్ణను ఎన్నికల కమిషన్ నియమించింది. ఆయన ఏప్రిల్ 26వ తేదీన బాధ్యతలు స్వీకరించారు. సీపీగా 77 రోజులు పనిచేశారు. విజయవాడలో అతి తక్కువకాలం పనిచేసిన కమిషనర్ ఈయనే. కొద్దినెలల క్రితం జరిగిన ఎన్నికలను ఎలాంటి హింసాత్మక ఘటనలు లేకుండా ప్రశాంతంగా నిర్వహించారన్న మార్కును రామకృష్ణ వేసుకున్నారు. నెల్లూరు జిల్లా బుచ్చినాయుడు కండ్రిగకు చెందిన రాజశేఖర్ బాబు 1999లో డీఎస్పీగా పోలీసు శాఖలో చేరారు. తొలుత అనంతపురం జిల్లా ధర్మవరంలో డీఎస్పీగా పనిచేశారు. తర్వాత పార్వతీపురంలో విధులు నిర్వర్తించారు. నంద్యాల ఓఎస్డీగా పనిచేశారు. నాన్ కేడర్ ఎస్పీగా ఎస్ఐబీలో పనిచేశారు. 2006లో ఆయనకు ఐపీఎస్ హోదా వచ్చింది. ఎస్పీగా తిరుపతి అర్బన్, అనంతపురం, గుంటూరు రూరల్, చిత్తూరు ఎస్పీగా పనిచేశారు. 2020లో డీఐజీగా పదోన్నతి పొందారు. ఈ ఏడాది జనవరిలో ఐజీగా పదోన్నతి పొంది పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్‌గా ఉన్నారు. ఇక ఆయన విజయవాడ పోలీసు చీఫ్‌గా వ్యవహరించబోతున్నారు.

సూత్రధారులు ఎక్కడ?

గన్నవరం టీడీపీ ఆఫీసుపై దాడిలో 71 మందిపై ఎఫ్ఐఆర్

2023, ఫిబ్రవరి 20వ తేదీన జరిగిందిదీ..

గన్నవరంలో వైసీపీ రౌడీమూక రెచ్చిపోయింది. టీడీపీ నియోజకవర్గ కార్యాలయాన్ని ధ్వంసం చేసి, ఆ పార్టీ నాయకుల కార్లను దహనం చేసింది. ఈ మొత్తం విధ్వంసం అప్పటి గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ నేతృత్వంలో సాగినా పోలీసులు టీడీపీ వారిపైనే కేసులు పెట్టి వేధించారు. రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగాక.. ఏడాదిన్నర తర్వాత గన్నవరం విధ్వంసం ఘటనలో 71 మందిని నిందితులుగా గుర్తించి ఎఫ్ఐఆర్ 137/2023 నమోదు చేశారు. తొలి విడతలో 15 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. కానీ, అరెస్టు చేసిన వారిలో ప్రభుకాంత్, బాపులపాడు మండల ఎంపీపీ నగేశ్ మినహా మిగిలిన వారంతా సామాన్య కార్యకర్తలే.

విధ్వంసరచన సూత్రధారులేరీ?

గన్నవరంలో విధ్వంసం సృష్టించిన కీలక పాత్రధారులైన అప్పటి ఎమ్మెల్యే వల్లభనేని వంశీ, ఆయన ముఖ్య అనుచరులు.. ఓలుపల్లి మోహనరంగా రావు అలియాస్ రంగా, బి.యతేంద్ర రామకృష్ణ అలియాస్ రాము, కాట్రు శేషుకుమార్ అలియాస్ శేషు, గన్నవరం ఎంపీపీ అనగాని రవి, నక్కా గాంధీ, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య, నన్నపనేని చలపతి, వంశీ పీఏ గద్దె సుధీర్ మాత్రం పరారీలో ఉన్నట్టు పోలీసులు చెబుతున్నారు. వీరిలో కొంతమంది టీడీపీ పంచన చేరి కేసుల నుంచి రక్షణ పొందే ప్రయత్నం చేస్తున్నారు.





టీడీపీ ఆఫీసుపై దాడిలో తగలబడుతున్న కారు (ఇన్‌సెట్‌లో) నాటి దాడిలో కీలకంగా ఉన్న వల్లభనేని వంశీ, బెజవాడ వాసు, రామకృష్ణ, రంగా (ఫైల్ ఫొటోలు)

- ఘటన జరిగిన ఏడాదిన్నరకు కదిలిన పోలీసులు
- కేవలం 15 మంది సామాన్య కార్యకర్తలు అరెస్టు
- 71వ నిందితుడిగా సూత్రధారి వల్లభనేని వంశీ
- వంశీ, ఆయన ముఖ్య అనుచరులవైపు చూడని పోలీసులు
- అప్పట్లో రాడ్లు, కర్రలతో రెచ్చిపోయిన అనుచరగణం
- పోలీసులు, అప్పటి ఎమ్మెల్యే వంశీ సాక్షిగా సాగిన అరాచకం

వంశీతో పాటు రంగా, రాము, శేషు పరారీలో ఉన్నట్టు చెబుతున్న పోలీసులు

● పక్కా ప్రణాళికతోనే..

టీడీపీ బీసీ నాయకుడిపై దాడితోపాటు పార్టీ కార్యాలయంపై దాడికి అప్పటి ఎమ్మెల్యే వంశీ అనుచరులు పక్కా వ్యూహరచన చేశారు. నియోజకవర్గ పరిధిలోని వైసీపీ కార్యకర్తలకు, నాయకులకు ఘటన జరిగిన రోజు ఉదయమే గన్నవరం వంశీ కార్యాలయం నుంచి మెసేజ్‌లు వెళ్లాయి. మధ్యాహ్నం 3 గంటలకు వంశీ కార్యాలయానికి తప్పకుండా రావాల్సిందిగా ఆ మెసేజ్‌లో కోరారు. దీంతో నియోజకవర్గంలోని 100 మందికిపైగా నాయకులు, కార్యకర్తలు మధ్యాహ్నం 3 గంటలకు వంశీ కార్యాలయానికి చేరుకున్నారు. సాయంత్రం 4 గంటల సమయంలో విధ్వంసం ప్రారంభమైంది. సుమారు 3 గంటలపాటు వైసీపీ మూక రెచ్చిపోయింది.

(విజయవాడ - ఆంధ్రజ్యోతి/గన్నవరం) : టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, సీనియర్ బీసీ నాయకుడు దొంతు చిన్నాకు వంశీ అనుచరుడు ఒకరు 2023, ఫిబ్రవరి 20వ తేదీ ఉదయం ఫోన్ చేసి బెదిరించారు. 'వంశీని విమర్శించే స్థాయి ఉందా నీకు..? నీ అంతు చూస్తాం' అని హెచ్చరించారు. ఆ తర్వాత కూడా పలువురు వంశీ అనుచరులమంటూ ఫోన్ చేసి బూతులు తిట్టారు. ఈ ఘటన జరిగిన కొద్దిసేపటికే వంశీ అనుచరులు సుమారు 10 మంది మారణాయుధాలతో చిన్న ఇంటికి వెళ్లారు. ఆ సమయంలో చిన్న ఇంటి వద్ద లేకపోవడంతో ఆయన భార్య రాణితో అసభ్యకరంగా ప్రవర్తించడంతోపాటు 'వంశీపై మాట్లాడితే నీ భర్త అంతు చూస్తా'మంటూ బెదిరించారు. దీంతో ఆందోళనకు గురైన చిన్న భార్య రాణి మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో ఈ వ్యవహారంపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు గన్నవరం పోలీసుస్టేషన్‌కు వెళ్లారు. ఆమెతో పాటు టీడీపీ రాష్ట్ర నాయకుడు పట్టాభి పలువురు టీడీపీ నాయకులు పోలీసుస్టేషన్‌కు చేరుకున్నారు. అదే సమయంలో వంశీ అనుచరులు ఓలుపల్లి మోహనరంగా అలియాస్ రంగా, భీమవరపు యతేంద్ర రామకృష్ణ అలియాస్ రాము, ములప్పారి ప్రభుకాంత్, రౌడీషీటర్ యూసుబ్, కొల్లి చిట్టిబాబు, సగ్గుర్తి నాగదీపు, కోటి తదితరులు టీడీపీ గన్నవరం నియోజకవర్గ కార్యాలయంపై రాడ్లు, కర్రలతో దాడికి తెగబడ్డారు. కార్యాలయంలోని ఫర్నీచర్‌ను ధ్వంసం చేయడంతోపాటు కార్యాలయ ఆవరణలో ఉన్న టీడీపీ నాయకుల కార్లను పెట్రోలు పోసి తగలబెట్టారు. సుమారు 5 కార్లపై పెట్రోలు పోసి తగలబెట్టగా, ఎనికేపాడుకు చెందిన టీడీపీ నాయకుడు కోనేరు పెదబాబు కారు పూర్తిగా అగ్నికి ఆహుతైంది. మరో నాలుగు కార్ల అద్దాలను పగలగొట్టారు. సుమారు గంటపాటు వంశీ అనుచరుల విధ్వంసం కొనసాగింది. వీరిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన టీడీపీ నాయకురాలు మండవ లక్ష్మి ముక్కుపై కొట్టడంతో ఆమె తీవ్రంగా గాయపడ్డారు. మరో టీడీపీ నాయకుడు అంజిబాబు చాతీపై కర్రలతో దాడి చేశారు. బుస్సే సరిత, పొదిలి లలిత, మండవ రమ్యకృష్ణ కూడా వంశీ అనుచరుల దాడిలో గాయాలపాలయ్యారు. దాడి చేస్తున్నంత సేపూ 'జై వంశీ' అంటూ నినాదాలతో ఆ ప్రాంతం మార్మోగిపోయింది. టీడీపీ కార్యాలయంపై దాడి విషయం తెలిసిన వెంటనే పోలీసులు అక్కడికి చేరుకున్నారు. అయినా వంశీ అనుచరులను నిలువరించకుండా వారు ప్రేక్షకపాత్రకే పరిమితమయ్యారు. మరోవైపు దాడి చేస్తున్న వంశీ అనుచరులను అడ్డుకునేందుకు ప్రయత్నించిన టీడీపీ నాయకులు, కార్యకర్తలపై పోలీసులు జులుం ప్రదర్శించారు. అప్పటి సీఐ కనకరావు స్వయంగా సీనులో ఉండి టీడీపీ వాళ్లపై తన ప్రతాపం చూపారు.



దాడిలో పాల్గొన్న హేమంత్

● టీడీపీ నాయకులపై హత్యాయత్నం కేసు

ఈ ఘటనలో పోలీసుల పాత్ర వివాదాస్పదమైంది. అప్పటి గన్నవరం సీఐ కనకారావు తనపై టీడీపీ నాయకులు హత్యాయత్నం చేశారని, కులం పేరుతో దూషించారని ఇచ్చిన ఫిర్యాదుతో టీడీపీ నాయకుడు పట్టాభితోపాటు మరికొందరు నాయకులపై కేసులు నమోదు చేశారు. సీఐ ఫిర్యాదు ఆధారంగా అప్పటి డీఎస్పీ విజయపాల్ విచారణ జరపడం.. నిందితులెవరో తేల్చేసి అరెస్టు చేయడం అంతా ఆగమేఘాలపై జరిగిపోయింది. అదే ఉత్సాహాన్ని పోలీసులు ఇప్పుడు ప్రదర్శించడం లేదు. పోలీసుల నుంచి కేసు నమోదుపై వంశీ, ఆయన అనుచరులకు ముందస్తుగానే సమాచారం లీకైనట్టు చెబుతున్నారు. దీంతో వంశీతోపాటు ఆయన అనుచరులు అందరూ అండర్ గ్రౌండ్‌లోకి వెళ్లిపోయారు. పోలీసులు వ్యవహరిస్తున్న తీరుపై టీడీపీ నాయకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఉల్లంఘనమే..

భారీగా పెరిగిన జరిమానాలు .. నగరంలో రేపటి నుంచి అమలు



హెల్మెట్ ధరించడం వల్ల కలిగే లాభాలపై పోలీసుల అవగాహన

ట్రాఫిక్‌లో సిగ్నల్ జంప్ చేసినప్పుడు పోలీసులు చలానా రాస్తే రూ.100 చెల్లించేసి చేతులు దులిపేసుకోవచ్చు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపినప్పుడు పోలీసులు రూ.100 చలానా విధిస్తే చెల్లించేసి చలోమని వెళ్లిపోవచ్చు. ఇప్పటి వరకు ట్రాఫిక్ ఉల్లంఘనకు పాల్పడి చిన్న మొత్తాల్లో జరిమానాలు చెల్లించి సైడ్ అయిపోయే వాహనదారులకు బిగ్ షాక్. ట్రాఫిక్ ఉల్లంఘనలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం పెంచిన భారీ జరిమానాలను అమలు చేయడానికి విజయవాడ ట్రాఫిక్ పోలీసులు సిద్ధమవడమే ఇందుకు కారణం.

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : ఈనెల 13వ తేదీ నుంచి కొత్త జరిమానాల ప్రకారం చలానాలు రాయాలని ట్రాఫిక్ పోలీసులు నిర్ణయించారు. ఉన్నట్టుండి కొత్త జరిమానాలను విధిస్తే వాహనదారుల నుంచి వ్యతిరేక వచ్చే అవకాశం ఉన్నందున తొలుత అవగాహన కార్యక్రమాలు మొదలుపెట్టారు. కొద్దిరోజులుగా అన్ని విద్యాసంస్థల్లో ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఇక భారీ బాదుడే..

నగరంలో ట్రాఫిక్ ఒక పెద్ద సమస్య. వాహనదారుల్లో ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తున్న వారు చాలా తక్కువ సంఖ్యలో ఉంటున్నారని ట్రాఫిక్ పోలీసులే చెబుతున్నారు. ఈ నిబంధనలను సరిగ్గా పాటిస్తున్నది 15-20 శాతం మంది మాత్రమేనంటున్నారు. నాలుగు రోడ్ల కూడలిలో రెడ్ సిగ్నల్ పడినా దాటుకుని వెళ్లిపోతున్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలను నడిపేస్తున్నారు. ముఖ్యంగా పాఠశాల, కళాశాల విద్యార్థులు ఈవిధంగా వాహనాలు నడుపుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు ఎన్‌ఫోర్స్‌మెంట్ నిర్వహించిన సందర్భాల్లో పట్టుబడుతున్న వారిలో మైనర్లే అధికంగా ఉంటున్నారు. వారికి జరిమానా విధించి పోలీసులు వ్యాస్ కాంప్లెక్సులో కౌన్సెలింగ్ ఇస్తున్నారు. మిగతా 6వ పేజీలో...



బ్రహ్మాండంగా..

బ్రహ్మయ్యలింగం చెరువు



- సీఎం చంద్రబాబు నాటి ఆకాంక్ష.. నేడు ఫలించే దిశగా..
- చెరువు, ఆలయాన్ని పరిశీలించిన ఏపీటీడీసీ అధికారులు
- బోటింగ్, కాటేజీల ఏర్పాటుకు స్థల పరిశీలన
- ప్రసాద్ స్కీమ్‌లో భాగంగా కేంద్ర నిధులతో అభివృద్ధి

6లో..

జిల్లా సమగ్రాభివృద్ధికి సమష్టి కృషి

- జాతీయ రహదారుల పెండింగ్ పనులు పూర్తి చేయాలి
- డయేరియా నియంత్రణకు చర్యలు
- తండాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం
- ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)

6లో..



తిరుపతమ్మ ఆలయంలో నిత్య కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

తిరుపతమ్మకు ఆషాఢం సారె

పెనుగంచిప్రోలు : పెనుగంచిప్రోలులో వేంచేసి ఉన్న తిరుపతమ్మ అమ్మవారికి గ్రామానికి చెందిన మహిళలు ఆషాడం సారెను అత్యంత భక్తిశ్రద్ధలతో గురువారం సమర్పించారు. గ్రామంలోని అన్ని వర్గాలకు చెందిన మహిళలు మేళతాళాలు మంగళ వాయిద్యాలతో అమ్మవారి దేవస్థానం వరకు ఊరేగింపుగా చేరుకున్నారు. మహిళా భక్తులకు దేవస్థానం వద్ద ఆలయ డిప్యూటీ కలెక్టర్ కె.రమేష్ నాయుడు, చైర్మన్ జంగాల వాసు, ధర్మకర్తలు, వేదపండితులు, అర్చకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి అత్యంత భక్తిశ్రద్ధలతో సారె సమర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ వేల్పుల పద్మకుమారి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బ్రహ్మాండంగా.. బ్రహ్మయ్యలింగం చెరువు

- సీఎం చంద్రబాబు నాటి ఆకాంక్ష.. నేడు ఫలించే దిశగా..
- చెరువు, ఆలయాన్ని పరిశీలించిన ఏపీటీడీసీ అధికారులు
- బోటింగ్ , కాటేజీల ఏర్పాటుకు స్థల పరిశీలన
- ప్రసాద్ స్కీమ్‌లో భాగంగా కేంద్ర నిధులతో అభివృద్ధి

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : బ్రహ్మయ్యలింగం చెరువును పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఇందులో భాగంగానే పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) విజయవాడ డివిజన్ అధికారుల బృందం గురువారం బ్రహ్మయ్యలింగం చెరువు ప్రాంతాన్ని పరిశీలించింది. ఏపీటీడీసీ విజయవాడ డీవీఎం చైతన్య, బెర్మ్‌పార్క్ మేనేజర్ శ్రీనివాస్, అడ్మిన్ మేనేజర్ శ్రీధర్‌తో కూడిన బృందానికి బ్రహ్మయ్య లింగేశ్వరస్వామి ఆలయ ధర్మకర్త అన్నే లక్ష్మణరావు (నల్లబాబు) ఇక్కడి విశేషాల గురించి వివరించారు. 1260 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో ఉన్న చెరువుతో పాటు చారిత్రక ప్రాశస్త్యం కలిగిన బ్రహ్మయ్యలింగేశ్వర స్వామి ఆలయాన్ని, చుట్టూ వృత్తాకారంలో ఉన్న కొండలు, ప్రకృతి రమణీయ దృశ్యాలను ఏపీటీడీసీ అధికారుల బృందం వీక్షించింది. బోటింగ్‌కు సంబంధించి ప్లాట్‌ఫాం నిర్మించటానికి వీలుగా ఉన్న ప్రాంతంతో పాటు బోటింగ్ యూనిట్ బుకింగ్ ఆఫీసు, బ్రహ్మయ్యలింగం చెరువు వ్యూ పాయింట్ లొకేషన్లను పరిశీలించింది. పర్యాటకులు విడిది చేసేందుకు వీలుగా కాటేజీల ఏర్పాటుకు సంబంధించి అనువైన భూములను చూశారు. అనంతరం బ్రహ్మయ్యలింగేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించారు. కేంద్ర పర్యాటకశాఖ నేతృత్వంలో పిలిగ్రిమేజ్ రెజువెనేషన్ అండ్ స్పిరిట్యువల్ ఆగ్మెంటేషన్ డ్రైవ్ (ప్రసాద్) స్కీమ్‌లో భాగంగా అటు ఆలయాన్ని, ఇటు చెరువును ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా అభివృద్ధి చేయవచ్చని నిర్ణయించారు. అభివృద్ధి ప్రణాళికలకు సంబంధించి త్వరలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ)కు నివేదిక పంపనున్నారు. ఈడీ సందర్శన తర్వాత పర్యాటక శాఖ మంత్రితో చర్చలు జరుపుతారు. స్థానిక శాసనసభ్యుడు యార్లగడ్డ వెంకట్రావుకు కూడా ఈ విషయాన్ని తెలియపరిచి ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లనున్నారు.

గతంలోనే శ్రీకారం

బ్రహ్మయ్యలింగం చెరువును గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలోనే పర్యాటకంగా, రిజర్వాయర్‌గా అభివృద్ధి చేసేందుకు నిర్ణయించారు. నాడు ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా ఇక్కడికి వచ్చి రూ.180 కోట్ల అంచనాతో ఎత్తిపోతల ప్రాజెక్టును మంజూరు చేశారు. పనులు దాదాపు పూర్తయ్యాయి. మరో రూ.3 కోట్లు ఖర్చుపెడితే పోలవరం కుడికాల్వ నీటిని బ్రహ్మయ్యలింగం చెరువులో నిల్వచేసే అవకాశం ఏర్పడేది. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం దీనిని పట్టించుకోలేదు. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రావటంతో పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు మార్గం ఏర్పడింది.

పచ్చని పల్లెపై విషం..


(5వ పేజీ తరువాయి)

కల్పించాల్సి ఉన్నా, కంపెనీతో అంటకాగుతున్న దళారులకు కాంట్రాక్టు అప్పగించారు. స్థానికులకు కూలి పనులు కాంట్రాక్ట్ ప్రాతిపదికన అప్పజెప్పి వెట్టిచాకిరీ చేయిస్తున్నారు. మొత్తం మూడు షిఫ్టుల్లో ఒక్కో షిఫ్టుకు సుమారు 500 మందికి వరకూ ఇక్కడ పనిచేస్తున్నారు. ఎంత గొడ్డు చాకిరీ చేసినా వీరికి రోజుకు ఇచ్చేది రూ.400 నుంచి రూ.500లే. పట్టణాల్లో కూలీకి వెళ్లి రావడం కష్టంతో కూడుకున్న పని. ఇంటి పక్కనే ఉన్న కర్మాగారంలో కూలి దొరికితే చాలనుకున్న చాలామంది అమాయకులు శాశ్వత ఉద్యోగాల ప్రస్తావనే లేకుండా పనులకు వెళ్లేవారు. ఇక వీరికి పోటీగా జార్ఖండ్, ఉత్తరప్రదేశ్, బిహార్‌కు చెందిన వలస కార్మికులు కుప్పలు తెప్పలుగా దిగుమతి అయ్యేవారు. ఆయా శాఖల అధికారులను చెప్పుచేతల్లోకి తీసుకున్న కర్మాగారాన్ని ప్రశ్నించే నాథుడే కరువయ్యారు. ఫలితంగా గ్రామంలో చాలామంది ఇతర రాష్ట్రాల వారు వేళ్లూనుకున్నారు. కోట్లాది రూపాయల వ్యాపారం చేస్తున్నా గ్రామానికి చేసింది మాత్రం శూన్యం. ఈ ఫ్యాక్టరీ ఆధ్వర్యంలో నిర్మించిన ఆసుపత్రిలోకి గానీ, ఆలయంలోకి గానీ స్థానికులను అనుమతించరంటేనే ఎంత పక్షపాత వైఖరి కొనసాగుతుందో తెలుస్తుంది.

ఇంకా విషమంగానే..

అల్ట్రాటెక్ సిమెంట్ కర్మాగారంలో గత ఆదివారం జరిగిన ప్రమాదంలో 16 మందికి గాయాలయ్యాయి. వీరిలో 80 నుంచి నూరుశాతం కాలిపోయిన ఆవుల వెంకటేష్, బాణావతు స్వామి ఇప్పటికే మృతిచెందగా, బొంత శివనారాయణ, పరిటాల అర్జున్ వెంటిలేటర్‌పై ఉన్నారు. గుగులోతు గోపీనాయక్, బాణావత్ సైదా పరిస్థితి కూడా విషమంగానే ఉంది. వారిని ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నారు. 5 నుంచి 30 శాతం మేర కాలిన గాయాలతో చికిత్స పొందుతున్న వారు ముగ్గురు ఉండగా, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్, బిహార్‌కు చెందిన ఏడుగురు విజయవాడలోని ఆంధ్ర, మణిపాల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సైదాకు కాలిన గాయాలు లేకపోయినా, బూడిద గొంతులోకి వెళ్లింది. దారావతు వెంకటేశ్వరరావుకు కళ్లలో పడింది. దీంతో వీరిద్దరికీ వైద్యం అందిస్తున్నారు. పూర్తిగా కోలుకునే వరకూ ఏమీ చెప్పలేమని వైద్యులు అంటున్నారు. వీరితో పాటు 5 నుంచి 30 శాతం మేర కాలిన గాయాలైన జార్ఖండ్‌కు చెందిన అరుణ్ నిషాశర్మ, ఉత్తరప్రదేశ్‌కు చెందిన దినేష్‌కుమార్, నాగేంద్ర, అరవింద్ యాదవ్, గుడ్డు కుమార్, శుభం సోనీ, బిహార్‌కు చెందిన బిబిల్ సింగ్ చికిత్స పొందుతున్నారు. వారికే ఇప్పటికే నష్టపరిహారం అందించారు.

ఆధారమే లేకపోయె..



ఈయన పేరు వేముల సైదులు. భార్య అన్నపూర్ణ, కుమారుడు నారాయణరావు, కుమార్తె శైలజ. కుమార్తెకు ఇటీవల వివాహమైంది. గతంలో సమీప పట్టణంలో పనులకు వెళ్లేవాడు. నెలకు రూ.20 వేలు కూడా వచ్చేవి కావు. పనులు లేక ఫ్యాక్టరీలో రోజు కూలీగా కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గత ఆదివారం జరిగిన ప్రమాదంలో 60 శాతం కాలిన గాయాలతో విజయవాడలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పేద కుటుంబానికి ఆధారమైన సైదులు ఆసుపత్రిలో ఉండగా, ఆ కుటుంబమంతా కన్నీటితో ఎదురుచూస్తోంది.

ఉల్లంఘనమే..

(5వ పేజీ తరువాయి)

వారి తల్లిదండ్రులను పిలిపిస్తున్నారు. రూ.500 జరిమానా విధిస్తున్నారు. అయినా మైనర్ల ప్రవర్తనలో మార్పు రావట్లేదు. నగరంలో జరుగుతున్న పలు ప్రమాదాలకు మైనర్ల డ్రైవింగ్ ఒక కారణమవుతోందని పోలీసులు చెబుతున్నారు. దీంతోపాటు ట్రిపుల్ రైడింగ్ ఎక్కువగానే జరుగుతోంది. ఇలాంటి వారికి ఇప్పటి వరకు వందల్లో ఉన్న జరిమానాలు ఇక భారీగా పెరగనున్నాయి. హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపిన వారికి ఇప్పటి వరకు రూ.100 విధించేవారు. ఇప్పుడు అది రూ.1,000కు పెరిగింది. ఇదే ఉల్లంఘనతో పలుమార్లు పట్టుబడితే ఆ వాహనదారుల లైసెన్సును మూడు నెలల పాటు రద్దు చేస్తారు. ట్రిపుల్ రైడింగ్‌కు ఇప్పటి వరకు రూ.1,000 జరిమానా విధించేవారు. దాన్ని ఇప్పుడు రూ.1,200కు పెంచారు.

ఉల్లంఘనలు	పాత జరిమానా	కొత్త జరిమానా
సిగ్నల్ జంపింగ్	రూ.100	రూ.500
లైసెన్స్ లేకుండా డ్రైవింగ్	రూ.500	రూ.5,000
పరిమితికి మించిన వేగం	రూ.400	రూ.1,000
ప్రమాదకరమైన డ్రైవింగ్	రూ.1,000	రూ.5,000
డ్రంకెన్ డ్రైవింగ్	రూ.2,000	రూ.10,000
బైక్ రేసింగ్‌లు	రూ.500	రూ.5,000
హెల్మెట్ ధరించకపోవడం	రూ.100	రూ.1,000 (మూడు నెలలు లైసెన్స్ రద్దు)
సీటుబెల్టు ధరించకపోవడం	రూ.100	రూ.1,000
అత్యవసర వాహనాలు ఆపడం		రూ.10,000
ట్రిపుల్ రైడింగ్	రూ.1,000	రూ.1,200
ద్విచక్ర వాహనాలపై ఓవర్ లోడ్	రూ.100	రూ.2,000 (మూడు నెలలు లైసెన్స్ రద్దు)
బీమా లేకుండా డ్రైవింగ్ చేయడం	రూ.1,000	రూ.2,000

పశువులకు సూపర్‌స్పెషాలిటీ వైద్యసేవలు

- రూ.50 లక్షలతో పశువుల కోసం డిజిటల్ ఎక్స్‌రే మిషన్ ఏర్పాటు
- ఎన్టీఆర్ పశువైద్యశాల వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కామని శ్రీనివాసరావు

కృష్ణలంక, జూలై 11: లబ్బీపేటలోని ఎన్టీఆర్ సూపర్‌స్పెషాలిటీ పశువైద్యశాలలో పశువులు, పెంపుడు జంతువులకు ఉచితంగా సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలందిస్తున్నట్టు వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కామని శ్రీనివాసరావు తెలిపారు. లబ్బీపేట పశువైద్యశాల 1919లో ప్రారంభించబడి దినదినాభివృద్ధి చెందు తూ పశువులకు, పెంపుడు జంతువులకు అనేక వైద్యసేవలందిస్తోందన్నారు. ఈ ఆసుపత్రిలో క్లినికల్ లేబొరేటరీ ద్వారా ఉచితంగా రక్తం, మూత్రం వంటి పరీక్షలు ఉచితంగా నిర్వహించి సకాలంలో వ్యాధిని నిర్ధారిస్తున్నట్టు శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఇప్పుడు కొత్తగా రూ.50లక్షలతో డిజిటల్ ఎక్స్‌రే మిషన్‌ను ఏర్పాటు చే సినట్టు పేర్కొన్నారు. పశువులు, పెంపుడు జంతువులకు ఎముకల పరీక్షలు, క్యాన్సర్ రోగ నిర్ధారణ, మూత్రాశయంలో రాళ్ల వంటి వ్యాధులు, గర్భాశయ, శ్వాసకోశ, గుండెజబ్బుల వ్యాధులను నిర్ధారణ చేయుట, జీర్ణాశ య వ్యవస్థకు సంబంధించిన వ్యాధులను నిర్ధారణ చేయుట జరుగుతుందన్నారు. రూ.16లక్షలు విలువైన స్కానింగ్ మిషన్ (అల్ట్రాసౌండ్) ఏర్పాటు చేశామన్నారు. లాబొరేటరీ పరీక్షలు, ఎక్స్‌రే పరీక్షలు, స్కానింగ్ పరీక్షలు చేసి సకాలంలో వ్యాధి నిర్ధారణ చేసి మూగజీవాలకు త్వరగా చికిత్స చేసి ప్రాణాపాయం నుంచి కాపాడటం జరుగుతుందని పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ జి.ఎస్.ఆర్.ఠాగూర్ తెలిపారు.



పశువులకు స్కానింగ్ ఎక్స్‌రే తీస్తున్న డాక్టర్ శ్రీనివాసరావు, రేడియోగ్రాఫర్ జ్యోత్స్న

శస్త్రచికిత్సలు

ఈ పశువైద్యశాలలో దాదాపు 2,100కి పైగా పెంపుడు జంతువులకు (కుక్కలు, పిల్లులు, కుందేళ్లు) ఇతర పశువులకు వివిధ రకాలైన మేజర్ శస్త్ర చికిత్సలంటే సంతాన నియంత్రణ, రొమ్ము, ఇతర కేన్సర్ సర్జరీలు, సిజేరియన్, మూత్రాశయంలో రాళ్ల తొలగింపు, వివిధ రకాల హెర్నియాకు సంబంధించిన సర్జరీలు, చెవి, కంటికి సంబంధించిన వివిధ రకాల సర్జరీల ద్వారా 98శాతం మంచి ఫలితాలు సాధించామన్నారు.

24/7 వైద్య సేవలు

పశువులకు, పెంపుడు జంతువులకు అర్జెంటు కేసులను 24 గంటలూ వైద్యసేవలందిస్తున్నట్టు డాక్టర్ కామని శ్రీనివాసరావు తెలిపారు. పైన తెలిపిన అన్ని పశువైద్య సేవలు లబ్బీపేటలోని ఎన్టీఆర్ సూపర్ స్పెషాలిటీ వైద్యశాలలోనే లభిస్తాయని, పెంపుడు జంతువుల యజమానులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాల్సిందిగా జేడీ డాక్టర్ ఠాగూర్, ఏడీ డాక్టర్ కామని శ్రీనివాసరావు తెలిపారు.



విల్లును ఎక్కుపెట్టి బాణం వదిలేందుకు గురి చూస్తున్న ఎంపీ చిన్ని

2036లో ఒలింపిక్స్‌కు గురిపెట్టాం

- ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)

సత్యనారాయణపురం, జూలై 11: భవిష్యత్తులో చదువుతో పాటు క్రీడలకు మంచి భవిష్యత్తు ఉంటుందని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. భానునగర్ కేంద్రీయ విద్యాలయంలో గురువారం 52వ హైదరాబాద్ రీజన్ ఆర్చరీ స్పోర్ట్స్‌మీట్ జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఒలింపిక్ గేమ్స్ జరిగే సమయానికి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌తో పాటు కీడాకారులు సిద్ధంగా ఉండాలన్నారు. కేంద్రప్రభుత్వ సాయంతో 2036లో ఒలింపిక్స్ నిర్వహించేందుకు బిడ్ చేయబోతున్నామన్నారు. ఆ సమయానికి ఒలింపిక్‌లో ఆడే గేమ్స్‌లో పాల్గొనేందుకు ఎక్కువ మంది ప్రావీణ్యం సంపాదించి సిద్ధంగా ఉండాలన్నారు. సీఎం చంద్రబాబు నేషనల్‌గేమ్ ఈవెంట్ జరిపించి క్రీడలను ప్రోత్సహించాలనుకుంటున్నారన్నారు. ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్ ద్వారా మంగళగిరి, విజయవాడ స్టేడియం అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహించేలా సదుపాయాలు కల్పించాలని కోరామన్నారు. రాబోయే ఐదేళ్లలో క్రీడాకారులకు అవసరమైన సదుపాయాలన్నీ కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. తొలుత కేంద్రీయవిద్యాలయం రీజన్ స్పోర్ట్స్ ఫ్లాగ్ ఆవిష్కరించి, బెలూన్లను గాలిలో వదిలి పెట్టడంతో పాటు, శాంతి కపోతాలను గాలిల్లోకి ఎగరవేశారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ కలర్ పార్టీతో విద్యార్థులు ఎంపీకి స్వాగతం పలికారు. అనంతరం డీఆర్ఎం, వీఎంసీ చైర్మన్ నరేంద్ర పాటిల్‌తో కలిసి జ్యోతిప్రజ్వలన చేశారు. డీఆర్ఎం, కేవీ స్కూల్ విద్యాలయ కమిటీ చైర్మన్ నరేంద్ర పాటిల్, ప్రిన్సిపాల్స్ ఆదిశేష శర్మ, ఎంవీ రావు, రీజనల్ టోర్నమెంట్ కన్వీనర్ డా.ఏడుకొండలు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత: డీఆర్ఎం

రైల్వేస్టేషన్, జూలై 11: లోకో పైలట్లు, సహాయ లోకో పైలట్లు, రైల్ మేనేజర్ల మౌలిక సదుపాయాల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్టు రైల్వే డివిజన్ మేనేజర్ నరేంద్ర ఏ పాటిల్ అన్నారు. లోకో పైలట్లు, సహాయ లో కో పైలట్లు, రైలు మేనేజర్లకు అందుతున్న మౌలిక సదుపాయాలపై గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు గైడెడ్ మీడియా టూర్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ యన విలేకరులతో మాట్లాడుతూ నగరంలోని రన్నింగ్ రూమ్ దేశంలో ఉన్న పెద్ద రన్నింగ్ రూమ్‌లలో ఒకటన్నారు. ఇక్కడికి 3 జోన్ల పరిధిలోని వారు వస్తారని, 6 డివిజన్ల పరిధిలో 14 డిపోల్లో అత్యధిక సంఖ్యలో సిబ్బంది ఉన్నారన్నారు. వారికి అల్పాహారం, మధ్యాహ్నం, రా త్రి భోజనం అందించేందుకు విస్తృత ఏర్పాట్లు ఉన్నాయన్నారు. అలసి వస్తున్న వీరికి అధిక సబ్సిడీలతో ఆహారాన్ని అందించేందుకు ఏర్పా ట్లు ఉన్నాయన్నారు. రీడింగ్ రూమ్, మెడిటేషన్ రూమ్, ఫుట్ మసాజర్ ఉన్నాయన్నారు. ఆపరేషన్స్ ఏడీఆర్ఎం కొండ శ్రీనివాసరావు మాట్లాడుతూ రైళ్ల నడకలో లోకో రన్నింగ్ సి బ్బంది పాత్ర కీలకమని, వారికి తగిన విశ్రాంతిని ఇచ్చేందుకు సురక్షిత వాతావరణంలో చ క్కటి వసతి సదుపాయాలు కల్పించినట్టు తె లిపారు. ఆపరేషన్స్ ఏడీఈఈ రవితేజ అన్ని విభాగాలను చూపించారు. డీఆర్ఎం నరేంద్ర వంటశాలలో పరిస్థితులను పరిశీలించి అక్క డ జరుగుతున్న కార్యకలాపాలను తెలుసుకు ని, ఇంకా మెరుగైన సేవలందించాలన్నారు. సాంబారును కలియబెట్టి నాణ్యత పరిశీలించా రు. లోకోపైలట్లతో అయన మాట్లాడారు. అదనపు డీఎం బి శ్రీనివాసులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ రోగి మృతి

- ప్రభుత్వ ఆసుపత్రి వద్ద బంధువుల ఆందోళన

ప్రభుత్వ ఆసుపత్రి, జూలై 11: ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందిన ఘటనలో గురువారం రాత్రి చోటుచేసుకోవడంతో బంధువులు ఆందోళనకు దిగారు. పెనమలూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో నివసించే టి. రవి బుధవారం విషం తాగి అపస్మారక స్థితిలో వుండటంతో చికిత్స నిమిత్తం నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతున్న రవి గురువారం మరణించడంతో బంధువులు, కుటుంబ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రోగికి సంబంధించిన పూర్తి వివరాలు వైద్యులు ముందుగా తెలపకపోవడంతో వారు కోపోద్రిక్తులై ఆసుపత్రి ఫర్నిచర్ ధ్వంసం చేశారు. విషయం గమనించిన సూపరింటెండెంట్ సర్ది చెప్పేందుకు ప్రయత్నించినా వినిపించుకోకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసుల రంగప్రవేశంతో గొడవ సద్దుమణిగింది.



మంత్రి అచ్చెన్నాయుడును సత్కరిస్తున్న ఎన్‌జీవో నేతలు

కలిసి పనిచేద్దాం

- ఎన్‌జీవోలతో మంత్రి అచ్చెన్నాయుడు

వన్‌టౌన్, జూలై 11: మంచి భావనతో ప్రభుత్వం-ఉద్యోగులు కలిసి పనిచేయాలని వ్యవసాయ మార్కెటింగ్, సహకార మంత్రి అచ్చెన్నాయుడు తనను కలిసిన ఎన్‌జీవో నేతలతో అన్నారు. ఏపీ ఐసీసీ మార్క్‌ఫెడ్ కార్యాలయంలో గురువారం మంత్రిని రాష్ట్ర ఎన్‌జీ వో సంఘం అధ్యక్షుడు కేవీ శి వారెడ్డి, ప్రధాన కార్యదర్శి పురుషో త్తం చౌదరి, ఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి, దుశ్శాలువ కప్పి అభినందన సత్కారం చేశారు. ఈ సందర్భంగా మం త్రి మాట్లాడుతూ గత ప్రభుత్వ అస్తవ్యస్త పాలనతో ఆర్థిక పరిస్థితి బాగా లేనప్పటికీ ఉద్యోగులకు పెన్షనర్లకు ఒకటో తేదీనే జీతాలు, పెన్షన్లు అందించిన సంగతిని గుర్తు చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగులు ఎంతో మానసిక ఒత్తిడికి గురయ్యారని, ప్రస్తుత కూటమి ప్రభుత్వానికి అండగా ఉండాలని, ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. సీఎం చంద్రబాబుకు అందరం సహకరించి రాష్ట్రం శరవేగంగా అభివృద్ధి చెందేందుకు కృషి చేద్దామన్నారు. సంఘ నేతలు రంజిత్ నాయుడు, శివప్రసాద్, నిర్మలకుమారి, శాంతి, వ్యవసాయ శాఖ ఉద్యోగుల సంఘం నేతలు వేణుమాధవ్, సాయికుమార్, పశు సంవర్ధకశాఖ ఉద్యోగ నేతలు సేవా నాయక్, రామకృష్ణ, సచివాలయ ఉద్యోగ నేత జానీ పాషా పాల్గొన్నారు.

ఏఐబీవోఏ సీనియర్ ఉపాధ్యక్షుడిగా రవికుమార్

విజయవాడ: ఆలిండియా బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ సీనియర్ ఉపాధ్యక్షుడిగా నగరంలోని కెన రా బ్యాంక్‌కు చెందిన రవికుమార్ ఎన్నికయ్యారు. ప్రస్తుతం ఆయ న సంఘంలో ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. తాజాగా ఆయనను సీనియర్ ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి సమష్టి కృషి

- జాతీయ రహదారుల పెండింగ్ పనులు పూర్తి చేయాలి
- డయేరియా నియంత్రణకు చర్యలు
- తండాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం
- ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)



అధికారుల సమీక్షా సమావేశంలో ఎంపీ కేశినేని చిన్ని, కలెక్టర్ సృజన తదితరులు

కృష్ణలంక, జూలై 11 : అధికారులు, ప్రజాప్రతినిధుల సమష్టి భాగస్వామ్యంతో జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి చేద్దామని, సరైన ప్రణాళికలు నిధుల సక్రమ వినియోగంతో మంచి ఫలితాలు వస్తాయని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. గురువారం కేశినేని శివనాథ్ జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), కలెక్టర్ జి.సృజన, జాతీయ రహదారులు, వైద్య ఆరోగ్య శాఖ, గ్రామీణ నీటి సరఫరా, జీజీహెచ్ కార్యకలాపాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎన్‌హెచ్ఏఐకు సంబంధించి పెండింగ్ ప్రాజెక్టులు, డీపీఆర్, సర్వీసు రహదారుల విస్తరణ పనుల పూర్తికి ఎదురవుతున్న సమస్యలు తదితరాలపై చర్చించారు. అదేవిధంగా జిల్లాలో డయేరియాకు అడ్డుకట్ట వేసేందుకు తీసుకున్న చర్యలు, ఎ.కొండూరు డయాలసిస్ కేంద్రం సేవలు, జలజీవన్ మిషన్ పనులు, పైపులైన్ల మరమ్మతులు, ఓహెచ్ఎస్ఆర్‌ల స్థితిగతులు తదితరాలపై చర్చించారు. ఈ సందర్భంగా కేశినేని చిన్ని మాట్లాడుతూ, విజయవాడ బైపాస్ పనుల సత్వర పూర్తికి అవరోధంగా వున్న హైటెన్షన్ లైన్ల పనులను వీలైనంత త్వరగా పూర్తిచేయాలని, పరిహారం చెల్లింపు ప్రక్రియ పూర్తయ్యేలా చూడాలన్నారు. ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు వీలుగా ఎన్‌హెచ్-16లో మహానాడు రోడ్డు నుంచి నిడమానూరు వరకు మెగా ఫ్లై ఓవర్‌కు సంబంధించి సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపకల్పనపై దృష్టిసారించాలన్నారు. ఎ.కొండూరు ప్రాంత ప్రజలకు కిడ్నీ సమస్యల నుంచి శాశ్వత పరిష్కారం దిశగా తాగు నీటి వ్యవస్థల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని, డయాలసిస్ కేంద్రం ద్వారా మెరుగైన సేవలకు కృషి చేయాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు జల్‌జీవన్ విషన్ కింద చేపట్టిన పనులపై సమీక్షించారు. తాగునీటి సరఫరా పనులకు సంబంధించి డీపీఆర్‌లు తయారుచేయాలన్నారు. ఎన్ఆర్ఈజీఎస్, ఎంపీ ల్యాడ్స్, సీఎస్ఆర్ నిధుల వినియోగంతో తాగునీరు, డ్రెయినేజీ వ్యవస్థల మెరుగుతో ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారు. పైపులైన్లు, ఓహెచ్ఎస్ఆర్‌ల తక్షణ మరమ్మతులకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జేసీ పి.సంపత్‌కుమార్, డీఆర్వో వి.శ్రీనివాసరావు, ఆర్డీవో బీహెచ్ భవానీశంకర్, ఎన్‌హెచ్ఏఐ పీడీ పార్వతీశం, గ్రామీణ నీటిసరఫరా ఎస్ఈ డీవీ రమణ, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, తదితరులు పాల్గొన్నారు.



బ్యాంకు సిబ్బందిని నిలదీస్తున్న జనసేన నేతలు

తాకట్టు పెట్టిన బంగారం మాయం!

- బ్యాంకు ఎదుట బాధితుల ఆందోళన

మచిలీపట్నం టౌన్, జూలై 11 : బ్యాంకులో తాకట్టు పెట్టిన బంగారం కనపడకపోవడంతో మచిలీపట్నంలో యునిమోని బ్యాంకు వద్ద గురువారం ఖాతాదారులతో పాటు జనసేన నాయకులు ఆందోళనకు దిగారు. మచిలీపట్నం రైతుబజారు ఎదురుగా ఉన్న యునిమోని బ్యాంకులో 500 గ్రాముల బంగారం చిన్నాపురానికి చెందిన చలమలశెట్టి పోతురాజు ఐదేళ్ల క్రితం తాకట్టు పెట్టారు. తాకట్టు విడిచిపించేందుకు వెళ్లిన పోతురాజుకు బంగారం కనబడటం లేదని మేనేజర్ చెప్పారు. బ్యాంకు ఉద్యోగి బంగారం దొంగిలించాడని, పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని మేనేజర్ ప్రసాద్ చెప్పారు. దీంతో పోతురాజుకు మద్దతుగా జనసేన నాయకులు గల్లా తిమోతి, కొట్టె వెంకట్రావు, గడ్డం రాజు, టీడీపీ నాయకుడు పీవీ ఫణికుమార్ తదితరులు ఆందోళనకు దిగారు. బ్యాంకుకు తాళం వేసి ఘెరావ్ చేశారు.

ఇన్‌స్పెక్టర్లకు అటాచ్‌మెంట్లు

విజయవాడ, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : పోలీసు కమిషనరేట్‌లో ఎనిమిది మంది ఇన్‌స్పెక్టర్లకు తాత్కాలిక పోస్టింగ్‌లు(అటాచ్‌మెంట్) ఇచ్చారు. ఎన్నికల కోడ్ ముందు మూడేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేశారు. వారిలో కొంతమందిని స్పెషల్‌బ్రాంచ్‌లో నియమించారు. ఎన్నికల ప్రక్రియ ముగియడం, స్టేషన్లలో పనిభారం పెరుగుతుండటంతో స్పెషల్‌బ్రాంచ్‌లో ఉన్న ఇన్‌స్పెక్టర్లకు తాత్కాలిక పోస్టింగ్‌లు ఇచ్చారు. ఐవీ నాగేంద్రకుమార్‌ను యాంటీ నార్కొటిక్ సెల్ ఇన్‌స్పెక్టర్‌గా నియమించారు. పలివెల శ్రీనుకు సైబర్‌క్రైం స్టేషన్‌లో అటాచ్‌మెంట్ ఇచ్చారు. రావి సురేష్‌రెడ్డికి సీసీఎస్ ఇన్‌స్పెక్టర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. డి.కాశీవిశ్వనాథ్‌ను కమిషనరేట్‌లో అడ్మిన్ ఇన్‌స్పెక్టర్‌గా నియమించారు. కమిషనరేట్‌కు అటాచ్‌మెంట్‌లో ఉన్న ఎండీ సహేరున్నీసాను మహిళా పీఎస్‌కు పంపారు. కె.శ్రీధర్‌కుమార్‌ను టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేశారు. వీఆర్‌లో ఉన్న పి.కృష్ణను పీసీఆర్‌లో నియమించారు. పీసీఆర్‌లో ఉన్న ఎస్‌వీవీ లక్ష్మీనారాయణకు సీసీఎస్‌లో పోస్టింగ్ ఇచ్చారు. దీనికి సంబంధించి పోలీసు కమిషనర్ పీహెచ్‌డీ రామకృష్ణ ఉత్తర్వులు ఇచ్చారు.

త్రోబాల్ జట్ల ఎంపిక రేపు

విజయవాడ స్పోర్ట్సు: నగరంలోని ఐజీఎంసీ స్టేడియంలో ఈ నెల 13న 10 గంటలకు సౌత్‌జోన్ సీనియర్ త్రోబాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే రాష్ట్ర పురుషుల, మహిళా జట్ల ఎంపికలను చేపడుతున్నట్టు ఏపీ త్రోబాల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఈదా సులోచన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికల్లో ప్రతిభ చాటిన వారిని కర్ణాటక రాష్ట్రం బెంగళూరులో ఆగస్టు 2 నుంచి 4 వరకు జరిగే సౌత్‌జోన్ చాంపియన్‌షిప్‌కు ఏపీ నుంచి ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు అర్హతా పత్రాలతో ఆ రోజు ఎంపికలకు హాజరు కావాలని సులోచన తెలిపారు.

విష జ్వరంతో ఆశా కార్యకర్త మృతి

- మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని పీహెచ్‌సీ వద్ద ధర్నా



తోట రాధ(ఫైల్‌ఫోటో)

ఎ.కొండూరు, జూలై 11 : విష జర్వాలపై ఇంటింటి సర్వే చేస్తూ అదే విషజ్వరంతో ఆశా కార్యకర్త మృతి చెందిన ఘటన మండల కేంద్రమైన ఎ.కొండూరులో జరిగింది. గ్రామానికి చెందిన తోటరాధ(42) ఆశ కార్యకర్తగా పనిచేస్తున్నది. ఇటీవల పాత కొండూరు గ్రామానికి చెందిన వెంపాటి లక్ష్మణరావు విష జర్వంతో మృతి చెందాడు. దీంతో ఆరోగ్య శాఖాధికారుల ఆదేశాల మేరకు ఆశాలు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. రెండు రోజుల క్రితం రాధకు జర్వం రాగా టాబ్లెట్‌లు తీసుకొని విధులు నిర్వహించింది. జర్వ తీవ్రతతో అనారోగ్యానికి గురైన రాధను చికిత్స నిమిత్తం చిన్న అవుటుపల్లి ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది.



ఆరోగ్య కేంద్రం వద్ద ధర్నా చేస్తున్న ఆశాలు, కుటుంబసభ్యులు

విష జ్వరంతో మృతి చెందిన తోట రాధ కుటుంబానికి న్యాయం చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా కార్యక్తలు, కుటుంబసభ్యులతో ఎ.కొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ధర్నా నిర్వహించారు. సీఐటీయూ నేత జెట్టి వెంకటేశ్వరావు మాట్లాడుతూ, జర్వంతో ఉన్నా శెలవు ఇవ్వకుండా డ్యూటీలు చేయించడం వలనే రాధ మృతి చెందినట్టు ఆరోపించారు. ఇంటింటి సర్వే చేస్తూ సత్వర వైద్యం అందక ప్లేట్‌లెట్లు తగ్గిపోగా చికిత్స పొందుతూ మృతి చెందినట్టు తెలిపారు. రాధ మృతికి ఆరోగ్య శాఖాధికారులు బాధ్యత వహించడంతో పాటు ఆమె కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ రియాజ్ హుస్సేన్ రాధ కుటుంబానికి న్యాయం చేస్తామని, ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

అసభ్య ప్రవర్తన కేసులో జైలు, జరిమానా

జి.కొండూరు, జూలై 11 : బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన కేసులో నేరం రుజువు కావడంతో ముద్దాయికి న్యాయమూర్తి ఐదైళ్ల జైలు, జరిమానా విధించారు. గురువారం మచిలీపట్నంలోని పోక్సో కోర్టు న్యాయమూర్తి గాజుల వెంకటేశ్వర్లు కవులూరు గ్రామానికి చెందిన గుడిపూడి రాజేంద్రకు 5 సంవత్సరాల కారాగార శిక్ష, రూ.3 వేలు జరిమాన (జరిమాన కట్టలేకపోతే మరో 3 నెలలు) శిక్ష విధిస్తూ తీర్పుచెప్పారు. కవులూరు ఎంపీపీ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న బాలిక మధ్యాహ్నం స్కూల్ గేటు వద్ద నిలబడి ఉండగా అదే గ్రామానికి చెందిన గుడిపూడి రాంజేంద్ర బాలికను స్కూల్‌కు సమీపంలో ఉన్న పొదల్లోకి తీసుకువెళ్లి అసభ్యంగా ప్రవర్తించాడు. స్థానికులు కేకలు వేయడంతో నిందితుడు పరారయ్యాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు 13 ఫిబ్రవరి 2023న అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. గురువారం ప్రాసిక్యూషన్ తరుపున సీనియర్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మంజులూరు వెంకట మహేష్, ఏఎస్సై పర్యవేక్షణలో 12 మంది సాక్షులను విచారించిన న్యాయమూర్తి నిందితుడిపై నేరం రుజువు కావడంతో పైవిధంగా శిక్షను ఖరారు చేశారు.

ఏపీ పాలిటెక్నిక్ ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ ఎన్నిక



భారతీనగర్, జూలై 11 : ఏపీ పాలిటెక్నిక్ ఫిజకల్ డైరెక్టర్స్ అసోసియేషన్ 2024-2028 సంవత్సరాలకు గాను నూతన కార్యవర్గం ఎన్నిక ప్రభుత్వపాలిటెక్నిక్ కళాశాలలో గురువారం జరిగింది. ఈ ఎన్నికల్లో ఏపీ పాలిటెక్నిక్ ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎండీఎం కమల్‌బాషా, సెక్రెటరీ కె.నాగేశ్వరరావు, ట్రెజరర్ ఎన్.పద్మావతి నియమితులైయారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ, ఏపీ పాలిటెక్నిక్ ఫిజకల్ డైరెక్టర్స్ నూతన నియామకం, ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ ప్రధానాంశాలను తీసుకొని విద్యశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తామన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	114, 123, 134
చికెన్ విత్ స్కిన్	214
చికెన్ స్కిన్‌లెస్	224

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.55

ఎడ్యుబాట్‌తో పీబీ సిద్ధార్థ బిజినెస్ ఎనలిటిక్స్ ఒప్పందం

మొగల్రాజపురం, జూలై 11: పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల బిజినెస్ ఎనలిటిక్స్ విభాగం విజయవాడకు చెందిన ఎడ్యుబాట్ సాఫ్ట్‌వేర్ సర్వీసెస్ సంస్థతో ఒప్పందం చేసుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ తెలియజేశారు. ఈ ఒప్పందంలో భాగంగా బిజినెస్ ఎనలిటిక్స్ విద్యార్థులకు టూల్స్‌పై శిక్షణ అందించి అర్హులైన విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఎడ్యుబాట్ సంస్థ వ్యవస్థాపకుడు పాలడుగు శశాంక్ చెప్పారు. డైరెక్టర్ వేమూరి బాబూరావు, డీన్ రాజేష్ జంపాల, బిజినెస్ ఎనలిటిక్స్ విభాగాధిపతి డాక్టర్ బి.జయప్రకాష్, ఎడ్యుబాట్ సంస్థ బిజినెస్ హెడ్ జి.నవీన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించండి...ప్రాణాలు కాపాడుకోండి

మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి సత్యానందం

విజయవాడ లీగల్, జూలై 11 : ద్విచక్రవాహనదారులు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించడం ద్వారా వారి ప్రాణాలను కాపాడుకోవాలని మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎ.సత్యానందం తెలిపారు. గురువారం బెజవాడ బార్ అసోసియేషన్ నుంచి న్యాయవాదులు, న్యాయమూర్తులతో కలిసి సెషన్స్ జడ్జి సత్యానందం ర్యాలీగా ఐదవ నెంబరు రోడ్డు మీదుగా బందరురోడ్డు వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ద్విచక్రవాహనాలపై వెళ్లేవారిని ఆపి అందరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలంటూ వారికి చాక్లెట్లు అందచేశారు. ప్రతి ద్విచక్రవాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి తమ ప్రాణాలను కాపాడుకోవాలని బార్ అధ్యక్ష, కార్యదర్శులు కొత్త చంద్రమౌళి, అరిగెల శివరాంప్రసాద్ తెలిపారు. సీనియర్, జూనియర్ న్యాయవాదులు, బార్ కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.



అవగాహనా ర్యాలీలో మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి సత్యానందం, బెజవాడ బార్ న్యాయవాదులు

రోడ్డు ప్రమాదాల్లో రక్షణకు హెల్మెట్‌ధారణ తప్పనిసరి

వన్‌టౌన్ : రోడ్డు ప్రమాదాల్లో రక్షణకు హెల్మెట్‌ధారణ తప్పనిసరి అని గురువారం కేబీఎన్ కాలేజీలో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసు అధికారులు సూచించారు. హెల్మెట్ ధరించడం వల్ల వచ్చే ప్రయోజనాలు వివరించారు. ఈ కార్యక్రమాన్ని ఏడీసీపీ డి.ప్రసాద్ పర్యవేక్షించారు. వన్‌ట్రాఫిక్ ఏసీపీ బి.జనార్ధన్‌రావు, సీఐలు ఆర్.సూర్యభాస్కర్, టీవీ రావు, కేబీఎన్ కాలేజీ ప్రిన్సిపాల్ వి. నారాయణరావు, లీగల్ సెల్ న్యాయవాది రాము పాల్గొన్నారు. టూరిస్ట్ హెల్ప్‌లైన్ వద్ద కూడా వాహనదారులకు హెల్మెట్‌ధారణ,ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు.



కేబీఎన్‌లో అవగాహన కల్పించిన పోలీసు అధికారులు

స్టెల్లాలో ప్రపంచ జనాభా దినోత్సవం

పటమట, జూలై 11: నగరంలోని మారిస్ స్టెల్లా కళాశాల అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని జనాభా పెరుగుదల కారణాలు, నివారణా చర్యలు, అభివృద్ధి అనే అంశంపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా గుడ్‌లైఫ్ హాస్పిటల్ లేప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ సుగంధ మాట్లాడుతూ జనాభా పెరుగుదలను నియంత్రించే విధానాన్ని అమలు చేయాలని కోరారు. ప్రతి ఒక్కరూ అధిక జనాభా వల్ల కలిగే దుష్ప్రభావాలపై చైతన్యం కలిగి ఉండాలన్నారు. తదనంతరం నిర్వహించిన పోస్టర్ మేకింగ్ పోటీల్లో 30 మంది ఇంటర్, డిగ్రీ విద్యార్థినులు పాల్గొన్నారు. అర్థశాస్త్ర అధ్యాపకులు వున్నం స్వప్న, డాక్టర్ సత్యవేదం, విద్యార్థినులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ సుగంధ

తాగునీటి సరఫరాను నిరంతరం పర్యవేక్షించాలి

● ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ మహేష్

చిట్టినగర్, జూలై 11: తాగునీటి సరఫరాను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ ఏ మహేష్ ఆదేశించారు. గురువారం చిట్టినగర్ బూస్టర్, పంపింగ్ హౌస్, కేఎల్ రావు హెడ్ వాటర్ వర్క్స్, 56వ డివిజన్లలో ఇన్‌చార్జి కమిషనర్ మహేష్ అధికారులతో కలిసి పర్యటించి మంచినీటి పరీక్షలు చేయించారు. ఎప్పటికప్పుడు మంచినీటి శాంపిల్స్ తీసి పరీక్షలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పలు ప్రాంతాల్లో డ్రెయిన్ల పక్కనే ఉన్న మంచినీటి పైపులైన్లను పరిశీలించి అక్కడ మంచినీటి శాంపిల్స్ సేకరించి పరీక్షలు నిర్వహించారు. డ్రెయిన్లలో మంచినీటి పైపులైన్లు లేకుండా చూడాలని ఆదేశాలు ఇచ్చారు. పర్యటనలో సీఈ ఎం.ప్రభాకరరావు, ఈఈ ప్రసాద్, అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సురేష్‌బాబు పాల్గొన్నారు.



కార్యకర్తలను ఆదుకోండి

● మంత్రి అచ్చెన్నాయుడికి టీడీపీ కార్యకర్తల విజ్ఞప్తి

పటమట, జూలై 11 : గడిచిన ఐదేళ్లుగా టీడీపీ అభ్యున్నతికి , పూర్వవైభవం కోసం అహర్నిశలు శ్రమించిన కార్యకర్తలకు సముచిత స్థానం కల్పించి ఆదుకోవాలని టీడీపీ నాయకుడు బెజవాడ నజీర్ ఆధ్వర్యంలో పలువురు మంత్రి అచ్చెన్నాయుడికి విజ్ఞప్తి చేశారు. ఏపీఐఐసీ కాలనీలో మార్క్‌ఫెడ్ కార్యాలయంలో టీడీపీ నాయకుల సగ్గుర్తి వంశీ, యునైటెడ్ ముస్లిం మైనార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మొహ్మద్ సుభానీ, శిరీష్ తదితర నాయకులు అచ్చెన్నాయుడిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్యకర్తలపై ఉన్న అక్రమ కేసులు ఎత్తివేయాలని, వారికి పార్టీ తరపున సముచిత స్థానం కల్పించి, తగు న్యాయం చేయాలని వారు మంత్రి అచ్చెన్నాయుడికి విజ్ఞప్తి చేశారు.



అచ్చెన్నాయుడిని సత్కరిస్తున్న నజీర్, బీజేపీ నాయకులు

వేతనాలు చెల్లించడం లేదంటూ
జీజీహెచ్ విద్యుత్ సిబ్బంది ధర్నా

ప్రభుత్వాసుపత్రి, జూలై 11: వేతనాలు సరిగ్గా చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని జీజీహెచ్ విద్యుత్ సిబ్బంది గురువారం ఎలక్ట్రీషియన్ కొక్కిలిగడ్డ కన్నయ్య ఆధ్వర్యంలో ఆసుపత్రి వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జీజీహెచ్ ఎలక్ట్రికల్ విభాగంలో అనేక అవకతవకలు జరుగుతున్నాయన్నారు. అక్రమాలకు, సూపరింటెండెంట్ పెట్టే ఆగడాలకు అంతే లేకుండా పోయిందని తెలిపారు. ఈఎస్ఐ. ఈపీఎఫ్ తదితర వెసులుబాట్లు కూడా లేవన్నారు. అవకతవకలు బయట పడకుండా ఉండేందుకు జీతాలు క్యాష్ రూపంలో ఇస్తున్నారన్నారు.ఇంకా అనేక సమస్యలు ఉన్నాయని, ఈ అంశాలపై మంత్రి నారా లోకేశ్‌ను కలిసి విన్నవిస్తామని కూడా తెలిపారు

విద్యార్థి దశలోనే లక్ష్యాన్ని ఎంచుకోవాలి

● మురళీకృష్ణ ట్రస్ట్ డైరెక్టర్ ఆఫ్ ఆపరేషన్ జోయ్

గుణదల, జూలై 11: విద్యార్థి దశలోనే యువత లక్ష్యం ఏర్పరచుకుని దాని సాధన కోసం కృషి చేస్తే ఉన్నత స్థాయికి ఎదుగుతారని మురళీకృష్ణ ట్రస్ట్ డైరెక్టర్ ఆఫ్ ఆపరేషన్ జోయ్ అన్నారు. స్థానిక ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం పవర్ స్కిల్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో జోయ్ మాట్లాడుతూ తమ సంస్థ స్ట్రీట్ టు స్కూల్...స్కూల్ టు స్కిల్స్ అనే నినాదంతో పేద విద్యార్థులకు ఉచిత నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. అదే సమయంలో ట్రస్ట్ తరపున నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడానికి తమ వంతు కృషి చేస్తున్నామని చెప్పారు. నూతన ఆవిష్కరణలపై యువత దృష్టి పెట్టాలని కోరారు. పోటీ పరీక్షలకు తరచూ హాజరవుతుంటే మరింత నైపుణ్యత పెరుగుతుందని చెప్పారు. ట్రస్ట్ మేనేజర్ మురళీకృష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

● కృష్ణలంక సీఐ మురళీకృష్ణ



రాణిగారితోట, జూలై 11: యువత మత్తు పదార్థాల పట్ల అవగాహన పెంచుకుని వాటికి దూరంగా ఉండాలని కృష్ణలంక సీఐ మురళీకృష్ణ అన్నారు. రాణిగారితోట తారకరామానగర్ కరకట్ట వద్ద గురువారం కృష్ణలంక పోలీస్ ఆధ్వర్యంలో డ్రగ్స్ అవేర్‌నెస్ క్యాంపు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో యువతపై డ్రగ్స్ ప్రభావం ఎక్కువగా ఉందని, ముఖ్యంగా విద్యార్థులు దీని ప్రభావానికి లోనవుతున్నారని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల నడవడికపై నిత్యం నిఘా ఉంచాలని తెలిపారు. మీ పరిధిలో ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు జరిగినా వెంటనే పోలీస్‌లకు సమాచారం అందించాలని తెలిపారు. హెల్ప్ అండ్ విముక్తి సభ్యులు అపూర్వ ఆశ, పుష్పవతి, లక్ష్మీప్రసన్న, భూమిక టీం సభ్యులు శ్యామల, స్థానికులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయాలపై
దాడులకు పాల్పడిన వారికి శిక్ష తప్పదు : లుక్కా

విద్యాధరపురం, జూలై 11: టీడీపీ కార్యాలయాలపై దాడులకు పాల్పడిన వారికి శిక్ష తప్పదని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి లుక్కా సాయిరామ్ ప్రసాద్ గౌడ్ అన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారం శాశ్వతమనుకుని గత ఐదేళ్ల కాలంలో రెచ్చిపోయిన వైసీపీ నాయకులకు కాలం చెల్లిందన్నారు. ప్రతిపక్ష నేతగా ఉన్నపుడు చంద్రబాబు ఇంటిపై జోగి రమేష్ దాడికి పాల్పడిన సంఘటనలో తాను ప్రత్యక్ష సాక్షినని చెబుతూ ఆనాటి దారుణ సంఘటనను గుర్తు చేశారు. తాము దేవాలయంగా భావించే టీడీపీ కేంద్ర కార్యాలయంపై లేళ్ళ అప్పిరెడ్డి, దేవినేని అవినాష్ ఆధ్వర్యంలో వైసీపీ గూండాలు దాడి చేసి పైశాచిక ఆనందం పొందారన్నారు. ఈ దాడిని సభ్య సమాజం ఛీదరించుకుందన్నారు. దాడులకు ప్రేరేపించిన నాయకులు ముందస్తు బెయిల్ కోరడం అంటే నేరం అంగీకరించినట్లేనని, నేరం చేసిన వారికి శిక్ష తప్పదని హెచ్చరించారు.

కృష్ణలంక మెట్లబజారులో రోడ్డుపై మురుగునీరు



కృష్ణలంక, జూలై 11 : కృష్ణలంక మెట్లబజారు చివరన కృష్ణవేణి అపార్ట్‌మెంట్ సమీపంలో రోడ్డుపై ఉన్న మ్యాన్‌హోల్ నుంచి మురుగునీరు పొంగిప్రవహిస్తోంది. అక్కడే వున్న కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయానికి వచ్చే భక్తులు ఈ మురుగునీటిలో నడిచి రావాలంటే చాలా ఇబ్బందిగా వుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలా కాలంగా మురుగునీరు రోడ్డుపైకి చేరుతున్నా కార్పొరేషన్ సిబ్బంది మాత్రం నామ మాత్రంగా వచ్చి చూసి వెళ్తున్నారు తప్పించి శాశ్వత పరిష్కారం చూపడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా కార్పొరేషన్ డ్రెయినేజీ సిబ్బంది మురుగునీరు రోడ్డుపైకి చేరకుండా శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం

వన్‌టౌన్, జూలై 11: ఉద్యోగాలు ఇప్పిస్తానని డబ్బులు తీసుకుని మోసం చేసిన ఘటనలో నాగపూర్‌కు చెందిన బ్రైట్ కెరీర్ గ్రూప్ యజమానిపై బుధవారం రాత్రి గవర్నరుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. కానూరుకు చెందిన గంగోలు శామ్యేల్ బాబు, మరికొందరు 2023లో బ్రైట్ కెరీర్ గ్రూప్ సంస్థ హనుమాన్‌పేటలోని ఒక హోటల్‌లో నిర్వహించిన ఇంటర్వ్యూకు హాజరయ్యారు. ఉద్యోగం కావాలంటే సంస్థకు ముందుగా రూ.30 వేలు చెల్లించాలనడంతో శామ్యేల్ బాబు, మరో ముగ్గురు డబ్బు చెల్లించారు. ఆ తరువాత నుంచి సంస్థ నుంచి ఎటువంటి సమాచారం లేదు. డబ్బు కూడా తిరిగి పంపలేదు. నలుగురు బాధితులు గవర్నరుపేట పోలీసులకు పిర్యాదు చేశారు. సంస్థ యజమాని విజయేంద్ర సింగ్, ఇంటర్వ్యూలు నిర్వహించిన సిబ్బందిపై కేసు నమోదు చేశారు.

వ్యభిచార కార్యకలాపాల కేసులో ...

యనమలకుదురుకు చెందిన మస్తాన్ బీ (44) పున్నమ్మ తోటలో ఒక నివాసాన్ని అద్దెకు తీసుకుని ఇతర ప్రాంతాల నుంచి మహిళలను రప్పించి వ్యభిచార కార్యకలాపాలను నిర్వహిస్తోంది. పోలీసులకు వచ్చిన సమాచారంతో బుధవారం రాత్రి దాడి చేసి మస్తాన్ బీ ని. మరో యువకుడిని అరెస్టు చేశారు. మరో యువతిని హోంకు తరలించారు.



ఎంపీ చిన్నిని కలిసిన ఏపీ స్పెషల్ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు

ఐఆర్‌డీలను విద్యాశాఖలో విలీనం చేయండి

● ఎంపీ చిన్నిని కోరిన ఏపీ స్పెషల్ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు

విద్యాధరపురం, జూలై 11: కాంట్రాక్ట్ విధానంలో దివ్యాంగులకు విద్యాబోధన చేసే ఐఆర్‌డీలను విద్యాశాఖలో విలీనం చేయాలని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్‌ని(చిన్ని)ని గురువారం గురునానక్ కాలనీలోని ఎన్‌టీఆర్ భవన్‌లో కలిసిన ఏపీ స్పెషల్ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు కోరారు. ఈమేరకు ఆయనకు వినతి పత్రం అందచేశారు. ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ నాగరాజు, ఉపాధ్యక్షుడు జే శ్రీను, ఉపాధ్యాయులు కే సోమరాజు డి నిర్మల, ఏ శ్రీలతలు ఎంపీని కలిసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 6,800 టీచర్ల పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న ఐఆర్డీలను విలీనం చేసి నోటిఫికేషన్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై ఎంపీ స్పందిస్తూ సంబంధిత అధికారులతో మాట్లాడతానని తెలిపారు.

నాగమానసాదేవికి ప్రత్యేక పూజలు

గవర్నర్‌పేట, జూలై 11: ఆషాఢ మాసం పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని లెనిన్ సెంటర్‌లోని ఓం శ్రీషిర్డి నాగసాయిబాబా, నాగమానసాదేవి మందిరంలో గురువారం భక్తులు నాగమానసాదేవి అమ్మవారికి చీరలు సమర్పించారు. మందిరం వ్యవస్థాపక అధ్యక్షుడు సుధాస్వామి ఆధ్వర్యంలో తెల్లవారు జాము నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకున్న మహిళా భక్తులు పసుపు, కుంకుమ, గాజులు, పండ్లు, పూలు సమర్పించారు. సుధాస్వామి ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ జరిగింది.

బాలిక వైద్య చికిత్సకు ఆర్థికసాయం

మధురానగర్, జూలై 11: కేన్సర్ వ్యాధితో బాధపడుతున్న బాలిక(7)కు చికిత్స నిమిత్తం సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు చేతుల మీదుగా మధురానగర్‌కు చెందిన టీడీపీ నాయకుడు బర్మా శ్రీనివాస్ రూ.10వేలు ఆర్థికసాయం అందించారు. దాతలు ఎవరన్నా ముందుకు వచ్చి సాయం చేయవచ్చని విజ్ఞప్తి చేశారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

చిట్టినగర్, జూలై 11: పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులను తరిమికొట్టవచ్చునని 49వ డివిజన్ కార్పొరేటర్ బుల్లా విజయ్‌కుమార్ అన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా గురువారం 49వ డివిజన్ పలు వీధుల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. చిట్టినగర్ మట్టా లాజరస్ స్కూల్లో విద్యార్థులకు వ్యాధులు ప్రబలకుండా పరిసరాల పరిశుభ్రతపై అవగాహన నిర్వహించారు. అసిస్టెంట్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు. ఎస్ఎస్‌లు ఓబేశ్వరరావు, శివరామ్‌ప్రసాద్, ఏఎన్ఎంలు వేమూరి రత్నకుమారి, సునీత, రాజ్యలక్ష్మి, ఉమెన్స్ పోలీస్ భారతి, స్కూల్ ప్రధానోపాధ్యాయులు సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.



ప్రతాప్‌గౌడ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

టీడీపీ నాయకుడు ప్రతాప్‌గౌడ్‌కు నివాళి

విద్యాధరపురం, జూలై 11: రాష్ట్ర తెలుగు నాడు కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షుడిగా, శ్రీశైలంలో గౌడ సత్రం కమిటీకి అధ్యక్షుడిగా పనిచేసిన దేవరపు ప్రతాప్ గౌడ్ అకాల మరణానికి చింతిస్తూ గురువారం ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో సంతాప కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆయనకు ప్రగాఢ సంతాపం వెలిబుచ్చారు. కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు. ప్రతాప్‌గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గత 30 ఏళ్లుగా టీడీపీలోనే ఉండి పార్టీకి, అటు గౌడల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. నాయకులు లుక్కా సాయిరాం ప్రసాద్ గౌడ్, వాకా వెంకటేశ్వరరావు గౌడ్, ఉయ్యూరు నరసింహరావు, పామర్తి కిషోర్‌బాబు, శొంఠి శివరామ్ ప్రసాద్ గౌడ్. పలువురు నాయకులు పాల్గొన్నారు.

NOTICE TO GENERAL PUBLIC

This is to inform to all the General Public through this paper publication that my client by name LAKAMALA RAMARAO, S/O. LATE MATAYYA, aged about 47 years, R/O. H.No.6-3-3, Tailorpeta, Chittinagar, Vijayawada (Urban), NTR District, Pin 520001, entered into agreement of sale with Shaik Subhani S/o. Shaik Husain R/o. D.No.26-3-163/A, 1st floor, NRP Road, Gandhinagar, Vijayawada on 21-06-2023, with respect to below mentioned notice schedule property and my client paid a good amount of consideration. It is reliably learnt that the said Shaik Subhani is trying to sell away the notice schedule property to 3rd parties for his illegal gain by ignoring the agreement executed in favor my client. My client demanded him many times to come forward to execute the regular sale deed by receiving remaining balance of sale consideration but he is postponing for the same. Hence, my client informs to all general public not to deal with the below mentioned property in any manner failing which my client will initiate appropriate civil and criminal action at appropriate time. **NOTICE SCHEDULE PROPERTY:** An extent of 01 acre of agricultural land in Rs.No.30/1, G-Konduru Mandal, Venkatapuram village, mylavaram Sub- Registrar. **EAST:** DONKA, **SOUTH:** MALLARAPU SESHAIAH, **WEST:** SEELAM ANAND REDDY & ANOTHER, **NORTH:** SHAIK ABDUL SAHIB. Along with all easement rights.

P. BABU RAO, Advocate
Door No. 1-4/7-12A, Andimani Brahmayya Street, Kamakoti Nagar, Vidhyadharapuram, Vijayawada - 520012. Cell: 9849110022.

Vijayawada Dt: 11.07.2024

ఎన్‌జీ రంగా వర్సిటీలో బీఎస్సీ ఆనర్స్ కమ్యూనిటీ సైన్స్

దిక్సూచి DIKSUCHI

గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ(ఏఎన్‌జీఆర్‌ఏయూ)- బీఎస్సీ ఆనర్స్ కమ్యూనిటీ సైన్స్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. అకడమిక్ మెరిట్ ఆధారంగా లాంలోని కాలేజ్ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్‌లో అడ్మిషన్స్ ఇస్తారు. ఈ కాలేజీకి ఐకార్ గుర్తింపు ఉంది. మొత్తం 83 సీట్లు ఉన్నాయి. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థుల కోసం 10 శాతం సూపర్ న్యూమరరీ సీట్లు నిర్దేశించారు. గ్రామీణ అభ్యర్థుల కోసం 40 శాతం సీట్లు ప్రత్యేకించారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన పురుషులు, మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చు. హాస్టల్ సౌకర్యం ఉంది.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి బైపీసీ/ఎంపీసీ/ఎంబైపీసీ గ్రూప్ సబ్జెక్టులతో ఇంటర్/ పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి.

- మూడేళ్ల వ్యవధి గల డిప్లొమా(హోం సైన్స్) ఉత్తీర్ణులైన అభ్యర్థుల కోసం పది శాతం సూపర్ న్యూమరరీ సీట్లు(ఎనిమిది సీట్లు) ప్రత్యేకించారు. గ్రామీణ అభ్యర్థులకు కేటాయించిన సీట్లకు అప్లయ్ చేసుకోవాలంటే ఒకటోతరగతి నుంచి ఇంటర్ స్థాయి వరకు కనీసం నాలుగేళ్లు గ్రామ పాఠశాలల్లో చదివి ఉండాలి. సంబంధిత ధ్రువపత్రాన్ని సబ్మిట్ చేయాల్సి ఉంటుంది.



- అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 25 ఏళ్లు; దివ్యాంగులకు 27 ఏళ్లు మించకూడదు.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.2,000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **పోస్ట్ ద్వారా దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** జూలై 29
- **దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** రిజిస్ట్రార్, ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, లాం, గుంటూరు - 522034
- **వెబ్‌సైట్:** angrau.ac.in

ఇగ్నోలో ఓడీఎల్ కోర్సులు

న్యూఢిల్లీలోని ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ(ఇగ్నో)- ఓపెన్ డిస్టెన్స్ లెర్నింగ్(ఓడీఎల్) కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. పీజీ, డిగ్రీ, డిప్లొమా, సర్టిఫికెట్ తదితర కోర్సులు ఉన్నాయి. ప్రోగ్రామ్‌లకు నిర్దేశించిన అర్హతల సమాచారాన్ని వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

అడ్వాన్స్ సర్టిఫికెట్ ప్రోగ్రామ్: ప్రోగ్రామ్ వ్యవధి ఆర్నెల్లు. ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ, పవర్ డిస్ట్రిబ్యూషన్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.

అప్రిసియేషన్ కోర్సు: కోర్సు వ్యవధి మూడు నెలలు.

సర్టిఫికెట్ ప్రోగ్రామ్: ప్రోగ్రామ్ వ్యవధి ఆర్నెల్లు.

డిప్లొమా: ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. బిజినెస్ ప్రాసెస్ అవుట్ సోర్సింగ్, క్రియేటివ్ రైటింగ్ ఇన్ ఇంగ్లీష్, డెయిరీ టెక్నాలజీ, ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్, ఫ్యాషన్ డిజైన్ అండ్ రిటైల్, హార్టికల్చర్, మీట్ టెక్నాలజీ, మోడరన్ ఆఫీస్ ప్రాక్టీస్, న్యూట్రిషన్ అండ్ హెల్త్ ఎడ్యుకేషన్, పారాలీగల్ ప్రాక్టీస్, థియేటర్ ఆర్ట్స్, టూరిజం స్టడీస్, ఉర్దూ, వాల్యూ ఎడ్యుకేషన్, వాటర్‌షెడ్ మేనేజ్‌మెంట్, ఉమన్ ఎంపవర్‌మెంట్ అండ్ డెవలప్‌మెంట్, అగ్రికల్చరల్ అండ్ కాస్ట్ మేనేజ్‌మెంట్, అప్పారెల్ మర్చండైజింగ్, రిటైలింగ్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.

డిగ్రీ ప్రోగ్రామ్‌లు: బీఏ, బీఏ ఆనర్స్, బీటీఏ, బీసీఏ, బీఎస్సీ, బీఎస్సీ ఆనర్స్ బీకాం, బీఎస్‌డబ్ల్యూ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. బ్యాచిలర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్సెస్ వ్యవధి ఏడాది.

పీజీ ప్రోగ్రామ్‌లు: ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంకాం, ఎంటీటీఎం, ఎంబీఏ, ఎంసీఏ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఎంఎల్ఐఎస్ ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది.

పీజీ డిప్లొమా: ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. అనలిటికల్ కెమిస్ట్రీ, కౌన్సెలింగ్ అండ్ ఫ్యామిలీ థెరపీ, గాంధీ అండ్ పీస్ స్టడీస్, ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ, యానిమల్ వెల్ఫేర్, అప్లయిడ్ స్టాటిస్టిక్స్, ఆడియో ప్రోగ్రామ్ ప్రొడక్షన్, బుక్ పబ్లిషింగ్, కార్పొరేట్ అండ్ సోషల్ రెస్పాన్సిబిలిటీ, డెవలప్‌మెంట్ స్టడీస్, డిస్టెన్స్ ఎడ్యుకేషన్, ఎడ్యుకేషనల్ టెక్నాలజీ తదితర స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.

పీజీ సర్టిఫికెట్: ప్రోగ్రామ్ వ్యవధి ఆర్నెల్లు. అగ్రికల్చర్ పాలసీ, క్లయిమేట్ ఛేంజ్, జియో ఇన్ఫర్మాటిక్స్, ఇండస్ట్రియల్ సేఫ్టీ, ఇన్వెంటరీ ప్లానింగ్ అండ్ వేర్‌హౌసింగ్ సిస్టమ్ ఫర్ ఇంజనీర్స్, మలయాళం-హిందీ ట్రాన్స్‌లేషన్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 15
- **వెబ్‌సైట్:** ignouadmission.samarth.edu.in

ఎన్‌పీటీఐలో పీజీ డిప్లొమాలు

ఫరీదాబాద్‌లోని నేషనల్ పవర్ ట్రెయినింగ్ ఇన్‌స్టిట్యూట్(ఎన్‌పీటీఐ)- పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. నిబంధనల ప్రకారం కోర్సులు పూర్తిచేసినవారికి ప్లేస్‌మెంట్స్ కల్పిస్తారు. మహిళలకు ప్రోగ్రామ్ ఫీజులో పది శాతం రాయితీ లభిస్తుంది. పవర్ సంస్థలు స్పాన్సర్ చేసే అభ్యర్థుల కోసం 25 శాతం సీట్లు కేటాయించారు. అకడమిక్ మెరిట్ ఆధారంగా మెరిట్ లిస్ట్ రూపొందించి కౌన్సెలింగ్‌ల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

పీజీ డిప్లొమా ఇన్ పవర్ ప్లాంట్ ఇంజనీరింగ్: కోర్సు వ్యవధి ఏడాది. ఫరీదాబాద్, నాగ్‌పూర్, నైవేలీ, దుర్గాపూర్, అలప్పుజా, శివ్‌పురి సెంటర్లలో ఈ ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. ఒక్కో సెంటర్లో 60 సీట్లు చొప్పున మొత్తం 360 సీట్లు ఉన్నాయి.

పీజీ డిప్లొమా ఇన్ హైడ్రో పవర్ ప్లాంట్ ఇంజనీరింగ్: కోర్సు వ్యవధి తొమ్మిది నెలలు. నంగల్ సెంటర్లో ఈ ప్రోగ్రామ్ ఉంది. ఇక్కడ 60 సీట్లు ఉన్నాయి.

పీజీ డిప్లొమా ఇన్ రెన్యూవబుల్ ఎనర్జీ అండ్ గ్రిడ్ ఇంటర్ఫేస్ టెక్నాలజీస్: కోర్సు వ్యవధి ఏడాది. న్యూఢిల్లీ, శివ్‌పురి, నైవేలీ, అలప్పుజా సెంటర్లలో ఈ ప్రోగ్రామ్ ఉంది.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో (బీఈ/బీటెక్)(మెకానికల్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/సీ అండ్ ఐ/పవర్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులై ఉండాలి. రెన్యూవబుల్ ఎనర్జీ అండ్ గ్రిడ్ ఇంటర్ఫేస్ కోర్సుకు ఏ ఇంజనీరింగ్ విభాగంవారైనా దరఖాస్తు చేసుకోవచ్చు. గరిష్ఠ వయోపరిమితి నిబంధనలు లేవు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 28
- **టెలిఫోనిక్ ఇంటర్వ్యూ:** జూలై 30, 31
- **అభ్యర్థుల మెరిట్ లిస్ట్ విడుదల:** ఆగస్టు 2
- **కౌన్సెలింగ్:** ఆగస్టు 5, 6
- **కోర్సులు ప్రారంభం:** ఆగస్టు 12 నుంచి
- **మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్స్:** ఆగస్టు 22
- **వెబ్‌సైట్:** www.npti.gov.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/V9yZi4uలో చదవండి.



సెప్టెంబర్ ఒకటిన బాలకృష్ణకు భారీ సన్మానం



'తాతమ్మ కల' (1974) చిత్రంతో తన నట జీవితాన్ని ప్రారంభించారు నందమూరి బాలకృష్ణ. వైవిధ్యమైన పాత్రలు పోషిస్తూ 50 ఏళ్లుగా హీరోగా కొనసాగుతున్న ఏకైక కళాకారుడు ప్రపంచంలో ఆయన ఒక్కరే అంటే అది అతిశయోక్తి కాదు. అంతేకాదు తండ్రి, మహానటుడు ఎన్టీఆర్ మార్గాన్ని అనుసరించి రాజకీయాల్లోకి ప్రవేశించి హిందూపురం నియోజక వర్గం నుంచి మూడు సార్లు వరుసగా శాసనసభ్యుడిగా ఎన్నికై హ్యాట్రిక్ సాధించారు. ఇలా సినీరంగంలోనూ, రాజకీయ రంగంలోనూ సత్తా చాటుతూ 50 ఏళ్ల కెరీర్ పూర్తి చేసుకున్న బాలకృష్ణను తెలుగు చిత్రపరిశ్రమ సెప్టెంబర్ ఒకటిన ఘనంగా సత్కరించనుంది. ఈ మేరకు తెలుగు నిర్మాతలమండలి కార్యదర్శి దామోదర ప్రసాద్, నిర్మాతలమండలి కార్యదర్శి ప్రసన్నకుమార్, తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు సునీల్ నారంగ్, ఫెడరేషన్ అధ్యక్షుడు అనిల్ కలవగా, బాలకృష్ణ ఈ సన్మానానికి తన అంగీకారం తెలిపారు. బాలీవుడ్, ఇతర సినీ రంగాలకు చెందిన ప్రముఖులు కూడా ఈ సన్మాన సభకు హాజరవుతారని సమాచారం.

షూటింగ్ మొదలుపెట్టారు



విక్టరీ వెంకటేశ్, దర్శకుడు అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న తాజా చిత్రం రెగ్యులర్ షూటింగ్ గురువారం మొదలైంది. వెంకటేశ్ సరసన మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేశ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఓ పోలీస్ ఆఫీసర్, ఆయన భార్య, మాజీ ప్రేయసి.. ఇలా మూడు పాత్రల చుట్టూ తిరిగే వినోద భరిత చిత్రమిదని, ఇందులో క్రైమ్ ఎలిమెంట్ కూడా మిళితమై ఉంటుందని దర్శకుడు అనిల్ రావిపూడి చెప్పారు. ప్రస్తుతం ప్రారంభమైన షూటింగ్‌లో చిత్రంలోని ముఖ్య తారాగణమంతా పాల్గొంటోంది. ఈ సినిమాను సంక్రాంతికి విడుదల చేయనున్నట్లు చిత్ర నిర్మాత శిరీష్ చెప్పారు. దిల్ రాజు ఈ సినిమాకు సమర్పకుడు. ఈ చిత్రానికి సమీర్‌రెడ్డి ఛాయాగ్రాహకుడు, భీమ్స్ సిసిరోలియో సంగీత దర్శకుడు.

ఉత్తమ నటులుగా ఎన్టీఆర్, రామ్‌చరణ్ ఉత్తమ నటిగా సాయి పల్లవి

ఫిల్మ్‌ఫేర్ సౌత్ ఇండియన్ అవార్డుల సందడి





జాతీయ చలనచిత్ర అవార్డుల తర్వాత భారతీయ చిత్ర పరిశ్రమ ప్రతిష్ఠాత్మకంగా భావించే ఫిల్మ్‌ఫేర్ సౌత్ ఇండియన్ అవార్డులను గురువారం ప్రకటించారు. అంతర్జాతీయంగా ప్రతిష్ఠాత్మకమైన అవార్డులు పొందిన 'ఆర్ ఆర్ ఆర్' చిత్రం తెలుగు విభాగంలో ఉత్తమ చిత్రంగా ఎంపికైంది. ఉత్తమ నటులుగా ఎన్టీఆర్, రామ్‌చరణ్, ఉత్తమ దర్శకుడిగా రాజమౌళి ఎన్నికయ్యారు. 'విరాటపర్వం' చిత్రంలో నటించిన సాయిపల్లవి ఉత్తమ నటిగా ఎంపికయ్యారు. 'భీమ్లా నాయక్'లో నటించిన రానా ఉత్తమ సహాయ నటుడిగా, 'విరాటపర్వం'లో నటించిన నందితా దాస్, 'సీతారామం'లో నటించిన మృణాల్ ఠాకూర్ ఉత్తమ సహాయ నటీమణులుగా, ఉత్తమ గేయ రచయితగా సీతారామశాస్త్రి (సీతారామం) ఎన్నికయ్యారు. తమిళంలో ఉత్తమ నటుడిగా కమల్ హాసన్ (విక్రమ్) ఉత్తమ నటిగా ఊర్వశి, ఉత్తమ చిత్రంగా 'పొన్నియిన్ సెల్వం 1', ఆ సినిమాకు దర్శకత్వం వహించిన మణిరత్నం ఉత్తమ దర్శకుడిగా ఎన్నికయ్యారు. కన్నడంలో 'కాంతార', మలయాళంలో 'న్నా థాన్ కేసు కుడు' ఉత్తమ చిత్రాలుగా ఎన్నికయ్యాయి.

వినోదాత్మకంగా డార్లింగ్



అశ్విన్‌రామ్ దర్శకత్వం వహించిన చిత్రం 'డార్లింగ్'. ప్రియదర్శి నభానటేశ్ జంటగా నటించగా, కె.నిరంజన్‌రెడ్డి, చైతన్య నిర్మించారు. ఈ నెల 19న విడుదలవుతోంది. ఈ సందర్భంగా అశ్విన్‌రామ్ మీడియాతో ముచ్చటించారు. "కొత్త జంట పెళ్లిని ఎలా హ్యాండిల్ చేస్తారనేది ఇందులో వినోదాత్మకంగా చూపించా. సినిమాల ద్వారా సందేశాలు ఇవ్వడం నాకు ఇష్టం ఉండదు. ఈ సినిమాలో ఎంటర్టైన్‌మెంట్‌తో పాటూ ఓ సామాజిక బాధ్యతను కూడా జత చేశా. ఇందులో కథానాయకుడి పాత్ర చాలా అమాయకంగా.. కథానాయిక పాత్ర చలాకీగా ఉండాలి. అలా ఆ పాత్రలకి సరిపోయే నటీనటులను పరిశీలించాక.. ప్రియదర్శి, నభానటేశ్ వందశాతం సరిపోతారని అనిపించి వారిని తీసుకున్నాం. నభా పాత్రలో చాలా షేడ్స్ ఉంటాయి.. సినిమాలో నభా మీ అందరినీ పూర్తిగా ఆశ్చర్యానికి గురిచేస్తుంది. వినోదంతో పాటు భావోద్వేగాలని సమపాళ్లలో మిక్స్ చేసి తీసిన ఈ సినిమాలో.. హీరో హీరోయిన్ల మధ్యన వచ్చే సన్నివేశాలు అందరినీ కడుపుబ్బా నవ్విస్తాయి. నిర్మాతలు ఎక్కడా రాజీ పడకుండా మేకింగ్ విషయంలో పూర్తి స్వేచ్ఛనిచ్చారు.

అద్భుతమైన విజువల్స్‌తో..



వరుణ్ సందేశ్ నటిస్తున్న చిత్రం 'విరాజి'. ఆద్యంత్ హర్ష దర్శకత్వంలో మహేంద్రనాథ్ కూండ్ల నిర్మిస్తున్నారు. ఆగస్టు 2న సినిమా విడుదలవుతుంది. ఈ సినిమా ఫస్ట్ లుక్ టీజర్‌ను దర్శకుడు సాయి రాజేశ్ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "టీజర్‌లో విజువల్స్ అద్భుతంగా ఉన్నాయి. వరుణ్ లుక్ అదిరిపోయింది" అని చెప్పారు. "ఈ చిత్రం నాకు చాలా స్పెషల్" అని వరుణ్ సందేశ్ అన్నారు. "ఈ సినిమాలో చాలా ఆసక్తికరమైన అంశాలు ఉన్నాయి. వాటిని థియేటర్లలో చూసి ఆశ్చర్యపోతారు" అని దర్శకుడు ఆద్యంత్ హర్ష తెలిపారు.

ముందు రిసెప్షన్.. తర్వాత పెళ్లి!



వైవిధ్యమైన పాత్రలు పోషిస్తూ మంచి నటిగా తెలుగువారికి దగ్గరైన తమిళ నటి వరలక్ష్మి తన పెళ్లి వేడుకలోనూ వైవిధ్యం చూపించారు. వారం రోజుల క్రితం చెన్నైలో వరలక్ష్మి, నికోలై సచిదేవ్‌ల పెళ్లి రిసెప్షన్ చెన్నైలో జరిగింది. ఈ వేడుకకు పలువురు చిత్ర ప్రముఖులు హాజరయ్యారు. ఇలా అందరి అభినందనలు అందుకున్న వరలక్ష్మి, నికోలై సచిదేవ్ మంగళవారం థాయ్‌లాండ్‌లోని క్రాబి బీచ్ రిసార్ట్‌లో పెళ్లి చేసుకున్నారు. కుటుంబ సభ్యులు, అతికొద్దిమంది సన్నిహితుల మధ్య తమిళ సంప్రదాయానికి అనుగుణంగా ఈ పెళ్లి జరిగింది.

అనౌన్స్‌మెంట్ వీడియోతోనే సంచలనం



సత్యం రాజేశ్, బాలాదిత్య, గెటప్ శ్రీను ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన 'పొలిమేర 2' బాక్సాఫీస్ వద్ద ఊహించని సక్సెస్‌ను అందుకుని హారర్ థ్రిల్లర్ జానర్ సినిమాల్లో సరికొత్త ట్రెండ్ క్రియేట్ చేసిన సంగతి తెలిసిందే. 2021లో 'మా ఊరి పొలిమేర' చిత్రం ఓటీటీ సంస్థ 'డిస్నీ ప్లస్ హాట్‌స్టార్'లో విడుదలై అందరినీ మెప్పించింది .'మా ఊరి పొలిమేర'కు సీక్వెల్‌గా వచ్చిందే 'పొలిమేర 2'. గతేడాది నవంబరులో విడుదలైన ఈ సక్సెస్‌ఫుల్ హారర్ థ్రిల్లర్ ఫిల్మ్‌కు కొనసాగింపుగా ఇంకో భాగం ఉంటుందని మేకర్స్ అప్పుడే ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించారు. తాజాగా, 'పొలిమేర 3'ను మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన అనౌన్స్‌మెంట్ వీడియో సంచలనం సృష్టిస్తోంది. ఈ వీడియో రిలీజైన కొద్దిసేపటికే ఎక్స్‌లో దేశవ్యాప్తంగా ట్రెండ్ అవుతూ టాప్ ప్లేస్‌ను ఆక్రమించింది. మూడో భాగాన్ని మొదటి రెండు పార్టులకు దర్శకత్వం వహించిన అనిల్ విశ్వనాథ్ తెరకెక్కించనున్నారు. భోగేంద్ర గుప్తా, వంశీ నందిపాటి సంయుక్తంగా నిర్మించనున్నారు. ప్రస్తుతం ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ పనుల్లో ఉన్నట్లు మేకర్స్ వెల్లడించారు. 'పొలిమేర 3' లో సత్యం రాజేశ్, బాలాదిత్య, కామాక్షి భాస్కర్ల, గెటప్ శ్రీను, రవి వర్మ, రాకేందు మౌళి, చిత్రం శ్రీను, సాహిత్య దాసరి ప్రధాన పాత్రల్లో నటించనున్నారు.





ఆంధ్రజ్యోతి
నవ్య
నివేదన
శుక్రవారం • 12 జూలై 2024

గత యుగాల నుంచి భూమిమీద ఇప్పటికీ మిగిలి ఉన్న 'చిరంజీవులు'గా పురాణాలు వర్ణించిన వారిలో అశ్వత్థామ ఒకరు. వారిలో శాపగ్రస్తుడు మాత్రం అతనొక్కడే.





అశ్వత్థామ అసలు కథ

మహా భారతం గురించి ప్రస్తావించేటప్పుడు పెద్దగా చర్చకురాని, మరుగున పడిన పాత్రల్లో ఒకరు... అశ్వత్థామ. ఇటీవల 'కల్కి' సినిమాతో ఆ పాత్ర సర్వత్రా చర్చనీయాంశ మయింది. అశ్వత్థామ ఎంతటి యోధుడో, అతని స్వభావం ఎలాంటిదో మహాభారతంలో... వివిధ సందర్భాల్లో వ్యాసుడు వివరించాడు. అతని తండ్రి ద్రోణుడు, రాజైన ద్రుపదుడు సహాధ్యాయులు. అశ్వత్థామ పుట్టిన తరువాత... కుటుంబ పోషణ కోసం ద్రుపదుడి దగ్గరకు వెళ్ళిన ద్రోణుడికి అవమానం జరిగింది. దానికి ప్రతీకారం తీర్చుకోవాలనే ఆలోచనతో కురు రాజులను ద్రోణుడు ఆశ్రయించి... పాండవులకు, కౌరవులకు శస్త్రాస్త్ర విద్యల్లో శిక్షణ ఇచ్చాడు. అశ్వత్థామ కూడా తండ్రి దగ్గర విద్యలు నేర్చి మహా వీరుడయ్యాడు. భారతకాలంలోని మహారథుల్లో అతనొకడు. మహారథి అంటే 60వేల మందితో పోరాడగలిగే శక్తి కలిగినవాడు. అయితే పాండవులన్నా, శ్రీకృష్ణుడన్నా అతనికి ఈర్ష్య. తను మహావీరుడిననీ, శివుడినుంచి వరం పొందినవాడిననీ, దివ్యాస్త్ర సంపన్నుడిననీ అహంకారం. పాండవులను సమూలంగా రూపుమాపాలని ప్రయత్నించిన అతను శాపగ్రస్తుడిగా మిగిలిపోవడానికి దారితీసిన ఘట్టాలు... మహాభారతంలోని 'సౌప్తిక పర్వం'లో కనిపిస్తాయి.

మహా భారత యుద్ధంలో తను మరణించినట్టు మభ్యపెట్టి... తన తండ్రిని పాండవులు వధించడంతో అశ్వత్థామ ఆగ్రహోదగ్రుడయ్యాడు. నిద్రిస్తున్న ద్రౌపది కుమారులైన అయిదుగురు ఉపపాండవులను, ద్రోణుణ్ణి చంపిన దుష్టద్యుమ్నుణ్ణి సంహరించాడు. ఇది విన్న ద్రౌపది... భీముణ్ణి పంపించి అశ్వత్థామను చంపించకపోతే ప్రాయోప్రవేశం చేస్తానని ప్రతిజ్ఞ చేసింది. "అశ్వత్థామ అడవులు పట్టిపోయి ఉంటాడు. అతణ్ణి చంపినట్టు నిదర్శనం ఏమిటి?" అని అడిగాడు ధర్మరాజు. "అతని శిరస్సుపైన సహజమైన రత్నం ఉంది. దాన్ని తెస్తేనే నేను బతుకుతాను" అంది ద్రౌపది.

అశ్వత్థామ సంహారానికి భీముడు, అతని రథ సారథిగా నకులుడు బయలుదేరారు. కురుక్షేత్రం దగ్గర ఆగి... "అశ్వత్థామ ఎక్కడున్నాడో తెలుసా?" అని అక్కడివారిని అడిగారు. "అశ్వత్థామ వ్యాసుడి ఆశ్రమానికి వెళ్ళాడు" అని వారు చెప్పారు.

ఈలోగా ధర్మరాజును కలవడానికి వచ్చిన శ్రీకృష్ణుడికి విషయం తెలిసింది.

అప్పుడు కృష్ణుడు "ధర్మరాజా! భీముడు ఒక్కడే వెళ్ళాడా? అది ప్రమాదం. మనం కూడా వెళ్ళడం మంచిది. ఎందుకంటే... అశ్వత్థామ దగ్గర బ్రహ్మశిరోనామకాస్త్రం ఉంది. పుత్రవాత్సల్యంతో దాన్ని ద్రోణుడు అతనికి ఇచ్చాడు. అయితే అశ్వత్థామది కోపిష్టి స్వభావం అని ఆయనకు తెలుసు. కాబట్టి... ఎప్పుడైనా పాండవులమీద దాన్ని ప్రయోగిస్తాడని అనుమానపడ్డాడు. అందుకే అర్జునుడికి కూడా ఆ అస్త్రాన్ని ఇచ్చాడు. అందుకే అర్జునుడంటే అశ్వత్థామకు ఈర్ష్య. ఆ అస్త్రాన్ని మనుషుల మీద ప్రయోగిస్తే ఎన్నో విపత్తులు కలుగుతాయి. కాబట్టి "ఎన్ని ఆపదలు ఎదురైనా... వేరే విధంగా తప్పించుకోవాలి తప్ప దీన్ని మాత్రం ప్రయోగించకు"

అని అశ్వత్థామకు ద్రోణుడు చెప్పాడు. కానీ ఆ మాటలు అతని చెవికెక్కలేదు. అంతేకాదు.. శివుడి వరం వల్ల తనకు మరణం లేదనీ, తన దగ్గర బ్రహ్మశిరోనామకాస్త్రం ఉందనీ, దాంతో ముల్లోకాలనూ కాల్చి బూడిద చెయ్యగలననీ అతనికి అహంకారం. మీరు అరణ్యవాసంలో ఉన్నప్పుడు... ఒకసారి నా దగ్గరకు అశ్వత్థామ వచ్చాడు. "ఈ అస్త్రాన్ని నా తండ్రి తపస్సుకు మెచ్చి అగస్త్య మహాముని ఇచ్చాడు. దీన్ని తీసుకొని... నాకు నీ సుదర్శన చక్రం ఇవ్వు" అని అడిగాడు. అతని మనసులోని ఉద్దేశం నాకు అర్థమయింది. నా చక్రం, కత్తి, గద చూపించి... "నువ్వు నీకు ఏది కావాలంటే అది తీసుకో. బదులుగా నువ్వు నాకు ఆ అస్త్రాన్ని ఇవ్వక్కర్లేదు. ఎందుకంటే స్నేహితుడికి ఏదైనా ఇచ్చినప్పుడు బదులుగా మరొకటి తీసుకోకూడదు" అన్నాను. అశ్వత్థామ సంతోషంతో సుదర్శన చక్రాన్ని ఎడమ చేతితో ఎత్తబోయాడు, కుదరలేదు కుడిచేత్తోనూ కదిలించలేకపోయాడు. తన బలమంతా ఉపయోగించి రెండు చేతులతో ప్రయత్నించాడు. కానీ ఎత్తలేక... అలిసిపోయాడు. "నేను పన్నెండేళ్ళు హిమాలయాల్లో తీవ్రమైన తపస్సు చేసి దీన్ని సంపాదించాను. దీన్ని ఎవ్వరూ... ఆఖరికి అర్జునుడు కూడా కావాలని అడగలేదు. నువ్వు అడిగావు. ఇంతకీ దీంతో ఎవరిమీద యుద్ధం చేస్తావు?" అని అశ్వత్థామను అడిగాను. "నువ్వు చక్రం ఇస్తే... నిన్ను బతిమాలైనా నీతోనే యుద్ధం చేద్దామనుకున్నాను. అయితే ఈ చక్రం ధరించడానికి నువ్వే తగినవాడివి. ఇది లేకపోయినా నాకు నష్టమేం లేదు. నీతో యుద్ధం చెయ్యడానికి నా దగ్గర ఉన్న మహా అస్త్రాలు చాలు" అన్నాడు. అతనిలో అంత మహా అహంకారానికి కారణం... బ్రహ్మశిరోనామకాస్త్రం. అతను అధర్మ ప్రవర్తకుడు. క్రూరకర్మలు చేసేవాడు. భీముడికి ఏమైనా కావచ్చు" అంటూ ధర్మరాజు, అర్జునులతో కలిసి బయలుదేరాడు శ్రీకృష్ణుడు.

వ్యాసుడి ఆశ్రమానికి ఉద్రేకంగా వెళ్తున్న భీముణ్ణి వాళ్ళ చూశారు. వాళ్ళు ఆగమన్నా భీముడు ఆగలేదు. ఆశ్రమంలో ఒక చోట... అశ్వత్థామ తపస్సులో ఉన్నాడు. పెద్దగా అరుస్తూ తనవైపు వస్తున్న భీముణ్ణి, అతని వెనకు అర్జునుణ్ణి, ధర్మరాజును చూశాడు అశ్వత్థామ. అంతకుముందు రాత్రి తాను చేసిన ఘోరాలు గుర్తుకువచ్చాయి. అతనిలో అధైర్యం మొదలైంది. వెంటనే రెల్లు పరక తీసుకున్నాడు. బ్రహ్మశిరోనామకాస్త్రాన్ని దానిలో ఆవహింపజేశాడు. 'అపాండవం కావాలి' అనుకుంటూ ప్రయోగించాడు. ఆ బాణంలోంచి పుట్టిన మహాగ్ని... అన్ని దిక్కులకూ మహోగ్రంగా విజృంభించింది.

ఇది చూసిన కృష్ణుడు "అర్జునా! అది మరో అస్త్రంతో ఆగదు. నువ్వు కూడా ఆ అస్త్రాన్నే ప్రయోగించు. నిన్నూ, నీ సోదరులనూ రక్షించుకో" అన్నాడు.

అర్జునుడు తన గురువైన ద్రోణుణ్ణి స్మరించి... అస్త్రాన్ని అస్త్రం హతమార్చాలి అనుకుంటూ ప్రయోగించాడు. అది వెళ్ళి అశ్వత్థామ ప్రయోగించిన అస్త్రాన్ని ఢీకొన్నాయి. దీంతో మూడు లోకాల్లో అల్లకల్లోలం చెలరేగింది. జరగబోయే మహోత్పాతాన్ని గుర్తించిన నారదుడు... వ్యాసాశ్రమంలో ప్రత్యక్షమయ్యాడు. వ్యాసుడితో కలిసి అర్జునుణ్ణీ, అశ్వత్థామను శాంతింపజేయడానికి ప్రయత్నించాడు. "ఈ భూమి మీద ఎందరో వీరులు పుట్టారు, మరణించారు. మనుషుల

> భారతకాలంలోని మహారథుల్లో అశ్వత్థామ. ఒకరు. మహారథి అంటే 60వేల మందితో పోరాడగలిగే శక్తి కలిగినవాడు. అయితే పాండవులన్నా, శ్రీకృష్ణుడన్నా అతనికి ఈర్ష్య. తను మహావీరుడిననీ, శివుడినుంచి వరం పొందినవాడిననీ, దివ్యాస్త్ర సంపన్నుడిననీ అహంకారం. పాండవులను సమూలంగా రూపుమాపాలని ప్రయత్నించిన అతను శాపగ్రస్తుడిగా మిగిలిపోవడానికి దారితీసిన ఘట్టాలు... మహాభారతంలోని 'సౌప్తిక పర్వం'లో కనిపిస్తాయి.

మీద ఎవరైనా బ్రహ్మ శిరోనామకాస్త్రాన్ని ప్రయోగించారా?" అని మునులిద్దరూ ప్రశ్నించారు.

అప్పుడు అర్జునుడు "అస్త్రంతో అస్త్రాన్ని శాంతింపజేయడం కోసం... మరో మార్గం లేక దీన్ని ప్రయోగించాను. మీరు కోరితే ఉపసంహరిస్తాను. కానీ అతను మమ్మల్ని దహించేస్తాడు. మా క్షేమం మీరే చూడాలి" అంటూ అస్త్రాన్ని ఉపసంహరించాడు. నిజానికి ఆ అస్త్రాన్ని ప్రయోగించాక.... ఉపసంహరించడం దేవతల వల్ల కూడా కాదు. అలా ఉపసంహరించినవాళ్ళను అది చంపుతుంది. కానీ గురుభక్తి, తపశ్శక్తి కలిగినవాడు, దానగుణం, సత్యశీలత ఉన్నవాడు కాబట్టి అర్జునుడు ఆ పని చేయగలిగాడు. అది చూసిన మునులు ఆశ్చర్యపోయారు.

> అశ్వత్థామ కూడా ఉపసంహరించబోయాడు. కానీ సాధ్యం కాలేదు. అప్పుడు వ్యాసుడితో... "భీముడు అధర్మ యుద్ధంలో దుర్యోధనుణ్ణి చంపాడు. ఇప్పుడు నన్ను చంపడానికి వచ్చాడు. ఆ ఆగ్రహంతో... ప్రాణభయంతో నాకు మతిపోయి ఈ అస్త్రాన్ని ప్రయోగించాను. అది పాండవ సంతతి నంతటినీ తుడిచిపెట్టేస్తుంది. అది పాపమైనా సరే నేను భరిస్తాను" అన్నాడు అశ్వత్థామ.

"శిష్యుడనే వాత్సల్యంతో అర్జునుడికి నీ తండ్రి ఆ అస్త్రాన్ని ఇచ్చాడు. దాన్ని నీకు హాని కలిగించడం కోసం కాకుండా... నీ అస్త్రం ఉపశమించేలా చెయ్యడానికే అర్జునుడు ప్రయోగించాడు. మేము వద్దని చెప్పగానే ఉపసంహరించాడు. ఈ మహాస్త్రాన్ని మనుషుల మీదకు ప్రయోగించినవారికి కీడు తప్పదు. ఇప్పుడు నీ అస్త్రం అతని అస్త్రంతో అణగారిపోతుంది. అది జరిగిన దేశంలో పన్నెండేళ్ళు వానలు పడవు. కాబట్టి దాన్ని అలాగైనా ఉపసంహరించు. నీ శిరోరత్నాన్ని అర్జునుడికి ఇవ్వు. ఇదే సంధి మార్గం" అని హితవు చెప్పాడు వ్యాసుడు.

"కౌరవుల సంపద అంతటినీ లాక్కున్న పాండవులకు రత్నాలకు కరువా? ఈ రత్నం ఉంటే దేవ రాక్షసులు, జంతువులు, చోరుల భయం ఉండదు. ఆకలి, దాహం, నిద్ర, అనారోగ్యాలు బాధించవు. అలాంటి రత్నం వీళ్ళకు ఎందుకు ఇవ్వాలి? కానీ నువ్వు ఆజ్ఞాపించావు కాబట్టి ఇచ్చేస్తాను. కానీ నా అస్త్రం మాత్రం పాండవ స్త్రీల గర్భాలను నాశనం చేసి కాని శాంతించదు" అన్నాడు అశ్వత్థామ.

"అలాగే... అయితే మరో దానికి మాత్రం ఆశపడకు" అన్నాడు వ్యాసుడు.

ఆయన మాటల్లోని అర్థాన్ని అశ్వత్థామ గ్రహించాడు. 'అది మాత్రం ఎందుకు వదిలెయ్యాలి? అన్నిటినీ అంతం చేస్తాను' అని మనసులో అనుకున్నాడు. కానీ "అలాగే చేస్తాను" అని వ్యాసుడితో చెప్పాడు.

కృష్ణుడికి విషయం అర్థమయింది. 'వ్యాసుడికి మాట ఇచ్చినట్టే ఇచ్చి.. తనకు నచ్చినట్టు చేస్తాడు. దీన్ని నేను ఆపుతాను' అనుకున్నాడు మనసులో. "పాండవుల సంతతిని నాశనం చేసి పాపానికి ఒడిగడుతున్నావు. గర్భాలన్నీ నాశనం చేస్తున్నావు. వాళ్ళకు ఒక్క వంశాంకురాన్నైనా విడుగుల్చు. ఆ ఒక్క గర్భాన్ని నీ అస్త్రంతో నాశనం కాకుండా ఆపు" అన్నాడు అశ్వత్థామతో.

"ఉత్తర గర్భాన్ని కాపాడాలని నువ్వు అనుకుంటున్నావని నాకు తెలుసు. నేను మాత్రం వదిలిపెట్టను" అని స్పష్టం చేశాడు అశ్వత్థామ.

"నువ్వు నాశనం చేసినా నేను రక్షించి, దీర్ఘాయువు పోస్తాను" అన్నాడు కృష్ణుడు.

"అస్త్రంతో తగలబడిపోయేవాణ్ణి బతికిస్తానంటున్నావ్. నువ్వెంత నేర్పరివో చూద్దాం" అంటూ 'పాండవ స్త్రీల గర్భాలన్నీ నాశనం కావాలి' అని అనుకొని అశ్వత్థామ ఆ అస్త్రాన్ని వదిలిపెట్టాడు.

"నీ కళ్ళముందే ఆ బిడ్డ, అతని వంశం కళకళలాడుతూ ఉంటుంది. నేను ఆ బిడ్డని రక్షిస్తాను. నిన్ను మాత్రం... గర్భంలో ఉన్న పిల్లల్ని చంపిన పాపం కట్టికుడుపుతుంది. తిండిలేక అల్లాడతావు. దుర్వాసనతో ఉండే రక్తాన్ని శరీరానికి పూసుకొని మూడువేల ఏళ్ళు దేవులాడుతూ ఉంటావు" అంటూ శ్రీకృష్ణుడు శపించాడు.

వ్యాసుడు కూడా అశ్వత్థామకు శాపం ఇస్తూ... "ఇంతటి పాతకానికి పాల్పడ్డావు. నా మాటను లెక్క చెయ్యలేదు. తిండీ తిప్పలు లేకుండా, ఎటువంటి సహాయం లేకుండా... మూడు వేల ఏళ్ళు దుర్గంధమైన రక్తంతో భూమి మీద తచ్చాడుతూ ఉంటావు" అన్నాడు.

"నువ్వూ చిరంజీవివే. మనుషులలోనే ఉంటావు. నేను నీ దగ్గరే ఉంటాను..." అని వ్యాసుడికి చెబుతూ... తన శిరోరత్నాన్ని పాండవులకు ఇచ్చేసి, తపోవనంలోకి నడిచాడు అశ్వత్థామ. గత యుగాల నుంచి భూమిమీద ఇప్పటికీ మిగిలి ఉన్న 'చిరంజీవులు'గా పురాణాలు వర్ణించిన వారిలో అశ్వత్థామ ఒకరు. వారిలో శాపగ్రస్తుడు మాత్రం అతనొక్కడే.


సద్బోధ

వివేకి– మూర్ఖుడు

ఇద్దరు వ్యక్తులు సముద్రంలో చిక్కుకున్నారు. తీరానికి కొంత దూరంగా ఉన్న ఒక రాతి మీదకు చేరుకున్నారు. చీకట్లు కమ్ముకుంటున్నాయి. ఆకాశంలో మబ్బులు ముసురుకుంటున్నాయి. తీరంలో ఉన్నవేవీ కనిపించడం లేదు. కెరటాలు ఉధృతంగా వచ్చి... రాళ్ళను ఢీకొని వెనక్కి పోతున్నాయి. సముద్రం కల్లోలంగా ఉంది.

ఇంతలో వేరొక వ్యక్తి వారిని సమీపించాడు. "నాతో రండి. మిమ్మల్ని తీరానికి చేరుస్తాను" అని అన్నాడు.

వారిలో వివేకవంతుడైన వ్యక్తి... అతనితో వెళ్ళడానికి సిద్ధమయ్యాడు. కానీ మూర్ఖుడైన వ్యక్తి సందేహిస్తూ "ఈ నీళ్ళలోంచి మమ్మల్ని నువ్వెలా బయటకు తీసుకువెళ్తావు?" అని ప్రశ్నించాడు.



14న స్వామి శివానంద వర్ధంతి

"పడవను నాతో తీసుకువచ్చాను" అన్నాడు కొత్త వ్యక్తి.

"నీతో రావడానికి నేను సిద్ధమే" అన్నాడు వివేకవంతుడు.


"లేదు. నేను రాను. బహుశా పడవలో ఏదైనా లోపం ఉండొచ్చు. లేదా ఈ మనిషి దోపిడీదారు కావచ్చు" అన్నాడు మూర్ఖుడు.

తెలివైన మనిషి పడవలో ఎక్కాడు. పడవ నడిపే వ్యక్తి మార్గదర్శకత్వంలో... తీరానికి సురక్షితంగా చేరాడు. ఇంతలో... సముద్రంలో కెరటాలు ఉవ్వెత్తున ఎగసిపడ్డాయి. మూర్ఖుడు నీళ్ళలో పడి మునిగిపోయాడు.

ఎన్నో జన్మల తరువాత... మానవ జన్మ అనే వరాన్ని పొందిన జీవుడు... సంసారం అనే సముద్రంలో కొట్టుకుపోతూ ఉంటాడు. సురక్షితమైన తీరాన్ని చేరుకోలేక సతమతమవుతూ ఉంటాడు. కాలం ప్రవహిస్తూ ఉంటుంది. జీవితం చరమాంకానికి చేరుకుంటుంది. కంటి చూపు తగ్గిపోతుంది. భౌతిక ప్రపంచాన్నే పట్టుకొని పాకులాడడం, సామరస్యత లేకపోవడం అనే మబ్బులు జ్ఞాన నేత్రాన్ని మూసేస్తాయి. అప్పుడు కలవరపాటుతో ప్రార్థిస్తూ మానవుడు అనిశ్చితి అనే శిల మీద నిలబడి ఉంటాడు.

భగవన్నామం లేదా భక్తి అనే పడవలో గురువు అతని దగ్గరకువస్తాడు. తనను అనుసరించి, నావను ఎక్కి, భవసాగరాన్ని దాటి సురక్షితంగా ఒడ్డుకు చేరుకోవాలని బోధిస్తాడు. వివేకవంతుడైన మనిషి అందుకు తక్షణమే సిద్ధమవుతాడు. కానీ మూర్ఖుడికి వెయ్యి సందేహాలు, లక్ష అనుమానాలు ఉంటాయి. గురువు చిత్తశుద్ధిని, భక్తి ప్రామాణికతను అతను ప్రశ్నిస్తాడు. త్వరలోనే మళ్ళీ మరోసారి అతను సంసారమనే మహా సముద్రంలో పడిపోతాడు. దానిలో మునిగిపోతాడు. తనను భగవంతుడికి సమర్పించుకోవడం ద్వారా... తనను తాను కాపాడుకొనే గొప్ప అవకాశాన్ని అతను కోల్పోతాడు.

- స్వామి శివానంద





సాధనతోనే నియంత్రణ సాధ్యం

చింతన

మన గతాన్ని, వర్తమానాన్ని, భవిష్యత్తును నిర్ణయించేది... మన ఆలోచనలే. ఈ ఆలోచనల్లోని వైరుధ్యాలే ప్రేమ, ద్వేషం, ఘర్షణ తదితర భావోద్వేగాలకు కారణం. మానవుడు తనను తాను తెలుసుకోవడానికి ఎంతో కృషి చేస్తాడు. చివరకు... 'నా ఆలోచనల సమగ్ర స్వరూపమే నేను' అని తెలుసుకుంటాడు. ఆత్మజ్ఞానం పొందడం అంటే... మనిషి తన ఆలోచనల విస్తృత స్వరూపాన్ని అర్థం చేసుకోవడమే. ఆలోచనల పుట్టుక, వాటి స్వభావం, వాటి పరిణామక్రమమే మానవుడి సమగ్ర వ్యక్తిత్వం. తమతమ ఆలోచనా సరళి కారణంగానే వ్యక్తిగతమైన భేదాలు ఏర్పడతాయి. విభిన్న అభిప్రాయాలకు, భావనా వైరుధ్యాలకు మూలకారణం... వారివారి ఆలోచనా విధానం వేరువేరుగా ఉండడమే. ఎవరైతే తమ ఆలోచనా విధానాన్ని సమగ్రంగా పరిశీలిస్తూ, విశ్లేషిస్తూ ముందుకు సాగుతారో... వారు తమ జీవన ప్రయాణాన్ని స్ఫూర్తిమంతంగా కొనసాగిస్తారు.

మనస్సులో పుట్టిన ఒక భావన... ఒక ఆలోచనగా రూపొందుతుంది. దరిమిలా కుప్పలు తెప్పలుగా ఆలోచనలు పుట్టుకొస్తాయి. ఇవన్నీ మూల భావన తాలూకు అస్తిత్వ ప్రతిరూపాలే. ఇలా అసంఖ్యాకంగా పుట్టుకొస్తున్న ఆలోచనల్లో కొన్ని మంచివి, కొన్ని చెడ్డవి ఉంటాయి. ఇక్కడ మంచి, చెడు అనే విషయంలో ఏ ఇద్దరి ఆలోచనా విధానం ఒకలా ఉండదు. కాబట్టి దేశకాలమాన పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని... ఏ ఆలోచనైతే సామాజికంగా సమగ్రాభివృద్ధికి దోహదపడుతుందో, ఎక్కువమంది ఆమోదాన్ని పొందుతుందో అదే మంచిదని భావించవచ్చు. అలాకాకుండా ఆ అభివృద్ధికి ఆటంకం కలిగించే ఆలోచనలను చెడ్డవిగా పరిగణించవచ్చు. ఇక... వ్యక్తిగత స్థాయిలో... ఏ ఆలోచన ఒక వ్యక్తి శారీరక, మానసిక, సామాజిక సమగ్ర వికాసానికి ఉపయోగపడుతుందో అది మంచి ఆలోచన అనీ, ఆ వికాసానికి హాని కలిగించేది చెడ్డ ఆలోచన అనీ విశ్లేషించవచ్చు.

ఈ మంచి చెడు ఆలోచనల పరంపర మన మనస్సును చుట్టుముట్టినప్పుడు... మనం ఎక్కువగా ఏ విధమైన ఆలోచనలు చేస్తామో... వాటికి మూలమైన భావన బలపడుతుంది. అలా బలపడిన భావన తాలూకు తదుపరి రూపం... కార్యాచరణ. మంచి ఆలోచనలతో మంచి పనులు, చెడు ఆలోచనలతో చెడ్డ పనులు చేస్తాం. మన మనస్సును ఎలా నియంత్రించుకోవాలనేదే అసలు సమస్య. నిజానికి మనస్సును నియంత్రించుకోలేం. మన మనస్సులో ఒక భావన మొలకెత్తగానే... దానికి సంబంధించిన ఆలోచనలు ప్రారంభమవుతాయి. ప్రారంభ దశలోనే ఆ భావన మంచిదా, చెడ్డదా, ప్రయోజనకరమైనదా, కాదా అనేది బుద్ధితో గ్రహించాలి. దానికి అనుగుణంగా ఆలోచనలను నియంత్రించుకోవాలి. ఒకదాని వెనుక ఒకటిగా వస్తున్న ఆలోచనలను... మన బుద్ధిద్వారా క్రమబద్ధీకరించుకోవాలి. ఆ ఆలోచనలు మనకుగాని, సమాజానికి గాని ప్రయోజనకరమైనవి కానప్పుడు... బుద్ధి ద్వారా ఆ సంగతి గ్రహించి... అలాంటి ఆలోచలను ఆపెయ్యాలి. లేకపోతే అవి మనలో స్థిరపడతాయి. చెడ్డ పనులకు ప్రోత్సహిస్తాయి. వాటిని ఎప్పటికప్పుడు వడబోసుకుంటూ ఉంటే... కొంతకాలానికి మనస్సులో చెడు భావనలు తగ్గుతాయి. ఒకవేళ అలాంటి భావనలు కలిగినా... మన మనస్సు వాటితో నిండిపోకుండా బుద్ధి అడ్డుకుంటుంది. క్రమంగా మన మనస్సు మంచి భావనలతో... తద్వారా మంచి ఆలోచనలతో నిండి ఉంటుంది. నిండు పాత్రలో... కొత్త వాటికి చోటు ఉండదు కదా! అలాగే మనస్సు పూర్తిగా మంచి భావనలతో, మంచి ఆలోచనలతో నిండి మనల్ని ఉన్నత స్థితివైపు మరలిస్తుంది. మనస్సును అదుపు చెయ్యడం కష్టం. కానీ, మనస్సులోని ఆలోచనను గమనిస్తూ... బుద్ధిద్వారా నియంత్రించుకోవడం కష్టం కాదు. సాధన ద్వారా ఇది సాధ్యమవుతుంది. మంచి ఆలోచనలతో నిండిన మనస్సు... వెంటనే కార్యాచరణకు ప్రేరేపిస్తుంది. మంచి పనులు చేయడం మొదలుపెడతాం. తద్వారా కలిగే సంతృప్తి... మనస్సులో మంచి భావనలు మొలకెత్తడానికి ఎరువులా ఉపయోగపడతాయి. మరిన్ని మంచి పనులు చేసే సమర్థతను మనలో కలిగిస్తాయి. సాధనతో దీన్ని సాధించవచ్చు.

- డాక్టర్ డి.వి.రఘునాథ్

విష, అమృత వలయాలు

గీతాసారం

విష, అమృత వలయాలు అంటే ఒకదాని నుంచి మరొక దానికి దారితీసే సంఘటనల సమూహాలు. ఇవి సుఖాన్ని లేదా దుఃఖాన్ని కలిగిస్తాయి. ఆదాయం కన్నా ఖర్చులు ఎక్కువగా ఉంటే... అది ఋణాల ఊబిలోకి దారి తీసే ఒక విషవలయం. ఆదాయం కన్నా ఖర్చులు తక్కువగా ఉండి... సంపద సృష్టి జరిగితే... అది అమృత వలయం. ఈ వలయాల గురించి శ్రీకృష్ణుడు వివరిస్తూ "విషయ చింతన చేసే వ్యక్తికి ఆ విషయాల పట్ల ఆసక్తి ఏర్పడుతుంది. ఆ ఆసక్తి కారణంగా... ఆ విషయాలను పొందాలనే కోరిక కలుగుతుంది. ఆ కోరిక తీరనప్పుడు... క్రోధం ఏర్పడుతుంది. అలాంటి క్రోధం వల్ల వ్యామోహం కలుగుతుంది. దాని ప్రభావం వల్ల స్మృతి ఛిన్నాభిన్నం అవుతుంది. స్మృతిని కోల్పోవడం వల్ల బుద్ధి... అంటే జ్ఞాపకశక్తి నశిస్తుంది. బుద్ధి నాశనమైపోవడం వల్ల మనిషి తను ఉన్న స్థితి నుంచి పతనం అయిపోతాడు" అని చెప్పాడు. ఇది పతనానికి సంబంధించిన విషవలయం. అలాగే "అంతఃకరణను వశంలో ఉంచుకున్న సాధకుడు రాగద్వేషరహితుడై, ఇంద్రియాల ద్వారా విషయాలను గ్రహిస్తున్నప్పటికీ, వాటి ఆకర్షణకు లోనుకాకుండా... మనశ్శాంతిని



పొందుతాడు" అని శ్రీకృష్ణుడు పేర్కొన్నాడు. ఇది శాంతి, ఆనందాల అమృత వలయం.

మనమందరం దైనందిన జీవితంలో ఆకర్షణీయమైన లేక అసహ్యమైన ఇంద్రియ వస్తువుల మధ్య సంచరిస్తూ ఉంటాం. వాటితో మనం ఎలా వ్యవహరిస్తామనేది మన ప్రయాణం దిశను నిర్దేశిస్తుంది. అమృతవలయంలోకి ప్రయాణిస్తున్నవారు... ఇంద్రియ వస్తువుల ఆకర్షణ, వికర్షణల నుంచి విముక్తి పొందుతారు. ఇక విషయవలయం వైపు వెళ్తున్నవారు ఇంద్రియ వస్తువుల ఆకర్షణకు లోనవుతారు లేదా అసహ్యాన్ని పెంచుకుంటారు. విషవలయం నుంచి అమృతవలయానికి రావడానికి సులువైన మార్గం... ద్వేషాన్ని వదిలెయ్యడం. ఎందుకంటే ద్వేషం ప్రాణాంతకమైన విషం లాంటిది. ద్వేషాన్ని వదిలేసినప్పుడు... దానికి వ్యతిరేక ధ్రువమైన రాగం కూడా తొలగిపోతుంది. షరతులు లేని ప్రేమకు అది దారి తీస్తుంది. రాగద్వేషాలను దాటి ముందుకు పోవడం అనేది భగవద్గీతలోని ఒక మౌలిక ఉపదేశం. అన్ని జీవులలో మనల్ని, అన్ని జీవులను మనలో... చివరకు అన్నిటిలో, ప్రతి చోటా తనను (శ్రీకృష్ణుణ్ణి) చూడాలని శ్రీకృష్ణుడు సలహా ఇచ్చాడు. ద్వేషాన్ని వదిలెయ్యడానికి ఈ ఏకత్వం మనకు సహాయపడుతుంది. అంతిమంగా... మనకు ఆనందం కలిగిస్తుంది.



కె. శివప్రసాద్
ఐఏఎస్

సుభాషితం

లోభత్వానికి ఫలితం

దానం భోగో నాశ స్తిస్రో
గతయో భవన్తి విత్తస్య
యోన దదాతి న భుంక్తే తస్య
తృతీయా గతిర్భవతి... అంటూ లోభత్వం వల్ల కలిగే అనర్థం గురించి తన 'నీతిశతకం'లోని ఈ శ్లోకంలో భర్తృహరి వివరించాడు.

దాన్ని...

దానము భోగము నాశము
పూనికతో మూడు గతులు భువి ధనమునకున్



దానము భోగము నెరుగని
దీనుని ధనమునకు గతి
ద్రుతీయమె పొసగన్... అనే పద్యరూపంలో తెలుగులో అందించాడు ఏనుగు లక్ష్మణకవి.

భావం:

డబ్బు ఖర్చు కావడానికి మూడు మార్గాలు ఉన్నాయి. మొదటిది: ఎవరికైనా దానం చేయడం. రెండోది: తాను అనుభవించడం. మూడోది: అది నాశనం కావడం. ఎవరికీ దానం చేయకుండా, తాను ఖర్చు పెట్టి సుఖపడకుండా లోభత్వంతో దాచిన ధనం చివరకు ఎందుకూ కొరగాకుండా పోతుంది, నాశనమైపోతుంది, దొంగల పాలు అవుతుంది. దానాన్నీ, భోగాన్నీ ఎరుగని వాడి సంపదకు చివరికి దుర్గతే పడుతుంది.

స్పోర్ట్స్

విజయవాడ ● శుక్రవారం 12 జూలై 2024

శ్రీలంకతో 3 వన్డేలు, 3 టీ20లు

న్యూఢిల్లీ: కొత్త కోచ్ గౌతమ్ గంభీర్ ఆధ్వర్యంలో భారత జట్టు ఈనెలాఖరున శ్రీలంకతో పరిమిత ఓవర్ల సిరీస్ ఆడనుంది. ముందుగా పల్లెకెలెలో 26, 27, 29న టీ20 సిరీస్.. ఆ తర్వాత కొలంబో వేదికగా ఆగస్టు 1, 4, 7న ఇరు జట్ల మధ్య మూడు వన్డేల సిరీస్ జరుగనుంది. సరిగ్గా మూడేళ్ల క్రితం భారత జట్టు లంకలో పర్యటించింది. మరోవైపు ఈ సిరీస్‌కు కెప్టెన్ రోహిత్, విరాట్, బుమ్రా విశ్రాంతి తీసుకోనున్నట్టు సమాచారం.



టీ20 కెప్టెన్సీకి హసరంగ గుడ్ బై: శ్రీలంక టీ20 జట్టు కెప్టెన్సీనుంచి వనిందు హసరంగ గురువారం వైదొలిగాడు. భారత్‌తో సిరీస్ ఆడనున్న తరుణంలో హసరంగ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. జట్టు ప్రయోజనాల రీత్యా కెప్టెన్సీ నుంచి వైదొలగి కేవలం ఆటగాడిగా కొనసాగాలని హసరంగ నిర్ణయించుకున్నట్టు శ్రీలంక క్రికెట్ తెలిపింది. హసరంగ నాయకత్వంలో ఇటీవలి టీ20 ప్రపంచ కప్‌లో తలపడిన శ్రీలంక సూపర్-8 దశకు కూడా చేరని విషయం తెలిసిందే.

ఓటమి అంచున విండీస్

రెండో ఇన్నింగ్స్ 79/6 ● ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ 371

లార్డ్స్: వెస్టిండీస్‌తో జరుగుతున్న తొలి టెస్టులో ఇంగ్లండ్ ఘనవిజయానికి చేరువలో ఉంది. రెండో రోజు గురువారం ఆతిథ్య జట్టు 371 పరుగులు సాధించి 250 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యాన్ని అందుకుంది. జేమీ స్మిత్ (70), రూట్ (68), బ్రూక్ (50) అర్ధసెంచరీలు చేశారు. జేడెన్ సీల్స్‌కు నాలుగు.. మోటీ, హోల్డర్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత విండీస్‌ను పేసర్లు అండర్సన్, అట్కిన్సన్, స్టోక్స్ తలా రెండు వికెట్లతో దెబ్బతీశారు. దీంతో ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 34.5 ఓవర్లలో 79 పరుగులకే ఆరు వికెట్లు కోల్పోయింది. విండీస్ ఇంకా 171 పరుగులు వెనుకంజలో ఉండగా, చేతిలో నాలుగు వికెట్లు మాత్రమే మిగిలాయి. ఫలితంగా విండీస్‌కు ఇన్నింగ్స్ ఓటమి తప్పేలా లేదు. అథనజె (22), హోల్డర్ (20) మాత్రమే రాణించారు.

కోహ్లీనా.. అతడెవరు?



స్వీడన్ సాకర్ స్టార్ ఇబ్రహిమోవిచ్

న్యూఢిల్లీ: ప్రపంచ వ్యాప్తంగా పాపులారిటీ కలిగిన క్రికెటర్ విరాట్ కోహ్లీ. రొనాల్డో, మెస్సీ తరహాలోనే ఇన్‌స్టాలో అతడికి కూడా కోట్లాదిమంది ఫాలోయర్లు ఉన్నారు. అయితే, స్వీడన్ లెజెండరీ ఫుట్‌బాలర్ జ్లటాన్ ఇబ్రహిమోవిచ్‌కు కోహ్లీ ఎవరో కూడా తెలియదట. అమెరికాకు చెందిన ప్రఖ్యాత యూట్యూబర్ స్పీడ్‌తో ఇంటర్వ్యూలో విరాట్ ఫొటోను చూపినా గుర్తుపట్టలేకపోయాడు. 'ఈ క్రికెటర్‌ను ఎప్పుడూ చూడలేదు. అస్సలు నాకు క్రికెట్టే తెలీదు. అతడు గొప్ప ఆటగాడా?' అని ప్రశ్నించాడు.

తుదిపోరుకు కొలంబియా

1-0తో ఉరుగ్వేపై గెలుపు



చార్లెట్ (నార్త్ కరోలీనా): రెండు దశాబ్దాల తర్వాత కొలంబియా 'కోపా అమెరికా చాంపియన్‌షిప్' ఫైనల్‌కు దూసుకెళ్లింది. గురువారం జరిగిన సెమీస్‌లో కొలంబియా 1-0తో ఉరుగ్వేను ఓడించింది. టైటిల్ ఫైట్‌లో అర్జెంటీనాతో తలపడనుంది. ఫస్టాఫ్ 39వ నిమిషంలో జేమ్స్ రోడ్రిగ్వెజ్ కార్నర్ కిక్‌ను జెఫర్సన్ లెర్మా హెడర్ ద్వారా గోల్‌లోకి పంపాడు. దీంతో కొలంబియా 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఫస్టాఫ్ ఇంజ్యూరీ టైమ్‌లో డేనియల్ మునోజ్‌కు రెడ్ కార్డ్ చూపడంతో.. సెకండాఫ్ మొత్తం కొలంబియా 10 మందితోనే ఆడింది. అయితే, ఫేవరెట్‌గా బరిలోకి దిగిన ఉరుగ్వే బంతిని ఎక్కువ శాతం తన నియంత్రణలోనే ఉంచుకొన్నా.. గోల్ మాత్రం సాధించలేక పోయింది. 2001లో టైటిల్ విజేతగా నిలిచిన కొలంబియా.. మళ్లీ 23 ఏళ్లకు ఫైనల్‌కు చేరుకొంది. కాగా, మ్యాచ్ ముగిసిన తర్వాత డార్విన్ నూనెజ్ సహా 12 మంది ఉరుగ్వే ఆటగాళ్లు స్టాండ్స్‌లోకి వెళ్లి ప్రత్యర్థి ఫ్యాన్స్‌తో దెబ్బలాడడం ఉద్రిక్తతకు దారి తీసింది. దీంతో పోలీసులు జోక్యం చేసుకొని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. కొలంబియా జెర్సీ ధరించిన ఓ వ్యక్తిపై నూనెజ్ దాడి చేస్తున్న వీడియో నెట్‌లో హల్‌చల్ చేస్తోంది.

పాక్‌లో ఆడేది లేదు!

హైబ్రిడ్ పద్ధతి మేలు
ఇది బీసీసీఐ అభిప్రాయం





న్యూఢిల్లీ: ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో ఆడేందుకు భారత క్రికెట్ జట్టు పాకిస్థాన్‌లో పర్యటించడం దాదాపు అసాధ్యమని బీసీసీఐ వర్గాలు పేర్కొన్నాయి. వచ్చే ఏడాది ఫిబ్రవరి-మార్చిలో ఈ టోర్నీ పాక్‌లో జరగాల్సి ఉంది. అయితే 8 జట్లు పాల్గొనే ట్రోఫీ ముసాయిదా షెడ్యూల్‌ను పాక్ క్రికెట్ బోర్డు ఇప్పటికే ఐసీసీకి సమర్పించింది. దీని ప్రకారం భారత జట్టు తమ మ్యాచ్‌లను లాహోర్‌లో ఆడాల్సి ఉంది. కానీ ఈ షెడ్యూల్‌కు బోర్డు ఆమోదం తెలపలేదని సమాచారం. ఎందుకంటే భద్రతా కారణాలరీత్యా పాక్‌లో అడుగుపెట్టకూడదన్న ఆలోచనలో బోర్డు ఉంది. అందుకే తమ మ్యాచ్‌లను దుబాయ్ లేదా శ్రీలంకలో ఆడించాలని ఐసీసీని గట్టిగా డిమాండ్ చేస్తోంది. 2008 నుంచి భారత జట్టు పాక్‌లో పర్యటించడం లేదు. 'చాంపియన్స్ ట్రోఫీ ఆడేందుకు టీమిండియా పాక్‌కు వెళ్లకపోవచ్చు. దీనిపై తుది నిర్ణయం కేంద్ర ప్రభుత్వం తీసుకోవాల్సి ఉంటుంది. ఆసియాకప్ మాదిరి హైబ్రిడ్ పద్ధతిన భారత్ మ్యాచ్‌లు దుబాయ్ లేక శ్రీలంకలో ఏర్పాటు చేసే అవకాశం ఉంది. ఐసీసీ కూడా ఇదే విషయంపై ఆలోచిస్తోంది' అని బీసీసీఐ అధికారి ఒకరు పేర్కొన్నారు. 2017లో చివరిసారి జరిగిన చాంపియన్స్ ట్రోఫీలో భారత్‌ను ఓడించిన పాక్ విజేతగా నిలిచింది.

ఆఖరి నిమిషంలో వాట్కిన్స్ వండర్ గోల్

'యూరో' ఫైనల్లో ఇంగ్లండ్
2-1తో నెదర్లాండ్స్‌పై గెలుపు



విజయ సారథులు వాట్కిన్స్ (జెర్సీ 19), హ్యారీ కేన్

డార్ట్‌మండ్: ఓలీ వాట్కిన్స్ ఆఖరి నిమిషం గోల్‌తో.. ఇంగ్లండ్ వరుసగా రెండోసారి యూరో ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్స్ ఫైనల్‌కు చేరుకొంది. బుధవారం రాత్రి జరిగిన రెండో సెమీస్‌లో ఇంగ్లండ్ 2-1తో నెదర్లాండ్స్‌ను ఓడించింది. ఆదివారం జరిగే టైటిల్ ఫైట్‌లో స్పెయిన్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. మ్యాచ్ ఆరంభమైన 7వ నిమిషంలోనే నెదర్లాండ్స్ గోల్ చేసి షాకిచ్చింది. 40 మీటర్ల దూరం నుంచి గవీ సైమన్ కొట్టిన కిక్.. బుల్లెట్‌లా గోల్‌లోకి దూసుకెళ్లింది. అయితే, 11 నిమిషాల తర్వాత పెనాల్టీ ఏరియాలో ఇంగ్లండ్ కెప్టెన్ హ్యారీ కేన్‌ను డెంజిల్ మొరటుగా అడ్డుకోవడంతో రెఫరీ పెనాల్టీ కిక్ ఇచ్చాడు. దీన్ని కేన్ గోల్‌గా మలచడంతో స్కోరు 1-1తో సమమైంది. అయితే, సెకండాఫ్‌లో ఇరుజట్లకూ చక్కని అవకాశాలు లభించినా వాటిని సద్వినియోగం చేసుకోలేక పోయాయి. మ్యాచ్ అదనపు సమయం దిశగా సాగుతున్న దశలో కేన్ బదులు సబ్‌స్టిట్యూట్‌గా వచ్చిన వాట్కిన్స్ 90వ నిమిషంలో కళ్లుచెదిరే గోల్‌తో ఇంగ్లండ్‌ను 2-1తో గెలిపించాడు. క్లిష్టమైన కోణం నుంచి అతడు కొట్టిన బంతి.. కీపర్‌ను బోల్తా కొట్టిస్తూ నేరుగా గోల్‌లో పడింది. కేన్ సేన విజయంపై ఇంగ్లండ్ రాజు కింగ్ చార్లెస్ అభినందనలు తెలిపారు. గత టోర్నీలో ఫైనల్లో ఇంగ్లండ్ ఓటమిపాలైంది.

జాతీయ పతాకాన్ని అగౌరపరిచాడట!

రోహిత్‌పై నెటిజన్ల ఆగ్రహం



న్యూఢిల్లీ: టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ జాతీయ పతాకాన్ని అవమానపరిచాడంటూ నెటిజన్లు ఆగ్రహం ప్రకటిస్తున్నారు. ఇంతకీ ఏమైందంటే.. వరల్డ్‌కప్ విజయానంతరం రోహిత్ బార్బడోస్ గ్రౌండ్‌లో నేలపై జాతీయ పతాకాన్ని నాటిన విషయం తెలిసిందే. ఆ ఫొటోను రోహిత్ తన 'ఎక్స్' ప్రొఫైల్ పిక్‌గా పెట్టుకున్నాడు. అయితే జెండా నేలను తాకడమంటే జాతీయ చిహ్నాల గౌరవ చట్టం-1971ను ఉల్లంఘించినట్టేనని నెటిజన్లు ఆరోపించారు. దీనికి రోహిత్ వివరణ ఇస్తూ 'కింగ్‌స్టన్ ఓవల్ మైదానంతో నాది ఉద్వేగభరితమైన అనుబంధం. ఆ పిచ్‌పై మేం విజయం సాధించాం. మా కలలను నిజం చేసిన ఆ ప్రదేశంపై గౌరవంతోనే అలా చేశా' అని చెప్పుకొచ్చాడు.

పౌలినీ x క్రెజికోవా

మహిళల సింగిల్స్ ఫైనల్

సెమీస్‌లో వెకిక్, రిబకినా పరాజయం ● వింబుల్డన్



పౌలినీ



క్రెజికోవా

లండన్: ప్రతిష్ఠాత్మక వింబుల్డన్ మహిళల సింగిల్స్ టైటిల్ కోసం ఏడో సీడ్ జాస్మిన్ పౌలినీ (ఇటలీ)-31వ సీడ్ బార్బరా క్రెజికోవా (చెక్ రిపబ్లిక్) తలపడతారు. గురువారం రాత్రి జరిగిన సెమీఫైనల్లో (2 గం.7 నిమిషాలు) 31వ సీడ్ క్రెజికోవా 3-6, 6-3, 6-4తో నాలుగో సీడ్, టైటిల్ ఫేవరెట్ ఎలెనా రిబకినా (కజకిస్థాన్)కు షాకిచ్చింది. అంతకుముందు హోరాహోరీగా జరిగిన మొదటి సెమీస్‌లో పౌలినీ 2-6, 6-4, 7-6 (8)తో అన్‌సీడెడ్ డొనా వెకిక్ (క్రొయేషియా)ను చిత్తు చేసింది. ఆల్ ఇంగ్లండ్ క్లబ్‌లో టైటిల్ ఫైట్‌కు చేరడం ద్వారా ఒకే ఏడాది వరుసగా రెండు గ్రాండ్‌స్లామ్‌ల ఫైనల్‌కు చేరిన క్రీడాకారిణిగా జాస్మిన్ ఘనత వహించింది. 2015, 16ల్లో సెరెనా విలియమ్స్ తర్వాత ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్‌లో టైటిల్ పోరుకు దూసుకెళ్లిన మొదటి ప్లేయర్‌గా పౌలినీ నిలిచింది. రెండు గంటలా 51 నిమిషాల పౌలినీ-వెకిక్ పోరు వింబుల్డన్‌లో సుదీర్ఘ సమయం సాగిన మహిళల సెమీఫైనల్‌గా రికార్డుల కెక్కింది. తొలి సెట్‌ను కోల్పోయిన పౌలినీ..రెండో సెట్‌లో 4-4తో పరాజయానికి రెండు గేముల దూరంలో ఉండి పుంజుకున్న తీరు అద్భుతం. ఇక మూడో సెట్‌లోనూ జాస్మిన్ 1-3, 4-3తో వెనుకంజలో ఉన్నా.. వెనక్కు తగ్గకుండా పోరాడడంతో సెట్ టైబ్రేకర్‌కు మళ్లింది. టైబ్రేకర్ కూడా హోరాహోరీగా సాగినా అంతిమంగా పౌలినీదే పైచేయి అయ్యింది. పౌలినీ 26 విన్నర్లే కొట్టగా..వెకిక్ 42 విన్నర్లతో విరుచుకుపడింది. అయితే పౌలినీ (32)తో పోల్చితే ఎక్కువగా అనవసర తప్పిదాలు (57) చేసిన వెకిక్ మూల్యం చెల్లించుకుంది.

నేడు పురుషుల సెమీఫైనల్స్

అల్కారజ్ x మెద్వెదెవ్ (సా. 6.10 నుంచి)

జొకోవిచ్ x ముసేటి (రా. 8 నుంచి)

స్టార్ స్పోర్ట్స్‌లో

టీసీఎస్.. భేష్

అంచనాలు మించిన కంపెనీ ఫలితాలు

- క్యూ1లో రూ.12,040 కోట్ల నికర లాభం
- రూ.62,613 కోట్లకు పెరిగిన ఆదాయం
- ఒక్కో షేరుకు రూ.10 మధ్యంతర డివిడెండ్
- 3 నెలల్లో 5,452 నికర నియామకాలు



ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికానికి (క్యూ1) టీసీఎస్ ఆర్థిక ఫలితాలు మార్కెట్ వర్గాల అంచనాలను మించాయి. క్యూ1లో కంపెనీ ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 8.7 శాతం వృద్ధితో రూ.12,040 కోట్లకు పెరిగింది. 2023-24లో ఇదే కాలానికి కంపెనీ లాభం రూ.11,074 కోట్లుగా నమోదైంది. ఈ జనవరి-మార్చి త్రైమాసికంలో నమోదైన రూ.12,434 కోట్ల లాభంతో పోలిస్తే మాత్రం 3.1 శాతం తగ్గింది. ఆదాయం విషయానికొస్తే, ఈ క్యూ1లో వార్షిక ప్రాతిపదికన 5.4 శాతం వృద్ధితో రూ.62,613 కోట్లకు చేరుకుంది. క్రితం ఆర్థిక సంవత్సరంలో ఇదే సమయానికి ఆదాయం రూ.59,381 కోట్లుగా నమోదైంది. కాగా, ఈ ఆర్థిక సంవత్సరానికిగాను టీసీఎస్ తన వాటాదారులకు ఒక్కో షేరుకు రూ.10 మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది. ఇందుకు అర్హులైన వాటాదారుల రికార్డు తేదీని ఈనెల 20గా ప్రకటించిన కంపెనీ.. ఆగస్టు 5న డివిడెండ్ చెల్లించనుంది. మరిన్ని ముఖ్యాంశాలు..

- ఈ ఏప్రిల్- జూన్ కాలానికి టీసీఎస్ నిర్వహణ మార్జిన్ వార్షిక ప్రాతిపదికన 1.5 శాతం పెరుగుదలతో 24.7 శాతంగా నమోదైంది. నికర మార్జిన్ 19.2 శాతంగా ఉంది.
- వరుసగా మూడు త్రైమాసికాలుగా తగ్గుతూ వచ్చిన టీసీఎస్ ఉద్యోగుల సంఖ్య.. ఈ జూన్ 30తో ముగిసిన క్వార్టర్‌లో మాత్రం 6,06,998కి పెరిగింది. గడిచిన మూడు నెలల్లో కంపెనీ నికరంగా 5,452 మందిని ఉద్యోగంలో చేర్చుకుంది. గత త్రైమాసికంలో కంపెనీ ఉద్యోగుల వలసల (అట్రిషన్) రేటు సైతం 12.1 శాతానికి తగ్గింది.
- గడిచిన మూడు నెలల్లో 11,000 మంది ట్రెయినీలను ఆహ్వానించినట్లు టీసీఎస్ హెచ్ఆర్ చీఫ్ మిలింద్ లక్కడ్ తెలిపారు. అందులో కొందర్ని గత ఆర్థిక సంవత్సరంలోనే కంపెనీలో చేర్చుకోవాల్సి ఉన్నప్పటికీ, అనుకోని పరిస్థితుల కారణంగా జాప్యమైందన్నారు.
- ఈ క్యూ1లో కంపెనీ దక్కించుకున్న ఆర్డర్ల విలువ మాత్రం 830 కోట్ల డాలర్లకు తగ్గింది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలంలో లభించిన 1,020 కోట్ల డాలర్ల ఆర్డర్లతో పోలిస్తే 18.6 శాతం తగ్గగా.. ఈ జనవరి-మార్చి క్వార్టర్‌లో లభించిన 1,320 కోట్ల డాలర్ల ఆర్డర్లతో పోలిస్తే 37 శాతం క్షీణించింది. కాగా, జనరేటివ్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) డీల్స్ రెట్టింపై 150 కోట్ల డాలర్ల స్థాయికి చేరుకున్నాయని కంపెనీ తెలిపింది. అయితే, అందులో చాలా వరకు ప్రాజెక్టులు రెండు త్రైమాసికాలకు మించని స్వల్పకాలిక ఆర్డర్లేనని సంస్థ పేర్కొంది.
- ప్రాంతాలవారీగా పరిశీలిస్తే, క్యూ1లో కంపెనీకి భారత మార్కెట్ నుంచి లభించిన ఆదాయంలో వృద్ధి వార్షిక ప్రాతిపదికన 61.8 శాతం పెరిగింది. ఎంఈఏ రెవెన్యూ 8.5 శాతం, యూకే 6 శాతం, యూరప్ 0.9 శాతం, లాటిన్ అమెరికా 6.3 శాతం పెరిగింది. ఐటీ రంగానికి కీలక మార్కెట్ అయిన ఉత్తర అమెరికా ఆదాయం మాత్రం 1.1 శాతం తగ్గింది.
- రంగాల వారీగా చూస్తే, లైఫ్ సైన్సెస్ అండ్ హెల్త్‌కేర్, మాన్యుఫాక్చరింగ్, ఎనర్జీ అండ్ రిసోర్సెస్ అండ్ యుటిలిటీస్ రంగాల ఆదాయాల్లో మాత్రమే వృద్ధి నమోదైంది. కంపెనీ మొత్తం రాబడిలో 40 శాతం వరకు వాటా కలిగిన బీఎఫ్ఎస్ఐతో పాటు మిగతా అన్నీ రంగాల ఆదాయం (వార్షిక ప్రాతిపదికన) క్షీణించింది.
- బీఎస్ఈలో టీసీఎస్ షేరు గురువారం 0.33 శాతం లాభంతో రూ.3,922.70 వద్ద ముగిసింది.

> కొత్త ఆర్థిక సంవత్సరాన్ని ఆల్ రౌండ్ వృద్ధితో ప్రారంభించామని తెలియజేసేందుకు సంతోషిస్తున్నాను. క్లయింట్లతో సంబంధాలను మరింత విస్తరించుకోవడంతో పాటు ఆధునిక సాంకేతికతల్లో కొత్త సామర్థ్యాల ఏర్పాటు, ఆవిష్కరణల్లో పెట్టుబడులను కొనసాగిస్తున్నాం. అయితే, వ్యాపార వృద్ధి స్థిరంగా కొనసాగుతుందని ఇప్పుడు చెప్పలేం. ఎందుకంటే, మార్చితో ముగిసిన త్రైమాసికంతో పోలిస్తే జూన్ త్రైమాసికంలో మార్కెట్ పరిస్థితుల్లో పెద్దగా మార్పేమీ లేదు. కాబట్టి, మార్కెట్ సెంటిమెంట్ గురించి కొత్తగా చెప్పడానికి ఏమీ లేదు. కాకపోతే, గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ప్రస్తుతం ఆర్థిక సంవత్సరం మెరుగ్గా ఉండనుందని భావిస్తున్నాం.
> **- కే కృతివాసన్, సీఈఓ, ఎండీ, టీసీఎస్**

వచ్చే ఏడాదిలో టీవీఎస్ సీఎన్‌జీ స్కూటర్!

న్యూఢిల్లీ: దేశీయ వాహన సంస్థ బజాజ్ ఆటో గత వారంలో సీఎన్‌జీతో నడిచే హైబ్రిడ్ మోటార్ సైకిల్‌ను మార్కెట్లోకి విడుదల చేసిన సంగతి తెలిసిందే. ప్రపంచంలో ఇదే తొలి సీఎన్‌జీ బైక్. కాగా, బజాజ్ ఆటో స్ఫూర్తితో మరో దేశీయ వాహన సంస్థ టీవీఎస్ ప్రపంచంలో తొలి సీఎన్‌జీ స్కూటర్‌ను మార్కెట్లోకి తెచ్చే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. టీవీఎస్ తన జూపిటర్ 125 స్కూటర్‌లో సీఎన్‌జీ వెర్షన్‌ను అభివృద్ధి చేసే పనిలో ఉందని, వచ్చే ఏడాదిలో విడుదల చేసే అవకాశాలున్నట్లు సమాచారం.

బిజినెస్

భారత రియల్టీ మొఘల్ డీఎల్ఎఫ్ రాజీవ్ సింగ్

ఈ ఏడాది మే నాటికి రూ.1.24 లక్షల కోట్ల సంపద

రెండు, మూడు స్థానాల్లో మంగళ్ సింగ్ లోధా, గౌతమ్ అదానీ, అపర్ణ ఎస్టేట్స్, ఎన్‌సీసీ ప్రమోటర్లకూ స్థానం.. గ్రోహే-హురున్ రియల్టీ లిస్ట్ వెల్లడి



ముంబై: దేశీయ స్థిరాస్తి (రియల్టీ) రంగం కుబేరులకు కనక వర్షం కురిపిస్తోంది. భారత్‌లో అత్యంత ధనవంతులైన ఔత్సాహిక స్థిరాస్తి పారిశ్రామికవేత్తల జాబితాలో డీఎల్ఎఫ్ చీఫ్ రాజీవ్ సింగ్ మొదటి స్థానంలో నిలిచారు. ఈ ఏడాది మే నెలాఖరు నాటికి రాజీవ్ సింగ్ సంపద విలువ రూ.1,24,420 కోట్లకు చేరింది. గురువారం విడుదలైన '2024 గ్రోహే-హురున్ ఇండియా రియల్ ఎస్టేట్ 100' జాబితాలో రాజీవ్ సింగ్ పేరు అగ్రస్థానంలో ఉంది. ఆ తర్వాతి స్థానంలో రూ.91,700 కోట్లతో మాక్రోటెక్ డెవలపర్స్ కంపెనీ వ్యవస్థాపకుడు మంగళ్ ప్రభాత్ లోధా, ఆయన కుటుంబం ఉంది. కాగా విలువ పరంగా అత్యంత విజయవంతమైన రియల్ ఎస్టేట్ కంపెనీల జాబితాలో డీఎల్ఎఫ్ రూ.2 లక్షల కోట్లతో అత్యంత విలువైన కంపెనీగా అగ్రస్థానంలో ఉందని నివేదిక వెల్లడించింది. రూ.1,36,730 కోట్లతో మాక్రోటెక్ రెండో స్థానంలో, ఇండియన్ హోటల్స్ కంపెనీ రూ.79,150 కోట్లతో మూడో స్థానంలో ఉంది.

గౌతమ్ అదానీకీ చోటు

ముకేశ్ అంబానీ తర్వాత దేశంలో రెండో అతిపెద్ద సంపన్నుడైన ప్రముఖ పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీకి రియల్టీ రంగమూ కలిసి వస్తోంది. రూ.56,500 కోట్ల రియల్టీ ఆస్తులతో గౌతమ్ అదానీ ఈ జాబితాలో మూడో స్థానం సంపాదించారు. గత ఏడాది కాలంలోనే గౌతమ్ అదానీ స్థిరాస్తుల విలువ ఏకంగా 62 శాతం పెరగడం విశేషం. రూ.44,820 కోట్ల రియల్టీ ఆస్తులతో ఒబెరాయ్ రియల్టీ అధినేత వికాస్ ఒబెరాయ్ నాలుగో స్థానంలో నిలిచారు. రహేజా గ్రూప్‌నకు చెందిన చంద్రు రహేజా అండ్ ఫ్యామిలీ రూ.43,710 కోట్లతో ఐదో స్థానంలో రూ.26.370 కోట్ల రియల్టీ ఆస్తులతో ది ఫీనిక్స్ మిల్స్ అధినేత అతుల్ రుయా జాబితాలో ఆరో స్థానంలో నిలిచారు.

ఆసియాలో మనదే పెద్ద మార్కెట్

చైనా రియల్టీ మార్కెట్లో కొనసాగుతున్న సంక్షోభం మన దేశానికి బాగానే కలిసొచ్చింది. దీంతో 100 కోట్ల డాలర్లు, అంతకంటే ఎక్కువ విలువ ఉన్న ఆసియా రియల్టీ కంపెనీలు మన దేశంలో 36కు చేరాయి. చైనా కంటే ఇది ఆరు కంపెనీలు ఎక్కువని గ్రోహే-హురున్ వెల్లడించింది. సంక్షోభానికి ముందు చైనాలో ఇలాంటి రియల్టీ కంపెనీలు 100 వరకు ఉండేవి. సంక్షోభం పుణ్యమాని ఇప్పుడవి 30కి పడిపోయినట్టు తెలిపింది.

రెండు తెలుగు కంపెనీలకూ చోటు

'2024 గ్రోహే-హురున్ ఇండియా రియల్ ఎస్టేట్ 100' జాబితాలో రెండు తెలుగు కంపెనీలకూ స్థానం లభించింది. రూ.33,130 కోట్ల రియల్ ఎస్టేట్ ఆస్తులతో అపర్ణ ఎస్టేట్స్ అండ్ కన్‌స్ట్రక్షన్ అధినేత సుబ్రమణ్యం రెడ్డి 11వ స్థానంలో, రూ.18,040 కోట్ల రియల్టీ ఆస్తులతో ఎన్‌సీసీ లిమిటెడ్ అధినేత ఏవీ రంగరాజు 20వ స్థానంలో నిలిచారు. గత ఏడాది కాలంలో అపర్ణ ఎస్టేట్స్ రియల్టీ ఆస్తుల విలువ 24 శాతం, ఎన్‌సీసీ రియల్టీ ఆస్తుల విలువ 141 శాతం పెరిగినట్టు నివేదిక తెలిపింది. మరోవైపు ఎన్‌సీసీ 20,615 మంది ఉద్యోగులతో టాప్ 100 జాబితాలో రెండో స్థానంలో ఉంది. ఇక ఈ సంవత్సరం జాబితాలో ఇద్దరు మహిళలకు స్థానం లభించింది. అందులో హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే తాజ్ జీవీకే అధినేత్రి ఇందిరా కృష్ణారెడ్డి ఒకరు. ఈ ఏడాది మే నాటికి ఆమె రియల్టీ ఆస్తుల విలువ రూ.2,050 కోట్లని హురున్ నివేదిక తెలిపింది. కాగా బెంగళూరు కేంద్రంగా ఉన్న బ్రిగేడ్ ఎంటర్‌ప్రైజెస్‌కి చెందిన పవిత్ర శంకర్ ఆస్తుల విలువ రూ.29,690 కోట్లుగా ఉంది.

హైదరాబాద్ నుంచి 6 కంపెనీలు

గ్రోహే-హురున్ జాబితాలో హైదరాబాద్ నుంచి 6 కంపెనీలకు చోటు లభించింది. ఈ కంపెనీల మొత్తం విలువ రూ.68,290 కోట్లుగా ఉంది. కాగా ముంబై నుంచి అత్యధికంగా 33 కంపెనీలు ఉండగా వాటి విలువ రూ.6,40,560 కోట్లుగా ఉంది. ఆ తర్వాతి స్థానంలో బెంగళూరు నుంచి 15 కంపెనీలు (రూ.2,13,720 కోట్లు), న్యూఢిల్లీ నుంచి 14 (రూ.87,460 కోట్లు), గురుగ్రామ్ నుంచి 10 (రూ.2,49,320 కోట్లు) కంపెనీలు ఈ జాబితాలో చోటు దక్కించుకున్నాయి.

బ్యాంక్ గ్యారెంటీ నుంచి మినహాయించండి

'డాట్'కు వొడాఫోన్ ఐడియా వేడుకోలు

న్యూఢిల్లీ: వొడాఫోన్ ఐడియా ఆర్థిక కష్టాలు ఇప్పట్లో తీరేలా లేవు. స్పెక్ట్రమ్ పాత బకాయిలు చెల్లించేందుకూ కంపెనీ ఆపసోపాలు పడుతోంది. వచ్చే ఏడాది సెప్టెంబరులో ఇందుకోసం చెల్లించాల్సిన రూ.24,747 కోట్ల మొత్తానికీ బ్యాంకు గ్యారెంటీ నుంచి మినహాయింపు ఇవ్వాలని టెలికాం శాఖ (డాట్)ను కోరింది. స్పెక్ట్రమ్ వేలం నిబంధనల ప్రకారం చెల్లించాల్సిన బకాయిలకు ఏడాది ముందే టెలికాం కంపెనీలు బ్యాంకు గ్యారెంటీలు సమర్పించాలి. ఈ బకాయిల విషయంలో ప్రభుత్వం ఇప్పటికే వొడాఫోన్ ఐడియాకు నాలుగేళ్ల విరామం ఇచ్చింది. అయినా కంపెనీ ఆర్థిక పరిస్థితి ఇంకా మెరుగుపడలేదు. దీంతో వచ్చే ఏడాది చెల్లించాల్సిన బకాయిలకూ బ్యాంకు హామీ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతోంది.


ఇంధన రంగంలో రూ.8.4 లక్షల కోట్ల పెట్టుబడి అవకాశాలు

న్యూఢిల్లీ: దేశంలో చమురు, సహజ వాయువుల అన్వేషణ పెంచాలని చమురు శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురి పిలుపు ఇచ్చారు. చమురుపై దిగుమతి ఆధారనీయత తగ్గించుకుని, సరసమైన ధరల్లో ఇంధనాన్ని అందరికీ అందుబాటులోకి తెచ్చేందుకు ఈ చర్య అవసరమన్నారు. ఇంధన, పెట్రోలియం రంగాలు 2030 నాటికి 10 వేల కోట్ల డాలర్ల (రూ.8.4 లక్షల కోట్లు) పెట్టుబడి అవకాశాలు అందుబాటులోకి తెస్తాయని పురి సూచించారు.

స్వల్ప నష్టాల్లో మార్కెట్

ముంబై: కార్పొరేట్ కంపెనీల తొలి త్రైమాసిక ఆర్థిక ఫలితాలు, ఇన్వెస్టర్ల లాభాల స్వీకారం నేపథ్యంలో గురువారం ఈక్విటీ మార్కెట్లలో నిస్తేజం నెలకొంది. వరుసగా రెండో రోజు కూడా ఈక్విటీ సూచీలు స్వల్పంగా నష్టపోయాయి. సెన్సెక్స్ 27.43 పాయింట్ల నష్టంతో 79,897.34 వద్ద ముగియగా నిఫ్టీ 8.50 పాయింట్ల నష్టంతో 24,315.95 వద్ద ముగిసింది. మార్కెట్‌ను పరుగులు పెట్టించే ఉత్సాహకరమైన వార్తలేవీ లేకపోవడంతో పాటు అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాలపై అందరి దృష్టి కేంద్రీకృతం కావడమే మార్కెట్లో నెలకొన్న స్తబ్ధతకు కారణమని విశ్లేషకులంటున్నారు. సెన్సెక్స్ షేర్లలో బజాజ్ ఫైనాన్స్ గరిష్ఠంగా 1.48 శాతం నష్టపోగా మహీంద్రా అండ్ మహీంద్రా, ఎన్‌టీపీసీ, నెస్లే కూడా ఒక శాతానికి పైబడి నష్టపోయాయి. సాధారణ మార్కెట్ ధోరణికి భిన్నంగా బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ 0.57 శాతం, మిడ్‌క్యాప్ సూచీ 0.34 శాతం లాభపడ్డాయి.

యాంబీ లాబ్స్ లిస్టింగ్ శుభారంభం: ఎన్ఎస్ఈ ఎస్ఎంఈ ఎక్స్ఛేంజీలో గురువారం లిస్టయిన యాంబీ లాబ్స్ షేరు 30 శాతం లాభంతో రూ.89.25 వద్ద ఎగువ సర్క్యూట్ పరిమితి కన్నా పైన ముగిసింది. ఆరంభంలో ఈ షేరు ఇష్యూ ధర రూ.68పై 25% ప్రీమియంతో రూ.85 వద్ద లిస్టయింది. తొలి రోజు ట్రేడింగ్ ముగిసే సమయానికి కంపెనీ మార్కెట్ విలువ రూ.222.65 కోట్ల వద్ద స్థిరపడింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	73,420 ▲	67,300 ▲	1.00.000 ▲
ముంబై	72,563 ▼	66,468 ▼	92,204 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



12వ తేదీ			
హైదరాబాద్	530	విజయవాడ	555
వరంగల్	532	గోదావరి	555
చిత్తూరు	573	విశాఖపట్నం	575
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	105	విజయవాడ	113
వరంగల్	105	గుంటూరు	113
కరీంనగర్	105	ఒంగోలు	113
మహబూబ్‌నగర్	105	చిత్తూరు	115
కర్నూలు	105	నెల్లూరు	115
విశాఖపట్నం	105	అనంతపురం	113
గోదావరి	113		

ఆత్మహత్యల్లో భారత్ టాప్



న్యూఢిల్లీ, జూలై 11: ఇటీవల ముంబైలో తండ్రీ కొడుకుల ఆత్మహత్య సంఘటన అందరినీ దిగ్భ్రాంతికి గురిచేసింది. భారత్‌లో యువకులతోపాటు వృద్ధులు కూడా ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య ఆత్మహత్య అని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అవును.. ఇది నిజం అనేలా ప్రపంచంలోనే అత్యధిక ఆత్మహత్యలు జరిగిన దేశంగా భారత్ నిలవడం మరింత ఆందోళన కలిగిస్తోంది. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) ఏప్రిల్‌లో విడుదల చేసిన నివేదిక ప్రకారం 2022లో ప్రపంచంలోనే అత్యధికంగా భారత్‌లో 1.71 లక్షల మంది ఆత్మహత్య చేసుకున్నారు. దేశంలో ఆత్మహత్యల రేటు ప్రతి లక్షకు 12.4 మందికి పెరిగిందని ఈ నివేదిక స్పష్టం చేసింది. ఇలాంటి పరిస్థితులకు దారితీస్తున్న అంశాలేమిటి అనే చర్చ ఇప్పుడు దేశవ్యాప్తంగా మొదలైంది. అయితే.. మానసిక ఒత్తిడే దీనికి ప్రధాన కారణమని ఆరోగ్య రంగ నిపుణులు చెబుతున్నారు. కొంతమందిలో జన్యుపరమైన కారణాలు, కొన్నిరకాల ఒత్తిళ్ల వల్ల ప్రేరేపితమవుతున్న మానసిక అనారోగ్యంగా దీన్ని అభివర్ణిస్తున్నారు. 'ఆత్మహత్యకు అత్యంత సాధారణ కారణం డిప్రెషన్. దీన్నే మేం ఒత్తిడి అని పిలుస్తాం. వెంటాడుతున్న సమస్యల వల్ల ఒత్తిడికి గురికావొచ్చు. ఒక్కోసారి హఠాత్తుగా క్షణికావేశంలోనూ ఆత్మహత్య నిర్ణయాలు తీసుకోవచ్చు. ఎక్కువ శాతం కేసుల్లో ఒత్తిడే ప్రధాన కారణంగా ఉంటుంది' అని ఢిల్లీలోని సర్ గంగారామ్ ఆస్పత్రిలో మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ రాజీవ్ మెహతా చెప్పారు. సాధారణంగా ఈ ఒత్తిళ్లకు పని, ఆర్థిక పరమైన, మానవ సంబంధాలు, ఆరోగ్య పరమైన సమస్యలు ప్రధాన కారణమని ఆయన చెప్పారు. ఒత్తిడి తీవ్రమైనప్పుడు అది డిప్రెషన్‌గామారి ఆత్మహత్యకు దారితీస్తుందని పేర్కొన్నారు. ఆత్మహత్య చేసుకున్న వారిలో 50-90% మంది నిరాశ, ఆందోళన, బైపోలార్ డిజార్డర్ వంటి మానసిక అనారోగ్యంతో బాధపడినవారేనని అధ్యయనాలు సూచిస్తున్నాయి.

ఆత్మహత్యలు సామాజిక సమస్య: సుప్రీం కోర్టు

భారత్‌లో ఆత్మహత్యలు పెరగడాన్ని సుప్రీం కోర్టు సామాజిక సమస్యగా అభివర్ణించింది. ఆత్మహత్యలను నివారించడానికి ప్రజారోగ్య కార్యక్రమాన్ని సమర్థంగా అమలు చేయాలని కోరుతూ దాఖలైన పిల్‌పై అత్యున్నత ధర్మాసనం గురువారం స్పందించింది. ఈ అంశంపై నాలుగు వారాల్లోగా పూర్తి వివరాలతో వివరణ ఇవ్వాలని కోరుతూ కేంద్రాన్ని ఆదేశించింది. పెరుగుతున్న ఆత్మహత్యలను ఎదుర్కోవడానికి పటిష్ట చర్యలు అవసరమని న్యాయవాది, పిటిషనర్ గౌరవ్ కుమార్ బన్సాల్ చేసిన వాదనలను పరిగణనలోకి తీసుకున్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్‌తో కూడిన ధర్మాసనం దీనిపై పూర్తి వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్రాన్ని ఆదేశించింది.

లోకం తీరు



విశాఖ ఉక్కును ప్రైవేటీకరించం

» ప్లాంట్‌ను పరిరక్షించడం మా బాధ్యత: కుమారస్వామి



స్టీల్‌ప్లాంట్ అధికారులతో సమావేశమైన కేంద్ర మంత్రి కుమారస్వామి

విశాఖపట్నం, జూలై 11(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేటీకరణ చేయబోమని కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి ప్రకటించారు. ఉక్కు సహాయ మంత్రి శ్రీనివాసవర్మ, ఎంపీ ఎం. శ్రీభరత్, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, విష్ణుకుమార్‌రాజుతో కలసి ఆయన గురువారం ఉదయం స్టీల్‌ప్లాంట్‌ను సందర్శించారు. సీఎండీ అతుల్ భట్, ఇతర అధికారులు వారికి వివిధ విభాగాల పనితీరు వివరించారు. అనంతరం సమావేశ మందిరంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రస్తుతం ప్లాంట్ పరిస్థితి, ఆర్థిక వ్యవహారాల గురించి తెలిపారు. అనంతరం బయటకు వచ్చిన మంత్రి.. విజిటర్స్ బుక్‌లో తన అభిప్రాయాన్ని రాశారు. 'విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను సందర్శించిన తరువాత ఈ దేశ ఆర్థిక అభివృద్ధికి ఈ ప్లాంట్ ఎంతో ఉపయోగపడుతుందని అర్థమైంది. అనేక కుటుంబాలు దీనిపై ఆధారపడి ఉన్నాయి. ఈ ప్లాంట్‌ను పరిరక్షించడం మా బాధ్యత. ఇది మూతపడుతుందని ఎవ్వరూ ఆందోళన చెందవద్దు. ప్రధానమంత్రి ఆశీస్సులు, సహాయంతో ప్లాంట్‌ను 100 శాతం సామర్థ్యంతో పనిచేయిస్తాం' అని రాశారు. అనంతరం బయటకు వచ్చి విలేకరులతో మాట్లాడారు. ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపుతారా? అని ఓ విలేకరి ప్రశ్నించగా, ప్రైవేటీకరణ చేస్తారని ఎవరు చెప్పారంటూ మంత్రి ఎదురు ప్రశ్నించారు. అలాంటి అపోహలు, భయాలు ఏమీ పెట్టుకోవద్దని చెప్పారు. రెండు నెలలు సమయమిస్తే ప్రధానికి ఇక్కడి పరిస్థితిని వివరించి, ప్లాంట్ పూర్తిస్థాయిలో పనిచేసేలా చర్యలు చేపడతామని వివరించారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కార్మిక సంఘాలు, ఉద్యోగ సంఘాలు, తాము పలు అంశాలపై కేంద్ర మంత్రికి వివరాలు అందించామని చెప్పారు. విశాఖ ఉక్కుకు ప్రస్తుతం బ్యాంకర్లు రుణాలు ఇవ్వడం లేదని, అందుకని భూములను ప్లాంట్ పేరు మీదకు మార్చాలని సూచించామని తెలిపారు.

ఏపీ మనోభావాలను నిలబెట్టారు: లోకేశ్

అమరావతి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్ ఫ్యాక్టరీని కాపాడినందుకు, ఏపీ మనోభావాలను నిలబెట్టినందుకు కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి కుమారస్వామికి మంత్రి నారా లోకేశ్ ధన్యవాదాలు తెలిపారు. ప్రైవేటీకరణ అనేది చర్చనీయాంశం కాదంటూ కేంద్రమంత్రి చేసిన ప్రకటన ప్రజలకు ఎనలేని సంతోషాన్ని కలిగించిందని గురువారం 'ఎక్స్'లో పేర్కొన్నారు. కేంద్రమంత్రి ప్రకటన కచ్చితంగా నిజాయితీ లేని నీలి మీడియాను నిరాశపర్చి ఉంటుంది. ఏపీ వ్యతిరేక, నకిలీ కథనాలతో రాష్ట్రంలో అశాంతిని సృష్టించే వారి ప్రయత్నాలను విఫలం చేసింది. ఎవరు ఎక్కువ ఫేక్, మోసగాడు అనే రేసులో వైఎస్ జగన్, నీలి మీడియా ఒకరినొకరు అధిగమించడానికి ప్రయత్నిస్తున్నట్లుగా ఉంది' అని పేర్కొన్నారు.

తిరుపతి ఆర్డీవోపై విచారణ

» బాధితుడికి బెదిరింపుల ఘటనపై సర్కారు ఆదేశం

తిరుపతి(కలెక్టరేట్), జూలై 11: అవినీతి ఆరోపణల్లో కూరుకుపోయిన తిరుపతి ఆర్డీవో నిశాంత్‌రెడ్డి వ్యవహారంపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. విచారణాధికారిగా తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్‌ను నియమించింది. గురువారం 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో 'బాధితుడికే బెదిరింపులు...తిరుపతి ఆర్డీవో నిర్వాకం' శీర్షికన కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. ఉమ్మడి చిత్తూరు జిల్లా పుత్తూరు సమీపంలో హెచ్‌పీసీఎల్ పెట్రోలు బంక్ ఏర్పాటుకు అవసరమైన అనుమతుల కోసం తనను ఆర్డీవో ఇబ్బంది పెడుతున్నట్లు సీసీఎల్ అధికారులకు యజమాని గతంలో ఫిర్యాదు చేశారు. దీంతో తిరుపతి జేసీగా ఉన్న శుభం బన్సల్‌తో విచారణ చేయించారు. అయితే బాధితుడినే బెదరగొట్టడంతో ఆయన స్టేట్‌మెంట్ ఇచ్చేందుకు వెనక్కి తగ్గారు. ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం వచ్చాక నిశాంత్‌రెడ్డిపై విచారణ మళ్లీ మొదలైంది. ఫిర్యాదు చేసిన బాధితుడిని ఒప్పించి దాన్ని వెనక్కి తీసుకునే ప్రయత్నాలు మళ్లీ చేశారు. దీంతో బాధితుడు మరోసారి సీసీఎల్‌ఏ సాయిప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. ఆర్డీవో నిశాంత్‌రెడ్డి, ఆయనకు సహకరించిన మరో ఇద్దరిపై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని కలెక్టర్ వెంకటేశ్వర్‌ను సీసీఎల్‌ఏ సాయిప్రసాద్ ఆదేశించారు. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లో విచారణకు హాజరు కావాలంటూ ఆర్డీవో నిశాంత్‌రెడ్డికి, ఆయనకు సహకరించిన అప్పట్లో కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేసిన సురేష్‌బాబుకు, మరో తహసీల్దారు పరమేశ్వరస్వామికి కలెక్టర్ వెంకటేశ్వర్ నోటీసులు జారీచేశారు.

మాజీ అగ్నివీరులకు 10% రిజర్వేషను

న్యూఢిల్లీ, జూలై 11: కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నిర్ణయానికి అనుగుణంగా మాజీ అగ్నివీరులకు తమ బలగాల్లో 10 శాతం కానిస్టేబుళ్ల పోస్టులను రిజర్వు చేయనున్నట్లు సీఐఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ నీనా సింగ్, బీఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ నితిన్ అగర్వాల్ గురువారం వెల్లడించారు. "మాజీ అగ్నివీరుల నియామకానికి సంబంధించి కేంద్ర హోం మంత్రిత్వ శాఖ తీసుకున్న కీలక నిర్ణయానికి అనుగుణంగా వారి నియామక ప్రక్రియను సీఐఎస్ఎఫ్ కూడా సిద్ధం చేస్తోంది" అని సింగ్ పేర్కొన్నారు.

యూజీసీ-నెట్ ప్రశ్నపత్రం లీక్ కాలేదు

లీకేజీకి ఆధారంగా చూపిస్తున్న స్క్రీన్‌షాట్‌పై తేదీ మార్చి.. టెలిగ్రామ్ చాన్‌లో వైరల్ చేశారు

సీబీఐ దర్యాప్తులో వెల్లడి త్వరలోనే చార్జిషీట్

న్యూఢిల్లీ, జూలై 11: 'యూజీసీ-నెట్ ప్రశ్నపత్రం లీక్‌కు సంబంధించి సీబీఐ దర్యాప్తులో సంచలన అంశాలు వెల్లడయ్యాయి! ఆ ప్రశ్నపత్రం అసలు లీక్ కాలేదని.. టెలిగ్రామ్ చానళ్లలో వైరల్ అయిన ప్రశ్నపత్రం స్క్రీన్‌షాట్‌పై తేదీని ఓ యాప్ సాయంతో మార్చారని సీబీఐ దర్యాప్తులో తేలింది. దీని వెనుక ఒక పాఠశాల విద్యార్థి ఉన్నాడని.. ఒక యాప్ సాయంతో ఆ విద్యార్థి తయారుచేసిన స్క్రీన్‌షాట్లను ఒక వ్యక్తి సర్క్యులేట్ చేశాడని వెల్లడైంది. ఈ విషయాన్ని కేంద్రం దృష్టికి అనధికారికంగా తీసుకెళ్లిన సీబీఐ.. ఆ వ్యక్తిపై చార్జిషీట్ దాఖలు చేసేందుకు, చీటింగ్ కేసు పెట్టేందుకు సిద్ధమైనట్లు సమాచారం. వర్సిటీలు, కళాశాలల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల నియామకాలకు అర్హత సాధించడానికి, పీహెచ్‌డీల్లో ప్రవేశాలకు, జూనియర్ రిసెర్చ్ ఫెలోషిప్‌కు అర్హత సాధించడానికి ఏటా నిర్వహించే యూజీసీ-నెట్‌ను కేంద్రం ఈ ఏడాది జూన్ 18న నిర్వహించిన సంగతి తెలిసిందే. దేశవ్యాప్తంగా 317 నగరాల్లో 1205 పరీక్షా కేంద్రాల్లో 11 లక్షల మంది అభ్యర్థులు ఈ పరీక్ష రాశారు. ఆరోజు ఈ పరీక్షను రెండు సెషన్లలో (ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 దాకా ఒక సెషన్. మధ్యాహ్నం 3 గంటల నుంచి 6 గంటల దాకా రెండో సెషన్) నిర్వహించారు. అయితే.. ఆ రోజు మధ్యాహ్నం 2 గంటల సమయంలో యూజీసీ ప్రశ్నపత్రం స్క్రీన్‌షాట్ పేరిట ఒక ఫొటో ఓ టెలిగ్రామ్ చానల్‌లో ప్రత్యక్షమైంది. జూన్ 17 తేదీతో ఉన్న ఆ స్క్రీన్‌షాట్ వైరల్ కావడంతో యూజీసీ-నెట్ పరీక్షను రద్దు చేస్తున్నట్టు జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ ప్రకటించింది. దీనిపై దర్యాప్తు చేసిన సీబీఐ.. ఆ స్క్రీన్‌షాట్ ఓ పాఠశాల విద్యార్థి తయారుచేసిందని, దీని వెనుక పెద్ద స్థాయి కుట్ర ఏదీ లేదని గుర్తించింది.



నీట్ పేపర్ లీకేజీ కేసులో కీలక నిందితుడు రాకీ అరెస్టు!

» పట్నాలో అదుపులోకి తీసుకున్న సీబీఐ

నీట్-యూజీ పేపర్ లీక్ కేసులో ప్రధాన నిందితుల్లో ఒకడైన రాకేశ్ రంజన్ అలియాస్ రాకీ అనే వ్యక్తిని సీబీఐ పట్నాలో అరెస్ట్ చేసింది. బిహార్‌లోని నలందకు చెందిన రాకీ.. పేపర్ లీకేజీ దందా సూత్రధారి అయిన సంజీవ్‌ముఖియాకి బంధువు. నీట్ పేపర్ లీక్ అయిన విషయం బయటపడినప్పటి నుంచీ రాకీ పరారీలో ఉన్నాడు. గురువారం ఉదయం సీబీఐ అధికారులు అతణ్ని పట్నా శివార్లలో అదుపులోకి తీసుకున్నారు. వెంటనే అతణ్ని పట్నాలోని ప్రత్యేక కోర్టులో హాజరుపరిచి 10రోజుల కస్టడీకి తీసుకున్నారు. గురువారం అతడు ఇచ్చిన సమాచారం ఆధారంగా పట్నాలోని మూడు చోట్ల, కోల్‌కతాలో ఒకచోట సోదాలు నిర్వహించారు. ఇప్పటిదాకా సీబీఐ ఈ కేసులో బిహార్, ఝార్ఖండ్‌కు రాష్ట్రాలకు చెందిన 8 మందిని అరెస్ట్ చేసింది. రాకీ అరెస్టుతో ఆ సంఖ్య తొమ్మిదికి చేరింది. కాగా, నీట్ అక్రమాలపై ఆరు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి, ముమ్మరంగా దర్యాప్తుచేస్తున్న సీబీఐ పట్నాలో రెండు చోట్ల, కోల్‌కతాలోని మరో రెండు చోట్ల సోదాలు నిర్వహించినట్టు తెలుస్తోంది. మొత్తం ఈ పేపర్ లీక్‌కు కేంద్రం హజారీబాఘ్ (ఝార్ఖండ్)లోని ఒయాసిస్ స్కూలేనని అంచనాకు వచ్చినట్టు సీబీఐ వర్గాలు చెబుతున్నాయి. అక్కడ లీకయిన పేపర్ బిహార్‌కు చేరిందని సీబీఐ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. మే 5వ తేదీన నిర్వహించిన నీట్ పరీక్షకు సంబంధించి మొత్తం 9 సెట్ల పేపర్లు స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖకు మే 3న చేరాయని.. అక్కడి నుంచి రెండు సెట్ల పేపర్లను నీట్ పరీక్షా కేంద్రమైన ఒయాసిస్ స్కూల్‌కు పంపించారని.. కానీ, అప్పటికే ఆ రెండు సెట్ల పేపర్ల సీళ్లు తొలగించి ఉన్నాయని సీబీఐ వర్గాల సమాచారం. మరోవైపు.. నీట్ అక్రమాలపై దాఖలైన పిటిషన్లపై గురువారం విచారణ జరపాల్సిన సుప్రీంకోర్టు.. కేంద్ర ప్రభుత్వం, జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ బుధవారం దాఖలు చేసిన అఫిడవిట్లు ఇంకా కొంత మంది పిటిషనర్లకు అందనందున విచారణను జూలై 18కి వాయిదా వేస్తున్నట్టు తెలిపింది. సీబీఐ నుంచి దర్యాప్తునకు సంబంధించి నివేదిక తమకు అందిందని వెల్లడించింది. కాగా.. నీట్-యూజీ కౌన్సెలింగ్ ప్రక్రియ జూలై మూడోవారం నుంచి మొదలై నాలుగు రౌండ్లలో జరుగుతుందని కేంద్రం తాజాగా దాఖలు చేసిన అఫిడవిట్‌లో పేర్కొంది. ఇక.. నీట్ వ్యవహారంపై కొనసాగుతున్న అనిశ్చితి నేపథ్యంలో ఈ పరీక్ష రాసిన పలువురు అభ్యర్థులు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్‌ను గురువారం ఆయన నివాసంలో కలిశారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో ఆలస్యం జరిగితే.. దాని ప్రభావం అకడమిక్ క్యాలెండర్‌పై పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

మణిపూర్ సమస్యపై పార్లమెంట్‌లో గళమెత్తుతాం

» సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం
» కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ
» మణిపూర్‌పై ప్రధాని ఎప్పుడు మాట్లాడతారు ? : ప్రియాంక గాంధీ

న్యూఢిల్లీ, జూలై 11: మణిపూర్‌లో శాంతి స్థాపన అంశంపై పార్లమెంట్ సమావేశాల్లో బలంగా మాట్లాడతామని కాంగ్రెస్, ఇండియా కూటమి తరఫున లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి మణిపూర్‌లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ప్రకటించారు. అలాగే, మణిపూర్‌లో పర్యటించి శాంతి స్థాపనకు కృషి చేయాలని ప్రధాని మోదీని డిమాండ్ చేశారు. మణిపూర్‌లో సోమవారం పర్యటించిన రాహుల్ గాంధీ అక్కడి పలు పునరావాస శిబిరాలను సందర్శించి ప్రజలతో స్వయంగా మాట్లాడారు. ఇందు కు సంబంధించిన వీడియోను గురువారం ఎక్స్(ట్విటర్)లో పోస్ట్ చేసిన ఆయన.. ఇప్పటికీ ఆ రాష్ట్రం రెండు ముక్కలుగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మణిపూర్‌లో హింస చెలరేగినప్పటి నుంచి ఇప్పటిదాకా మూడు సార్లు ఆ రాష్ట్రంలో పర్యటించానని.. పరిస్థితుల్లో ఎలాంటి మార్పు లేదని పేర్కొన్నారు. మణిపూర్‌లో హింస కొనసాగుతోందని, అమాయక ప్రజలు ప్రాణాపాయంలో ఉన్నారని, వేలాది కుటుంబాలు పునరావాస శిబిరాల్లో తలదాచుకుంటున్నాయని వివరించారు. ఈ పర్యటనలో మూడు జిల్లాల్లోని వేర్వేరు పునరావాస శిబిరాలను సందర్శించిన రాహుల్ గాంధీ.. మైతేయులు, కుకీలతో మాట్లాడారు. రాహుల్ గాంధీ చేసిన పోస్ట్‌కు స్పందించిన కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ ప్రియాంక గాంధీ.. మణిపూర్ సమస్యపై ప్రధాని మోదీ ఎప్పుడు మాట్లాడతారని ప్రశ్నించారు. మణిపూర్‌లో శాంతి స్థాపనకు ప్రభుత్వం ఎందుకు ప్రయత్నించడం లేదని నిలదీశారు.


కేంద్రం, రాష్ట్రాల మధ్య వారధిగా ఈ ఆఫీస్!

వేగంగా అనుమతులకు మార్గం

న్యూఢిల్లీ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఒక రాష్ట్రం నుంచి ఏదైనా ఫైలు కేంద్రానికి వచ్చిందంటే ఆ పని ఎప్పుడు పూర్తవుతుందో తెలియదు! ఆ ఫైలు ఎక్కడుందో? ఏ శాఖలో ఉందో? అంతుచిక్కదు. ఆయా రాష్ట్రాల అధికారులు ఢిల్లీ చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిందే. దీనికి 'ఈ-ఆఫీస్' తో చెక్ పెట్టాలని భావిస్తోంది కేంద్రం. మోదీ 3.0 ప్రభుత్వం వంద రోజుల ఎజెండాలోని ప్రధానమైన వాటిలో ఈ-ఆఫీస్ కూడా ఒకటి. తొలుత కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల్లో అమలుకు కార్యాచరణ సిద్ధం చేసింది. అందులో భాగంగా ఎంపికచేసిన 133 కార్యాలయాల్లో వంద రోజుల్లో ఈ-ఆఫీస్ అమలు చేయాలని ఆదేశించింది. మార్గదర్శకాలు జారీ చేసి, తరచూ అధికారులతో సమీక్షలు నిర్వహిస్తోంది. ఈ-ఆఫీస్ ద్వారా రాష్ట్రాలతో సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లాలని, ఆయా రాష్ట్రాల పథకాలు, అభివృద్ధి పనులకు అనుమతుల మంజూరును వేగవంతం చేయాలని భావిస్తోంది. ఒక రాష్ట్రం నుంచి ఏదైనా ఫైలు కేంద్రానికి చేరితే అది ఏ కార్యాలయంలో.. ఏ విభాగంలో.. ఎన్ని రోజుల నుంచి ఉంది? పెండింగ్‌లో ఏమైనా ఉందా?.. వంటి మొత్తం సమాచారాన్ని ఈ-ఆఫీస్ ద్వారా కంప్యూటర్ ముందు కూర్చుని తెలుసుకోవచ్చు. ఆ ఫైలు ఎన్ని రోజుల్లో క్లియర్ అవుతుందో స్పష్టత వస్తుంది. అయితే కొన్ని రాష్ట్రాలు కేంద్రం నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నాయి. ఈ-ఆఫీస్ ద్వారా రాష్ట్రాల సమాచారాన్ని కేంద్రం పర్యవేక్షిస్తుందనే భయం నెలకొంది. అది సమాఖ్య స్ఫూర్తికి విఘాతం కలిగిస్తుందని భావిస్తున్నాయి. కేంద్రం మాత్రం కేవలం కేంద్ర, రాష్ట్రాలు సమన్వయంతో అమలు చే సే పథకాలకు మాత్రమే ఈ-ఆఫీస్ అమలు చేస్తామని చెబుతుంది.

పాఠ్యాంశాలు మార్చేశారు!

» ప్రభుత్వ బడులకు ఒకలా.. ప్రైవేటు బడులకు మరోలా
» టెన్త్ తెలుగు పాఠ్యపుస్తకంలో పొరపాట్లు
» మొత్తం 24 పొరపాట్లు.. మూడు పాఠాలు మార్పు
» ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి నిర్వాకం



ప్రభుత్వ పుస్తకంలో ఉన్న తప్పెటగుళ్ల పాఠం
ప్రైవేట్ పుస్తకంలో ఉన్న కొమ్ము వాద్యం పాఠం

అమరావతి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): వైసీపీ కార్యకర్తలా పనిచేసిన రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి(ఎస్‌సీఈఆర్‌టీ) డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి నిర్వాకంతో విద్యార్థులు నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. ఈ ఏడాది పదో తరగతి పాఠ్యపుస్తకాన్ని ఇష్టానుసారంగా మార్చేసిన విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. పాఠశాల విద్యాశాఖ ఏటా రెండు రకాల పుస్తకాలను ముద్రిస్తుంది. ఒకటి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇచ్చేందుకు ఉచిత పుస్తకాలు, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులు కొనుగోలు చేసుకునే విక్రయ పుస్తకాలను తయారుచేస్తుంది. అయితే ఉచిత పుస్తకాలు, విక్రయ పుస్తకాల్లో కేవలం ఉచితం, అమ్మకం అనే పదాలు తప్ప ఇంకేవీ మారకూడదు. ఏ మేనేజ్‌మెంట్‌లో చదివినా విద్యార్థికి ఒకేరకంగా పరీక్షల ప్రశ్నావళి ఉంటుంది. అందువల్ల ఒక్క అక్షరం కూడా మార్చకుండా పుస్తకాలు ముద్రించి ఇస్తారు. కానీ ఈ ఏడాది పదో తరగతిలో తెలుగు పుస్తకాన్ని గందరగోళం చేశారు. ఉచిత పుస్తకాలకు, విక్రయ పుస్తకాలకు మధ్య 24 చోట్ల మార్పులు చేశారు. పైన పద్యం ఒక్కటే ఉన్నప్పటికీ దాని కింద అడిగే ప్రశ్నల శైలి రెండు పుస్తకాల్లో వేర్వేరుగా ఉంది. అదీ కాకుండా, ఏకంగా మూడు పాఠ్యాంశాలనే మార్చేశారు. అంటే ఉచిత పుస్తకంలో ఉన్న పాఠాలకు, విక్రయ పుస్తకంలో ఉన్న పాఠాలకు సంబంధం లేదు. దీంతో ఈ ఏడాది ఆ పాఠాల నుంచి వచ్చే ప్రశ్నలకు విద్యార్థులు సమాధానాలు ఎలా రాయాలనేది ప్రశ్నార్థకంగా మారింది. ఉదాహరణకు విక్రయ పుస్తకంలో 149వ పేజీలో శ్రీవారి బ్రహ్మోత్సవాలకు సంబంధించిన పాఠం ఉంటే, ఉచిత పుస్తకంలో శ్రీకాకుళం జిల్లాలోని శాలిహుండం, శాలివాటికపై పాఠం ఉంది. 126వ పేజీలో విక్రయ పుస్తకంలో కొమ్ము వాద్యం గురించి ఉంటే, తప్పెటగుళ్ల గురించి పాఠం ఇచ్చారు. 91వ పేజీలో పరనారీ సోదరుడై అనే పద్యం రెండింటిలో ఉన్నా ప్రశ్నలు రెండు పుస్తకాల్లో వేర్వేరుగా ఉన్నాయి. 72వ పేజీలో ప్రకృతి, వికృతిలను గుర్తించి రాయండి అనే చోట విక్రయ పుస్తకంలో సంక్రాంతి వేడుకల గురించి, ఉచిత పుస్తకంలో 'రాజు శాసనలు చేస్తారు. రాయలు శాసనాలకు తిరుగులేదు' అని ఉంది. ఇలా 70, 91, 94, 95, 127, 142, 145, 149 పేజీల్లోనూ అనేక మార్పులు ఉన్నాయి. ప్రశ్నలు అటూ ఇటూగా మారినా ఫరవాలేదని, కానీ పాఠాలే మారిపోతే ఎలా గని ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు.

ముద్రణకు ఇచ్చాక మార్పులు

తొలుత ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల కోసం ఒక కాపీని ముద్రణకు పంపారు. ఆ తర్వాత విక్రయ పుస్తకాల కాపీలో మార్పులు చేయడం వల్ల ఈ పొరపాట్లు వచ్చాయి. ఏటా ఒకసారి పుస్తకం సాఫ్ట్ కాపీ తయారుచేశాక మార్పులు చేయరు. కానీ ఈ ఏడాది ఎస్‌సీఈఆర్‌టీ చేసిన అత్యుత్సాహం వల్ల విద్యార్థులు ఇబ్బంది పడే పరిస్థితి వచ్చింది. వైసీపీ ప్రభుత్వంలో అంతా తానే అన్నట్టుగా వ్యవహరించిన ప్రతాప్‌రెడ్డి నిర్వాకంతోనే ఈ నష్టం జరిగింది. ఆయన సతీమణి వైసీపీ ఎమ్మెల్సీగా ఉన్నారు. మన వ్యక్తి అనే భావనతో గత ప్రభుత్వం ఆయనకు పెద్దపీట వేసింది. ఒకరకంగా పాఠశాల విద్యాశాఖపై పెత్తనం చేసే స్థాయిలో ఆయన వ్యవహరించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో పశ్చిమ రాయలసీమ వైసీపీ అనుకూల అభ్యర్థిని గెలిపించడంలో ఆయనదే కీలక పాత్ర. అందుకే ఆ ఎన్నికల సమయంలో ఆయన్ను కడప ఆర్జేడీగా నియమించి వైసీపీ లబ్ధిపొందింది.

కౌంటింగ్ తర్వాతా కుమ్మేడు

(మొదటి పేజీ తరువాయి)

అంతకుముందు వెంకటరెడ్డి ప్రభుత్వానికి లేఖ రాశారు. ఆ లేఖ న్యాయశాఖ పరిశీలనలో ఉంది. వారు ఆ లేఖలోని అంశాలపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తంచేయడంతో పాటు రిమార్క్స్ అడిగారు. ఇది అయ్యే పనికాదని భావించిన వెంకటరెడ్డి వాటితో సంబంధం లేకుండానే సొంతంగా నిర్ణయాలు తీసుకున్నారు. ఎన్నికల్లో జగన్ పార్టీ ఓడినా ముందడుగు వేశారు. కూటమి ప్రభుత్వం కొలువు తీరడంతో వెంకటరెడ్డితో ఆడించిన జగన్నాటకం బట్టబయలైంది. 100 కోట్ల రూపాయల పైనే చేతులు మారినట్లు గనులశాఖలో ప్రచారం జరుగుతోంది. ఇందులో తాడేపల్లి వాటా ఎంత? వెంకటరెడ్డికి, గనుల శాఖ డీడీలకు ఎంత చేరింది? సీఐడీతో విచారణ చేయిస్తే చీకటి సంతకాల బాగోతం బయటకొస్తుంది.


కమిషన్ల కోసం కక్కుర్తి

రాష్ట్రంలో గనుల లీజు తవ్వకాలకు కొత్తగా అనుమతులు కోరుతూ, పాత లీజులకు రెన్యువల్ (కొనసాగింపు) ఇవ్వాలని గనుల శాఖకు ఫిబ్రవరి నాటికే 420కి పైగా దరఖాస్తులు వచ్చాయి. వాటిపై నిబంధనల ప్రకారం గనుల శాఖ వెంటనే నిర్ణయాలు తీసుకోవచ్చు. అప్పటికి ఇంకా రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి రాలేదు. మరికొద్ది రోజుల్లో ఎన్నికల కోడ్ రానుందనగా తెరచాటుగా తీసుకునే కమిషన్‌ను పెంచి నిర్ణయాలు తీసుకోవాలన్నది తాడేపల్లి పెద్దల ఆలోచన. దీంతో ఎన్నికల కోడ్ వచ్చే నాటికి కూడా వాటికి ఎల్‌ఓఐలు ఇవ్వలేదు. మార్చి 16న నోటిఫికేషన్ వచ్చింది. దీంతో ఇక అనుమతులు రావేమోనని లీజుదారులు ఆందోళనకు గురయ్యారు. ఎవరు ఎక్కువ ఇస్తే వారికే ఎల్‌ఓఐలు ఇప్పిస్తామని ఐదుగురు కీలక అధికారులు మంత్రాంగం మొదలుపెట్టారు. కాకినాడ, ఒంగోలు, విశాఖ, చిత్తూరు జిల్లాల్లోని కీలక అధికారులతో పాటు గనుల శాఖ డైరెక్టరేట్‌లోని మరో అధికారి పాత్ర ఇందులో ఉంది. వీరితో పాటు నాటి మంత్రి పెద్దిరెడ్డి పేషీలో పనిచేసిన అధికారి, అనధికారికంగా వ్యవహరించిన శశి అనే వ్యక్తి తెర చాటు డీలింగ్స్ చేసినట్లు తెలిసింది. అప్పటికే కొన్ని లీజులకు ఎల్‌ఓఐలు ఇచ్చారు. కానీ, ఈ 170 లీజులు వందలు, వేల కోట్లలో వ్యాపారం జరిగేవి. ఎవరు ఎక్కువ ఇస్తే వారికే ఎల్‌ఓఐ వస్తుందని కాకినాడకు చెందిన గనుల శాఖ అధికారి ఒకరు లీజుదారులతో మాట్లాడారు. ఒక్కో లీజుకు ప్రాథమిక ధర 75 లక్షలుగా నిర్ణయించినట్లు తెలిసింది. కొన్ని పెద్ద క్వారీలకు అంటే ప్రకాశం, కాకినాడ జిల్లాలకు చెందిన వాటికి రెండు కోట్లపైనే ధరను ఫిక్స్ చేసినట్లు తెలిసింది. మార్చి 16 తర్వాత ఎల్‌ఓఐల జారీకి ఎన్నికల కమిషన్ అనుమతి కోరుతూ గనుల శాఖ డైరెక్టరేట్ నుంచి ఫైలు న్యాయ శాఖ పరిశీలనకు పంపించారు. న్యాయ శాఖ ఆ ఫైలుపై అనేక కొర్రీలు వేసింది. ఒక దశలో ఒంగోలుకు చెందిన గనుల శాఖ అధికారితో న్యాయ శాఖలోని ఓ అధికారిని సెటిల్ చేయించే ప్రయత్నం చేయగా అది తీవ్రంగా బెడిసికొట్టింది. దీంతో ఎల్‌ఓఐల ఫైలును న్యాయశాఖ ఆమోదించదని ఆశలు వదులుకున్నారు.

ఎన్నికల ఫలితాలు జూన్ 4న వచ్చాయి. ఆ మరుసటి రోజే గనుల శాఖ డైరెక్టరేట్‌లో వెంకటరెడ్డి నేతృత్వాన సమావేశం జరిగినట్లు తెలిసింది. ఎనిమిది జిల్లాల డీడీలు, ఏడీలు, మరికొందరు అధికారులు ఆ భేటీలో పాల్గొన్నారు. కాకినాడ, ఒంగోలు, చిత్తూరుకు చెందిన ముగ్గురు గనుల శాఖ కీలక అధికారులు ముందుగానే నిర్ణయించిన సొమ్మును లీజుదారుల నుంచి వసూలు చేసినట్లు తెలిసింది. ఇలా 100 కోట్ల పైనే ఆగమేఘాల మీద వసూలు చేసినట్లు తెలిసింది. ఆ తర్వాతే ఆ భేటీకి ముహూర్తం నిర్ణయించినట్లు తెలిసింది. తాడేపల్లి నుంచి వచ్చిన ఒత్తిళ్లతో గత నెల ఐదో తేదీన 170 లీజులకు ఎల్‌ఓఐలు ఇచ్చేశారు. అయితే, వాటిని మార్చి నెలలో ఇచ్చినట్లుగా పాత తేదీల (బ్యాక్ డేట్స్)తో ఉత్తర్వులు ఇచ్చారు. ఆ ఉత్తర్వులను నేరుగా గనుల శాఖ డీడీలకు అందించినట్లు తెలిసింది. సమావేశానికి రాని డీడీలకు వాట్సాప్ ద్వారా ఉత్తర్వులు పంపించినట్లు తెలిసింది.

బాలిక హత్య కేసులో నిందితుడి ఆత్మహత్య

» ఆమె ఇంటి సమీపంలోని కొబ్బరి తోటలో మృతదేహం



రాంబిల్లి, జూలై 11: అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం కొప్పుగొండుపాలెంలో సంచలనం రేపిన తొమ్మిదో తరగతి విద్యార్థిని హత్య ఘటనలో బోడాబత్తుల సురేష్ (26) ఆత్మహత్య చేసుకున్నాడు. అతడి మృతదేహాన్ని గురువారం ఉదయం ఏడు గంటల సమయంలో మృతురాలి ఇంటి సమీపంలోని కొబ్బరి తోటలో గుర్తించారు. పురుగుమందు తాగి నిందితుడు ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులు నిర్ధారించారు. క్లూస్ టీమ్ మృతదేహం పక్కన పురుగుమందు బాటిల్, సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకుంది. పరవాడ డీఎస్పీ కె.వి.సత్యనారాయణ సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతుడి తండ్రి, సోదరుడిని పిలిపించి సూసైడ్ లేఖను వారికి చూపించారు. ఈ విషయంలో సందేహాలు ఉంటే చెప్పాలని కోరారు. మృతుడి తండ్రి, సోదరుడు కూడా ఆత్మహత్యగా నిర్ధారించడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం అనకాపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సూసైడ్ లేఖలో ఉన్న విషయాలను మీడియాకు డీఎస్పీ వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా అతడి కోసం 14 పోలీస్ బృందాలు గాలింపు చేపట్టాయని, అయితే బాలికను హత్య చేసిన రోజు రాత్రే లేదా మరుసటిరోజు నిందితుడు ఆత్మహత్య చేసుకుని ఉంటాడని చెప్పారు. చనిపోయి నాలుగైదు రోజులవుతుందని భావిస్తున్నామన్నారు. కేసు పెట్టి జైలుకు పంపించినందున కక్షతోనే బెయిల్‌పై వచ్చిన సురేష్ పథకం ప్రకారం బాలికను హత్య చేసి, తాను కూడా ఆత్మహత్య చేసుకున్నట్టు సూసైడ్‌నోట్‌లో ఉన్నట్టు తెలుస్తోందన్నారు. అంతకుముందు సురేష్ మృతదేహాన్ని ఆసుపత్రికి తరలిస్తుండగా బాలిక తల్లి అడ్డుకుంది. తమకు న్యాయం జరిగేంత వరకు వాహనాన్ని కదలనివ్వబోమని భీష్మించింది. అయితే ఆమెకు డీఎస్పీ నచ్చజెప్పి మృతదేహాన్ని అనకాపల్లికి తరలించారు.



తిరుమల ఆలయం ముందు బండి సంజయ్

గతంలో టీటీడీ వీరప్పన్ వారసుల చేతిలో ఉండేది

▸ కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్

తిరుమల, జూలై 11(ఆంధ్రజ్యోతి): టీటీడీ గతంలో వీరప్పన్ వారసుల చేతిలో ఉండేదని, ఇకపై ఎర్రచందనం దొంగలను వదిలే ప్రసక్తి లేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ హెచ్చరించారు. కుటుంబ సభ్యులతో కలిసి గురువారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. శ్రీవారి దర్శనం కోసం వచ్చిన తనకు చాలామంది సిబ్బంది, భక్తులు గత పాలకుల నిర్వాకం గురించి వివరించారన్నారు. అక్రమ దందాలు చేసి శ్రీవారి ఆస్తిని, జాతీయ సంపదను కొల్లగొట్టే ప్రయత్నం చేశారన్నారు. వాళ్లంతా వీరప్పన్ వారసులన్నారు. స్వామి జోలికి వెళితే ఇవాళ ఏమైందని ప్రశ్నించారు. ఈ విషయాన్ని కేంద్రమంత్రి అమిత్‌షా దృష్టికి తీసుకువెళ్లి చర్యలు తీసుకుంటామని సంజయ్ చెప్పారు. మొన్నటివరకు దేవుడిని నమ్మనివాళ్లు, ధర్మం గురించి ఆలోచించని వాళ్లు, పేరుకు నామాలు పెట్టుకుని స్వామికి, స్వామి ఆస్తులకు పంగనామాలు పెట్టే నయవంచకులు పోయి నిత్యం శ్రీవారి నామస్మరణతో సేవ చేసే సేవకుల రాజ్యం వచ్చిందని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. గతంలో రాజకీయ నిరుద్యోగులకు టీటీడీని పునరావాస కేంద్రంగా మార్చారన్నారు. అరాచక, నయవంచక పాలన పీడ విరగడైందని, గోవిందా అంటూ సేవ చేసే సేవకుల పాలన వచ్చిందని తెలిపారు.

ఆర్జీయూకేటీ చాన్సలర్ కేసీ రెడ్డి రిలీవ్

అమరావతి, జూలై 11(ఆంధ్రజ్యోతి): రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ నాలెడ్జ్ టెక్నాలజీస్ చాన్సలర్ కేసీ రెడ్డి బాధ్యతల నుంచి రిలీవ్ అయ్యారు. 2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఆయన చాన్సలర్‌గా నియమితులయ్యారు. ఆయన పదవీ కాలం శుక్రవారంతో ముగుస్తోంది. ప్రభుత్వం మారిన నేపథ్యంలో బాధ్యతల నుంచి తప్పించాలని ఇటీవల ఆయన లేఖ రాశారు. దీంతో ఆయన్ను బాధ్యతల నుంచి రిలీవ్ చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీచేసింది.

యూ ట్యూబర్ ప్రణీత్‌కు 14 రోజుల రిమాండ్

హైదరాబాద్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): తండ్రీ, కుమార్తె బంధంపై సోషల్ మీడియాలో అసభ్య, అశ్లీల సంభాషణ చేసిన యూ ట్యూబర్ ప్రణీత్ హనుమంతుకు హైదరాబాద్ నాంపల్లి కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. కోర్టు ఆదేశాల మేరకు దర్యాప్తు అధికారులు ప్రణీత్‌ను చంచల్‌గూడ జైలుకు తరలించారు. బెంగళూరులో హనుమంతును అదుపులోకి తీసుకున్న పోలీసులు గురువారం నాంపల్లి కోర్టులో హాజరు పరిచారు. విచారణ అనంతరం న్యాయమూర్తి ప్రణీత్‌కు 14 రోజులు జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. కాగా, ఈ కేసులో ప్రణీత్ హనుమంతుతోపాటు నాగేశ్వర్ రావు, ఆదినారాయణ, యువరాజ్‌ను సైబర్ సెక్యూరిటీ బ్యూరో పోలీసులు నిందితులుగా చేర్చారు.

ఔటర్‌తోనే 'ఇన్నర్'!

▸ ఐఆర్ఆర్‌కు సిద్ధంగా ఉండాలని సర్కారు మౌఖిక ఆదేశాలు

▸ ప్రతిపాదిత అలైన్‌మెంట్, భూ అవసరాలపై సీఆర్‌డీఏ దృష్టి

(విజయవాడ-ఆంధ్రజ్యోతి)

అమరావతి రాజధానికి ఔటర్ రింగ్ రోడ్డుకు కేంద్రం పచ్చజెండా ఊపడంతో ఇక ఇన్నర్ రింగ్ రోడ్డుపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఐఆర్ఆర్‌కు కూడా సంసిద్ధంగా ఉండాలంటూ ప్రభుత్వం నుంచి సీఆర్‌డీఏకు మౌఖిక ఆదేశాలు వచ్చినట్టు తెలుస్తోంది. దీంతో ఈ విషయమై సంబంధిత శాఖల అధికారులతో కమిషనర్ భాస్కర్ సమీక్షలు జరుపుతున్నారు. అలాగే ఇన్నర్ రింగ్ రోడ్డుకు గతంలో ప్రతిపాదించిన నివేదికను అధ్యయనం చేస్తున్నారు. ప్రతిపాదిత అలైన్‌మెంట్, భూ అవసరాలపై ఆయన దృష్టి సారించినట్టు తెలుస్తోంది. భూ సమీకరణ, భూ సేకరణ సాధ్యాసాధ్యాలపై క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలిస్తున్నారు. వాస్తవానికి అమరావతికి సత్వరం ప్రారంభించాల్సిన ప్రాజెక్టు ఇన్నర్ రింగు రోడ్డే. భవిష్యత్తు అవసరాలకు ఓఆర్ఆర్ ఉపయోగపడుతుంది. రాజధాని నిర్మాణ పనుల సందర్భంలో సీడ్ యాక్సెస్ రోడ్డుతో పాటు ఐఆర్ఆర్ ఎంతో అవసరం. రాష్ట్ర ప్రభుత్వం ముందుగా ఐఆర్ఆర్ ప్రాజెక్టునే కేంద్రానికి ప్రతిపాదించే అవకాశం



ప్రతిపాదిత ఐఆర్ఆర్

ఉందని భావించారు. అనూహ్యంగా ఔటర్ రింగ్ రోడ్డుకు సంబంధించి ప్రతిపాదన చేయగా దానికి వెంటనే సుముఖత తెలిపింది. త్వరలో ప్రవేశపెట్టనున్న కేంద్ర బడ్జెట్‌లో ఓఆర్ఆర్‌కు నిధులు కేటాయించనున్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో ఐఆర్ఆర్‌ను కూడా కేంద్రానికి ప్రతిపాదిస్తారా లేక రాష్ట్ర ప్రభుత్వమే నిర్మిస్తుందా అనేదానిపై స్పష్టత లేదు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల రీత్యా ఈ ప్రాజెక్టును కూడా కేంద్రానికి ప్రతిపాదించే అవకాశాలు లేకపోలేదని సీఆర్‌డీఏ వర్గాలు పేర్కొంటున్నాయి. విజయవాడ, అమరావతి నగరాల భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇన్నర్ రింగ్ రోడ్డు ప్రతిపాదన తీసుకొచ్చారు. ఈ క్రమంలో అప్పట్లో ముసాయిదా ప్రణాళిక కూడా రూపొందించింది. ఐఆర్ఆర్‌ను 96.16 కిలోమీటర్ల పొడవున నిర్మిస్తారు. ఎన్టీఆర్ జిల్లా కేతనకొండ వద్ద ఎన్‌హెచ్-65 నుంచి ప్రారంభమై చినకాకాని వద్ద ఎన్‌హెచ్-16తో, పోరంకి గ్రామంలో ఎన్‌హెచ్-65తో అనుసంధానమవుతుంది. రెండోవైపున నిడమానూరు వద్ద ఎన్‌హెచ్-16 నుంచి కొండపల్లి దగ్గర ఎన్‌హెచ్-30 తో అనుసంధానిస్తారు. మొదటిదశలో 68.08 కిలోమీటర్లు, రెండోదశలో 28.08 కిలోమీటర్ల పొడవునా నిర్మించాలన్నది నాటి ప్రణాళిక. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ఈ ఐఆర్ఆర్ 41 గ్రామాల మీదుగా సాగుతుంది. భవిష్యత్తులో బీఆర్‌టీఎస్ వంటి వ్యవస్థలను అమలు చేయటానికి వీలుగా నిర్దేశించారు. ట్రక్కులు, బస్సులు నిలిపే ప్రాంతాలు, విశ్రాంతి గదులు, ఉద్యానవనాలు, జంక్షన్లు ఏర్పాటు చేయాలని భావించారు. ఐఆర్ఆర్‌కు సంబంధించి ఉమ్మడి గుంటూరు జిల్లాలో అమరావతి, దుగ్గిరాల, మంగళగిరి, తాడికొండ, తుళ్ళూరు మండలాల పరిధిలో 2,366.35 ఎకరాలు, ఉమ్మడి కృష్ణాజిల్లాలో జీ కొండూరు, గన్నవరం, ఇబ్రహీంపట్నం, పెనమలూరు, విజయవాడ రూరల్ మండలాల పరిధిలో 3,521.76 ఎకరాల మేర భూములు అవసరమని నిర్ణయించారు.

లా సిలబస్‌లో మనుస్మృతి.. విమర్శలతో వెనక్కి!

▸ ప్రతిపాదనను తిరస్కరించామని ఢిల్లీ వర్సిటీ వీసీ వివరణ

న్యూఢిల్లీ, జూలై 11: లా డిగ్రీ సిలబస్‌లో మనుస్మృతిని ప్రవేశపెట్టటానికి రంగం సిద్ధం చేసిన ఢిల్లీ విశ్వవిద్యాలయం (డీయూ) సర్వత్రా విమర్శలు రావడంతో వెనక్కు తగ్గింది. సవరించిన సిలబస్‌లో మనుస్మృతిని చేర్చాలనే ప్రతిపాదనను తిరస్కరించినట్లు గురువారం డీయూ వైస్ చాన్సలర్ యోగేశ్ సింగ్ పేర్కొన్నారు. వాస్తవానికి సవరించిన సిలబస్ పత్రంలో మనుస్మృతిని చేర్చాలనే ప్రతిపాదనపై డీయూ ఎకడమిక్ కౌన్సిల్ నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించింది. కౌన్సిల్ ఆమోదిస్తే.. రానున్న విద్యాసంవత్సరం నుంచి డిగ్రీ స్థాయి లా సిలబస్‌లో మనుస్మృతి కూడా ఒక భాగమయ్యేదే. పైగా.. విద్యార్థులు భారతీయ సంప్రదాయాలను నేర్చుకోవాలన్న నూతన విద్యావిధానం-2020 మార్గదర్శకాల ప్రకారమే సిలబస్‌లో అనుబంధ అంశంగా మనుస్మృతిని చేర్చాలని నిర్ణయించినట్లు డీయూ లా విభాగం డీన్ ప్రొఫెసర్ అంజువాలి టిక్కూ పేర్కొన్నారు. కాగా, డీయూకి చెందిన అధ్యాపక సంఘం 'సోషల్ డెమోక్రటిక్ టీచర్స్ ఫ్రంట్' దీనిని తీవ్రంగా వ్యతిరేకించింది. దేశ జనాభాలో 85 శాతంగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీల పట్ల, జనాభాలో 50 శాతంగా ఉన్న మహిళల పట్ల తీవ్ర వివక్ష చూపి, వారి ప్రాథమిక హక్కులను నిరాకరించే మనుస్మృతిని సిలబస్‌లో ఎలా ప్రవేశపెడతారని ప్రశ్నిస్తూ డీయూ వీసీకి లేఖ రాసింది. ఫలితంగా ఆ 'ప్రతిపాదనను తిరస్కరిస్తున్నట్లుగా' వీసీ నుంచి ప్రకటన విడుదలైంది.

నిరంకుశ ముప్పులో మన ప్రజాస్వామ్యం

▸ తీవ్ర ఒత్తిడిలో మీడియా

▸ భారత్‌లో పరిస్థితి అధ్వాన్నం

న్యూఢిల్లీ, జూలై 11: ప్రజాస్వామ్యం తీవ్ర నిరంకుశ ఒత్తిడికి గురి అవుతున్న దేశాల జాబితాలో భారత్ పరిస్థితి అధ్వాన్నంగా ఉన్నదని అమెరికాకు చెందిన ఓ సంస్థ హెచ్చరించింది. దాదాపు వెయ్యిమంది స్కాలర్స్‌ను నమూనాగా తీసుకుని 1 నుంచి 5 వరకు సూచీల (అథారిటేరియన్ థ్రెట్ ఇండెక్స్) ఆధారంగా యాంటీ అథారిటేరియనిజం గ్రూపు' అనే సంస్థ అమెరికా సహా ఆరు దేశాలకు రేటింగ్ ఇచ్చింది. ప్రతి వారాంతంలో వీరిపై జరిపిన అధ్యయాన్ని ఆధారంగా చేసుకుని తాజాగా సూచీలను నిర్ణయించింది. ఆరోగ్య ప్రజాస్వామ్యం కలిగిన దేశానికి రేటింగ్ వన్ ఇచ్చింది. ఈ సూచీల్లో భారత్‌కు 3.5 రేటింగ్ ఇచ్చారు. అత్యధికంగా నిరంకుశత ముప్పును భారత్ కలిగి ఉన్నదని పేర్కొంది. హక్కులు, ప్రజాస్వామ్యం విషయంలో అధ్వాన్న స్థితిలో ఉన్నదని వ్యాఖ్యానించింది. ఇక మిగతా దేశాల్లో అమెరికా 2.1, పోలాండ్ 2.3., జర్మనీ 1.5, కెనడా 1.5, ఇంగ్లాండ్ 1.8 రేటింగ్‌లో ఉన్నాయి. 2017 నుంచి తీస్తున్న సూచీల ఆధారంగా తాజాగా రేటింగ్‌ను ఇచ్చినట్టు ఈ సంస్థను ఉటంకిస్తూ ఫైనాన్షియల్ టైమ్స్ ఒక కథనం ప్రచురించింది.

బ్రిటన్ పార్లమెంటులో భగవద్గీత సాక్షిగా ప్రమాణం

లండన్, జూలై 11: బ్రిటన్ దిగువ సభ హౌస్ ఆఫ్ కామన్స్‌కు ఎన్నికైన పలువురు భారతీయ ఎంపీలు ప్రమాణ స్వీకారం సందర్భంగా తమ ప్రత్యేకత చాటుకున్నారు. ఇటీవలి ఎన్నికల్లో మొత్తం 29 మంది భారత సంతతి వారు యూకేలో పార్లమెంటుకు ఎన్నికయ్యారు. వీరిలో జన్మతః హిందువులైన మాజీ ప్రధాని రిషి సునాక్‌తో పాటు శివానీ రాజా, కనిష్క నారాయణ్‌లు భగవద్గీతపై ప్రమాణం చేశారు. శివానీ.. గుజరాత్ నుంచి వెళ్లి బ్రిటన్‌లో వ్యాపారవేత్తగా రాణిస్తున్నారు. గత వారం ఎన్నికల్లో ఈమె కన్జర్వేటివ్ పార్టీ నుంచి గెలిచారు. కనిష్క.. అధికార లేబర్ పార్టీ తరఫున తొలిసారిగా వేల్ ఆఫ్ గ్లామెర్గాన్ నుంచి నెగ్గారు. వేల్స్ నుంచి పార్లమెంటుకు ఎన్నికైన తొలి భారత సంతతి ఎంపీ ఈయన. సిక్కు ఎంపీలు తాన్ దేశీ, గురీంద్ సింగ్ జోసన్, హర్‌ప్రీత్ ఉప్పల్, సత్వీర్ కౌర్, వారిందర్ సింగ్ జస్‌లు తమ పవిత్ర గ్రంథం గురు గ్రంథ్ సాహిబ్ సాక్షిగా ప్రమాణం చేశారు.



విజయవాడ ఏపీఐఐసీ కాలనీ రైతుబజారులో కందిపప్పు, బియ్యం విక్రయాలను ప్రారంభిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

284 కేంద్రాల్లో రాయితీపై బియ్యం, కందిపప్పు విక్రయాలు

▸ విజయవాడలో ప్రారంభించిన మంత్రి నాదెండ్ల మనోహర్

అమరావతి(ఆంధ్రజ్యోతి), విజయవాడ, జూలై 11: బహిరంగ మార్కెట్లో బియ్యం, కందిపప్పు ధరలు భగ్గుమంటున్న తరుణంలో వాటిని సరసమైన ధరలకే వినియోగదారులకు అందించేందుకు కొత్త ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 284 ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసింది. పౌరసరఫరాలశాఖ ఆధ్వర్యంలో రైతుబజార్లు, పెద్దచైన్ రిటైల్ షాపులలో గురువారం వీటిని ప్రారంభించారు. వీటిలో దేశవాళీ కందిపప్పు కిలో రూ.160, స్టీమ్డ్ బీపీటీ బియ్యం కిలో రూ.49, సోనామసూరి బియ్యం కిలో రూ.48కే విక్రయిస్తున్నట్టు అధికారులు తెలిపారు. విజయవాడలోని ఏపీఐఐసీ కాలనీ రైతుబజారులో ఏర్పాటు చేసిన కౌంటర్‌ను మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రారంభించారు.

ప్రైవేటు వర్సిటీలకు ఫీజులు ఖరారు

అమరావతి, జూలై 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రైవేటు యూనివర్సిటీల్లో కన్వీనర్ కోటా సీట్లకు ప్రభుత్వం ఫీజులు ఖరారు చేసింది. 2024-25 నుంచి 2026-27 విద్యా సంవత్సరం వరకు ఈ ఫీజులు అమల్లో ఉంటాయని స్పష్టంచేసింది. ఈ మేరకు ఉన్నత విద్యాశాఖ గురువారం ఉత్తర్వులు జారీచేసింది. మొత్తం పది వర్సిటీలకు కొత్త ఫీజులు ఖరారయ్యాయి. వీటిలో తొమ్మిది వర్సిటీల్లో ఇంజనీరింగ్ కోర్సులున్నాయి. మోహన్‌బాబు యూనివర్సిటీ, వీఐటీకి రూ.1.03లక్షలు, ఎస్ఆర్ఎంకు 1.02 లక్షలు, అపోలో వర్సిటీకి రూ.99500, బెస్ట్ వర్సిటీకి రూ.69,500, గోదావరి గ్లోబల్ వర్సిటీ, అన్నమాచార్య, ఆదిత్య, సెంచూరియన్ వర్సిటీలకు రూ.60వేలుగా ఇంజనీరింగ్ ఫీజును నిర్ణయించింది. అలాగే, కేఆర్ఈఏ వర్సిటీలో ఎంబీఏ కోర్సుకు రూ.97,500 ఫీజు ఖరారు చేశారు. ఈ యూనివర్సిటీల్లో ఇతర కోర్సులకు కూడా ప్రభుత్వం ఫీజులు నిర్ణయించింది. అలాగే కొత్తగా ఒక ఇంజనీరింగ్ కాలేజీ, నాలుగు కొత్త క్యాంపస్‌లకు అనుమతులు మంజూరుచేస్తూ ఉన్నత విద్యాశాఖ మరో ఉత్తర్వు జారీచేసింది. చిత్తూరులో కొత్త కాలేజీ విజయం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి అనుమతులు మంజూరు చేసింది.

డిగ్రీ కాలేజీలకు 30ఏళ్ల లీజు

అద్దె భవనాల్లో ఉన్న ప్రైవేటు డిగ్రీ కాలేజీలు 30ఏళ్ల లీజుపై కొనసాగేందుకు అవకాశం కల్పిస్తూ ఉన్నత విద్యాశాఖ గురువారం ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుతం ఈ గడువు 5 ఏళ్లుగా ఉంది. కాలేజీలకు ఉపశమనం కలిగిస్తూ తీసుకున్న ఈ నిర్ణయంపై మంత్రి లోకేశ్‌కు డిగ్రీ కాలేజీల సంఘం అధ్యక్షుడు గుండారెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

2 మాధ్యమాలూ ఉండాలి: టీఎన్‌యూఎస్

అమరావతి, జూలై 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు, ఆంగ్లం రెండు మాధ్యమాలూ సమాంతరంగా కొనసాగించాలని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం(టీఎన్‌యూఎస్) ప్రభుత్వాన్ని కోరింది. గురువారం ప్రజాదర్బార్‌లో టీఎన్‌యూఎస్ నేతలు రజనీబాబు నాయుడు, మన్నం శ్రీనివాస్, శ్రీరామశెట్టి వెంకటేశ్వర్లు, చిరుగుపాటి పినాకపాణి ఈ మేరకు మంత్రి లోకేశ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. జీవో 117ను రద్దుచేసి, విద్యా వ్యవస్థను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ఉన్నత పాఠశాలల్లో రద్దుచేసిన గ్రేడ్-2 హెచ్ఎం, పీడీ పోస్టులను పునరుద్ధరించాలని కోరారు.

దుర్గమ్మకు ఇందిరా ఎన్‌క్లేవ్ మహిళల సారె సమర్పణ



వన్‌టౌన్, జూలై 11: ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ కరుణతో రాష్ట్రం సుభిక్షంగా ఉండటంతో పాటు పాడి పంటలు సమృద్ధిగా పండి, ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని కోరుతూ గురువారం ఇందిరా ఎన్‌క్లేవ్ మహిళలు వందమంది దుర్గమ్మకు సారె సమర్పించా రు. తొలుత అపార్ట్‌మెంట్ వాసులందరూ అక్కడే అమ్మవారికి పూజలు చేసి సారె తీసుకుని ఊరేగింపుగా బయలుదేరి దుర్గగుడికి చేరుకుని అమ్మవారికి సాదరంగా సారె సమర్పించారు. పసుమర్తి కామేశ్వరశర్మ, సాంబశివరాజు, మాచిరాజు శ్రీనివాస్, వసంత, శైలజ, అరుణ, లీలాకుమారి, పావని ఆధ్వర్యంలో సారె సమర్పణ నిర్వహించారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

● మంత్రి లోకేష్‌కు ఏఐటీయూసీ వినతి

పాయకాపురం, జూలై 11: భవన నిర్మాణ రంగంలోని కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ నేతలు మంత్రి నారా లోకేష్ ను కోరారు. ఉండవల్లిలోని ఆయన నివాసంలో మంత్రి లోకేష్‌ను ఏఐటీయూసీ నేతలు గురువారం కలిసి కార్మికుల సమస్యలు పరిష్కరించాల ని కోరుతూ వినతిపత్రం ఇచ్చారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బో ర్డు ఏర్పాటు, సంక్షేమ పథకాల అమలు జీవో నెం.17 ద్వారా నిధులు వే రే ప్రభుత్వ అవసరాలకు మళ్లింపు, నవరత్నాల పేరుతో సంక్షేమ బోర్డు పథకాలు జగన్మోహన్‌రెడ్డి నిలిపివేసి కార్మికుల పొట్ట కొట్టిన తీరును ఏఐటీయూసీ నేతలు లోకేషకు వివరించారు. గత వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించిన నిధులను రికవరీ చేసి బోర్డు అకౌంట్‌లో జమ చేయాలని కో రారు. సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తానని లోకేశ్ హామీ ఇచ్చినట్టు ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమణ తెలిపారు. ఎస్.వెంకట సుబ్బయ్య, పి.సత్యనారాయణ, సత్తిబాబు, షణ్ముఖరావు ఉన్నారు.

107, 108 జీవోలు రద్దు చేయండి

● మెడికోస్ పేరెంట్స్ అసోసియేషన్

గవర్నర్‌పేట, జూలై 11: ప్రభుత్వ వైద్య విద్యను వ్యాపారంలా మార్చేలా గత ప్రభుత్వం విడుదల జీవో 107, 108ని వెంటనే రద్దు చేసి వైద్యను కాపాడాలని మెడికోస్ పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. గురువారం ఎంజీ రోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఆలా వెం కటేశ్వర్లు మాట్లాడుతూ 2023లో అడ్మిషన్లు జరిగే ముందు ప్రభుత్వం ఈ జీవోలు తెచ్చి వైద్య విద్యార్థుల ఆశలపై నీళ్లు చల్లిందన్నారు. దీనివల్ల ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 50శాతం సీట్లు మాత్రమే ప్రతిభ ఆధారంగా కేటాయించబడతాయని, మిగిలిన 50శాతం మేనేజ్‌మెంట్ కోటాకు, ఎన్ఆర్ కోటాకు వెళ్లిపోయి పేదలకు అందుబాటులో లేకుండా పోతాయన్నా రు. ప్రభుత్వం ఆధ్వర్యంలో నడిచే వైద్య కళాశాలల్లో 50శాతం సీట్లకు డబ్బులు వసూలు చేసి కాలేజీలకు వాడకుండా ఇతరత్రా వాడటం దేశం లో ఎక్కడా లేదన్నారు. ఈ జీవోలను వ్యతిరేకిస్తూ, వైద్య విద్యార్థులు, వా రి తల్లిదండ్రులు గత ప్రభుత్వంపై ఉద్యమించారని, వారి ఉద్యమానికి టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు మద్దతుగా నిలిచారన్నారు. కమిటీ కార్యదర్శి డాక్టర్ చంద్రశేఖర్, న్యాయవాది ఠాగూర్ యాదవ్ పాల్గొన్నారు.

రేపు ఏపీ పీటీడీ బీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం

భవానీపురం, జూలై 11: నగరంలోని గవర్నర్‌పేట-డిపో గ్యారేజ్ సమీపంలోని స్వాతంత్ర సమరయోధుల సమావేశం మందిరంలో ఏపీ పీటీడీ (ఆర్టీసీ) బీసీ ఉద్యోగుల రాష్ట్రస్థాయి సమావేశం ఈ నెల 13న శ నివారం ఉదయం 9 గంటలకు జరుగుతుందని రాష్ట్ర అసోసియేషన్ అ ధ్యక్షుడు ఎస్పీ శేషగిరిరావు ఒక ప్రకటనలో తెలిపారు. అసోసియేషన్ రాష్ట్ర, రీజనల్, డిపో కమిటీ పునర్నిర్మాణం, భవిష్యత్ కార్యాచరణ వంటి అంశాలపై సమావేశం నిర్వహిస్తున్నామని అన్ని డిపోల్లోని ఆర్టీసీ బీసీ ఉద్యోగ నేతలు, సభ్యులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ చేయిస్తాం

● ఎంపీ కేశినేని శివనాథ్



అధికారులతో మాట్లాడుతున్న ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

భారతీనగర్, జూలై 11: నగరపాలక సంస్థలో 2019 నుంచి 2023 వరకు నిధుల దుర్వినియోగం జరిగిందని వాటిపై త్వరలో విచారణ జరిపిస్తామని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. తూర్పులోని 4వ డివిజన్‌లో గురువారం భారతీనగర్ 6వ రోడ్డు, శ్రీనగర్ కాలనీ మెయిన్ రోడ్లను రూ.30.48లక్షలతో సీసీ రోడ్లుగా ఏర్పాటు చేసేందుకు చేపట్టిన నిర్మాణపనులకు ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నోవాటెల్ హోటల్ సర్వీస్ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. త్వరగా పనులు పూర్తి చేయాలని అధికారులకు తెలిపారు. ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ నగరాభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామని, అవసరమైతే కేంద్రం నుంచి నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తామన్నారు. సిద్ధార్థ మెడికల్ కళాశాల నుంచి నిడమానూరు వరకు ఫ్లై ఓవర్ నిర్మాణ పనులకు త్వరలో టెండర్లు పిలుస్తామన్నారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని కార్పొరేషన్లు నిధుల కొరతతో ఇబ్బందులు పడుతున్నా వీఎంసీకి మాత్రం ఇబ్బంది లేదన్నారు. ఆ నిధులతో నగరంలోని రోడ్ల నిర్మాణం చేసుకుంటున్నామన్నారు. అవసరమైతే ఎంపీ సహకారంతో నిధులు తెచ్చి సమస్యను పరిష్కరిస్తామన్నారు. స్ట్రామ్ వాటర్ పథకంలో భాగంగా మిగిలిన నిధులను తెచ్చి డ్రైనేజీ పనులను పూర్తి చేస్తామన్నారు. ఇన్‌చార్జి కమిషనర్ మహేష్ మాట్లాడుతూ గతంలో ఈరోడ్డులో వర్షపునీరు నిల్వ ఉండేదని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారని అధికారులు తెలిపారన్నారు. ఈ రోడ్ల పునర్నిర్మాణ పనులు చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. కొమ్మారెడ్డి పట్టాభి, కార్పొరేటర్లు జాస్తి సాంబశివరావు, ముమ్మనేని ప్రసాద్, చెన్నుపాటి ఉషారాణి, చెన్నుపాటి గాంధీ, జోనల్ కమిషనర్ ఎస్.శివరామకృష్ణ, ఈఈ జి.సామ్రాజ్యం, ప్రాజెక్ట్ డైరెక్టర్ పార్వతీశం, ఏడీ శివరామ్ ప్రసాద్, ఏఈ మురళీకృష్ణ పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి

● మొక్కు తీర్చుకునేందుకు కాలినడకన తిరుమలకు బయలుదేరిన రంగారావు



రంగారావు పాదయాత్రకు జెండా ఊపుతున్న టీడీపీ మండలాధ్యక్షుడు రాజేశ్వరరావు

హనుమాన్‌జంక్షన్/హనుమాన్‌జంక్షన్ రూరల్, జూలై 11: రాష్ట్ర సమగ్రాభివృద్ధి సీఎం చంద్రబాబు సారథ్యంలోనే సాధ్యమవుతుందని బాపులపాడు మండలం కాకులపాడు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నేత సూరపనేని రంగారావు అన్నారు. చంద్రబాబు సీఎం అయితే కాలినడకన తిరుమల తిరుపతికి వస్తానని రంగారావు మొక్కుకున్నారు. ఈ మొక్కు తీర్చుకోవడానికి గురువారం ఆయన స్థానిక అభయాంజనేయస్వామి ఆలయం నుంచి కాలినడకన యాత్ర చేపట్టారు. ముందుగా ఆలయంలో 101 కొబ్బరికాయలు కొట్టి స్వామిని కుటుంబ సమేతంగా పూజించారు. అనంతరం పాదయాత్ర చేపట్టారు. టీడీపీ బాపులపాడు మండలాధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు పూలమాలతో రంగారావును సత్కరించి యాత్ర విజయవంతంగా సాగాలని అభినందించారు.

టీడీపీ జెండా ఊపి రంగారావుకు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా రం గారావు మాట్లాడుతూ తాను 2019 ఎన్నికల తరువాత టీడీపీ అధికారంలోకి రావడం కల్లని చాలామంది అభిప్రాయపడ్డారు. తాను మాత్రం 2024 ఎన్నికల్లో చంద్రబాబు సీఎం అవుతారాని ధృఢనిశ్చయంతో ఉన్నానని, చంద్రబాబు సీఎం అయితే కాలినడకన తిరుపతికి వస్తానని, మొక్కుకున్నానని, ఆ వేంకటేశ్వరస్వామి దయతో చంద్రబాబు సీఎం అయ్యారని, చంద్రబాబు సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్న ఆశతో రాష్ట్ర ప్రజలు ఉన్నారని ప్రజలు ఆశలు చంద్రబాబు నెరవేరుస్తారని రంగారావు చెప్పారు. టీడీపీ తెలుగు మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయికల్యాణి, హనుమాన్‌జంక్షన్ టీడీపీ పట్టణాధ్యక్షుడు అట్లూరి శ్రీనివాసరావు, గండి రాంబాబు, బోయపాటి ప్రసాద్, జనసేన నేతలు గరికపాటి నాగేశ్వరరావు సంఘీభావం తెలిపి అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి.. మరొకరి పరిస్థితి విషమం

ఉంగుటూరు, జూలై 11: చెన్నై-కోల్‌కతా 16వ నెంబర్ జాతీయ రహదారిపై కృష్ణాజిల్లా, ఉంగుటూరు మండలం, పెద అవుటపల్లి వద్ద గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. ఆత్కూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు జిల్లా, చింతలపూడి మండలం, యర్రగుంటపల్లికి చెందిన గాలంకి వెంకటేశ్వరరావు (50) నాగమణి (45) దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు. ఇద్దరు కుమార్తెలకు వివాహమైంది. నగరంలో నివాసముంటున్న రెండో కుమార్తె మాధవిని చూసేందుకు తల్లి నాగమణి, కుమారుడు శ్యామ్‌కుమార్ (27)తో కలిసి బైక్‌పై ఉదయం 8గంటలకు బయలుదేరారు. 9.30 గంటలకు పెద అవుటపల్లి ఫ్లై ఓవర్‌బ్రిడ్జి మీదుగా వెళ్తున్న క్రమంలో అదేమార్గంలో విజయనగరం నుంచి విజయవాడ గొల్లపూడివైపు పార్శిల్‌లోడుతో వేగంగా వెళ్తున్న లారీ వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న తల్లీకొడుకులు ఎగిరి రోడ్డుపై పడ్డారు. తీవ్రంగా గాయపడ్డ తల్లీకొడుకులను పోలీసులు హైవే అంబులెన్స్‌లో విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మార్గమధ్యంలో శ్యామ్‌కుమార్ మృతి చెందగా, తీవ్రగాయాలైన నాగమణి అపస్మారకస్థితిలో ఐసీయూలో చికిత్సపొందుతోంది. కాగా ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్టు పోలీసులు తెలిపారు. ప్రమాదానికి కారకుడైన లారీ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతుడి తండ్రి వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు ఎస్సై ఏ పైడిబాబు తెలిపారు.



కందిపప్పు అందజేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

పేదల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం, జూలై 11: పేదల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. స్థానిక రైతుబజార్‌లో నిత్యవసరాల ధరలను నియంత్రిస్తూ పేద, మధ్య తరగతి ప్రజలకు తక్కువ ధరకే నాణ్యమైన కందిపప్పు, బియ్యం అందించేందుకు గురువారం ప్రత్యేక కౌంటర్లను అధికారులు, జనసేన, బీజేపీ నేతలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన సరుకులను తక్కువధరకు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మిల్లర్లతో మాట్లాడి పౌరసరఫరాలశాఖ ద్వారా బియ్యం కేజీ రూ.55.85 ఉంటే రూ.49కే, కందిపప్పు మార్కెట్లో కేజీ రూ.181 ఉంటే రూ.160కే రైతు బజార్లలో ప్రజలకు అందిస్తున్నామన్నారు. నిత్యవసర ధరలు తగ్గించేందుకు చర్యలు చేపట్టిన సీఎం చంద్రబాబు, మంత్రి నాదెం డ్ల మనోహర్‌కు వెంకట్రావు ధన్యావాదాలు తెలిపారు. తహసీల్దార్ పవన్‌కుమార్, పీడీఎస్ డీటీ నందూరి ప్రధాన్, ఆర్ఐ ఉదయ్‌కుమార్, నేతలు వెంకటేశ్వరరావు, చలమలశెట్టి రమేష్‌బాబు, ఫణి, వరప్రసాద్, తులసీమోహన్, కృష్ణారెడ్డి, మద్దినేని వెంకటేశ్వరరావు, దయాల రాజేశ్వరరావు, జూపల్లి సురేష్, మండవ లక్ష్మీ, కాసన్నేని రంగబాబు, మండవ అన్వేష్, గొట్టిపూళ్ల శ్రీనాథ్, వెంకటరత్నం, రవి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

రైల్వే కార్మికుల డిమాండ్లపై కేంద్రం కాలయాపన

రైల్వేస్టేషన్, జూలై 11: రైల్వే కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుండా కేంద్రం కాలయాపన చేస్తోందని రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ నేతలు విమర్శించారు. సంఘ్ జనరల్ సెక్రటరీ మర్రి రాఘవ య్య పిలుపు మేరకు గురువారం నగరంలోని డీఆర్ఎం కార్యాలయం వ ద్ద జరిగిన లంచ్ అవర్ గేట్ మీటింగ్‌లో డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆమంచి వెంకటేశ్వరరావు, ఆకుల రాఘవేంద్రరావు మాట్లాడారు.ఏజీఎస్ యడ్ల నాగేంద్రబాబు, సెంట్రల్ వర్కింగ్ కమిటీ సభ్యులు రమేష్, దేగల శ్రీను, బ్రాంచి కార్యదర్శులు బసవపున్నయ్య కర్నాలు సుకుమార్, శ్యా మ్, దాసు, బాలాజీ, ఇంజనీరింగ్ బ్రాంచ్ అధ్యక్షుడు కొయ్య రమణారెడ్డి, కార్యదర్శి ఎం శ్రీనివాసరావు, మెడికల్ బ్రాంచి కార్యదర్శి ఏ శ్రీనివాసరావు, మహిళా నేతలు సుగుణ కుమారి, రాధిక, సుప్రియ పాల్గొన్నారు.

2019 నాటి సర్క్యులర్ అమలు చేయాలి

విజయవాడ: ఆర్టీసీ ఉద్యోగుల భద్రతపై టీడీపీ ప్రభుత్వం 20 19లో జారీ చేసిన సర్క్యులర్‌ను అమలు చేయాలని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ కోరింది. యూనియన్ 73వ ఆవిర్భావ దినోత్స వం గురువారం యూనియన్ రాష్ట్ర కార్యాలయంలో జరిగింది. విజయవాడ డిపోలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దామోదరరావు, నర్సయ్య మాట్లాడుతూ 2019లో జారీ చేసిన సర్క్యులర్‌ను పక్కన పెట్టి గత ప్రభుత్వం జీవో 70, 71లను జారీ చేసి చిన్న చిన్న తప్పిదాలకు కూడా సస్పెన్షన్లు, తొలగింపులు చేసిందన్నారు.

ప్రభుత్వ పాఠశాలకే 'తల్లికి వందనం' ఇవ్వాలి

రాష్ట్ర సర్కారుకు ఏపీసీపీఎస్ఈఏ విజ్ఞప్తి

అమరావతి: 'తల్లికి వందనం' పథకాన్ని ప్రభుత్వ పాఠశాలకే వర్తింపజేయాలని ఆంధ్రప్రదేశ్ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏపీసీపీఎస్ఈఏ) విజ్ఞప్తి చేసింది. గత ప్రభు త్వం తీసుకొచ్చిన అమ్మఒడి పథకం వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు లక్షల్లో తగ్గిపోయాయని తెలిపింది. ప్రైవే టు బడుల్లో చదివేవారిలో 90శాతం మందికి తెల్లకార్డులు ఉన్నాయని తెలిపింది. తల్లికి వందనం పథకం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు రెండింటికీ వర్తింపజేస్తే భవిష్యత్తులో ప్రభుత్వ పాఠశాలలు కనుమరుగువుతాయని, ఈ పథకాన్ని కేవలం ప్రభుత్వ పాఠశాలలకే వర్తించేలా చర్యలు తీసుకోవాలని ఏపీసీపీఎస్ఈఏ ఓ ప్రకటనలో కోరింది.



అనకాపల్లి జిల్లా దార్లపూడిలో సీఎం చంద్రబాబుపై పూలుచల్లుతూ ఘనంగా స్వాగతం పలుకుతున్న ప్రజలు



పోలవరం ఎడమ కాలువ, అసంపూర్తిగా ఉన్న అక్విడెక్ట్‌ను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు



మెడ్ టెక్‌జోన్‌లో ప్రారంభించిన కంపెనీలను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

ఏపీ నంబర్ 1

(మొదటి పేజీ తరువాయి)

రూ.800 కోట్లతో పూర్తిచేస్తామని ప్రకటించారు. టెండర్ల ప్రక్రియను ఆలస్యం చేయకుండా వెంటనే ప్రారంభించాలని జల వనరుల శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన ఉత్తరాంధ్ర పర్యటనలో సుడిగాలి పర్యటన చేశారు. మొదట అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం దార్లపూడిలో ఎడమ కాలువకు సంబంధించిన 6, 7, 8 ప్యాకేజీ పనుల ఫొటో ప్రదర్శనను తిలకించారు. అనంతరం అక్విడెక్ట్ వద్దకు వెళ్లి ఆగిన కాలువ పనులను పరిశీలించారు. తర్వాత భోగాపురం విమానాశ్రయానికి వెళ్లి పనులను పరిశీలించారు. తర్వాత విశాఖ వచ్చి స్టీల్ ప్లాంటు సమీపానున్న మెడ్‌టెక్ జోన్‌ను సందర్శించి రెండు కొత్త కంపెనీలను ప్రారంభించారు. దార్లపూడిలో ప్రజలనుద్దేశించి మాట్లాడు తూ సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదట పోలవరాన్ని సందర్శించానని గుర్తుచేశారు. దార్లపూడిలో కాలువ పనులు 72 శాతం వరకూ టీడీపీ హయాంలోనే పూర్తయ్యాయన్నారు. నాడు ఎక్కడ ఆగిపోయాయో ఇప్పుడూ అక్కడే ఉన్నాయని.. పోలవరాన్ని వైసీపీ ప్రభుత్వం గోదావరిలో కలిపేసిందని మండిపడ్డారు. ఎడమ కాలువ 214 కిలోమీటర్లకుగాను 93 కిలోమీటర్లు పూర్తిచేస్తే 2.20 లక్షల ఎకరాలకు సాగునీరు అందించవచ్చన్నారు. అర్థాంతరంగా నిలిచిన ఈ పనులకు రూ.800 కోట్లు ఖర్చవుతుందన్నారు. ఈ పనులు పూర్తయితే అనకాపల్లి జిల్లాలో లక్ష ఎకరాలకు సాగునీరు అదనంగా అందుతుందన్నారు. వీలైనంత త్వరగా ఈ పనులు పూర్తిచేసేందుకు టెండర్ల ప్రక్రియ ప్రారంభించాలని అధికారులను ఆదేశించామన్నారు. పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం ద్వారా 2,500 క్యూసెక్కుల నీటిని తీసుకొచ్చి అనకాపల్లి జిల్లా ప్రజలకు అందిస్తే జన్మ ధన్యమవుతుందని తెలిపారు. వీటితో పాటు ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు పనులు కూడా పూర్తయితే అనకాపల్లి జిల్లాలో 2.80 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకాన్ని పరుగులు పెట్టించి ఈ ప్రాంత ప్రజలకు సాగు, తాగునీరు అందిస్తామని తెలిపారు. వైసీపీ అసమర్థ, అస్తవ్యస్త పాలనతో రాష్ట్రం దివాలా తీసిందని ముఖ్యమంత్రి ధ్వజమెత్తారు. విశాఖ స్టీల్ ప్లాంటు విషయంలో యూటర్న్ తీసుకున్నానని కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని చంద్రబాబు మండిపడ్డారు. దాని విషయం ఏం చేయాలో తమకు స్పష్టమైన ఆలోచన ఉందన్నారు. వాజపేయి ప్రధానిగా ఉన్నప్పుడే దీని ప్రైవేటీకరణకు ప్రయత్నాలు జరిగితే అడ్డుకున్నానన్నారు. తెలుగోడి ఆత్మగౌరవమైన స్టీల్ ప్లాంటును కాపాడే బాధ్యత తీసుకుంటామన్నారు. వైసీపీ నాయకులు ఆర్థిక ఉగ్రవాదులుగా మారి విశాఖను దారుణంగా దోచుకున్నారని.. భూములు కొట్టేయాలని తీవ్ర ప్రయత్నాలు చేశారని ధ్వజమెత్తారు.

ఒక్కొక్కటిగా అమలు..

ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తున్నామని.. వాటిపై రాజీలేదని చంద్రబాబు తేల్చిచెప్పారు. 'ఇప్పటికే ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నాం. మొదటి సంతకం మెగా డీఎస్సీపై చేశా. ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేశాం. ఉచిత ఇసుక విధానం అమల్లోకి తెచ్చాం. స్కిల్ డెవలప్‌మెంట్‌పై దృష్టిపెట్టి వివరాలు సేకరిస్తున్నాం. నాతో పాటు ప్రధాని మోదీ, పవన్ కల్యాణ్ ఇచ్చిన హామీలను ప్రజలు నమ్మారు కాబట్టే అఖండ విజయం చేకూర్చారు. ఏపీని నంబర్‌వన్‌గా నిలపాలన్నదే నా ముందున్న ప్రధాన లక్ష్యం. నార్త్ కొరియాలో కిమ్ ఆ దేశ ప్రజలు నవ్వినా, ఏడ్చినా శిక్షిస్తాడు. అలాగే ఐదేళ్లుగా ఏపీలో కూడా కిమ్ ఒకరు పాలించారు' అని వ్యాఖ్యానించారు. మొన్నటి ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో కూటమి నేతలను గెలిపించిన జిల్లాల్లో తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల తర్వాత అనకాపల్లే ఉందని గుర్తుచేశారు. గెలిచామనే ధీమాగా ఉండకుండా ప్రజా పాలనే ముఖ్యంగా ముందుకు వెళ్లాలని సూచించారు.

రెడ్ కార్పెట్లు వేసి డబ్బు వృథా చేయొద్దు

గతంలో తాను ఎన్నికల ప్రచారానికి వచ్చినప్పుడు ప్రజలు దిగులుగా ఉండేవారని, ఇప్పుడు అందరిలో ఆనందం కనిపిస్తోందని చంద్రబాబు అన్నారు. సభా ప్రాంగణంలో రెడ్ కార్పెట్లు వేశారని, ఇకపై ఎక్కడ సభలు జరిగినా కార్పెట్‌లు వేసి డబ్బు వృథా చేయొద్దని అధికారులకు హితవు పలికారు. ఇకముందు కార్పెట్లకు డబ్బు వృథా చేస్తే చర్యలు తప్పవన్నారు. సీఎంగా బాధ్యతలు చేపట్టాక తొలిసారిగా అనకాపల్లి జిల్లా పర్యటనకు వచ్చిన చంద్రబాబునాయుడుకు ఎస్.రాయవరం మండలం దార్లపూడిలో ఘన స్వాగతం లభించింది. స్పీకర్ అయ్యన్నపాత్రుడు, హోం మంత్రి వంగలపూడి అనిత, జల వనరుల మంత్రి నిమ్మల రామానాయుడు, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ(అనకాపల్లి), పంచకర్ల రమేశ్‌బాబు (పెందుర్తి), సుందరపు విజయ్‌కుమార్(యలమంచిలి), ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు పుష్పగుచ్ఛాలు అందించారు.

మోడ్రన్ ఎయిర్‌పోర్టుగా భోగాపురం

2026 జూన్ 30కి ముందే నిర్మాణం పూర్తి

అన్నీ సజావుగా జరిగినట్టయితే 2023 నాటికే వినియోగంలోకి: చంద్రబాబు

విజయనగరం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): భోగాపురం విమానాశ్రయాన్ని మోడ్రన్ ఎయిర్‌పోర్టుగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. గురువారం భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులను ఆయన పరిశీలించి, అధికారులతో సమీక్షించారు. చంద్రబాబుకు కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహననాయుడు, కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు, రాష్ట్ర మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, గుమ్మిడి సంధ్యారాణి, ఎమ్మెల్యేలు ఘనస్వాగతం పలికారు. అంతకుముందు చంద్రబాబు ఏరియల్ సర్వే నిర్వహించారు. ఎయిర్‌పోర్టు పనులను పరిశీలించిన అనంతరం అధికారులతో సమీక్ష జరిపారు. గతంలో కేంద్ర విమానయాన శాఖ మంత్రిగా పనిచేసిన అశోక్ గజపతిరాజు పలు సలహాలు, సూచనలు అందించారు. అనంతరం చంద్రబాబు విలేకరులతో మాట్లాడారు. ఎయిర్‌పోర్టును 2026 జూన్ 30నాటికి పూర్తి చేస్తామని అధికారులు చెప్పారని, అంతకంటే ముందుగానే పూర్తిచేయాలని ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. ఫేజ్-1లో భాగంగా భోగాపురం వరకు బీచ్‌రోడ్డు, ఫేజ్-2లో మరో 50 కిలోమీటర్లతో శ్రీకాకుళం, ఫేజ్-3లో మూలపేట వరకు రోడ్డు పనులు పూర్తి చేస్తామన్నారు.

కనెక్టివిటీ ముఖ్యం.. ఎయిర్‌పోర్టు నిర్మాణానికి రూ.4,700 కోట్లు వ్యయం చేస్తున్నట్టు చంద్రబాబు తెలిపారు. 45 లక్షల మంది ప్రయాణికులు ఈ ఎయిర్‌పోర్టు ద్వారా ప్రయాణాలు సాగించవచ్చని అంచనాగా ఉందన్నారు. ఈ ఎయిర్‌పోర్టు పూర్తయి వినియోగంలోకి వస్తే ఉత్తరాంధ్ర ఎకనమిక్ హబ్‌గా తయారవుతుందన్నారు. ఏ ఎయిర్‌పోర్టుకైనా కనెక్టివిటీ ముఖ్యమని, హైదరాబాద్‌కు ఔటర్ రింగురోడ్డు ఏర్పాటు చేశామని, ఎక్కడి నుంచైనా విమానాశ్రయానికి వేగంగా చేరుకునేలా కనెక్టివిటీ ఏర్పాటు చేశామన్నారు.

సజావుగా సాగి ఉంటే...

2015లోనే ఈ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేశామని చంద్రబాబు వివరించారు. 2016 అక్టోబరులో కేంద్ర ప్రభుత్వం నిర్మాణానికి సంబంధించిన అన్ని అనుమతులు ఇచ్చిందన్నారు. రైతుల నుంచి 2,700 ఎకరాలు సేకరించామన్నారు. అన్ని సజావుగా జరిగినట్టయితే 2023 నాటికే ఈ ఎయిర్‌పోర్టు వినియోగంలోకి రావల్సి ఉందన్నారు.

- రాజకీయాల్లో విర్రవీగిన వారిని ఎలా అణగదొక్కాలో ప్రజలకు బాగా తెలుసు. భగవంతుడు ఇచ్చిన శక్తితో సామర్థ్యం ఉన్నంతవరకు వారి కోసం పనిచేస్తా.
- ఆర్థిక పరిస్థితి బాగుండకపోయినా ఉద్యోగులకు ఒకటో తేదీనే జీతాలిచ్చాం. వలంటీర్ల అవసరం లేకుండానే ఒకేరోజు సచివాలయ సిబ్బంది ద్వారా పెన్షన్లు ఇచ్చి చూపించాం. ప్రజల శ్రేయస్సే అభిమతంగా కూటమి ప్రభుత్వ పాలన సాగుతోంది.
- రాష్ట్రంలో ఎక్కడ చూసినా రోడ్లు గుంతలమయం. ఆ గుంతల్లో ఎవరిని పూడ్చాలో ప్రజలే చెప్పాలి. రోడ్లన్నీ ప్రణాళికాబద్ధంగా బాగు చేసేందుకు చర్యలు చేపడతాం.

- సీఎం చంద్రబాబు

మెడ్‌టెక్ జోన్‌పై జగన్ వివక్ష

- అక్కడ తయారైన వైద్య పరికరాలను తీసుకోలేదు
- త్వరలో ఏఐ వర్సిటీ: సీఎం

విశాఖపట్నం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలోని మెడ్‌టెక్ జోన్ వైద్య పరికరాల తయారీకి గ్లోబల్ హబ్‌గా మారాలని సీఎం చంద్రబాబు ఆశాభావం వ్యక్తంచేశారు. సీఎంగా పదవీ బాధ్యతలు చేపట్టాక గురువారం తొలిసారిగా విశాఖపట్నం వచ్చిన ఆయన స్టీల్ ప్లాంటు సమీపానున్న మెడ్‌టెక్ జోన్‌ను సందర్శించారు. అక్కడ రెండు కొత్త కంపెనీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...మెడ్‌టెక్ జోన్‌లో తయారైన వైద్య పరికరాలను 20 రాష్ట్రాలు ఉపయోగించుకుంటుంటే.. జగన్ ప్రభుత్వం వాటిని తీసుకోలేదని, వివక్షకు అంతకు మించిన నిదర్శనం లేదని విమర్శించారు. జోన్ ప్రధాన సలహాదారు, సీఈవో జితేంద్ర శర్మ 2016లో తనను కలిసి వైద్య పరికరాల తయారీ పెద్ద పరిశ్రమగా మారిందని, వాటిని ఏపీలోనే తయారుచేయాలని కోరగా.. అందుకు అవసరమైన సహకారం ఇచ్చి ప్రోత్సహించానన్నారు. పెదగంట్యాడ మండలంలో 275 ఎకరాలు కేటాయించగా అందులో 140 పరిశ్రమలు ఏర్పాటుచేసి, ఆరు వేల మందికి ఉపాధి కల్పించి, ఏడాదికి రూ.10 వేల కోట్ల టర్నోవర్ సాధిస్తున్నారన్నారు. కొత్త ఆవిష్కరణలకు నాంది పలికి గ్లోబల్ హబ్‌గా మార్చాలని పిలుపిచ్చారు. త్వరలోనే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) యూనివర్సిటీని ఏర్పాటుచేస్తామని ప్రకటించారు.

పాలన పరుగులు పెట్టాలి

మాది పొలిటికల్ గవర్నెన్స్.. నాట్ బ్యూరోక్రటిక్ గవర్నెన్స్: చంద్రబాబు

విశాఖపట్నం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలు టీడీపీ కూటమి ప్రభుత్వంపై పెట్టుకున్న ఆశలు నెరవేర్చేందుకు వీలుగా పాలన పరుగులు తీయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. తాను 1995లో మొదటిసారి సీఎంగా ఉన్నప్పుడు మాదిరిగా పాలనలో వేగం ఉంటుందని ఇప్పటికే ప్రకటించానని, అందుకు తగిన విధంగా అధికారులు పనిచేయాలని సూచించారు. గురువారం రాత్రి విశాఖపట్నం ఎయిర్‌పోర్టులో విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల ఎంపీలు, శాసనసభ్యులు, శాసన మండలి సభ్యులు, అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. 'మా ప్రభుత్వం పొలిటికల్ గవర్నెన్స్ తప్ప బ్యూరోక్రాటిక్ గవర్నెన్స్ కాదు. ప్రజాప్రతినిధులు, ప్రజల సూచనలు సలహాలకు ప్రాధాన్యం ఉంటుంది. ముఖ్యమంత్రిని సంతోషపరిచేలా వ్యవహరించవద్దు. ప్రజలకు మేలు చేసేలా పనిచేయాలి. మాకు రెడ్ కార్పెట్ వద్దు. మాది సామాన్యంగా పాలన చేసే ప్రభుత్వం. సమర్థ పాలన మా విధానం. నిబంధనలకు లోబడే పాలన ఉంటుంది. అధికారులు అదే తీరులో పనిచేయాలి. వైసీపీ ప్రభుత్వంలో అనేక విధ్వంసాలు సృష్టించి ప్రజలను, ప్రత్యర్థి పార్టీల నేతలను ఇబ్బందిపెట్టినా.. వారిపై ప్రతీకారం తీర్చుకోవడం మా విధానం కాదు. అభివృద్ధే ఏకైక ఎజెండాగా పనిచేస్తాం' అని తేల్చిచెప్పారు.

వడివడిగా అడుగులు

ఆర్భాటం లేకుండా అణుకువగా ముందుకు

బాబు 4.0 పాలనకు నేటితో నెలరోజులు

(అమరావతి, ఆంధ్రజ్యోతి)

ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన మర్నాడే చంద్రబాబు ఒకేసారి ఐదు కీలక నిర్ణయాలకు తొలి సంతకాలు చేశారు. పింఛన్ల భారీ పెంపు, వివాదాస్పద లాండ్ టైటిలింగ్ చట్టం రద్దు, పదహారు వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం మెగా డీ ఎస్సీ నిర్వహణ, రూ. ఐదుకు అన్నం పెట్టే అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, రాష్ట్రంలోని యువతలో నైపుణ్యాల అంచనా కోసం నైపుణ్య గణన నిర్వహణ ఈ ఐదు సంతకాల్లో ఉన్నాయి. తొలి సంతకాలపై ఇచ్చిన హామీలు రెండే! కానీ, ఒకేసారి ఐదు నిర్ణయాలు వెంటనే తీసుకొని సంచలనం కలిగించారు. పోలవరం, అమరావతి, ఉచిత ఇసుక వంటి విషయాల్లో చంద్రబాబు నిర్ణయాలు ప్రభుత్వ ప్రతిష్ఠను పెంచాయి. కేంద్రంతో సత్సంబంధాలవల్ల రాష్ట్రానికి గరిష్ఠ ప్రయోజనం కలిగేలా గట్టి అడుగులు పడుతున్నాయి.

రికార్డు ఆధిక్యంతో అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన టీడీపీ కూటమి ప్రభుత్వం తన తొలి నెల పాలనలో వడివడిగా అడుగులు వేసింది. వైసీపీ విధ్వంస పాలనలో కుదేలైన రాష్ట్రాన్ని తిరిగి నిలబెట్టడం ప్రధాన ఎజెండాగా పాలన చేపట్టిన చంద్రబాబు ప్రభుత్వం, ఆ దిశగా కొంత మార్పు చూపించగలుగుతోంది. హడావుడి, ఆర్భాటం లేకుండా అణుకువగా ఈ ప్రభుత్వం పని చేస్తోందన్న పేరు తెచ్చుకొంది. అప్పులు తప్ప ఖజానాలో చిల్లి గవ్వ లేని పరిస్థితుల్లో కూడా కూటమి ప్రభుత్వం పేదలకు పింఛన్ల విషయంలో తన మాట నిలుపుకొంది. చంద్రబాబు 4.0 పాలనకు శ్రీకారం చుడుతూ, గత నెల 12వ ప్రమాణం చేశారు. ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన తొలి నెలలోనే పేదలు, దివ్యాంగుల పింఛన్లను భారీగా పెంచారు. పేదల పింఛన్లు రూ.వెయ్యి పెంచడానికి వైసీపీ ప్రభుత్వం నాలుగేళ్ల సమయం తీసుకోగా, అదే మొత్తాన్ని టీడీపీ ప్రభుత్వం కేవలం పదిహేడు రోజుల్లో పెంచింది. రూ. మూడు వేల నుంచి పేదల పింఛన్లను రూ. నాలుగు వేలకు పెంచారు. దివ్యాంగులకు ఇచ్చే పింఛన్లు రూ. నాలుగు నుంచి రూ. ఆరు వేలకు పెంచారు. పూర్తి అంగ వైకల్యంతో బాధపడుతున్న వారికి ఇచ్చే పింఛన్లు ఏకంగా రూ. పదిహేను వేలకు పెంచారు. ఈ పెంపును గత మూడు నెలల నుంచి వర్తింప చేస్తూ ఆ మొత్తాన్ని కూడా జూలై నెల పింఛన్లతోపాటు కలిపి ఇచ్చారు. ఇంత మొత్తం డబ్బులు పింఛనుదారులకు అందడం ఇదే ప్రథమం.

కేంద్రం నుంచి శుభ సంకేతాలు

టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటు తర్వాత కేంద్రం నుంచి రాష్ట్రానికి శుభ సంకేతాలు రావడం మొదలైంది. కేంద్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వానికి అవసరమైన బలాన్ని సమకూర్చడంలో టీడీపీ పాత్ర ప్రముఖంగా ఉండటం దీనికి కారణం. చంద్రబాబు మంత్రివర్గం ప్రమాణ స్వీకారానికి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్వయంగా హాజరై టీడీపీ ప్రాముఖ్యతను చాటారు. పాలనాపగ్గాలు చేపట్టిన తొలి నెలలోనే ఢిల్లీకి వెళ్లిన చంద్రబాబు, ప్రధాని సహా ఎనిమిది మంది మంత్రులను కలిసి రాష్ట్రానికి కావాల్సిన నిధులు, ప్రాజెక్టులు, పథకాలపై వినతులను ఇచ్చి వచ్చారు. దీని ఫలితాలు వేగంగా కనిపించాయి. అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు ప్రాజెక్టుకు భూ సమీకరణతో సహా మొత్తం వ్యయాన్ని భరించడానికి కేంద్రం ముందుకు వచ్చింది. రూ. అరవై వేల కోట్ల వ్యయంతో ఆయిల్ రిఫైనరీ ఏర్పాటుపై చర్చించడానికి బీపీసీఎల్ కంపెనీ సీఎండీతోపాటు ముఖ్య అధికారగణం తరలివచ్చింది. ఈ భారీ ప్రాజెక్టు ఏపీకి రావడానికి మంచి అవకాశాలు ఉన్నాయని ప్రచారం జరుగుతోంది. ఏపీలో జాతీయ రహదారుల నిర్మాణానికి రూ. ఐదు వేల కోట్ల వరకూ మంజూరుకు కేంద్రం అంగీకరించింది. పోలవరం ప్రాజెక్టులో కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణానికి వ్యయం అయ్యే రూ. వెయ్యి కోట్లు కేంద్రం భరించేలా రాష్ట్రం ఒప్పించగలిగింది. జీఎస్టీ వాటా నిధులు తెలంగాణకు రూ. 2200 కోట్లు విడుదల అయితే ఏపీకి రూ. నాలుగు వేల ఎనిమిది వందల కోట్లు అందాయని చెబుతున్నారు. రాజధాని నిర్మాణానికి కూడా కేంద్రం సహకరించగలదని రాష్ట్రం ఆశిస్తోంది. అధికారికంగా చెప్పకపోయినా వివిధ పథకాల రూపంలో కేంద్రం నుంచి కొంత అదనపు సాయం రాబట్టగలమని టీడీపీ ప్రభుత్వం నమ్మకంతో ఉంది. ఇదే సమయంలో వైసీపీ హయాంలో జరిగిన విధ్వంసాన్ని ప్రజల దృష్టికి తేవడానికి కూడా టీడీపీ ప్రభుత్వం గట్టి ప్రయత్నం చేస్తోంది. కీలకమైన రంగాల్లో ఏం నష్టం జరిగిందో శ్వేత పత్రాల రూపంలో ప్రజల ముందుకు తెస్తున్నారు. ఇప్పటికి మూడు పత్రాలను విడుదల చేశారు.

కొన్ని శాఖల్లో చురుకుదనం

చంద్రబాబు ప్రభుత్వంలో మంత్రులు కొందరు తమ శాఖల పరిధిలో వేగం ప్రదర్శిస్తున్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తన శాఖలపై వరుసగా పలు సమీక్ష సమావేశాలు నిర్వహించి అధికారులను కదిలించారు. ముఖ్యమంత్రి కుమారుడు లోకేశ్ తాను చూస్తున్న విద్యా శాఖలో దారి తప్పిన వ్యవస్థను దారిలో పెట్టడానికి తీవ్రంగా శ్రమిస్తున్నారు. ప్రజాదర్బార్ పేరుతో ఆయన రోజూ ఉదయం వందల మంది ప్రజలను తన నివాసంలో కలుస్తూ వారి సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి ప్రయత్నం చేస్తున్నారు. పౌర సరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ బియ్యం గోదాముల్లో వరుస తనిఖీలు జరిపి బియ్యం మాఫియాకు వణుకు తెప్పించారు. సాగునీటి మంత్రి నిమ్మల రామానాయుడు, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ వంటి వారు కూడా తమ శాఖల్లో వేగం ప్రదర్శిస్తున్నారు. మహిళా మంత్రుల్లో హోం మంత్రి అనిత బాగా చురుగ్గా కనిపిస్తున్నారు.

జె.మాఫియా గాయబ్

గత ఐదేళ్లుగా పెండింగ్‌లో పడి సుదీర్ఘ రైతుల ఉద్యమానికి కారణమైన అమరావతి రాజధాని నిర్మాణాన్ని చంద్రబాబు ప్రభుత్వం వెంటనేపట్టాలెక్కించింది. రాజధానిలో నిర్మాణం మొదలై అసంపూర్తిగా నిలిచిపోయిన భవనాలను చంద్రబాబు స్వయంగా సందర్శించారు. వాటిని పూర్తి చేయడానికి సన్నాహాలు మొదలుపెట్టారు. అమరావతికి కంపెనీలు, విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలను రప్పించడానికి చర్యలు చేపట్టారు. ఆంధ్రప్రదేశ్‌కు జీవనాడి వంటి పోలవరం భారీ ప్రాజెక్టును పూర్తి చేయడంపై కూడా తొలినెలలోనే చంద్రబాబు ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఆ ప్రాజెక్టును చంద్రబాబు స్వయంగా వెళ్లి చూడటంతోపాటు కేంద్రంతో మాట్లాడి అంతర్జాతీయ నిపుణులను కూడా వెంటనే రప్పించి వారితో అధ్యయనం చేయించారు. వైసీపీ హయాంలో భారీగా జరిగిన ఇసుక దోపిడీ, అవినీతికి ముకుతాడు వేస్తూ, ఉచిత ఇసుక విధానాన్ని ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. ఈ విధానంతో పలు చోట్ల ఇసుక ధరలు నేలకు దిగి వచ్చాయి. ఇసుకను పెద్ద ఆదాయ వనరుగా మార్చుకొని జేబులు నింపుకొన్న జె.మాఫియా.... ప్రభుత్వం మారగానే రాష్ట్రం నుంచి అదృశ్యం కావడం విశేషం. విశాఖ పర్యటనకు వెళ్లి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, మెడ్ టెక్ జోన్ నిర్మాణ పురోగతిని పరిశీలించడంతోపాటు విశాఖ నగర అభివృద్ధికి సంబంధించిన అంశాలపై కూడా చంద్రబాబు గురువారం సమీక్ష నిర్వహించారు.

క్యాడర్‌లో కొంత అసహనం

పాలనపరంగా చంద్రబాబు ప్రభుత్వం తొలి నెల పాలనలో కొన్ని కీలకమైన అడుగులు వేసి ప్రభావం చూపించినా, రాజకీయపర మైన అంశాల్లో క్యాడర్‌లో కొంత అసహనం కనిపిస్తోంది. వైసీపీ హయాంలో టీడీపీ క్యాడర్‌ను, సానుభూతిపరులను తీవ్రంగా వేధించి, బాధించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంలో వేగం కనిపించడం లేదని వారు వ్యాఖ్యానిస్తున్నారు. వైసీపీ హయాంలో అధికార పార్టీకి అంతేవాసులుగా పనిచేసిన అధికారులకు ఈ ప్రభుత్వంలో కూడా మంచి పోస్టింగులు దొరుకుతున్నాయని, అప్రతిష్ఠపాలైన అధికారులను ఆ సీట్ల నుంచి మార్చడానికి నెల రోజులైనా ఇంకా చర్యలు తీసుకోలేదని వారు పెదవి విరుస్తున్నారు. సహజ వనరులను అడ్డగోలుగా దోచుకొన్నవారు, అవినీతిని శిఖరాగ్ర స్థాయికి తీసుకువెళ్లినవారు, అధికారాన్ని అయినకాడికి దుర్వినియోగం చేసిన వారిపై చర్యలు లేకపోతే ఎలా అన్నది వారి నుంచి వినవస్తున్న ప్రశ్న. వైసీపీ పాలన దెబ్బకు ఖజానా వట్టిపోవడంతో ఇటీవలి ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యేలు అల్లాడుతున్నారు. కనీసం రోడ్ల మరమ్మతులు, డ్రైనేజి కాల్వలు బాగు చేయడానికి కూడా ప్రభుత్వ శాఖల్లో నిధులు లేకపోవడం వారిని ఇబ్బంది పెడుతోంది. దీనికితోడు టీడీపీ సానుభూతిపరుల బిల్లులను వైసీపీ హయాంలో పూర్తిగా నిలిపివేసింది. వారు ఇప్పుడు తమ బిల్లుల సంగతి చూడాలని మొర పెట్టుకోవడం టీడీపీ ప్రభుత్వానికి సంకటంగా మారింది.

పెట్టుబడులతో రండి అన్ని వసతులూ కల్పిస్తాం

పారిశ్రామికవేత్తలకు చంద్రబాబు ఆహ్వానం



విశాఖపట్నం, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌ను పునర్నిర్మాణం చేస్తున్నామని, పెట్టుబడులతో ముందుకొస్తే అన్ని రకాల వసతులూ కల్పిస్తామని పారిశ్రామికవేత్తలకు సీఎం చంద్రబాబు పిలుపిచ్చారు. గురువారమిక్కడి మెడ్‌టెక్ జోన్‌లో భారత పరిశ్రమల సమాఖ్య(సీఐఐ) ప్రతినిధులతో ఆయన వర్చువల్ సమావేశం నిర్వహించారు. పరిశ్రమలకు మెరుగైన రాయితీలు ఇవ్వడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, ఏపీలోనే పెట్టుబడులు పెట్టాలని కోరారు. సీఐఐకి ప్రపంచవ్యాప్తంగా ప్రభావం చూపించే శక్తి ఉందన్నారు. 'పేదరిక నిర్మూలనకు అంతా కలిసి కృషిచేద్దామని చెప్పారు. ఆర్థిక సంస్కరణల తర్వాత 'పీ4.. పబ్లిక్, ప్రైవేట్, పీపుల్, పార్టనర్‌షిప్' తీసుకురాబోతున్నామని.. ఇందులో పీపుల్ అంటే కేపిటల్(రాజధాని) అని.. మిగిలిన అంశాలన్నీ దానికి అదనమని తెలిపారు. 'పబ్లిక్ పాలసీ రూపకల్పనకు అధిక ప్రాధాన్యమిస్తాం. ప్రజలకు ఏ సంక్షేమ పథకం అమలు చేసినా అది పేదరికాన్ని పారదోలేదిగా ఉండాలి. పేదరికం లేని సమాజ స్థాపనకు ఆలోచనలు చేయాలి. దానికి సీఐఐ మార్గదర్శనం చేయాలి. ఏ దేశానికీ లేని ఆధార్ వ్యవస్థ మన దేశానికి ఉంది. డిజిటల్ కరెన్సీ వ్యవస్థను ఎంతో ముందుకు తీసుకెళ్తోంది' అని తెలిపారు. రాబోయే నాలుగైదు నెలల్లో సోలార్, విండ్, పంప్డ్ ఎనర్జీ అమలుచేసే తొలి కార్యక్రమం చేపట్టబోతున్నామన్నారు. కొత్త ఆలోచనలతో ముందుకు రావాలని సూచించారు. పారిశ్రామికవేత్తలు పెట్టుబడులతో అమరావతికి రావాలని, ప్రధాన కార్యాలయాలు ఏర్పాటుచేయాలని, వాటికి అవసరమైన భూములిచ్చే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని భరోసా ఇచ్చారు. అంతా సహకరిస్తే అమరావతిని నాలెడ్జ్ ఎకానమీగా, పబ్లిక్ పాలసీ క్రియేషన్ హబ్‌గా మారుస్తామని చెప్పారు. అమరావతిలో నిర్మించాల్సిన సీఐఐ యూనివర్సిటీ ముంబైకి వెళ్లిపోయిందని సభ్యులు చెప్పగా.. సీఐఐ రెండో యూనివర్సిటీని అమరావతిలో పెట్టడానికి ముందుకొస్తే అందుకు అవసరమైన భూమి తాము ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు.

రిఫైనరీ సాధ్యాసాధ్యాలపై ఇప్పుడు అధ్యయనమా?

- మోదీపై జైరాం రమేశ్ విసుర్లు

న్యూఢిల్లీ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఏపీ విభజన చట్టాన్ని గత పదేళ్లలో ప్రధాని మోదీ మందగమనంతో అమలు చేశారని.. ఇప్పుడు మెజారిటీ కోల్పోవడంతో శరవేగంగా అమలు చేస్తారని ఆశిస్తున్నట్టు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అన్నారు. 'ఆంధ్రలో ఆయిల్ రిఫైనరీ, పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటు మన్మోహన్ సర్కారు ఇచ్చిన హామీ. పదేళ్లలోపు ఈ ప్రాజెక్టును మోదీ సర్కారు పూర్తిచేయాల్సి ఉంది. ఆరు నెలల్లోగా ఐవోసీ లేదా హెచ్‌పీసీఎల్ సాధ్యాసాధ్యాలను పరిశీలించాల్సి ఉంది. పదేళ్లపాటు కదలని ప్రభుత్వం.. ఇప్పుడు సాధ్యాసాధ్యాల అధ్యయనం చేయిస్తోంది' అని ఎద్దేవా చేశారు.

అధికారులు బాధ్యతతో పనిచేయాలి: డోలా

అమరావతి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని, ప్రజలకు జవాబుదారీగా ఉండాలని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి అన్నారు. గురువారం సచివాలయంలో సాంఘిక సంక్షేమశాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ ఉద్యోగాల నియామకాల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. ఉద్యోగుల సమస్యలు తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని అన్నారు.

40వేల కోట్ల బియ్యం కుంభకోణం: రఘురామ

భీమవరం టౌన్, జూలై 11: గత ప్రభుత్వ హయాంలో నాలుగేళ్లలో తక్కువలో తక్కువగా రూ.40వేల కోట్ల సబ్సిడీ బియ్యం కుంభకోణం జరిగిందని ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అతితక్కువ కాలంలోనే బియ్యం స్మగ్లర్ల ఆటకట్టించే పని స్టార్ట్ అయ్యిందన్నారు. విదేశాలకు ఎగుమతి చేయడానికి కాకినాడలో నిల్వ చేసిన 43,250 టన్నుల సబ్సిడీ బియ్యాన్ని పట్టుకున్నట్టు మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారని గుర్తు చేశారు.

ఇక ఎంపీలే రాష్ట్ర రాయబారులు

- ఒక్కొక్కరికీ ఒక్కో మంత్రిత్వ శాఖ బాధ్యతలు

(న్యూఢిల్లీ-ఆంధ్రజ్యోతి)

తెలుగుదేశం పార్టీ ఎంపీలే ఢిల్లీలో ఏపీకి రాయబారులుగా వ్యవహరించనున్నారు. వీరికి ఒక్కొక్కరికీ ఒక్కో ప్రధాన మంత్రిత్వ శాఖను కేటాయించి రాష్ట్రానికి సంబంధించిన పెండింగ్ ప్రాజెక్టులు, పథకాలు, నిధుల మంజూరీకి సంబంధించి కీలక బాధ్యతలను అప్పగించే దిశగా కసరత్తు సాగుతున్నట్లు తెలిసింది. ఈ నెల 22న కేంద్ర బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యేలోపు ఈ ప్రక్రియ పూర్తవుతుంది. కేంద్ర, రాష్ట్ర మంత్రులు, అధికారులతో ప్రతి ఎంపీని అనుసంధానం చేయడం, ఢిల్లీకి, రాష్ట్రానికి మధ్య సమాచార లోపం లేకుండా, వేగంగా ఫైళ్ల క్లియరెన్స్ చేయించడం వారి ప్రధాన బాధ్యతలుగా భావిస్తున్నారు. టీడీపీ పార్లమెంటరీ పార్టీ నాయకుడిగా వివిధ కేంద్ర మంత్రుల వద్దకు పార్టీ ఎంపీలను తీసుకువెళ్లి కీలక సమస్యలపై వినతిపత్రాలు సమర్పించి, వాటిని పరిష్కరించే బాధ్యతలను లావు శ్రీకృష్ణదేవరాయలు భుజస్కంధాలపై పెట్టారు. కేంద్ర కేబినెట్ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు కీలకమైన రాజకీయ వ్యవహారాల కమిటీ, పార్లమెంటరీ వ్యవహారాల కమిటీలో సభ్యుడుగా ఉన్నందున ఆయన తోటి మంత్రులు, అధికారులతో సంబంధాలు పెంచుకుని రాష్ట్రానికి చెందిన ప్రధాన సమస్యలను పరిష్కరించాల్సి ఉంటుంది. టీడీపీ లోక్‌సభ సభ్యుల్లో మొత్తం 16 మందీ అనుభవజ్ఞులు, విద్యాధికులు, వ్యాపారవేత్తలు ఉండటంతో వారంతా చంద్రబాబుకు కొండంత అండగా మారనున్నారు. త్వరలో పార్లమెంట్‌లో వివిధ శాఖలకు చెందిన కమిటీల్లో టీడీపీ ఎంపీలకు సభ్యత్వం లభిస్తుందని అప్పుడు ఆయా శాఖల మంత్రులు, అధికారులతో వారు సన్నిహిత సంబంధాలు ఏర్పరుచుకోవడం ద్వారా రాష్ట్ర ప్రయోజనాలకు తోడ్పడే అవకాశం మరింత పెరుగుతుందని భావిస్తున్నారు.

ఏపీ పునర్నిర్మాణమే లక్ష్యం

- పెట్టుబడిదారులకు భరోసా కల్పిస్తాం: సీఎం

అమరావతి, జూలై 11(ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణం కోసం మేం ఒక లక్ష్యంతో ఉన్నాం. గత ప్రభుత్వం ఎక్కడ వదిలిపెట్టిందో చూస్తే.. ఇది పెద్ద సవాల్‌గా మారనుంది. ఈ మిషన్‌లో అందరి మద్దతు అవసరం. ప్రజాస్వామానికి నాలుగో స్తంభమైన మీడియా.. ప్రభుత్వాన్ని జవాబుదారీగా ఉంచుతూ, పౌరులకు సమాచారం అందించడంలో కీలక పాత్ర పోషిస్తుంది' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. బీపీసీఎల్, విన్ ఫాస్ట్ సంస్థల ప్రతినిధులతో భేటీపై పత్రికల్లో వచ్చిన వార్తలను ఆయన గురువారం 'ఎక్స్'లో షేర్ చేశారు. 'బీపీసీఎల్, విన్ ఫాస్ట్‌తో ఉత్పాదక సమావేశాలు నిర్వహించాను. ఫలితంగా పెద్దఎత్తున పెట్టుబడులు, ఉద్యోగాల కల్పన సాధ్యమవుతుంది. గత ఐదేళ్లలో పారిశ్రామికవేత్తలకు సహకారం బదులు అవినీతి, విధ్వంసంతో పెట్టుబడిదారుల విశ్వాసం కోల్పోయి, పరిశ్రమలు నిష్క్రమించాయి. దీని ప్రభావం ఆర్థిక వ్యవస్థ, ఉపాధిపై చూపింది. రాష్ట్రవ్యాప్తంగా ఆశాజనకంగా ఈ సమావేశాలను కవర్ చేసిన మీడియాకు ధన్యవాదాలు. మీ కవరేజ్ ఏపీ అందించే సహాయ, సహకారాలు, అవకాశాలకు ఊతమిచ్చింది. పెట్టుబడిదారులకు మన రాష్ట్రం నమ్మదగిన, సురక్షితమైన గమ్యస్థానమని భరోసా ఇచ్చింది. ఏపీని దేశంలోనే నం.1 రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు మనమంతా కలిసికట్టుగా కృషి చేస్తామని ఆశిస్తున్నా' అని చంద్రబాబు పేర్కొన్నారు.

సిసోడియాకు రెవెన్యూ

- స్టాంపులు-రిజిస్ట్రేషన్లు కూడా ఆయనకే
- రాష్ట్రంలో 19 మంది ఐఏఎస్‌ల బదిలీ


హిమాన్షు శుక్లా


ఆర్‌పీ సిసోడియా


జయలక్ష్మి

అమరావతి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పలువురు ఐఏఎస్ అధికారులకు చంద్రబాబు ప్రభుత్వం స్థాన చలనం కలిగించింది. తొలివిడతలో జరిగిన బదిలీలపై వచ్చిన విమర్శలను దృష్టిలో పెట్టుకుని ఈ సారి పకడ్బందీగా పోస్టింగులు ఇచ్చారు. జగన్ ప్రభుత్వంలో తీవ్ర వేధింపులకు గురై.. ఐదేళ్ల అప్రధాన పోస్టులకే పరిమితమైన ఆర్‌పీ సిసోడియాకు కొత్త సర్కారు సముచిత గౌరవం కల్పించింది. ఆయన్ను రెవెన్యూ, స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించింది. ఈ రెండు విభాగాలు రెండు దశాబ్దాలకు పైగా విడివిడిగా ఉంటుండగా ఈ సారి కలిపేశారు. దీంతో ఆయనకు సమున్నత గౌరవం లభించినట్లయింది. నిజాయితీపరురాలిగా పేరు ఉన్నప్పటికీ చాలాకాలంగా లూప్‌లైన్లోనే ఉంటూ వచ్చిన జయలక్ష్మిని కీలకమైన భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్‌ఏ) పోస్టులో నియమించారు. కొద్ది రోజుల క్రితమే ఆర్థిక శాఖలో కార్యదర్శిగా నియమితులైన వాడ్రేవు వినయ్‌చంద్‌ను పర్యాటక శాఖ కార్యదర్శిగా బదిలీచేశారు. మొన్నటి వరకూ ఎక్సైజ్, సీఆర్‌డీఏ కమిషనర్‌గా పనిచేసి పలు విమర్శలు ఎదుర్కొన్న వివేక్ యాదవ్‌ను యువజన సర్వీసుల విభాగానికి మార్చారు. కోనసీమ కలెక్టర్‌గా పనిచేస్తూ కొద్దిరోజుల క్రితమే బదిలీ అయి పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న హిమాన్షు శుక్లాను సమాచార శాఖ డైరెక్టర్‌గా నియమించారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన ఢిల్లీరావును వ్యవసాయ శాఖ డైరెక్టర్‌గా పంపారు. రాష్ట్ర వాణిజ్య పన్నుల ముఖ్య కార్యదర్శి గిరిజా శంకర్ వద్ద అదనంగా ఉన్న ఆర్థిక శాఖ బాధ్యతలను తొలగించారు. పాఠశాల విద్య కమిషనర్‌గా ఉన్న ఎస్.సురేశ్‌కుమార్‌ను మౌలిక వసతులు-పెట్టుబడుల కార్యదర్శిగా బదిలీచేశారు. ఆయనకు అదనంగా గ్రామ/వార్డు సచివాలయాల శాఖను అప్పగించారు. అలాగే ఆయన సాధారణ పరిపాలన విభాగం-జీఏడీ (పొలిటికల్) కార్యదర్శిగానూ పూర్తి అదనపు బాధ్యతల్లో కొనసాగుతారు. కళాశాల విద్య కమిషనర్‌గా ఉన్న పి.భాస్కరను బీసీ సంక్షేమ కార్యదర్శిగా బదిలీచేశారు. ఈడబ్ల్యూఎస్ శాఖ అదనంగా అప్పగించారు. అలాగే జీఏడీ (సర్వీసెస్) కార్యదర్శిగా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తారు.

బదిలీ అయిన అధికారులు వీరే..

ఐఏఎస్ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ అయిన స్థానం
జి.అనంతరాము	స్పెషల్ సీఎస్, బీసీ సంక్షేమం	స్పెషల్ సీఎస్, అటవీ పర్యావరణం
ఆర్.పి. సిసోడియా	డీజీ, ఏపీ హెచ్‌ఆర్‌డీఐ	స్పెషల్ సీఎస్, రెవెన్యూ, స్టాంపులు-రిజిస్ట్రేషన్లు
జి.జయలక్ష్మి	ముఖ్య కార్యదర్శి, మహిళా శిశు సంక్షేమం	సీసీఎల్‌ఏ
కాంతిలాల్ దండే	ముఖ్య కార్యదర్శి, గిరిజన సంక్షేమం	ముఖ్య కార్యదర్శి, రవాణా, రోడ్లు-భవనాలు
ఎస్.సురేశ్‌కుమార్	కమిషనర్, పాఠశాల విద్య	కార్యదర్శి, మౌలిక వసతులు, పెట్టుబడులు
సౌరభ్ గౌర్	కార్యదర్శి, ఉన్నత విద్య	కార్యదర్శి, ఐటీఈ, ఆర్టీజీఎస్
ఎన్.యువరాజ్	కార్యదర్శి, పరిశ్రమలు, వాణిజ్యం	కార్యదర్శి, పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్
కె.హర్షవర్ధన్	కార్యదర్శి, సాంఘిక సంక్షేమం	కార్యదర్శి, మైనారిటీ సంక్షేమం
పి.భాస్కర	కమిషనర్, కళాశాల విద్య	కార్యదర్శి, బీసీ సంక్షేమం
కె.కన్నబాబు	కమిషనర్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి	కార్యదర్శి, సాంఘిక సంక్షేమం
వాడ్రేవు వినయ్‌చంద్	కార్యదర్శి, ఆర్థిక శాఖ	కార్యదర్శి, పర్యాటక, సాంస్కృతిక శాఖ
వివేక్ యాదవ్	వెయిటింగ్	కార్యదర్శి, క్రీడలు, యువజన సర్వీసులు
ఎ. సూర్యకుమారి	కమిషనర్, ఫిషరీస్	కార్యదర్శి, మహిళా శిశు సంక్షేమం
డాక్టర్ శ్రీధర్	కమిషనర్, సహాయ పునరావాసం	డైరెక్టర్, పరిశ్రమలు
జె.నివాస్	వెయిటింగ్	అదనపు కార్యదర్శి, ఆర్థిక శాఖ
వి.విజయరామరాజు	వెయిటింగ్	డైరెక్టర్, పాఠశాల విద్య
హిమాన్షు శుక్లా	వెయిటింగ్	డైరెక్టర్, సమాచార-పౌరసంబంధాలు
ఢిల్లీరావు	వెయిటింగ్	డైరెక్టర్, వ్యవసాయ శాఖ

ఐపీఎస్‌ల బదిలీ

- హరీశ్‌కుమార్ గుప్తా విజిలెన్స్‌కు
- హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా విశ్వజిత్
- ఫైర్ డీజీగా మాదిరెడ్డి ప్రతాప్
- సీహెచ్ శ్రీకాంత్‌కు శాంతిభద్రతలు
- బెజవాడ సీపీగా ఎస్వీ రాజశేఖర్‌బాబు
- రాజధాని రైతులను చితకబాదిన విశాల్ గున్నీ, విజయా రావుకు షాక్
- వారికి పోస్టింగ్ ఇవ్వని వైనం


హరీశ్‌కుమార్ గుప్తా


కుమార్ విశ్వజిత్


ఎస్వీ రాజశేఖర్‌బాబు

అమరావతి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 10 మంది సీనియర్ ఐపీఎస్ అధికారులను బదిలీ చేసింది. హోం శాఖ ముఖ్య కార్యదర్శి హరీశ్ కుమార్ గుప్తాను విజిలెన్స్-ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్‌గా నియమించింది. ఆయన స్థానంలో కుమార్ విశ్వజిత్‌ను హోం శాఖ ముఖ్య కార్యదర్శిగా నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. శాంతి భద్రతల విభాగం ఐజీగా సీహెచ్ శ్రీకాంత్‌ను నియమించారు. పోస్టింగ్ కోసం ఎప్పటి నుంచో నిరీక్షిస్తున్న మాదిరెడ్డి ప్రతాప్ మరోసారి అగ్నిమాపక శాఖ డీజీగా నియమితులయ్యారు. జగన్ ప్రభుత్వ బాధితులుగా పోలీసు శాఖలో చర్చించుకునే సమర్థ అధికారుల్లో ఎస్వీ రాజశేఖర్‌బాబు విజయవాడ పోలీసు కమిషనర్‌గా, గోపీనాథ్ జెట్టిని విశాఖపట్నం రేంజ్ డీఐజీగా, కోయ ప్రవీణ్ కర్నూలు రేంజ్‌కు బదిలీ అయ్యారు. వైసీపీ ప్రభుత్వంతో అంటకాగి రాజధాని ప్రాంతంలో రైతులను చితకబాదిన విశాల్ గున్నీ, విజయారావును విశాఖ, కర్నూలు రేంజ్‌ల నుంచి తప్పించి పోస్టింగ్ ఇవ్వకుండా ప్రభుత్వం పక్కన బెట్టింది. డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించింది. సార్వత్రిక ఎన్నికల సమయంలో డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డిని తప్పించిన ఎన్నికల కమిషన్ (ఈసీ).. ఆయన స్థానంలో హోం శాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్న గుప్తాను డీజీపీగా ఎంపిక చేసిన సంగతి తెలిసిందే. ఎన్నికల్లో భారీ విజయం సాధించి గద్దెనెక్కిన టీడీపీ కూటమి ప్రభుత్వం.. గుప్తా స్థానంలో ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావును పోలీసు బాస్‌గా నియమించింది. గుప్తాను తిరిగి హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా నియమించి.. జైళ్ల శాఖ డీజీగా అదనపు బాధ్యతలు కూడా అప్పగించింది. ఎన్నికల సందర్భంగానే నిఘా విభాగం చీఫ్ పీఎస్ఆర్ ఆంజనేయులును ఈసీ తొలగించి.. ఆయన స్థానంలో రైల్వే ఏడీజీగా ఉన్న కుమార్ విశ్వజిత్‌ను ఎంపిక చేసింది. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత కేంద్ర సర్వీసుల్లో ఉన్న మహేశ్ చంద్ర లడ్హా ఆంధ్రప్రదేశ్‌కు తిరిగి రావడంతో ఆయన్ను నిఘా చీఫ్‌గా ఇటీవలే నియమించింది. విశ్వజిత్‌ను నిరీక్షణలో పెట్టింది. ఆయన్ను విజిలెన్స్ డీజీగా నియమిస్తారని ప్రచారం జరిగింది. అయితే గుప్తాను అటు బదిలీ చేసి హోం శాఖ ముఖ్య కార్యదర్శిగా విశ్వజిత్‌ను నియమించింది. రోడ్ సేఫ్టీ అథారిటీ చైర్మన్‌గా ఉన్న అంజనా సిన్హాకు ఎస్పీఎఫ్ డీజీగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.

ఐపీఎస్ పేరు	ప్రస్తుత స్థానం	తాజా పోస్టింగ్
హరీశ్‌కుమార్ గుప్తా	హోం శాఖ ముఖ్య కార్యదర్శి	విజిలెన్స్-ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ
కుమార్ విశ్వజిత్	వెయిటింగ్	హోం శాఖ ముఖ్య కార్యదర్శి
మాదిరెడ్డి ప్రతాప్	వెయిటింగ్	డీజీ, విపత్తుల నిర్వహణ, అగ్నిమాపక శాఖ
సీహెచ్ శ్రీకాంత్	ఐజీ, ఆక్టోపస్	ఐజీ, శాంతి భద్రతలు
ఎస్వీ రాజశేఖర్‌బాబు	చైర్మన్, పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు	సీపీ, విజయవాడ
పీహెచ్‌డీ రామకృష్ణ	సీపీ, విజయవాడ	ఐజీ, పీ అండ్ ఎల్ (పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్‌గా అదనం)
గోపీనాథ్ జెట్టి	డీఐజీ, గ్రేహౌండ్స్	డీఐజీ, విశాఖపట్నం రేంజ్ (కోస్టల్ సెక్యూరిటీ అదనం)
డాక్టర్ కోయ ప్రవీణ్	డీఐజీ, గ్రేహౌండ్స్	డీఐజీ, కర్నూలు రేంజ్
విశాల్ గున్నీ	డీఐజీ, విశాఖపట్నం రేంజ్	డీజీపీ ఆఫీసులో రిపోర్టు
సీహెచ్. విజయా రావు	డీఐజీ, కర్నూలు రేంజ్	డీజీపీ ఆఫీసులో రిపోర్టు

'నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు' పేరు తొలగింపు

- పేదల ఇళ్లపై జగన్ బొమ్మలున్న లోగోలు, వైసీపీ రంగులు నిలిపివేత

అమరావతి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేదల గృహ నిర్మాణ పథకానికి గత వైసీపీ ప్రభుత్వం పెట్టిన 'నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు' పేరును కొత్త ప్రభుత్వం తొలగించింది. పూర్తయిన పేదల ఇళ్లపై జగన్ బొమ్మతో ఉన్న లోగోలు అతికించడం, గత ప్రభుత్వ హయాంలో వేసిన నిర్దిష్ట రంగులను కూడా తక్షణమే నిలిపివేయాలని అన్ని జిల్లాల హౌసింగ్ అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. హౌసింగ్ కార్పొరేషన్ వెబ్‌సైట్‌తోపాటు, కార్పొరేషన్ ద్వారా జారీ చేసే లబ్ధిదారుల కార్డులు, పాస్‌పుస్తకాలు, సర్టిఫికెట్లపై కూడా జగన్ బొమ్మలు, వైసీపీ జెండా రంగులు లేకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని, పేదల ఇళ్ల పథకాలకు కొత్త పేర్లు పెట్టే వరకు 2019కి ముందున్న పాత పేర్లను పునరుద్ధరించాలని హౌసింగ్ కార్పొరేషన్ ఉన్నతాధికారులు సూచించారు. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత.. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఉన్న పేర్లను మార్చేసిన సంగతి తెలిసిందే. ఎన్టీఆర్ రూరల్ హౌసింగ్, ఎన్టీఆర్ స్పెషల్ హౌసింగ్ పథకాలను గత ఐదేళ్లు వైఎస్ఆర్ రూరల్ హౌసింగ్, వైఎస్ఆర్ స్పెషల్ హౌసింగ్ పేర్లతో అమలు చేశారు. ఈ రెండు పథకాలను మళ్లీ పాత పేర్లతోనే అమలు చేయనున్నారు. జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకాన్ని ఇక మీదట 'వన్ టైమ్ సెటిల్‌మెంట్ స్కీమ్' (ఓటీఎస్)గా అమలు చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన లే-అవుట్ల వద్ద 'వైఎస్ఆర్ జగనన్న కాలనీ' పేరుతో స్వాగత ద్వారాలు (ఆర్చిలు) నిర్మించారు. ఇక మీదట ఈ పేర్లను కూడా నిలిపివేయనున్నారు.

మంత్రి లోకేశ్ వాట్సాప్ బ్లాక్

- మెసేజీలు పోటెత్తడంతో బ్లాక్ చేసిన మెటా
- ఇకపై సమస్యలను ఈ-మెయిల్ చేయాలని విజ్ఞప్తి

అమరావతి(ఆంధ్రజ్యోతి): మంగళగిరి, జూలై 11: సాయం కోసం వచ్చే ప్రజలకు తన ఇంటి తలుపులు ఎప్పుడూ తెరిచే వుంటాయని ఎన్నికలకు ముందు నారా లోకేశ్ ప్రకటించారు. ఎన్నికల్లో గెలిచి మంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ఉండవల్లిలోని నివాసంలో ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నారు. ఫోన్ కాల్స్, వాట్సాప్ ద్వారా వచ్చిన సందేశాలకు సైతం స్పందించి పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటున్నారు. ఇటీవల వాట్సాప్ మెసేజ్‌కు స్పందించి 25 మంది దివ్యాంగ విద్యార్థుల సమస్యను పరిష్కరించారు. దీంతో మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకువెళితే చాలు.. పరిష్కారం లభిస్తుందని రాష్ట్రవ్యాప్తంగా ప్రజలందరూ విశ్వసిస్తున్నారు. వేలాది మంది తమ సమస్యలను ఒకేసారి మంత్రి లోకేశ్‌కు వాట్సాప్ చేయడంతో సాంకేతిక పరమైన సమస్యలు ఉత్పన్నమయ్యాయి. తరచూ ఇదే సమస్య తలెత్తడంతో మెటా పలుమార్లు మంత్రి లోకేశ్ వాట్సాప్‌ను బ్లాక్ చేసింది. దీంతో ప్రత్యామ్నాయంగా తన వ్యక్తిగత ఈ-మెయిల్ ద్వారా ప్రజలకు అందుబాటులోకి రావాలని మంత్రి లోకేశ్ నిర్ణయించారు. ఇక నుంచి ప్రజలెవరైనా సమస్యలను తెలియజేయాలంటే hello.lokesh@ap.gov.inకు మెయిల్ పంపాలని మంత్రి లోకేశ్ విజ్ఞప్తి చేశారు. పేరు, ఊరు, మొబైల్ నంబరు, మెయిల్ ఐడీ, సమస్య లేదా సహాయానికి సంబంధించిన పూర్తి వివరాలను వినతుల్లో పొందుపరచాలని సూచించారు. ప్రజలందరూ మెయిల్ ఐడీకే వినతులు పంపించాలని కోరారు.

డిగ్రీ అడ్మిషన్లకు కొత్త షెడ్యూలు

- అనుమతుల గందరగోళంతో నిర్ణయం
- 23 నుంచి ఆప్షన్ల ఎంపిక.. 31న సీట్ల కేటాయింపు

అమరావతి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియలో ప్రభుత్వం పొరపాట్లు సరిదిద్దే చర్యలు చేపట్టింది. గత ప్రభుత్వ నిర్ణయం ప్రకారం హడావుడిగా జారీచేసిన షెడ్యూలును మార్చింది. అఫిలియేషన్లు, కాలేజీలకు అనుమతులు, ఏఐసీటీఈ నుంచి అనుమతుల విషయంలో స్పష్టత రాకుండానే.. విద్యార్థులు ఆప్షన్లు ఎంపిక చేసుకునే గడువు సమీపించడంతో ఈ నిర్ణయం తీసుకుంది. మొదటి షెడ్యూలు ప్రకారం గురువారం నుంచి ఆప్షన్ల ఎంపిక ప్రారంభం కావాలి. కొత్త షెడ్యూలు ప్రకారం 20 వరకు దరఖాస్తుల గడువు పొడిగించింది. 23 నుంచి 26 వరకు ఆప్షన్ల ఎంపికకు, 27న ఎంపిక చేసుకున్న ఆప్షన్లలో మార్పులు చేసుకునేందుకు అవకాశం ఇచ్చింది. 31న సీట్లు కేటాయించనుంది. ఆగస్టు 1 నుంచి విద్యార్థులు కాలేజీల్లో రిపోర్టు చేయాలని, అదే రోజు నుంచి తరగతులు ప్రారంభమవుతాయని తెలిపింది. తాజా నిర్ణయంతో డిగ్రీలో విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియలో తలెత్తిన ఇబ్బందులు, గందరగోళంపై 'ఆంధ్రజ్యోతి' కథనాలు ప్రచురించింది.

భాషా పండితుల పదోన్నతికి ఆదేశాలు

అమరావతి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పాఠశాలల్లో భాషా పండితులకు పదోన్నతులకు చర్యలు తీసుకోవాలని పాఠశాల విద్యాశాఖ తాజాగా ఉత్తర్వులు జారీచేసింది. హైకోర్టు ఆదేశాల మేరకు ఈ చర్యలు ప్రారంభించింది. గుంటూరు, పశ్చిమగోదావరి, కడప, కర్నూలు, కృష్ణా, చిత్తూరు జిల్లాల్లో కామన్ సీనియారిటీ జాబితాలు రూపొందించి అర్హులైన వారికి పదోన్నతులు ఇవ్వాలని ఆదేశించింది. అలాగే 2017లో ఇచ్చిన జీవో 82 ప్రకారం పదోన్నతులు పొందిన టీచర్లను వెనక్కి పంపాలని స్పష్టంచేసింది.

జగన్ బాదుడు సరిచేస్తాం!

- స్థానిక సంస్థల నిధులపై పయ్యావుల తొలి సంతకం
- సచివాలయ చాంబర్లో బాధ్యతల స్వీకరణ


ఆర్థిక శాఖా మంత్రిగా బాధ్యతలు చేపడుతున్న పయ్యావుల కేశవ్

అమరావతి, జూలై 11(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థలకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.250 కోట్లు విడుదల చేస్తూ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తన చాంబర్లో తొలి సంతకం చేశారు. గురువారం రాష్ట్ర సచివాలయంలోని రెండో బ్లాక్‌లో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చడానికి ప్రజలపై పన్నుల భారం మోపే ఆలోచన తమకు లేదని, ఉన్న పన్నులను సవ్యంగా వసూలు చేయడంపై మాత్రమే దృష్టి పెడుతున్నట్లు చెప్పారు. జగన్ ప్రభుత్వం విపరీతంగా పన్నుల భారం మోపి రాష్ట్ర ఆదాయాన్ని తీవ్రంగా దెబ్బ తీసిందని, దానిని సవరించడంపై దృష్టి పెట్టామని వివరించారు. 'సహజ వాయువు వినియోగంపై అన్ని దక్షిణాది రాష్ట్రాలు ఐదు శాతం పన్ను విధిస్తుంటే, జగన్ ప్రభుత్వం 26 శాతం పన్ను విధించింది. దేశంలోని మిగిలిన రాష్ట్రాల్లో మూడు శాతం మాత్రమే ఉంది. అంత పన్నులు ఉంటే సహజ వాయువు వినియోగించే పరిశ్రమలు ఈ రాష్ట్రానికి ఎలా వస్తాయి? పొరుగునున్న కర్ణాటకతో పోలిస్తే మన రాష్ట్రంలో పెట్రోలు, డీజిల్‌పై పన్ను విపరీతంగా పెంచారు. దీంతో రవాణా వాహనాలు ఈ రాష్ట్రంలో డీజిల్ కొనుగోలు చేయడం తగ్గించాయి. అసాధారణంగా మన రాష్ట్రంలో ఇటీవల ద్విచక్ర వాహనాల అమ్మకాలు పడిపోయాయి. లారీలు, బస్సులు నాగాలాండ్ వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకొని అక్కడ పన్నులు చెల్లించి, ఆ వాహనాలను ఇక్కడకు తీసుకొచ్చి తిప్పుతున్నారు. ఎందుకు పక్క రాష్ట్రాల్లో కొనుగోలు చేసి అక్కడ పన్నులు చెల్లిస్తున్నారో అధ్యయనం చేసి ఆ లోపం దిద్దుకొని ఈ రాష్ట్రం ఆదాయం పెంచాలన్నది మా ఆలోచన. ఒక కుటుంబంలో ఉన్న వారు తమ మధ్య ఆస్తులు పంపిణీ చేసుకొని రిజిస్ట్రేషన్ చేయించుకోవాలంటే గతంలో ఆస్తి విలువలో ఒక శాతం కడితే సరిపోయేది. గత ప్రభుత్వం దానిని విపరీతంగా పెంచేసింది. ఒక్కో కుటుంబం 20-30 లక్షల రూపాయలు పన్నుల కింద చెల్లించి ఆస్తులు పంచుకోవాల్సి వస్తోంది. ఇంత ఖర్చు భరించలేక తెల్ల కాగితాల మీద ఒప్పందాలు రాసుకొంటున్నారు. తర్వాతి కాలంలో ఇవి చెల్లుబాటు కాక న్యాయ వివాదాలుగా మారుతున్నాయి. లిటిగేషన్లు పెరగడానికి జగన్ కారణమయ్యారు. ఆదాయం పెంచుకోవడానికి పన్నుల విధింపు ఒకటే మార్గం కాదు. వ్యాపారాలు పెరిగితే జీఎస్టీ, పన్నుల ద్వారా ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. ఆ కోణంలో ఆలోచించాలనుకొంటున్నాం' అని వివరించారు. రాష్ట్రం ఆర్థికంగా ముందంజ వేయడానికి ఆర్థిక కార్యకలాపాలు పెరగాలని, అవి పెరగడానికి బ్రాండ్ చంద్రబాబు ఒకటే మార్గమని పయ్యావుల చెప్పారు.

బాబు బ్రాండ్ వల్ల పరిశ్రమల రాక..

'చంద్రబాబు బ్రాండ్ వల్ల రాష్ట్రానికి పరిశ్రమలు వస్తాయి. వ్యాపారాలు పెరుగుతాయి. దీంతో ప్రభుత్వానికి పన్ను ఆదాయం పెరుగుతుంది. రూ.60 వేల కోట్లతో ఆయిల్ రిఫైనరీ రాష్ట్రానికి వస్తే జీఎస్టీ ఎంత వస్తుందో ఆలోచించండి. అనేక పథకాల కింద కేంద్ర ప్రభుత్వం 60 శాతం భరిస్తూ నిధులు ఇస్తుంది. మిగిలిన 40 శాతం రాష్ట్రం భరిస్తే సరిపోతుంది. అందులో పది శాతం పన్నుల కింద ఖజానాకే తిరిగి వస్తాయి. ఏదో రూపంలో నిధులు వస్తే అవి పలు రంగాల్లోకి ప్రవహించి వ్యాపారాలు, ప్రభుత్వ ఆదాయం పెరగడానికి ఉపయోగపడతాయి. ఈ చిన్న లాజిక్‌ను జగన్ మర్చిపోయి కేంద్ర పథకాలు అన్నింటినీ నిలిపివేశారు' అని పయ్యావుల వివరించారు.


మరియమ్మకు ఆటో అందజేస్తున్న శ్రీనివాసకుమార్

పవన్ గెలుపు.. ఆ మహిళకు ఆటో..

పిఠాపురం, జూలై 11: 'పిఠాపురంలో పవన్ కల్యాణ్ విజయం సాధిస్తే తన భర్త తొక్కే రిక్షాను అమ్మయినా సరే ఊరంతా పార్టీ చేస్తాను..' అంటూ ఆ మహిళ ఉత్సాహంగా చెప్పింది. ఎన్నికల ముందు ఆ వీడియో తెగ వైరల్ అయింది. ఆమె అభిమానానికి ఫిదా అయిన సినీ నిర్మాత శ్రీనివాసకుమార్ (ఎస్‌కేఎన్).. వారికి ఆటో కొనిస్తానని అప్పట్లో చెప్పారు. ఎన్నికల్లో పవన్ గెలిచి.. ఉపముఖ్యమంత్రి అయ్యారు. దీంతో ఎస్‌కేఎన్ మాట నిలబెట్టుకున్నారు. గురువారం కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలోని జగ్గయ్యచెరువు కాలనీలోని మరియమ్మ ఇంటికి వెళ్లి ఆమెకు ఆటో అందజేశారు. మరియమ్మ కళ్లలో ఆనందం చూశానంటూ.. అందుకు సంబంధించిన చిత్రాలను ఎక్స్‌లో పోస్ట్ చేశారు. దీంతో అందరూ ఎస్‌కేఎన్‌ను అభినందిస్తున్నారు.

వైసీపీ కోర్టు ధిక్కార పిటిషన్‌పై.. సీఆర్‌డీఏ కమిషనర్‌కు హైకోర్టు నోటీసులు

అమరావతి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): నిర్మాణంలో ఉన్న తమ పార్టీ కార్యాలయాన్ని.. హైకోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించి కూల్చివేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని వైసీపీ వేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్ గురువారం విచారణకు వచ్చింది. పిటిషనర్ తరఫున న్యాయవాది శ్రీహరి వాదనలు వినిపిస్తూ.. ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని కోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. అయితే అధికారులు తుది ఉత్తర్వులు జారీ చేయకుండానే నిర్మాణంలో ఉన్న భవనాన్ని కూల్చివేశారని, బాధ్యులైనవారిపై కోర్టు ధిక్కరణ కింద చర్యలకు ఆదేశించాలని కోరారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం.. వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న సీఆర్‌డీఏ కమిషనర్ కాటమనేని భాస్కర్, తాడేపల్లి-మంగళగిరి మున్సిపల్ కమిషనర్ నిర్మల్‌కుమార్‌కు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను 4 వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలో నిర్మాణంలో ఉన్న తమ పార్టీ కార్యాలయం విషయంలో చట్టనిబంధనలకు లోబడి వ్యవహరించాలని కోర్టు ఇచ్చిన ఆదేశాలను ఉల్లంఘించి అధికారులు దానిని కూల్చివేశారని, బాధ్యులైన అధికారులపై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవాలని కోరుతూ వైసీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు ఎం.శేషగిరిరావు హైకోర్టులో పిటిషన్ వేసిన విషయం తెలిసిందే.

ఇసుకాసురులకు పెద్దన్న!

- పెద్దిరెడ్డి ఇసుక కొండల విలువ 17 కోట్లు
- 41 వేలటన్నులకు పైగా ఉన్నట్లు గుర్తింపు
- కాలువ పనులు చేపట్టిన కంపెనీకి నోటీసు


ఇసుక కొండలను సీజ్ చేస్తున్న అధికారుల బృందం (ఫైల్)



ఇసుక నిల్వ ఉంచిన చోట గేటుకు పీఎల్ఆర్ అని ఉన్న దృశ్యం (ఫైల్)

ములకలచెరువు, జూలై 11: మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అక్రమంగా పేర్చిన ఇసుక కొండల కథ ఐదేళ్ల జగన్ అరాచక పాలనలో చెలరేగిన ఇసుకాసురుల బరితెగింపునకు పరాకాష్ఠ! అన్నమయ్య జిల్లా ములకలచెరువు మండలం సోంపల్లె పంచాయతీ రెడ్డివారిపల్లె సమీపంలోని ఇసుక కొండల విలువ రూ.17 కోట్లు ఉంటుందని అంచనా. పెద్దతిప్పసముద్రం మండలం టి.సదుం సమీపంలోని సంగమేశ్వరస్వామి ఆలయం సమీపంలోని పాపాఘ్ని నుంచి పీఎల్ఆర్ పేరున్న టిప్పర్లలో రాత్రింబవళ్లు ఈ ఇసుకను ఇక్కడికి తరలించారు. ఈ ఇసుక కొండలపై కలెక్టర్ చామకూరి శ్రీధర్ కొరడా ఝుళిపించడంతో రెండు రోజుల క్రితం గనులు, భూగర్భశాఖ, మండల అధికారుల బృందం సీజ్ చేసింది. ఇక్కడ మొత్తం 27,472.45 క్యూబిక్ మీటర్లకుపైగా (41 వేల టన్నులు) ఇసుక ఉన్నట్లు గుర్తించారు. వైసీపీ హయాంలో ధరలను బట్టి ఇసుక కొండల విలువ రూ.20 కోట్లు దాటుతుందని పలువురు చర్చించుకుంటున్నారు.

జలాల తరలింపు పేరిట తవ్వేశారు..

కడప జిల్లాలోని గండికోట జలాలను అన్నమయ్య జిల్లాకు తీసుకువచ్చేందుకు గత వైసీపీ ప్రభుత్వంలో పనులు మొదలయ్యాయి. గాలేరు-నగిరి కాలువను తంబళ్లపల్లె నియోజకవర్గం పెద్దమండ్యం, తంబళ్లపల్లె, ములకలచెరువు మండలాల మీదుగా పెద్దతిప్పసముద్రం మండలం పులికల్లులోని హంద్రీ-నీవా కాలువకు అనుసంధానం చేయాలనేది అప్పటి ప్రణాళిక. మంత్రి హోదాలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి 2021 జూలై 4వ తేదీ పనులను ప్రారంభించారు. ఈ పనులకు ఇసుక అవసరమని టిప్పర్లు పెద్దతిప్పసముద్రం మండలం నుంచి ములకలచెరువు మండలం రెడ్డివారిపల్లె సమీపంలోకి తరలించి భారీగా నిల్వ ఉంచారు. కానీ ఈ ఇసుకను పనులకు వాడలేదు. ఇసుక ఉన్న చోటికి ఎవరూ వెళ్లకుండా చుట్టూ ట్రెంచ్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్నారు. లోపలికి వెళ్లే చోట గేటు కూడా ఏర్పాటు చేశారు. ఈ గేటుకు పీఎల్ఆర్ అని రాశారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన తరువాత ఆ పేరు తొలగించారు.

పనులు చేసిన కంపెనీకి షోకాజ్ నోటీసు

ఇసుక కొండలకు సంబంధించి గనులు, భూగర్భశాఖ అధికారులు హైదరాబాద్‌కు చెందిన పీపీపీఎల్-ఎస్ఈసీఎల్ (జేవీ) కంపెనీకి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. కాలువ పనులు చేపట్టిన కంపెనీకి నోటీసు జారీ చేశారు. ఇసుకకు సంబంధించిన వివరాలు అందజేయాలని ఆ నోటీసులో మదనపల్లె డివిజనల్ గనులు, భూగర్భశాఖ అధికారి వేణుగోపాల్ కోరారు.

యువగళంలో పీఎల్ఆర్ ప్రస్తావన

అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గంలో టీడీపీ యువనేత లోకేశ్ గతేడాది మార్చిలో యువగళం పాదయాత్ర చేసిన సమయంలో పీఎల్ఆర్ టిప్పర్ల గురించి ప్రస్తావించారు. పాదయాత్ర సమయంలో పీఎల్ఆర్ పేరుతో ఇసుకను తరలిస్తున్న టిప్పర్లు పలు సందర్భాల్లో ఆయనకు ఎదురుపడ్డాయి. వాటిని చూపుతూ.. ఇసుక అక్రమ రవాణాపై అప్పట్లో వైసీపీ ప్రభుత్వాన్ని ఆయన నిలదీశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● శుక్రవారం 12 జూలై 2024
diksuchi@andhrajyothy.com

ఎన్‌జీ రంగా వర్సిటీలో బీఎస్సీ ఆనర్స్ కమ్యూనిటీ సైన్స్



గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ(ఏఎన్‌జీఆర్‌ఏయూ)- బీఎస్సీ ఆనర్స్ కమ్యూనిటీ సైన్స్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. అకడమిక్ మెరిట్ ఆధారంగా లాంలోని కాలేజ్ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్‌లో అడ్మిషన్స్ ఇస్తారు. ఈ కాలేజీకి ఐకార్ గుర్తింపు ఉంది. మొత్తం 83 సీట్లు ఉన్నాయి. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థుల కోసం 10 శాతం సూపర్ న్యూమరరీ సీట్లు నిర్దేశించారు. గ్రామీణ అభ్యర్థుల కోసం 40 శాతం సీట్లు ప్రత్యేకించారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన పురుషులు, మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చు. హాస్టల్ సౌకర్యం ఉంది.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి బైపీసీ/ఎంపీసీ/ఎంబైపీసీ గ్రూప్ సబ్జెక్టులతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి.

- మూడేళ్ల వ్యవధి గల డిప్లొమా(హోం సైన్స్) ఉత్తీర్ణులైన అభ్యర్థుల కోసం పది శాతం సూపర్ న్యూమరరీ సీట్లు(ఎనిమిది సీట్లు) ప్రత్యేకించారు. గ్రామీణ అభ్యర్థులకు కేటాయించిన సీట్లకు అప్లయ్ చేసుకోవాలంటే ఒకటోతరగతి నుంచి ఇంటర్ స్థాయి వరకు కనీసం నాలుగేళ్లు గ్రామ పాఠశాలల్లో చదివి ఉండాలి. సంబంధిత ధ్రువపత్రాన్ని సబ్మిట్ చేయాల్సి ఉంటుంది.
- అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 25 ఏళ్లు; దివ్యాంగులకు 27 ఏళ్లు మించకూడదు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.2,000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **పోస్ట్ ద్వారా దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** జూలై 29
- **దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** రిజిస్ట్రార్, ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, లాం, గుంటూరు-522034
- **వెబ్‌సైట్:** angrau.ac.in

ఇగ్నోలో ఓడీఎల్ కోర్సులు

న్యూఢిల్లీలోని ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ(ఇగ్నో)- ఓపెన్ డిస్టెన్స్ లెర్నింగ్(ఓడీఎల్) కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. పీజీ, డిగ్రీ, డిప్లొమా, సర్టిఫికెట్ తదితర కోర్సులు ఉన్నాయి. ప్రోగ్రామ్‌లకు నిర్దేశించిన అర్హతల సమాచారాన్ని వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

అడ్వాన్స్ సర్టిఫికెట్ ప్రోగ్రామ్: ప్రోగ్రామ్ వ్యవధి ఆర్నెల్లు. ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ, పవర్ డిస్ట్రిబ్యూషన్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.

అప్రిసియేషన్ కోర్సు: కోర్సు వ్యవధి మూడు నెలలు. ఎన్విరాన్‌మెంట్, పాపులేషన్ అండ్ సస్టయినబుల్ డెవలప్‌మెంట్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.



సర్టిఫికెట్ ప్రోగ్రామ్: ప్రోగ్రామ్ వ్యవధి ఆర్నెల్లు. రష్యన్ లాంగ్వేజ్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్, బుక్ కీపింగ్, బిజినెస్ స్కిల్స్, కమ్యూనికేషన్ అండ్ ఐటీ స్కిల్స్, కమ్యూనిటీ రేడియో, కన్జూమర్ ప్రొటెక్షన్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, ఎనర్జీ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్, ఫ్యాషన్ డిజైన్, ఫస్ట్ ఎయిడ్, ఫుడ్ అండ్ న్యూట్రిషన్, ఫ్రెంచ్, ఫంక్షనల్ ఇంగ్లీష్, జనరల్ డ్యూటీ అసిస్టెన్స్, జీరియాట్రిక్ కేర్ అండ్ అసిస్టెన్స్, జర్మన్, గైడెన్స్, హెల్త్ కేర్ అండ్ మేనేజ్‌మెంట్, హోమ్ హెల్త్ అసిస్టెన్స్ హ్యూమన్ రైట్స్, ఐటీ, ఇంటర్నేషనల్ హ్యూమానిటేరియన్ లా, జపనీస్, కొరియన్ లాంగ్వేజ్ అండ్ కల్చర్, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్, మెటర్నల్ అండ్ ఛైల్డ్ హెల్త్ నర్సింగ్, మొబైల్ అప్లికేషన్ డెవలప్‌మెంట్, న్యూట్రిషన్ అండ్ ఛైల్డ్ కేర్, హిందుస్తానీ మ్యూజిక్, భరతనాట్యం, కర్ణాటక సంగీతం, రష్యన్, పర్షియన్, రూరల్ డెవలప్‌మెంట్ తదితర స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.

డిప్లొమా: ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. బిజినెస్ ప్రాసెస్ అవుట్ సోర్సింగ్, క్రియేటివ్ రైటింగ్ ఇన్ ఇంగ్లీష్, డెయిరీ టెక్నాలజీ, ఎర్లీ ఛైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్, ఫ్యాషన్ డిజైన్ అండ్ రిటైల్, హార్టికల్చర్, మీట్ టెక్నాలజీ, మోడరన్ ఆఫీస్ ప్రాక్టీస్, న్యూట్రిషన్ అండ్ హెల్త్ ఎడ్యుకేషన్, పారాలీగల్ ప్రాక్టీస్, థియేటర్ ఆర్ట్స్, టూరిజం స్టడీస్, ఉర్దూ, వాల్యూ ఎడ్యుకేషన్, వాటర్‌షెడ్ మేనేజ్‌మెంట్, ఉమన్ ఎంపవర్‌మెంట్ అండ్ డెవలప్‌మెంట్, అగ్రికల్చరల్ అండ్ కాస్ట్ మేనేజ్‌మెంట్, అప్పారెల్ మర్చండైజింగ్, రిటైలింగ్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.

డిగ్రీ ప్రోగ్రామ్‌లు

బీఏ, బీఏ ఆనర్స్, బీబీఏ, బీసీఏ, బీఎస్సీ, బీఎస్సీ ఆనర్స్, బీకాం, బీఎస్‌డబ్ల్యూ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. బ్యాచిలర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్సెస్ వ్యవధి ఏడాది.

- **బీఏ స్పెషలైజేషన్‌లు:** ఎకనామిక్స్, ఇంగ్లీష్, హిందీ, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, సైకాలజీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సంస్కృతం, సోషియాలజీ, ఉర్దూ, అప్లయిడ్ హిందీ, అప్లయిడ్ సంస్కృతం, అప్లయిడ్ ఉర్దూ, జెండర్ స్టడీస్, జర్నలిజం అండ్ డిజిటల్ మీడియా, ఫిలాసఫీ, టూరిజం స్టడీస్
- **బీఏ ఆనర్స్ స్పెషలైజేషన్‌లు:** ఎకనామిక్స్, ఇంగ్లీష్, హిందీ, హిస్టరీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, పొలిటికల్ సైన్స్, సైకాలజీ, సంస్కృతం, సోషియాలజీ, ఉర్దూ
- **బీబీఏ స్పెషలైజేషన్‌లు:** రిటైలింగ్, సర్వీసెస్ మేనేజ్‌మెంట్
- **బీఎస్సీ స్పెషలైజేషన్‌లు:** ఆంత్రోపాలజీ, బయోకెమిస్ట్రీ, ఫుడ్ సేఫ్టీ అండ్ క్వాలిటీ కంట్రోల్
- **బీఎస్సీ ఆనర్స్ స్పెషలైజేషన్‌లు:** ఆంత్రోపాలజీ, బయోకెమిస్ట్రీ

పీజీ ప్రోగ్రామ్‌లు

ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంకాం, ఎంటీటీఎం, ఎంబీఏ, ఎంసీఏ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఎంఎల్‌ఐఎస్ ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది.

- **ఎమ్మెస్సీ స్పెషలైజేషన్‌లు:** హోం సైన్స్, మేథమెటిక్స్-కంప్యూటర్ అప్లికేషన్స్, కౌన్సెలింగ్ అండ్ ఫ్యామిలీ థెరపీ, అనలిటికల్ కెమిస్ట్రీ, అప్లయిడ్ స్టాటిస్టిక్స్, బయోకెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, ఫుడ్ న్యూట్రిషన్, ఫుడ్ సేఫ్టీ అండ్ క్వాలిటీ మేనేజ్‌మెంట్, జాగ్రఫీ, జియోఇన్ఫర్మాటిక్స్, ఇండస్ట్రియల్ సేఫ్టీ, ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ, ఫిజిక్స్, రెన్యూవబుల్ ఎనర్జీ అండ్ ఎన్విరాన్‌మెంట్ తదితరాలు
- **ఎంఏ స్పెషలైజేషన్‌లు:** అడల్ట్ ఎడ్యుకేషన్, ఆంత్రోపాలజీ, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ, డెవలప్‌మెంట్ స్టడీస్, ఇంగ్లీష్, గాంధీ అండ్ పీస్ స్టడీస్, జెండర్ అండ్ డెవలప్‌మెంట్ స్టడీస్, హిందీ, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, ఫిలాసఫీ, సైకాలజీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, రూరల్ డెవలప్‌మెంట్, సోషియాలజీ, ట్రాన్స్‌లేషన్ స్టడీస్, భగవద్గీత స్టడీస్, డ్రాయింగ్ అండ్ పెయింటింగ్, ఎకనామిక్స్, ఎడ్యుకేషన్, ఆంత్రప్రెన్యూర్‌షిప్, ఎన్విరాన్‌మెంటల్ అండ్ ఆక్యుపేషనల్ హెల్త్, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్, ఫ్రెంచ్, హిందీ, హిందూ స్టడీస్.
- **ఎంబీఏ స్పెషలైజేషన్‌లు:** అగ్రిబిజినెస్ మేనేజ్‌మెంట్, కన్‌స్ట్రక్షన్ మేనేజ్‌మెంట్, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, హెల్త్‌కేర్ అండ్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, లాజిస్టిక్స్ అండ్ సప్లయ్ చెయిన్ మేనేజ్‌మెంట్, మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్

పీజీ డిప్లొమా: ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. అనలిటికల్ కెమిస్ట్రీ, కౌన్సెలింగ్ అండ్ ఫ్యామిలీ థెరపీ, గాంధీ అండ్ పీస్ స్టడీస్, ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ, యానిమల్ వెల్ఫేర్, అప్లయిడ్ స్టాటిస్టిక్స్, ఆడియో ప్రోగ్రామ్ ప్రొడక్షన్, బుక్ పబ్లిషింగ్, కార్పొరేట్ అండ్ సోషల్ రెస్పాన్సిబిలిటీ, డెవలప్‌మెంట్ స్టడీస్, డిస్టెన్స్ ఎడ్యుకేషన్, ఎడ్యుకేషనల్ టెక్నాలజీ తదితర స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.

పీజీ సర్టిఫికెట్: ప్రోగ్రామ్ వ్యవధి ఆర్నెల్లు. అగ్రికల్చర్ పాలసీ, క్లయిమేట్ ఛేంజ్, జియో ఇన్ఫర్మాటిక్స్, ఇండస్ట్రియల్ సేఫ్టీ, ఇన్వెంటరీ ప్లానింగ్ అండ్ వేర్‌హౌసింగ్ సిస్టమ్ ఫర్ ఇంజనీర్స్, మలయాళం-హిందీ ట్రాన్స్‌లేషన్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 15
- **వెబ్‌సైట్:** ignouadmission.samarth.edu.in

ఎన్‌పీటీఐలో పీజీ డిప్లొమాలు

ఫరీదాబాద్‌లోని నేషనల్ పవర్ ట్రెయినింగ్ ఇన్‌స్టిట్యూట్(ఎన్‌పీటీఐ)- పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. నిబంధనల ప్రకారం కోర్సులు పూర్తిచేసినవారికి ప్లేస్‌మెంట్స్ కల్పిస్తారు. మహిళలకు ప్రోగ్రామ్ ఫీజులో పది శాతం రాయితీ లభిస్తుంది. పవర్ సంస్థలు స్పాన్సర్ చేసే అభ్యర్థుల కోసం 25 శాతం సీట్లు కేటాయించారు. అకడమిక్ మెరిట్ ఆధారంగా మెరిట్ లిస్ట్ రూపొందించి కౌన్సెలింగ్‌ల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

పీజీ డిప్లొమా ఇన్ పవర్ ప్లాంట్ ఇంజనీరింగ్: కోర్సు వ్యవధి ఏడాది. ఫరీదాబాద్, నాగ్‌పూర్, నైవేలీ, దుర్గాపూర్, అలప్పుజా, శివ్‌పురి సెంటర్లలో ఈ ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. ఒక్కో సెంటర్లో 60 సీట్లు చొప్పున మొత్తం 360 సీట్లు ఉన్నాయి.


పీజీ డిప్లొమా ఇన్ హైడ్రో పవర్ ప్లాంట్ ఇంజనీరింగ్: కోర్సు వ్యవధి తొమ్మిది నెలలు. నంగల్ సెంటర్లో ఈ ప్రోగ్రామ్ ఉంది. ఇక్కడ 60 సీట్లు ఉన్నాయి.

పీజీ డిప్లొమా ఇన్ రెన్యూవబుల్ ఎనర్జీ అండ్ గ్రిడ్ ఇంటర్ఫేస్ టెక్నాలజీస్: కోర్సు వ్యవధి ఏడాది. న్యూఢిల్లీ, శివ్‌పురి, నైవేలీ, అలప్పుజా సెంటర్లలో ఈ ప్రోగ్రామ్ ఉంది.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో (బీఈ/బీటెక్)(మెకానికల్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/సీ అండ్ ఐ/పవర్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులై ఉండాలి. రెన్యూవబుల్ ఎనర్జీ అండ్ గ్రిడ్ ఇంటర్ఫేస్ కోర్సుకు ఏ ఇంజనీరింగ్ విభాగంవారైనా దరఖాస్తు చేసుకోవచ్చు. గరిష్ఠ వయోపరిమితి నిబంధనలు లేవు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 28
- **టెలిఫోనిక్ ఇంటర్వ్యూ:** జూలై 30, 31
- **అభ్యర్థుల మెరిట్ లిస్ట్ విడుదల:** ఆగస్టు 2
- **కౌన్సెలింగ్:** ఆగస్టు 5, 6
- **కోర్సులు ప్రారంభం:** ఆగస్టు 12 నుంచి
- **మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్స్:** ఆగస్టు 22
- **వెబ్‌సైట్:** www.npti.gov.in



జాబ్ కార్నర్

ఐటీబీపీలో హెడ్ కానిస్టేబుల్ పోస్టులు



ఖాళీలు 112

ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్(ఐటీబీపీ).. హెడ్ కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. అర్హులైన పురుష, మహిళా అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

పోస్టు: హెడ్ కానిస్టేబుల్(ఎడ్యుకేషన్ అండ్ స్ట్రెస్ కౌన్సెలర్)

అర్హత: ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సైకాలజీ ఒక సబ్జెక్టుగా బ్యాచిలర్స్ డిగ్రీ లేదా బ్యాచిలర్స్ ఆఫ్ ఎడ్యుకేషన్ లేదా బ్యాచిలర్ ఆఫ్ టీచింగ్‌లో ఉత్తీర్ణులై ఉండాలి.

వయసు: 2024 ఆగస్టు 5 నాటికి 20 నుంచి 25 సంవత్సరాల మధ్య ఉండాలి. అంటే 1999 ఆగస్టు 6 కంటే ముందుగానీ, 2004 ఆగస్టు 5 తరవాత గానీ జన్మించి ఉండకూడదు. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు; ఓబీసీలకు మూడేళ్లు; ఎక్స్ సర్వీస్‌మన్(యూఆర్)లకు మూడేళ్లు; ఎక్స్ సర్వీస్‌మన్(ఓబీసీ)లకు ఆరేళ్లు; ఎక్స్ సర్వీస్‌మన్(ఎస్సీ/ఎస్టీ)లకు ఎనిమిదేళ్లు వయోపరిమితి నిబంధనలో సడలింపు ఉంటుంది.

ఎంపిక ప్రక్రియ: ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, రిక్రూట్‌మెంట్ టెస్ట్ ద్వారా

రిక్రూట్‌మెంట్ టెస్ట్: ఇంగ్లీష్/హిందీ మాధ్యమంలో 100 మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది. 100 ప్రశ్నలు ఇస్తారు. జనరల్ ఇంగ్లీష్ నుంచి 10(10 మార్కులు), జనరల్ హిందీ నుంచి 10(10 మార్కులు), జనరల్ అవేర్‌నెస్ నుంచి 10(మార్కులు), క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ అండ్ సింపిల్ రీజనింగ్ నుంచి 10(మార్కులు), సైకాలజీ నుంచి 60(60 మార్కులు) ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నలు మల్టిపుల్ చాయిస్ విధానంలో ఉంటాయి. పరీక్షను ఓఎంఆర్/కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ) విధానంలో నిర్వహిస్తారు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 5

వెబ్‌సైట్: https://recruitment.itbpolice.nic.in/rect/index.php

సెయిల్‌లో మేనేజ్‌మెంట్ ట్రెయినీలు

ఖాళీలు 249

స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్(సెయిల్)... కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

విభాగాలు: కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, మెటలర్జికల్ ఇంజనీరింగ్

అర్హత: కనీసం 65 శాతం మార్కులతో సంబంధిత విభాగంలో ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు గేట్-2024 స్కోరు సాధించి ఉండాలి.

వయోపరిమితి: 2024 జూలై 25 నాటికి 28 సంవత్సరాలు మించకూడదు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

జీతభత్యాలు: రూ.60,000 - రూ.1,80,000

దరఖాస్తు రుసుము: రూ.700. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు రూ.200.

ఎంపిక ప్రక్రియ: గేట్-2024 స్కోర్, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూలై 25

వెబ్‌సైట్: https://www.sail.co.in/en/home

सेल SAIL

ఎస్‌బీఐలో స్పెషలిస్ట్ క్యాడర్ ఆఫీసర్లు

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ)...రెగ్యులర్, కాంట్రాక్ట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న స్పెషలిస్ట్ క్యాడర్(ఎస్‌సీఓ) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

ఖాళీలు: 16

1. సీనియర్ వైస్ ప్రెసిడెంట్(ఐఎస్ ఆడిటర్)(కాంట్రాక్ట్): **2 పోస్టులు**

వయసు: 38 నుంచి 50 సంవత్సరాల మధ్య ఉండాలి.

2. అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్(ఐఎస్ ఆడిటర్)(కాంట్రాక్ట్): **3 పోస్టులు**

వయసు: 33 నుంచి 45 సంవత్సరాల మధ్య ఉండాలి.

3. మేనేజర్(ఐఎస్ ఆడిటర్)(రెగ్యులర్): 4 పోస్టులు

వయసు: 28 నుంచి 40 సంవత్సరాల మధ్య ఉండాలి.

4. డిప్యూటీ మేనేజర్(ఐఎస్ ఆడిటర్)(రెగ్యులర్): 7

వయసు: 25 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉండాలి

అర్హతలు: అభ్యర్థులు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/కంప్యూటర్ సైన్స్/ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్స్‌లో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి. పోస్టును అనుసరించి బ్యాంకింగ్/బీఎఫ్‌ఎస్‌ఐ సంస్థల్లో సంబంధిత విభాగంలో కనీసం 3 నుంచి 10 ఏళ్ల పని అనుభవం ఉండాలి.

పని ప్రదేశం: ముంబై/హైదరాబాద్/మొబైల్ డ్యూటీ

ఎంపిక ప్రక్రియ: కాంట్రాక్ట్ పోస్టులకు షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ, సీటీసీ నెగోషియేషన్ ద్వారా; రెగ్యులర్ పోస్టులకు షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూలై 24

వెబ్‌సైట్: https://bank.sbi/web/careers



రాజుగారి కల


విజయ నగరాన్ని పాలించే కృష్ణ దేవరాయలకు ఒక రాత్రి వింతైన కల వచ్చింది. ఆ కలలో ఆయన మహిమ గల సింహాసనం మీద కూర్చున్నాడు. ఆ ఆసనం మనసులో ఏ ప్రదేశాన్ని తలచుకుంటే అక్కడికి క్షణంలో తీసుకుపోతుంది. ఆ సింహాసనం మీద పొదిగి ఉన్న విలువైన రత్నాలు వజ్రాల్లో మొత్తం రాజుగారి రూపమే కనబడుతోంది. తర్వాత రాజు కొలువులో కూర్చుని, తన కలలో కనిపించిన ఆసనం వంటిదే కావాలని ఆజ్ఞ ఇచ్చాడు



రాజోద్యోగులందరూ గాలిలో ఎగిరే 'ఆసనం, క్షణంలో కోరుకున్న చోటికి చేర్చే ఆసనం ఎలా సాధ్యం అని గుసగుసలు పోయారు. రోజులు గడుస్తున్నా, రాజుగారు తన కల గురించి అందులో తను చూసిన సింహాసనం గురించి చెప్పడం మానలేదు. ఒకరోజు ఒక పేదవృద్ధుడు రాజుగారి కొలువుకు వచ్చి, 'నేను దాచుకున్న వంద బంగారు కాసులు ఎవరో దొంగిలించారు, ఆ దొంగను పట్టుకుని శిక్ష వేసి, నా బంగారం నాకు ఇప్పించండి' అని మొర పెట్టుకున్నాడు. 'ఇంతకీ నీ సొమ్ము కాజేసింది ఎవరు?' అని రాజు అడిగాడు 'నిన్న రాత్రి నా కలలో కనిపించి, నా సొమ్ముకాజేసింది మీరే మహారాజా' అని అతను జవాబు చెప్పాడు. అక్కడున్న వారంతా ఆ ముసలి వాడికి మరణ దండన ఖాయం రాజుగారినే దొంగ అంటాడా. అనుకున్నారు. రాజు కూడా ముసలి వాడితో 'నేను నీ సొమ్ము ఎందుకు కాజేస్తాను? అలా ఎలా మాట్లాడుతావు? కలలో కనబడితే మాత్రం అది నిజం అవుతుందా?' అని గట్టిగా అడిగాడు వెంటనే ఆ వృధుడు తాను అతికించుకున్న గడ్డం, మాసిన దుస్తులు తొలగించి, మెరిసే బట్టలు ఆ భరణాలతో ముందుకు వచ్చి నిలబడి, 'కలలో జరిగిన దొంగతనం ఎలా నిజం కాదో, కలలో కనిపించిన ఎగిరే సింహాసనం కూడా నిజం కాదు కాబట్టి, ఇక దాని విషయమై అన్వేషణ కూడా ఆపు చేయించండి మహారాజా' అని చిరునవ్వు నవ్వాడు మారు వేషం తొలగించిన తెనాలి రామలింగ కవి. తనకు కను విప్పు కలగడానికే తెనాలి రాముడు ఇలా నాటకం ఆడాడు అని తెలుసుకున్న రాజుగారు ఎప్పటిలాగే తెనాలి రాముని సన్మానించి, అతని బుద్ధి కుశలతను ఎంతో మెచ్చుకున్నాడు.



6 తేడాలు గుర్తించండి!



దారి కనుక్కోండి

సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 356

			6	7			1	3
				5			2	
					3	4		
	3				7			2
7		4				5		8
5			4				6	
		8	9					
	2			8				
6	9			3	1			

సుడోకు - 355 సమాధానం

2	8	5	6	7	4	9	1	3
1	4	3	8	5	9	7	2	6
9	7	6	1	2	3	4	8	5
8	3	9	5	6	7	1	4	2
7	6	4	3	1	2	5	9	8
5	1	2	4	9	8	3	6	7
3	5	8	9	4	6	2	7	1
4	2	1	7	8	5	6	3	9
6	9	7	2	3	1	8	5	4

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.